మంగళవారం
20•8•2019
కరీంనగర్
• వెల. రూ.6.50
• సంపుటి 9 • సంచిక 56
• పేజీలు: 14 + 16

# నమస్తే తెలంగాణ

మన రాష్ట్రం • మన పత్రిక

WWW. NTNEWS.COM
/NTDAILYONLINE

PUBLISHED FROM KARIMNAGAR | HYDERABAD | WARANGAL | KHAMMAM | NALGONDA | MAHABUBNAGAR | NIZAMABAD






సోమవారం యూపీలోని ప్రయాగ్‌రాజ్ (అలహాబాద్)లో త్రివేణి సంగమం వద్ద వరద ఉధృతి

# ఉత్తరాదిన పోటెత్తిన నదులు

- వర్షాలు, వరదలతో అస్తవ్యస్తమవుతున్న రాష్ట్రాలు
- హిమాచల్‌ప్రదేశ్‌లో 25 మంది మృతి
- జలదిగ్బంధంలో ఉత్తరాఖండ్.. 12 మంది మృతి, ఆరుగురు గల్లంతు
- పంజాబ్, హర్యానాలో పొంగిపొర్లుతున్న వాగులు
- ఉధృతంగా ప్రవహిస్తున్న యమున.. ఢిల్లీ, ఆగ్రాలో ప్రమాద హెచ్చరికలు

III

**కూలుతున్న** చెట్లు, విరిగిపడుతున్న కొండచరియలు.. వరదల్లో కొట్టుకుపోతున్న ఇండ్లు.. ఎటు చూసినా నీరే! అప్పటివరకూ పచ్చగా కనిపించిన పంటపొలాలు.. మహా సముద్రాల్ని తలపిస్తున్నాయి. భారీ వర్షాలు, వరదలతో ఉత్తరాది రాష్ట్రాలు నీటిగుప్పిట చిక్కుకున్నాయి. ఎప్పుడూ ప్రశాంతంగా ప్రవహించే యమునమ్మ కన్నెర్రజేసింది. ప్రమాద సూచీని దాటి పరీవాహక ప్రాంతాల్ని తనలో కలిపేసుకుంటూ ఉధృతంగా ప్రవహిస్తున్నది. యమున భీకర ప్రవాహానికి ఢిల్లీ, ఆగ్రా ప్రజలు ప్రాణాల్ని అరచేతిలో పెట్టుకొన్నారు. హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో వరదలు ముంచెత్తడంతో మూడు రోజుల్లో 37 మంది చనిపోయారు. వందలమంది ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి బిక్కుబిక్కుమంటూ జీవితం గడుపుతున్నారు. హిమాచల్‌లో 70 ఏండ్లలో తొలిసారి ఒక్కరోజులోనే భారీగా 102 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. వరదలతో పంజాబ్, హర్యానా రాష్ట్రాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి.



ఫైల్ ఫొటో

## రెచ్చగొట్టే వ్యాఖ్యలతో శాంతికి విఘాతం

అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ

5

## నడ్డా.. ఇది తెలంగాణ అడ్డా

# మీ నాటకాలు సాగవు



సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ డివిజన్, బూత్‌స్థాయి టీఆర్‌ఎస్ కమిటీ సభ్యుల సమావేశంలో కార్యకర్తలు ఇచ్చిన గదతో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు. చిత్రంలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్, ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కూడా ఉన్నారు

### కులమతాలపేరిట చిచ్చుపెడుతున్న బీజేపీ

కాళేశ్వరం ప్రాజెక్టుపైనా ఏడుపు ఎందుకు? ■ మా పథకాలే కాపీ కొట్టి మాపై విమర్శలా?

ఆయుష్మాన్ భారత్ పథకం ఓ బక్వాస్ స్కీం

కూకట్‌పల్లి నియోజకవర్గ సమావేశంలో టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:**

తెలంగాణ అడ్డాలో బీజేపీ నడ్డా నాటకాలు నడువబోవని టీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కే తారకరామారావు ఘాటుగా వ్యాఖ్యానించారు. కర్ణాటకలో వేసిన పన్నాగాలు, నాటకాలు తెలంగాణలో సాగబోవని స్పష్టంచేశారు. అధికారం మత్తులో ఇష్టమొచ్చినట్లు మాట్లాడితే సహించేదిలేదని హెచ్చరించారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టుకు సహకరించాల్సింది పోయి.. ప్రాజెక్టుపై ఏడుస్తున్నారని విమర్శించారు. కేంద్రంలో అధికారంలో ఉన్న బీజేపీ నేతలు బాధ్యతాయుతంగా మాట్లాడాలని హితవుపలికారు. సోమవారం కూకట్‌పల్లి నియోజకవర్గ డివిజన్, బూత్‌స్థాయి టీఆర్‌ఎస్ కమిటీ సభ్యుల సమావేశంలో పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. రాష్ట్రం బాగుపడుతుంటే, తెలంగాణ పొలాలు పచ్చగా ఉంటే బీజేపీ, కాంగ్రెస్‌లకు నచ్చడం లేదన్నారు. హైదరాబాద్ ప్రశాంతంగా ఉంటే నచ్చని బీజేపీ.. మతాలు, కులాల పేరిట చిచ్చు పెట్టి, ఆ చలిమంటల్లో రాజకీయంగా లాభం పొందాలని చూస్తున్నదని మండిపడ్డారు. ఎవరో రాసిచ్చిన స్క్రిప్ట్‌ను బీజేపీ జాతీయ కార్యనిర్వాహక అధ్యక్షుడు జేపీ నడ్డా చదివి వెళ్లిపోయారని విమర్శించారు. రాష్ట్ర ప్రభుత్వంపై ఒక్కటంటే ఒక్కటీ సరిగా మాట్లాడని జేపీ నడ్డా.. తన పేరును పచ్చి అబద్ధాల

మిగతా 2వ పేజీలో



### ప్రభుత్వాన్ని విమర్శిస్తే ప్రజలు సహించరు

దేశానికి దారిచూపేవి తెలంగాణ పథకాలు

నడ్డా వ్యాఖ్యలపై మంత్రి నిరంజన్‌రెడ్డి ఆగ్రహం 3



### నడ్డా ఆరోపణలు అర్థరహితం

టీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మేలు: మంత్రి కొప్పుల 3

### ప్రశంసించినవారే విమర్శిస్తారా?

రాష్ట్ర పథకాలపై బీజేపీ రెండు నాల్కల ధోరణి

నడ్డా వ్యాఖ్యలపై మండిపడిన ఎమ్మెల్సీ కర్నె 3





సోమవారం కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఎర్రవాగులో చిక్కుకుపోయిన ఎడ్లబండిని తాళ్ల సాయంతో బయటకు తీస్తున్న రైతులు

### మూడు జిల్లాల్లో ఓ మోస్తరు వానలు

గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు

వచ్చే 48గంటల్లో రాష్ట్రానికి వర్షసూచన

7

### సాగర్ 26 గేట్లు మూసివేత

శ్రీశైలంలో రెండు గేట్ల ద్వారా నీటి విడుదల

శాంతించిన కృష్ణా, తుంగభద్ర, భీమా నదులు

3

### గోదావరి తగ్గుముఖం

నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో నిరంతర ఎత్తిపోతలు

ఎలంపల్లి నుంచి మధ్యమానేరుదాకా గంగమ్మ పరవళ్లు



ఎమ్మెల్సీగా ఏకగ్రీవంగా ఎన్నికైన గుత్తాసుఖేందర్‌రెడ్డికి ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు. చిత్రంలో మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, ఎన్ భాస్కర్‌రావు, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి తదితరులు కూడా ఉన్నారు

## ఎమ్మెల్సీగా గుత్తా ఏకగ్రీవం

అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి ■ ధ్రువీకరణ పత్రం అందజేత

మంత్రులు, ఎమ్మెల్యేలు, టీఆర్‌ఎస్ నేతల అభినందనలు

సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముచేయను: గుత్తా

2

### మెడికల్ కౌన్సెలింగ్‌కు లైన్‌క్లియర్

రిజర్వేషన్లపై దాఖలైన పిటిషన్ కొట్టివేత

మధ్యంతర స్టే ముగిసిందన్న హైకోర్టు

31లోపు ప్రవేశాలు ముగించాలని ఆదేశాలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కాళోజీ నారాయణరావు హెల్త్‌సైన్సెస్ యూనివర్సిటీ (కేఎన్‌ఆర్‌యూహెచ్‌ఎస్) పరిధిలోని కన్వీనర్ కోటా రెండోదశ కౌన్సెలింగ్ ప్రక్రియపై దాఖలైన పిటిషన్‌ను కొట్టివేస్తూ సోమవారం హైకోర్టు తీర్పు వెల్లడించింది. దీంతో కౌన్సెలింగ్ ప్రక్రియకు లైన్‌క్లియర్ అయ్యింది. రెండోదశ కౌన్సెలింగ్‌లో రిజర్వేషన్లను సరిగా అమలుచేయడం లేదంటూ హైకోర్టులో వేర్వేరు పిటిషన్లు దాఖలయ్యాయి. వీటిపై వాదోపవాదాలు ముగిసిన నేపథ్యంలో జస్టిస్ సంజయ్‌కుమార్, జస్టిస్ పీ కేశవరావు నేతృత్వంలోని ద్విసభ్య ధర్మాసనం గత బుధవారం తీర్పును రిజర్వుచేసింది. సోమవారం తీర్పు వెల్లడిస్తూ.. కౌన్సెలింగ్‌ను

మిగతా 3వ పేజీలో

### గుండె జబ్బుల గుట్టు మరింత పక్కాగా



అత్యంత వేగంగా, కచ్చితత్వంతో గుర్తించే అధునాతన పరికరం

అభివృద్ధిచేసిన ఐఐటీ హైదరాబాద్

హృద్రోగాల గుర్తింపులో కీలక మలుపు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** గుండె వ్యాధులను మరింత వేగంగా, సులువుగా, కచ్చితంగా గుర్తించేందుకు ఐఐటీ హైదరాబాద్.. పలు సంస్థల పరిశోధకులతో కలిసి సెన్సర్ పరికరాన్ని ఆవిష్కరించింది. ఐఐటీ హైదరాబాద్‌కు చెందిన బయోమెడికల్ ఇంజినీరింగ్ విభాగ అధిపతి ప్రొఫెసర్ రేణు జాన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ పరిశోధనలో ఐఐటీ కాన్పూర్, జువలాజికల్ సర్వే ఆఫ్ ఇండియా, అమెరికాకు చెందిన ఐయోవా స్టేట్ యూనివర్సిటీ, ఢిల్లీ టెక్నలాజికల్ యూనివర్సిటీ భాగస్వాములుగా ఉన్నాయి. వారి ఆవిష్కరణ ప్రతిష్ఠాత్మక మెటీరియల్ కెమిస్ట్రీ బీ జర్నల్‌లో ఇటీవల ప్రచురితమైంది. తాజాగా అభివృద్ధి చేసిన పరికరం నిమిషాల్లోనే గుండె సంబంధిత వ్యాధులే కాకుండా ఇతర వ్యాధులను కూడా గుర్తించగలదు. హృదయ సంబంధిత వ్యాధుల (కార్డియోవాస్కులర్ డిసీజెస్) చికిత్సలో

మిగతా 6వ పేజీలో

### నేడు కలెక్టర్లతో సీఎం భేటీ

కొత్త రెవెన్యూ చట్టంపై కలెక్టర్ల అభిప్రాయాలు తీసుకోనున్న సీఎం

60 రోజుల కార్యాచరణపై దిశానిర్దేశం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** కొత్త రెవెన్యూ చట్టం రూపకల్పనలో కలెక్టర్లను పాత్రధారులను చేయడంకోసం ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు మంగళవారం ప్రగతిభవన్‌లో కలెక్టర్ల సమావేశం నిర్వహిస్తున్నారు. ఉదయం 11.30 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్లతోపాటు మంత్రులు, సీఎస్, సంబంధితశాఖల కార్యదర్శులు పాల్గొంటారు. నయాపైసా లంచం ఇవ్వకుండా ప్రజలకు సత్వరం సేవలు అందేలా నూతన రెవెన్యూ చట్టం రూపొందాలన్న దృఢ నిశ్చయంతో ఉన్న సీఎం కేసీఆర్.. ఈ సమావేశంలో కలెక్టర్లందరి నుంచి అభిప్రాయాలు తీసుకుంటారు. వాటిని క్రోడీకరించి నూతన చట్టంలో పొందుపరిచే అవకాశం ఉంటుంది. కొత్తగా అమల్లోకి వచ్చిన పంచాయతీరాజ్, పురపాలక చట్టాల అమలు విషయంలో కూడా అభిప్రాయాలను ఈ సమావేశంలో తీసుకోనున్నారు. పట్టణాలు, గ్రామాల అభివృద్ధికి నిర్దేశించిన 60 రోజుల ప్రణాళికపైనా సమావేశంలో చర్చిస్తారు. కొత్త చట్టం రూపకల్పనతోపాటు, అమలులోకి వచ్చిన చట్టాల అమలు, 60 రోజుల ప్రత్యేక కార్యాచరణ అమలుపై జిల్లా కలెక్టర్లకు సీఎం కేసీఆర్ దిశానిర్దేశనం చేయనున్నారు.

### సీఎస్‌కు సాగునీటి శాఖ

ఉత్తర్వులు జారీచేసిన ప్రభుత్వం 2

### నేడు చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-2!

ఉదయం 8.30 నుంచి గంటపాటు కీలక ప్రక్రియలు

ఇది సవాల్‌తో కూడుకున్న దశ : ఇస్రో చైర్మన్ శివన్

III

**చికెన్ ధరలు (వెన్‌కాబ్) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| ఫారం ధర | 79.00 | రిటైల్ లైవ్ | 101.00 |
| డ్రెస్‌డ్ | 146.00 | స్కిన్‌లెస్ | 167.00 |

**గుడ్ల ధరలు (వందకు) (రూ.)**

| | | | |
|---|---|---|---|
| హైదరాబాద్ | 341.00 | రంగారెడ్డి | 341.00 |
| మెదక్ | 341.00 | కరీంనగర్ | 344.00 |
| వరంగల్ | 344.00 | చిల్లర ధర | 4.00 |

## హైకోర్టు తీర్పిస్తే నాకేంటి?

ధర్మగంట




బాధితురాలు సరోజినీదేవి

- న్యాయస్థానం ఉత్తర్వుల అమలులో తాసిల్దార్ నిర్లక్ష్యం
- జీపీ అభిప్రాయం తీసుకున్నాక చూస్తానంటూ వింతవాదన
- ఆర్డీవో ఆదేశాలూ బేఖాతర్.. కబ్జాదారులకే వత్తాసు
- ధర్మగంటను ఆశ్రయించిన దివంగత సినీనటి ప్రత్యూష తల్లి

**జేసీ** కోర్టు బాధితురాలికి అనుకూలంగా ఆదేశాలు ఇచ్చింది.. వాటిని వెంటనే అమలుచేయాలంటూ హైకోర్టు కూడా తీర్పు ఇచ్చింది.. కానీ తాసిల్దార్ మాత్రం సాక్షాత్తు కోర్టు ఉత్తర్వులను పట్టించుకోవడం లేదు. ఆర్డీవో ఆదేశాలను బేఖాతర్ చేస్తున్నాడు. కబ్జాదారులకే వంత పాడుతూ.. రైతుకు జారీఅయిన పట్టాదారు పాస్‌పుస్తకాన్ని పెండింగ్‌లో పెట్టి వేధిస్తున్నాడు. కోర్టు తీర్పిస్తే నాకేంటి.. ప్రభుత్వ న్యాయవాది (జీపీ) అభిప్రాయాన్నే అమలుచేస్తానంటూ వింతవాదన చేస్తున్నాడు. భువనగిరి తాసిల్దార్ తీరుతో విసిగివేసారిన దివంగత సినీనటి ప్రత్యూష తల్లి సరోజినీదేవి ధర్మగంటను ఆశ్రయించారు.

6





## మట్టి గణేశులు రెడీ..

సెప్టెంబర్ రెండు నుంచి గణేశ్ నవరాత్రులు ప్రారంభకానున్న నేపథ్యంలో వేడుకలకు గణపతి విగ్రహాలు రెడీ అవుతున్నాయి. ఈసారి కళాకారులు పెద్దసంఖ్యలో పర్యావరణహిత విఘ్నేశ్వరుడి ప్రతిమలను తయారుచేస్తున్నారు. కాలుష్యాన్ని నివారించేందుకు జీవావరణ వస్తువులతో విగ్రహాలను అందంగా వివిధ రూపాల్లో రూపొందిస్తున్నారు. హైదరాబాద్‌లో ఓ కళాకారుడు మట్టితో ఏకదంతుడి విగ్రహాన్ని తయారుచేస్తుండగా సోమవారం కెమెరాకంటికి చిక్కిన దృశ్యమిది.

## గవర్నర్‌కు స్వల్ప అస్వస్థత

- వైద్య చికిత్స తర్వాత కుదుటపడిన ఆరోగ్యం
- నేడు రాష్ట్రపతి కోవింద్‌తో భేటీ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర గవర్నర్ ఈఎస్‌ఎల్ నరసింహన్ బీహార్‌లోని బుద్ధగయలో సోమవారం ఉదయం స్వల్ప అస్వస్థతకు గురయ్యారు. తల్లి శ్రాద్ధకర్మ కోసం ఆదివారం సాయంత్రం హైదరాబాద్ నుంచి బుద్ధగయ వెళ్లిన ఆయన.. అక్కడ కార్యక్రమాలు జరిగేంత వరకు మంచినీరు కూడా తీసుకోకుండా కఠిన ఉపవాసదీక్ష చేశారు. దాంతో శరీరం సత్తువ కోల్పోయి అస్వస్థతకు గురయ్యారు. వెంటనే ఆయనను స్థానిక గయ వైద్య కళాశాలకు తరలించి చికిత్స జరిపించారు. చికిత్స అనంతరం ఆయన ఆరోగ్యం సాధారణ స్థితికి చేరుకొన్నట్టు అక్కడి వైద్యులు ప్రకటించారు. పూర్తిగా కోలుకొన్న గవర్నర్.. సోమవారం సాయంత్రం ఢిల్లీకి చేరుకొన్నారు. మంగళవారం రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్‌తో భేటీ కానున్నట్టు రాజ్‌భవన్‌వర్గాలు వెల్లడించాయి. గవర్నర్ల పరిపాలనాసంస్కరణల కమిటీకి నరసింహన్ నాయకత్వం వహిస్తున్నారు. దేశంలోనే సీనియర్ గవర్నర్ అయిన నరసింహన్‌ను డోయెన్ గవర్నర్‌గా పిలుస్తారు. కోవింద్, నరసింహన్ భేటీలో వివిధ సంస్కరణలు చర్చకు వచ్చే అవకాశాలు ఉన్నట్టు తెలిసింది.

## రాహుల్‌గాంధీకి చేరిన గ్రీన్ ఛాలెంజ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఇగ్నైటింగ్ మైండ్స్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో ప్రారంభమైన రెండోవిడుత గ్రీన్ చాలెంజ్‌కు దేశవ్యాప్తంగా మంచి స్పందన వస్తున్నది. టీఆర్‌ఎస్ రాజ్యసభ సభ్యుడు సంతోష్‌కుమార్ ఆదివారం ప్రారంభించిన గ్రీన్ ఛాలెంజ్ కాంగ్రెస్‌పార్టీ జాతీయనాయకుడు రాహుల్‌గాంధీని చేరింది. ఆదివారం రెండుకోట్ల మార్క్ మొక్కను నాటిన ఎంపీ సంతోష్.. వైఎస్సార్‌సీపీ ఎంపీలు విజయసాయిరెడ్డి, మిథున్‌రెడ్డి, జీఎమ్మార్ అధినేత గ్రంధి మల్లికార్జున్‌రావు, నటుడు అఖిల్ అక్కినేనిని నామినేట్ చేశారు. చాలెంజ్‌ను స్వీకరించిన మల్లికార్జునరావు స్వయంగా మొక్కను నాటగా.. అమెరికా పర్యటనలో ఉన్న మిథున్‌రెడ్డి ఏపీకి వచ్చాక మొక్క నాటుతానని పేర్కొంటూ ఎంపీ సుప్రియాసూలేతోపాటు ఇద్దరిని నామినేట్ చేశారు. తన నియోజకవర్గంలోని జెడ్పీ పాఠశాలలో మొక్క నాటిన సుప్రియాసూలే.. రాహుల్‌గాంధీపాటు సుస్మితాదేవి, పాండాజైను నామినేట్ చేస్తున్నట్టు ట్వీట్ చేశారు.





సోమవారం హైదరాబాద్‌లోని ఎన్ గార్డెన్స్‌లో కూకట్‌పల్లి నియోజకవర్గ డివిజన్, బూత్‌స్థాయి టీఆర్‌ఎస్ కమిటీ సభ్యుల సమావేశంలో మాట్లాడుతున్న పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కల్వకుంట్ల తారకరామారావు. చిత్రంలో మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, చామకూర మల్లారెడ్డి, ఎమ్మెల్యేలు మాధవరం కృష్ణారావు, కేపీ వివేకానంద్, ఎమ్మెల్సీలు నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, పార్టీ నేత మర్రి రాజశేఖర్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

# మీ నాటకాలు సాగవు

మొదటిపేజీ తరువాయి...

అడ్డాగా మార్చుకోవాలని ఎద్దేవాచేశారు.

### తెలంగాణ పథకాలను కాపీకొట్టిన కేంద్రం

తెలంగాణలో అమలుచేస్తున్న పథకాలను కేంద్రప్రభుత్వం కాపీకొట్టిందని కేటీఆర్ తెలిపారు. రైతుబంధును పీఎం కిసాన్‌గా మార్చారని, మిషన్ భగీరథను నకలుకొట్టి జల్‌శక్తి అభియాన్ అంటున్నారని పేర్కొన్నారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో వ్యవసాయానికి 24 గంటల ఉచిత కరంట్ ఇస్తున్నారా? అని కేటీఆర్ ప్రశ్నించారు. చేతనైతే తెలంగాణ సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుచేసి చూపాలన్నారు. కేంద్రం అమలుచేస్తున్న ఆయుష్మాన్ భారత్.. ఓ బక్వాస్ స్కీం అని కొట్టిపారేశారు. దానికన్నా ఆరోగ్యశ్రీ పథకమే మంచిదని స్పష్టంచేశారు. రాష్ట్రంలో ఏడాదికి రూ.12 వేల కోట్లు పింఛన్లుగా ఇస్తున్నామని, ఇందులో కేంద్రం రూ.200 కోట్లు ఇచ్చి.. మొత్తం తానే ఇస్తున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నదని కేటీఆర్ మండిపడ్డారు. రాజకీయంగా ఎదగాలంటే మంచిపనులు చేసి ఎదగాలే తప్ప ఇష్టమొచ్చినట్లు మాట్లాడడం సరికాదని బీజేపీ నేతలకు హితవుపలికారు. రాజ్యాంగబద్ధంగా రావాల్సిన నిధులు తప్ప హైదరాబాద్ అభివృద్ధికి గత ఐదేండ్లలో మోదీ ప్రభుత్వం చేసిందేమీలేదని స్పష్టంచేశారు. ఐదేండ్లలో ఒక్కరోజైనా కర్ఫ్యూ పెట్టాల్సిన పరిస్థితి రాలేదన్న కేటీఆర్.. ముఖ్యమంత్రి కేసీఆర్ కార్యదక్షత, పనితీరుకు ఇది నిదర్శనమని అన్నారు.



సోమవారం కూకట్‌పల్లిలోని ఎన్ గార్డెన్స్‌లో నిర్వహించిన టీఆర్‌ఎస్ పార్టీ నియోజవర్గ సమావేశానికి హాజరైన కార్యకర్తలు

### కాళేశ్వరంపైనా ఏడుపా!

నీళ్లు, నిధులు, నియామకాల్లో జరిగిన అన్యాయాన్ని సరిచేసుకోవడానికే తెలంగాణ సాధించుకున్నామని కేటీఆర్ చెప్పారు. ప్రపంచంలోనే అతి పెద్దదైన కాళేశ్వరం లిఫ్ట్ ఇరిగేషన్ ప్రాజెక్టును కొత్త రాష్ట్రంలో చేపడితే సహకరించాల్సింది పోయి.. ప్రాజెక్టుపై ఏడుస్తున్నారని విమర్శించారు. తెలంగాణ వచ్చిందే కాళేశ్వరం లాంటి ప్రాజెక్టులు కట్టుకోవడానికని చెప్పారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలు దేశానికే ఆదర్శంగా నిలుస్తున్నాయని కేటీఆర్ వివరించారు. మిషన్ కాకతీయకు రూ.5వేల కోట్లు ఇవ్వాలని నీతి ఆయోగ్ సిఫారసుచేస్తే కేంద్రం ఎందుకు పట్టించుకోలేదని ప్రశ్నించారు. మిషన్ కాకతీయను నీతి ఆయోగ్ ప్రశంసించిందని గుర్తుచేస్తూ.. కేంద్ర ప్రభుత్వ సంస్థల ప్రశంసలు బీజేపీ నేతలకు కనబడుతలేవా అని నిలదీశారు. పదకొండు రాష్ట్రాల నుంచి మంత్రులు, అధికారులు తెలంగాణకు వచ్చి, అధ్యయనం చేసి నేర్చుకున్నారని గుర్తుచేశారు. అవినీతి అంటూ గొంతు చించుకుంటున్న నేతలకు దమ్ముంటే.. ఆధారాలను ప్రజాక్షేత్రంలో పెట్టాలని సవాలు విసిరారు. గతంలో కాంగ్రెస్ నేతలు ఇలానే మాట్లాడారని, ఒకాయన కాంగ్రెస్ అధికారంలోకి రాకపోతే గడ్డం తీయనని చెప్పారని, టీఆర్‌ఎస్ అధికారంలోకి వచ్చింది కానీ ఆయన గడ్డం అలాగే ఉన్నదని కేటీఆర్ ఎద్దేవా చేశారు.

### టీఆర్‌ఎస్‌కు ప్రాణవాయువు కార్యకర్తలే

తెలంగాణ రాష్ట్రవ్యాప్తంగా 50 లక్షల సభ్యత్వంతో టీఆర్‌ఎస్ తిరుగులేని రాజకీయశక్తిగా మారిందని కేటీఆర్ అన్నారు. క్రమశిక్షణ కలిగిన నాయకులు, కార్యకర్తలే టీఆర్‌ఎస్‌కు బలమని చెప్పారు. ఎగిరెగిరిపడుతున్న బీజేపీ నేతలను పట్టించుకోవాల్సిన అవసరం లేదన్నారు. ప్రభుత్వంపై బీజేపీ చేస్తున్న దుష్ప్రచారం, కుట్రలను టీఆర్‌ఎస్ శ్రేణులు ఎక్కడికక్కడ తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. తెలంగాణను బంగారు తెలంగాణగా, హైదరాబాద్‌ను విశ్వనగరంగా చేయడం టీఆర్‌ఎస్ ప్రభుత్వ లక్ష్యమన్నారు. కూకట్‌పల్లి పరిధిలో కార్పొరేటర్ల సంఖ్య పెంచే విషయాన్ని సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకువెళ్తానని చెప్పారు.

### నడ్డా వ్యాఖ్యలపై విరుచుకుపడ్డ మంత్రులు

టీఆర్‌ఎస్ ప్రభుత్వ సంక్షేమ పథకాలను బీజేపీ దేశమంతా కాపీ కొడుతున్నదని మంత్రి శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. ఒక్క ఎమ్మెల్యే సీటు గెలిచి బీజేపీ ఎగిసి పడుతున్నదని, ఆ పార్టీని చూసి భయపడేవారు ఎవరూలేరని చెప్పారు. ఐదేండ్లలో రాష్ట్ర ప్రజలకు కేంద్ర ప్రభుత్వం ఏం చేసిందో చెప్పే ధైర్యం బీజేపీకి లేదన్నారు. యువనేత, పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ ఆధ్వర్యంలో టీఆర్‌ఎస్ మరింత బలోపేతమవుతుందని చెప్పారు. మరో 20 ఏండ్లు కేసీఆరే సీఎం అని శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మంత్రి మల్లారెడ్డి మాట్లాడుతూ దేశంలో దమ్మున్న సీఎం కేసీఆర్ అన్నారు. కాళేశ్వరం లాంటి భారీ ప్రాజెక్టును కట్టే సత్తా కేసీఆర్‌కే ఉన్నదని నిరూపితమైందని చెప్పారు. తెలంగాణ తరహాలో సంక్షేమ పథకాలు బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలవుతున్నాయా? అని ప్రశ్నించారు. దమ్ముంటే తెలంగాణ సంక్షేమ పథకాలను బీజేపీ పాలిత రాష్ట్రాల్లో అమలుచేసి చూపాలన్నారు. తెలంగాణ ప్రజలు కేసీఆర్‌ను, టీఆర్‌ఎస్‌ను తప్ప మరెవర్నీ నమ్మే పరిస్థితిలేదని స్పష్టంచేశారు. మంత్రి శ్రీనివాస్‌యాదవ్ మాట్లాడుతూ బీజేపీ, కాంగ్రెస్ నేతల తాటాకు చప్పుళ్లకు బెదిరేవాళ్లు ఎవరూలేరని అన్నారు. రాష్ట్రంలో సంక్షేమ పథకాలు, అభివృద్ధి విషయంలో ఏ వేదిక మీద అయినా చర్చకు సిద్ధమని సవాలు విసిరారు. ఏది పడితే అది మాట్లాడితే ఊరుకోబోమని బీజేపీ నేతలను హెచ్చరించారు. షెడ్యూల్ ప్రకారమే జీహెచ్‌ఎంసీ ఎన్నికలు జరుగుతాయని, గతంకంటే టీఆర్‌ఎస్‌కు అదనంగా ఐదు సీట్లు వస్తాయని చెప్పారు. కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఎమ్మెల్యే వివేక్, ఎమ్మెల్సీలు కే నవీన్‌కుమార్, శంభీపూర్ రాజు, యువజన విభాగం నాయకులు పాటిమీది జగన్మోహన్‌రావు, పలువురు కార్పొరేటర్లు తదితరులు పాల్గొన్నారు.

## సీఎస్‌కు సాగునీటిశాఖ

అదనపు బాధ్యతలు అప్పగించిన ప్రభుత్వం



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి ఎస్కే జోషికి సాగునీటి పారుదలశాఖ, భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణ కమిషనర్ బాధ్యతలను అప్పగిస్తూ ప్రభుత్వం సోమవారం ఉత్తర్వులు జారీచేసింది. ఇప్పటివరకు రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా నియమితులైన సోమేశ్‌కుమార్ సాగునీటి పారుదలశాఖ భూసేకరణ, పునరావాసం, పునర్నిర్మాణం బాధ్యతలను నిర్వర్తించారు.

## మంత్రి ఎర్రబెల్లిని కలిసిన పీఆర్ కమిషనర్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధిశాఖ కమిషనర్‌గా పదవీబాధ్యతలు చేపట్టిన ఎం రఘునందన్‌రావు సోమవారం మంత్రి దయాకర్‌రావును మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రితో పంచాయతీరాజ్‌కు సంబంధించిన పలు అంశాలపై చర్చించారు. త్వరలో రూపుదిద్దుకోనున్న 60 రోజుల ప్రణాళికపై పలువిషయాలను మంత్రి దయాకర్‌రావుకు వివరించారు.



మంత్రి దయాకర్‌రావుకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న రఘునందన్‌రావు

## సోమేశ్‌కుమార్ బాధ్యతల స్వీకరణ

- ఉద్యోగసంఘాల నేతల అభినందన

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రెవెన్యూశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా సోమేశ్‌కుమార్ సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు రెవెన్యూశాఖ బాధ్యతలు నిర్వర్తించిన రాజేశ్వర్‌తివారి విధుల నుంచి రిలీవయ్యారు. తివారి అటవీశాఖ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటివరకు అదనపు బాధ్యతలు నిర్వర్తించిన అజయ్‌మిశ్రా రిలీవ్ అయ్యారు.



సోమేశ్‌కుమార్‌ను అభినందిస్తున్న రాష్ట్ర రుణవిముక్తి కమిషన్ చైర్మన్ వెంకటేశ్వర్లు

### అభినందనల వెల్లువ

రెవెన్యూశాఖ బాధ్యతలు స్వీకరించిన సోమేశ్ కుమార్‌ను రాష్ట్ర రుణవిముక్తి కమిషన్ చైర్మన్ నాగుర్ల వెంకటేశ్వర్లు, సభ్యులు కవ్వా లక్ష్మారెడ్డి, పాకాల శ్రీహరిరావు సోమవారం సచివాలయంలో కలిసి పుష్పగుచ్ఛం అందించి అభినందించారు. టీజీవో ప్రధాన కార్యదర్శి ఏ సత్యనారాయణ, టీజీవో ఎక్సైజ్ అధికారుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీందర్‌రావు, కోశాధికారి లక్ష్మణ్‌గౌడ్, అసోసియేట్ ప్రెసిడెంట్ శ్రీనివాస్‌రెడ్డి, ఇన్‌స్పెక్టర్లు శ్యాం, శేఖర్ సోమేశ్ కుమార్‌కు శుభాకాంక్షలు తెలిపారు. అబ్కారీ శాఖలో పదోన్నతులతోపాటు పలు అంశాలపై చర్చించారు. డీపీసీ పూర్తయినా పదోన్నతులు ప్రకటించలేదని పేర్కొనగా, త్వరలోనే దీనిపై నిర్ణయం తీసుకుంటామని సోమేశ్‌కుమార్ చెప్పారు. తెలంగాణ కమర్షియల్ ట్యాక్స్ తెలంగాణ గెజిటెడ్ అధికారుల సంఘం (టీసీటీజీవో) ప్రతినిధులు అభినందనలు తెలిపారు. రెవెన్యూ వసూళ్లు, ఇతర అంశాల్లో సలహాలు ఇస్తూ ముందుకునడిపించాలని సోమేశ్‌కుమార్‌ను కోరగా, త్వరలో సమావేశం ఏర్పాటుచేస్తామని హామీఇచ్చారు. అభినందనలు తెలిపినవారిలో టీసీటీజీవో అధ్యక్షుడు బీ వెంకటయ్య, ప్రధాన కార్యదర్శి ఎన్ దేవేందర్, సంయుక్త కార్యదర్శి మురహరి, కార్యవర్గ సభ్యుడు రాజు తదితరులు ఉన్నారు. రెవెన్యూశాఖ పటిష్టం కోసం, ప్రజలకు మరింత సులువుగా సేవలందించేందుకు తీసుకొనే చర్యలకు సంపూర్ణ మద్దతు ఉంటుందని సోమేశ్‌కుమార్‌కు రెవెన్యూ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు వంగ రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి, ఎం నారాయణరెడ్డి, తాసీల్దార్ల సంఘం అధ్యక్షుడు గౌతంకుమార్, వీఆర్వో, వీఆర్‌ఏ సంఘాల ప్రతినిధులు తెలిపారు. కంక్లూజివ్ టైటిల్ యాక్ట్ తేవడానికి ముందుగా భూ సమగ్రసర్వే చేయాలని, పదోన్నతులు చేపట్టాలని కోరారు.

### ముహూర్తం

సూర్యోదయం: 6.04 గంటలకు

సూర్యాస్తమయం: 6.35 గంటలకు

వికారినామ సంవత్సరం, దక్షిణాయణం, వర్షరుతువు, శ్రావణమాసం, కృష్ణపక్షం, చతుర్థి తె.జా. 3.32 వరకు, తదుపరి పంచమి, నక్షత్రం: రేవతి రాత్రి 10.29 వరకు, తదుపరి అశ్విని, అమృతఘడియలు: రాత్రి 7.49 నుంచి 9.25 వరకు, రాహుకాలం: మధ్యాహ్నం 3.27 నుంచి సాయంత్రం 5.01 వరకు, దుర్ముహూర్తం: ఉదయం 8.34 నుంచి 9.24 వరకు, తిరిగి మధ్యాహ్నం 2.25 నుంచి 3.15 వరకు, వర్జ్యం: ఉదయం 9.09 నుంచి 10.45 వరకు.

### లోకం పోకడ



హలో నేను మీ ఫేస్‌బుక్ ఫ్రెండ్‌ని, మీ పోస్టులు షేర్ చేస్తుంటా గదా.. ఇప్పుడు మీ ఖాతాలో డబ్బులు కూడా షేర్ చేసుకున్నాను. థ్యాంక్యూ ఫ్రెండ్!

## బకాయి 457 కోట్లే

- ఆరోగ్యశ్రీపై కొన్నివర్గాల అబద్ధపు ప్రచారం
- రూ.1500 కోట్ల బకాయిలంటూ వదంతులు
- నాలుగున్నర నెలల్లోనే రూ.412.9 కోట్లు చెల్లింపులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆరోగ్య తెలంగాణ సాధన దిశగా ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావు దేశంలో ఎక్కడా లేనివిధంగా వైద్యపథకాలను అమలుచేస్తున్నారు. ఇందుకోసం ప్రత్యేక నిధులు కేటాయిస్తూ ప్రజారోగ్యంపై నిబద్ధతను చాటుకుంటున్నారు. అందులోభాగంగానే తెలంగాణ ప్రభుత్వం ఆరోగ్యశ్రీ పథకాన్ని అమలుచేస్తున్నది. ప్రతిష్ఠాత్మకమైన ఈ పథకానికి ప్రభుత్వం చెల్లించాల్సిన బకాయిలు రూ. 457 కోట్లు మాత్రమే ఉండగా.. రూ.1500 కోట్లు బకాయిలున్నాయంటూ కొన్నివర్గాలు అబద్ధపు ప్రచారం కొనసాగిస్తున్నాయి. పనిగట్టుకొని పుకార్లు సృష్టిస్తున్నాయి. దీంతో చిన్న దవాఖానలు కొన్ని ఆరోగ్యశ్రీ సేవలను నిలిపివేయడంతో పేదలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సూపర్ స్పెషాలిటీ వైద్యసేవలు అందించే ముఖ్యమైన దవాఖానల్లో ఆటంకం లేకపోయినప్పటికీ.. నిరంతరాయంగా కొనసాగే ఆరోగ్యశ్రీ, ఈజేహెచ్‌ఎస్ పథకాల నిర్వహణకు సంబంధించి బకాయిలను మూడింతలు పెంచి అబద్ధపు ప్రచారం చేస్తుండటంతో ప్రజలు అయోమయానికి గురవుతున్నారు. తెలంగాణ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి వైద్య పథకాల నిర్వహణకు సంబంధించిన నిధుల చెల్లింపులో ఎలాంటి జాప్యం జరుగడంలేదు. ఎప్పటికప్పుడు మంజూరు చేస్తున్నది. అయితే, ఈ ఏడాది వరుసగా శాసనసభ, పార్లమెంట్, పంచాయతీ ఎన్నికల కోడ్, తదితర కారణాలతో కొంత జాప్యం ఏర్పడింది. అయినప్పటికీ ఈ ఆర్థిక సంవత్సరం నాలుగున్నర నెలల్లోనే రాష్ట్రప్రభుత్వం రూ.రూ.412.9 కోట్లు చెల్లించింది. ఆరోగ్యశ్రీ నిరంతరాయంగా కొనసాగే పథకం. పేదలు ఎప్పటికప్పుడు సేవలు పొందుతూనే ఉంటారు. దీంతో ప్రభుత్వం నిధుల చెల్లింపు జరుపుతున్నప్పటికీ బకాయిలు ఏర్పడుతుండటం సహజం. వాస్తవంగా చూస్తే వైద్యసేవలకు సంబంధించిన చెల్లింపునకు సంబంధించి ప్రైవేటు దవాఖానలకు రూ.457.74కోట్లు మాత్రమే బకాయి ఉన్నది. ఆ మొత్తంలో ఆరోగ్యశ్రీ పథకం కింద రూ. 344.17 కోట్లు, ఈజేహెచ్‌ఎస్ పథకం కింద రూ.113.57కోట్లు ఉన్నట్లు వైద్య విభాగాలు నిర్ధారించాయి. వాస్తవ పరిస్థితులను ప్రజలు గుర్తించాల్సిందిగా సంబంధిత విభాగాలు సూచించాయి.

### మానవీయ కోణంలో ఆలోచించాలి



రాష్ట్రంలోని సూపర్ స్పెషాలిటీ హాస్పటళ్లలో ఆరోగ్యశ్రీ సేవలు యథాతథంగా కొనసాగుతున్నాయి. ఎటువంటి సమస్యా లేదు. వైద్యులు వ్యాపార ధోరణితో కాకుండా మానవీయ కోణంలోనూ ఆలోచించాలి. ఆరోగ్యశ్రీ కింద రూ.1500 కోట్లు బకాయి ఉన్నట్టు చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదు. ప్రైవేటు దవాఖానలకు రూ.457.74 కోట్లు మాత్రమే బకాయి ఉన్నది. అందులో ఆరోగ్యశ్రీ కింద రూ.344.17 కోట్లు, ఈజేహెచ్‌ఎస్ కింద రూ.113.57 కోట్లు చెల్లించాల్సి ఉన్నది. ఈ బకాయిలను విడుతలవారీగా చెల్లించేందుకు ప్రణాళికలు రూపొందించాం. ప్రజలు ఆందోళనకు గురికావద్దు. **- వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి రాజేందర్**

**2019 ఏప్రిల్ 1 నుంచి ఆగస్టు 15 వరకు చెల్లించిన నిధులు రూ.కోట్లల్లో..**

| దవాఖాన క్యాటగిరీ | ఆరోగ్యశ్రీ | ఈజేహెచ్‌ఎస్ | చెల్లించిన మొత్తం |
|---|---|---|---|
| ప్రైవేటు దవాఖానలు | 199.24 | 128.24 | 327.48 |
| ప్రభుత్వ దవాఖానలు | 68.14 | 17.28 | 85.42 |
| **చెల్లించిన మొత్తం** | **267.38** | **145.52** | **412.9** |

**2019 ఆగస్టు 16వరకు నిధుల బకాయి రూ.కోట్లల్లో..!**

| దవాఖాన క్యాటగిరీ | ఆరోగ్యశ్రీ | ఈజేహెచ్‌ఎస్ | బకాయి మొత్తం |
|---|---|---|---|
| ప్రైవేటు దవాఖానలు | 344.17 | 113.57 | 457.74 |
| ప్రభుత్వ దవాఖానలు | 122.71 | 9.59 | 132.3 |
| **మొత్తం** | **468.88** | **123.16** | **590.04** |

### ఆరోగ్యశ్రీపై చింతించాల్సిన అవసరం లేదు: డాక్టర్ నాగేందర్



**కొన్ని** ప్రైవేటు దవాఖానల్లో ఆరోగ్యశ్రీ పథకం కింద చికిత్సలు అందకపోవడంతో రోగులు చింతించాల్సిన అవసరం లేదని, ఉస్మానియాతోపాటు, అన్ని ప్రభుత్వ దవాఖానల్లో వైద్యసేవలు అందుబాటులో ఉన్నాయని ఉస్మానియా దవాఖాన సూపరిండెంట్ డాక్టర్ నాగేందర్ పేర్కొన్నారు. ప్రభుత్వ దవాఖానల్లోనూ మెరుగైన చికిత్స అందించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పారు. ఎప్పటిలాగే రోగులకు 24 గంటలు చికిత్సలు అందుబాటులో ఉంటాయని సూచించారు.

## యూరియా కోటాను వెంటనే ఇవ్వండి

కేంద్రమంత్రికి రాష్ట్రమంత్రి నిరంజన్‌రెడ్డి లేఖ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణకు రావాల్సిన యూరియా కోటాను వెంటనే విడుదలచేయాలని కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి నరేంద్రసింగ్ తోమర్‌కు రాష్ట్రవ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి లేఖరాశారు. 'మహారాష్ట్ర, కర్ణాటకలో కురిసిన భారీ వర్షాలతో కృష్ణా, గోదావరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. తెలంగాణలో ప్రాజెక్టులన్నీ నీటితో కళకళలాడుతున్నాయి. గతంతో పోలిస్తే ఈ ఏడాది గోదావరి, కృష్ణా పరీవాహక ప్రాంతాల్లో వరి, మక్కజొన్న, వేరుశనగ పంటల సాగు పెరుగనున్నది. ఎరువులకు డిమాండ్ పెరిగే అవకాశమున్నది. తెలంగాణకు వెంటనే యూరియాను విడుదల చేయండి' అని మంత్రి నిరంజన్‌రెడ్డి లేఖలో పేర్కొన్నారు. తెలంగాణకు ఆగస్టు నెలకు 1.40 లక్షల మెట్రిక్ టన్నుల యూరియా కేటాయించారని, ఇది ఇతర దేశాల నుంచి దిగుమతి చేసుకొనే కోటాలో ఉండటంతో ఆలస్యం కావచ్చని, యూరియా కొరత రాకుండా ఇతర రాష్ట్రాల కోటానుంచి వెంటనే సరఫరా చేయాలని కోరారు.

## వ్యవసాయశాఖ పద్దులపై మంత్రి సమీక్ష

**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** పూర్తిస్థాయి బడ్జెట్ రూపొందుతున్న నేపథ్యంలో వ్యవసాయ, సహకార, పౌరసరఫరాలు, మార్కెటింగ్ తదితర శాఖల పద్దులపై సోమవారం వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి సమీక్ష నిర్వహించారు. వచ్చే ఏడాదికి అవసరమయిన పూర్తిస్థాయి ప్రణాళికా సిద్ధంచేయాలని అధికారులకు సూచించారు. మంత్రి నివాసంలో జరిగిన సమావేశానికి వ్యవసాయశాఖ ముఖ్యకార్యదర్శి పార్థసారథి, కమిషనర్ రాహుల్‌బొజ్జా, అగ్రి వర్సిటీ రిజిస్ట్రార్ డాక్టర్ ఎస్ సుధీర్‌కుమార్, ఉద్యానశాఖ కమిషనర్ వెంకట్రామ్‌రెడ్డి, మార్కెటింగ్ డైరెక్టర్ లక్ష్మీబాయి, విత్తన సంస్థ డైరెక్టర్ డాక్టర్ కే కేశవులు, సహకారశాఖ డైరెక్టర్ వీరబ్రహ్మయ్య, గిడ్డంగుల సంస్థ ఎండీ భాస్కరాచారి తదితరులు హాజరయ్యారు.

## ఎమ్మెల్సీగా గుత్తా ఏకగ్రీవ ఎన్నిక

- అధికారికంగా ప్రకటించిన రిటర్నింగ్ అధికారి
- ధ్రువీకరణ పత్రం అందజేత
- మంత్రులు, ఎమ్మెల్యేలు, టీఆర్‌ఎస్ నేతల అభినందనలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** శాసనసభ్యుల కోటా ఎమ్మెల్సీగా (శాసన మండలి సభ్యునిగా) టీఆర్‌ఎస్ అభ్యర్థి గుత్తా సుఖేందర్‌రెడ్డి ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఈ విషయాన్ని ఎన్నికల రిటర్నింగ్ అధికారి వీ నర్సింహాచార్యులు సోమవారం అధికారికంగా ప్రకటించి.. గుత్తాకు ధ్రువీకరణ పత్రాన్ని అందజేశారు. అసెంబ్లీలోని రిటర్నింగ్ అధికారి కార్యాలయంలో జరిగిన ఈ కార్యక్రమంలో గుత్తా వెంట రాష్ట్ర మంత్రులు జీ జగదీశ్‌రెడ్డి, వేముల ప్రశాంత్ రెడ్డి కూడా ఉన్నారు. 2015లో ఎమ్మెల్యేల కోటా నుంచి టీఆర్‌ఎస్ అభ్యర్థిగా ఎన్నికైన కే యాదవరెడ్డిపై పార్టీ ఫిరాయింపు వ్యవహారంలో అనర్హతవేటు పడటంతో ఉపఎన్నిక అనివార్యమైంది. ఆ స్థానానికి గుత్తా సుఖేందర్‌రెడ్డి మినహా ఇంకెవరూ పోటీలో లేకపోవడంతో ఆయన ఏకగ్రీవంగా ఎన్నికైనట్టు రిటర్నింగ్ అధికారి ప్రకటించారు. 2021 జూన్ మూడు వరకు గుత్తా ఎమ్మెల్సీగా కొనసాగనున్నారు.

### పలువురి అభినందనలు

ఎమ్మెల్సీగా ఎన్నికైన గుత్తాను మంత్రులు జగదీశ్‌రెడ్డి, ప్రశాంత్‌రెడ్డి, ఎన్నికల రిటర్నింగ్ అధికారి నర్సింహాచార్యులు అభినందించారు. రాజ్యసభ సభ్యుడు బడుగుల లింగయ్యయాదవ్, మాజీ మంత్రి నాయిని నర్సింహారెడ్డి, నల్లగొండ జెడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీత, గాదరి కిశోర్, కంచర్ల భూపాల్‌రెడ్డి, ఎన్ భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, చిరుమర్తి లింగయ్య, ఎమ్మెల్సీలు కర్నె ప్రభాకర్, తేరా చిన్నపరెడ్డి, మాజీ ఎంపీ బూర నర్సయ్యగౌడ్, టీఆర్‌ఎస్ నాయకులు కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, వేనేపల్లి చందర్‌రావు, వేమిరెడ్డి నర్సింహారెడ్డి, సైదిరెడ్డి, చాడ కిషన్‌రెడ్డి తదితరులు గుత్తాకు అభినందనలు తెలిపారు.

### సీఎం కేసీఆర్ నమ్మకాన్ని వమ్ముచేయను: గుత్తా



**తనకు** ఎమ్మెల్సీగా అవకాశం కల్పించిన పార్టీ అధినేత, ముఖ్యమంత్రి కే చంద్రశేఖర్‌రావుకు గుత్తా సుఖేందర్‌రెడ్డి కృతజ్ఞతలు తెలిపారు. ఎమ్మెల్సీగా ఎన్నికైన అనంతరం టీఆర్‌ఎస్ ఎల్పీ కార్యాలయంలో గుత్తా మీడియా సమావేశంలో మాట్లాడారు. తన రాజకీయ జీవితంలో ఇప్పటివరకు మూడుసార్లు ఎంపీగా ఎన్నికవడంతోపాటు పీఏసీఎస్ చైర్మన్‌గా, జెడ్పీటీసీ సభ్యుడిగా, మార్కెట్ కమిటీ చైర్మన్‌గా, రాష్ట్ర పాడిపరిశ్రమాభివృద్ధి సంస్థ చైర్మన్‌గా, రైతు సమన్వయ సమితి చైర్మన్‌గా పనిచేశానని, సీఎం కేసీఆర్ ప్రవేశపెట్టిన రైతుబంధు, రైతుబీమా లాంటి పథకాలు విజయవంతంగా అమలవడంలో తనవంతు కృషిచేశానని చెప్పారు. దేశంలో ఎక్కడా లేనివిధంగా రైతుల సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టిన ఘనత సీఎం కేసీఆర్‌కే దక్కుతుందని, ఆయన తనపై ఉంచిన నమ్మకాన్ని వమ్ముచేయకుండా ప్రజలకు మరింత సేవచేస్తానని గుత్తా పేర్కొన్నారు. తన ఎన్నికకు సహకరించిన మంత్రి జగదీశ్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, టీఆర్‌ఎస్ నాయకులకు ఆయన ధన్యవాదాలు తెలిపారు.

# ముగిసిన ఎంసెట్ కౌన్సెలింగ్

కన్వీనర్ కోటాలో 76 శాతం సీట్లు భర్తీ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో అడ్మిషన్ల ప్రక్రియ ముగిసింది. ఎంసెట్ తొలి, తుది విడుత కౌన్సెలింగ్‌లో మిగిలిన సీట్లకు చేపట్టిన స్పాట్ కౌన్సెలింగ్ ప్రక్రియ కూడా ఈ నెల పదోతేదీతో ముగిసింది. ప్రభుత్వ, ప్రైవేటు ఇంజినీరింగ్ కాలేజీల్లో మొత్తం 76 శాతం సీట్లు భర్తీఅయ్యాయని, ఇంకా 24 శాతం వరకు సీట్లు మిగిలాయని ఉన్నత విద్యామండలి అధికారులు తెలిపారు. రాటిఫికేషన్ల (అనుమతి) ప్రక్రియ కొనసాగుతున్నప్పటికీ.. 2019-20 విద్యా సంవత్సరానికిగాను ఎంసెట్ కౌన్సెలింగ్ ప్రక్రియ ముగిసినట్లేనని రాష్ట్ర సాంకేతిక విద్యాశాఖ అధికారులు పేర్కొన్నారు. రాష్ట్రంలో ఉస్మానియా, కాకతీయ, జేఎన్టీయూహెచ్ యూనివర్సిటీల పరిధిలో మొత్తం 183 కాలేజీల్లో 65,544 సీట్లు ఉండగా 49,408 సీట్లు భర్తీ అయ్యాయి. 16,136 సీట్లు మిగిలాయి. సింగిల్ విండో-1లో 3,300 సీట్లు అదనంగా ఉన్నాయి. ప్రభుత్వ ఇంజినీరింగ్ కాలేజీల్లో 3,050 సీట్లు కలిపి మొత్తం 92,577 సీట్లు ఉండగా.. కన్వీనర్ కోటాలో 64,804 సీట్లు (70 శాతం), యాజమాన్య కోటాలో 27,773 సీట్లు (30 శాతం) ఉన్నాయి. కన్వీనర్ కోటాలో నింపినసీట్ల వివరాలు ఎంసెట్ క్యాంపు కార్యాలయానికి చేరాయి. సింగిల్ విండో-2 ద్వారా నిండిన సీట్ల వివరాలు తమకు అందాల్సిఉన్నదని పేర్కొన్నారు.

# ప్రభుత్వానికి గిడ్డంగుల సంస్థ రూ.6.5 కోట్ల డివిడెండ్



మంత్రి నిరంజన్‌రెడ్డికి చెక్‌ను అందజేస్తున్న గిడ్డండుల సంస్థ చైర్మన్ మందుల సామ్యేల్, ఎండీ భాస్కరాచారి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** 2018-19 ఆర్థిక సంవత్సరంలో లభించిన లాభాల్లో రాష్ట్ర గిడ్డంగుల సంస్థ.. ప్రభుత్వానికి రూ.6.5 కోట్ల డివిడెండ్‌ను అందజేసింది. గిడ్డండుల సంస్థ చైర్మన్ మందుల సామ్యేల్, ఎండీ భాస్కరాచారి సోమవారం సచివాలయంలో వ్యవసాయశాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డికి ఈ చెక్కును అందజేశారు.

# హైదరాబాద్ మెట్రోలో 9 కోట్లమంది ప్రయాణం

సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి వెల్లడి

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** హైదరాబాద్‌లో మెట్రో రైల్ ప్రారంభమైనప్పటి నుంచి ఇప్పటివరకు 9 కోట్ల మంది ప్రయాణించారని సంస్థ ఎండీ ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్రమోదీ, ముఖ్యమంత్రి కేసీఆర్ చేతులమీదుగా 2017 నవంబర్ 28న మియాపూర్‌లో మెట్రోరైల్ సేవలు ప్రారంభమైన విషయం తెలిసిందే. ప్రస్తుతం రోజుకు 3.06 లక్షల మంది వరకు ప్రయాణిస్తున్నారని, రద్దీ రోజురోజుకూ పెరుగుతున్నదని ఎన్వీఎస్ రెడ్డి చెప్పారు. కారిడార్-2లో జేబీఎస్-ఎంజీబీఎస్ మధ్య 10 కి.మీ మార్గం డిసెంబర్‌లో అందుబాటులోకి రానుండగా.. అదే నెలలో హైటెక్ సిటీ-మైండ్‌స్పేస్ మధ్య 1.5 కి.మీ. మార్గాన్ని పొడిగించనున్నారు. దీంతో హైదరాబాద్ మెట్రోరైల్ సేవలు 66 కిలోమీటర్లకు విస్తరిస్తాయి. హైటెక్ సిటీ-రాయదుర్గం మార్గంలో కూడా మెట్రోరైల్ సేవలు ప్రారంభమైతే రోజుకు దాదాపు 15 లక్షల మంది ప్రయాణించే అవకాశాలున్నాయని ఎన్వీఎస్ రెడ్డి తెలిపారు. మరోవైపు హైటెక్ సిటీ మైండ్‌స్పేస్ జంక్షన్-శంషాబాద్ ఎయిర్‌పోర్టు మధ్య 31 కి.మీ. మెట్రో ప్రాజెక్టుకు రాష్ట్ర మంత్రిమండలి ఆమోదం తెలిపినట్టు సమాచారం.





'రైతు మార్గదర్శి' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి. ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు, ఎండీ సురేందర్, పుస్తక రూపకర్త సుధాకర్‌రెడ్డి

## 'ఉపాధి'ని వ్యవసాయానికి
# అనుసంధానం చేయాలి

కేంద్ర ప్రభుత్వాన్ని కోరిన మంత్రి నిరంజన్‌రెడ్డి

- మానవవనరుల పనిగంటలు తగ్గిపోతున్నాయి
- యాంత్రీకరణపై రైతులకు అవగాహన సదస్సులు
- సీఎం కేసీఆర్ నియోజకవర్గం గజ్వేల్ నుంచి ప్రారంభం
- హరితప్లాజాలో 'రైతు మార్గదర్శి' పుస్తకావిష్కరణ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం ప్రారంభించినప్పటి నుంచి క్షేత్రస్థాయిలో మానవవనరుల పనిగంటలు రోజురోజుకు తగ్గిపోతున్నాయని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్‌రెడ్డి ఆందోళన వ్యక్తంచేశారు. ఈ పరిస్థితుల్లో ఉపాధి హామీ పథకాన్ని వ్యవసాయానికి అనుసంధానం చేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని ఆయన డిమాండ్‌చేశారు. పార్లమెంటులో తెలంగాణ ఎంపీలు ఈ విషయంపై అనేకసార్లు విజ్ఞప్తిచేసినా, పార్టీపరంగా విన్నవించినా కేంద్రం స్పందించలేదని తెలిపారు. వ్యవసాయ పరికరాలు, యంత్రాల వినియోగంపై ఆగ్రోస్ ఆధ్వర్యంలో రూపొందించిన 'రైతు మార్గదర్శి' పుస్తకాన్ని హైదరాబాద్ హరితప్లాజాలో మంత్రి నిరంజన్‌రెడ్డి సోమవారం ఆవిష్కరించి సందర్భంగా మాట్లాడారు. వ్యవసాయంలో యాంత్రీకరణ ద్వారా రైతులు ఆర్థిక భారాన్ని తగ్గించుకోవాలని అన్నారు. నిరంతర విద్యుత్ సరఫరా, రైతుబంధు, రైతు బీమా, రాయితీ విత్తనాలు, ఎరువుల పంపిణీ ద్వారా రాష్ట్రంలో వ్యవసాయరంగాన్ని గట్టెక్కించగలిగామని తెలిపారు. టీఎస్ ఆగ్రోస్ ఆధ్వర్యంలో యాంత్రీకరణపై రైతులకు జిల్లాలవారీగా సదస్సులు నిర్వహిస్తామని, తొలుత ముఖ్యమంత్రి కేసీఆర్ నియోజకవర్గమైన గజ్వేల్ నుంచి ప్రారంభిస్తామని, తర్వాత వనపర్తి, ఇతర జిల్లాల్లో రైతు సదస్సులు నిర్వహిస్తామని ప్రకటించారు. తెలంగాణ రాష్ట్ర వ్యవసాయ పరిశ్రమల అభివృద్ధి సంస్థ (ఆగ్రోస్)ను మరింత బలోపేతంచేస్తామని చెప్పారు. ఫామ్ మెకనైజేషన్ ద్వారా ఎక్కువ మందికి లబ్ధిచేకూరేలా, సంస్థ లక్ష్యాలు నెరవేరేలా సహకరిస్తానని తెలిపారు. రైతుబంధు పథకంపై ఎవరికీ అపోహలు అక్కరలేదని, ఈ వానకాలం సీజన్‌లో ప్రతిరైతు ఖాతాలో డబ్బు జమవుతుందని స్పష్టంచేశారు. మరో రూ.2 వేల కోట్లు జమచేయాల్సి ఉన్నదని, త్వరలో అవి కూడా రైతుల ఖాతాల్లో చేరుతాయని చెప్పారు. అంతకుముందు ఆగ్రోస్ చైర్మన్ లింగంపల్లి కిషన్‌రావు మాట్లాడుతూ.. ప్రతి మండలానికి ఒకటిచొప్పున కస్టమ్ హైరింగ్ సెంటర్ ఏర్పాటుచేసి వ్యవసాయ యంత్ర పరికరాలు అందుబాటులో ఉంచుతామని తెలిపారు. సమావేశంలో జిల్లా రైతు సమన్వయసమితి అధ్యక్షులను శాలువాలతో మంత్రి సన్మానించారు. వారికి రైతుమార్గదర్శి పుస్తకాలను అందజేశారు. కార్యక్రమంలో టీఎస్ ఆగ్రోస్ ఎండీ సురేందర్, అగ్రి యూనివర్సిటీ ప్రధాన శాస్త్రవేత్త సుధాకర్‌రెడ్డి, ఆగ్రోస్ జీఎం రాజ్‌కుమార్, ఏడీ కనకరాజు, సంజీవరెడ్డి, వివిధ జిల్లాల రైతు సమన్వయ సమితి అధ్యక్షులు పాల్గొన్నారు.

# ప్రశంసించినవారే విమర్శిస్తారా?

**రాష్ట్ర పథకాలపై బీజేపీది రెండునాల్కల ధోరణి: జేపీ నడ్డా వ్యాఖ్యలపై మండిపడ్డ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్**

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:**



టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో సోమవారం మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్. చిత్రంలో ఎంపీ లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ గుత్తా, ఎమ్మెల్యే భాస్కర్‌రావు కూడా ఉన్నారు.

తెలంగాణ చైతన్యవంతమైన ప్రాంతమని, ఇక్కడ బీజేపీ ఆటలు సాగవని టీఆర్‌ఎస్ ఎమ్మెల్సీ కర్నె ప్రభాకర్ హెచ్చరించారు. అధికారంలో లేని రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయాలనే కుట్ర బీజేపీ నేతల్లో కనిపిస్తున్నదని అన్నారు. సోమవారం టీఆర్‌ఎస్‌ఎల్పీ కార్యాలయంలో ఎంపీ బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ గుత్తా సుఖేందర్‌రెడ్డి, ఎమ్మెల్యేలు గొంగిడి సునీతారెడ్డి, భాస్కర్‌రావు, రవీంద్రకుమార్, కంచర్ల భూపాల్‌రెడ్డితో కలిసి ఆయన మీడియా సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా కర్నె ప్రభాకర్ మాట్లాడుతూ గతంలో జేపీ నడ్డా కేంద్ర ఆరోగ్యశాఖ మంత్రిగా తెలంగాణలో పర్యటించినప్పుడు ఇక్కడ అమలవుతున్న కేసీఆర్ కిట్స్ పథకం ఆదర్శవంతమైనదని, దేశమంతా అమలుచేయాల్సి ఉన్నదన్నారని గుర్తుచేశారు. ఇప్పుడు రాష్ట్రానికి వచ్చి ప్రతి పథకాన్ని అక్రమమని విమర్శిస్తున్నారని మండిపడ్డారు. బీజేపీ నేతలు రెండునాల్కల ధోరణితో వ్యవహరిస్తున్నారని, వారికి అధికార యావ తప్ప మరేమీ లేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. రాష్ట్ర నాయకులు రాసిచ్చిన స్క్రిప్ట్‌ను నడ్డా చదివారని ఎద్దేవాచేశారు. తెలంగాణలో అమలవుతున్న పథకాలను ప్రధాని మోదీ సహా దాదాపుగా 12 మంది కేంద్ర మంత్రులు ప్రశంసించారని గుర్తుచేశారు. మిషన్ భగీరథ, మిషన్‌కాకతీయ కమిషన్ పథకాలుగా మారాయని ఆరోపించడం బీజేపీ రాజకీయ దివాళాకోరుతనానికి నిదర్శనమని చెప్పారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వంపై నడ్డా వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, వెంటనే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు.

### చేతనైతే విభజనహామీలు అమలుచేయాలి

గతంలో మిషన్ కాకతీయను ప్రశంసించిన కేంద్రం, ఇతర రాష్ట్రాల్లోనూ అమలుచేయాలని మిగతా రాష్ట్రాలకు సూచించిందని కర్నె ప్రభాకర్ గుర్తుచేశారు. నీటి వినియోగంపై కేంద్రం వివిధ రాష్ట్రాలకు చెందిన ముగ్గురు మంత్రులతో కమిటీ వేస్తే తెలంగాణ నీటిపారుదలశాఖ మంత్రిని అందులో చేర్చారని గుర్తుచేశారు. బీజేపీ నేతల మాటల్లో సామ్రాజ్యవాద విస్తరణ ధోరణి కనిపిస్తున్నదని, అందులో భాగంగానే అన్నిరాష్ట్రాల్లో బీజేపీ ప్రభుత్వం ఉండాలనే ఉద్దేశంతో అనైతికంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. గోవా, కర్ణాటక, సిక్కింలో అదేవిధంగా చేశారని, బీజేపీ పాలన లేని రాష్ట్రాలను విచ్ఛిన్నం చేయాలని కుట్ర పన్నుతున్నదని చెప్పారు. రాష్ట్రప్రభుత్వం కోరిన కాళేశ్వరం, పాలమూరు-రంగారెడ్డి ప్రాజెక్టులకు జాతీయహోదా ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ అభివృద్ధి విషయంలో రాజీపడబోమని స్పష్టంచేశారు. బీజేపీ నేతలకు చేతనైతే విభజనచట్టంలోని హామీలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. కేంద్రం హామీలను అమలుచేసే వరకు అడుగుతూనే ఉంటామని స్పష్టంచేశారు. దేశానికి మేలు జరిగే విషయంలో కేంద్ర ప్రభుత్వ పథకాలకే అంశాలవారీగా మద్దతు ఇస్తామని పేర్కొన్నారు. బీజేపీ నేతల తాటాకు చప్పుళ్లకు భయపడబోమని తేల్చిచెప్పారు.

## నడ్డాకు మతిభ్రమణం

**అందుకే అవాస్తవాలు మాట్లాడారు**

**ఎమ్మెల్యే జోగు రామన్న ఆగ్రహం**




**ఆదిలాబాద్ అర్బన్, నమస్తే తెలంగాణ:**

బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డాకు మతిభ్రమించిందని, అందుకే అవాస్తవాలు మాట్లాడారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే జోగు రామన్న చెప్పారు. సోమవారం ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులో చేపపిల్లలను వదిలారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. దేశంలో ఏ రాష్ట్రంలో లేనివిధంగా తెలంగాణ ప్రభుత్వం అన్నివర్గాలకు సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నదని, బీజేపీ పాలిత ఇలాంటి పథకాలు ఎందుకు లేవని ప్రశ్నించారు. రాష్ట్ర పథకాలను విమర్శిస్తున్న బీజేపీ, రైతుబంధుతో పాటు ఇతర పథకాలను ఎందుకు కాపీ కొట్టిందని నిలదీశారు. బీజేపీ నాయకులు నోటికి వచ్చినట్లు మాట్లాడకుండా వాస్తవాలను గ్రహించాలని హితవుపలికారు. తెలంగాణ పథకాలపట్ల ఆకర్షితులైన జిల్లా సరిహద్దులో ఉన్న మహారాష్ట్ర గ్రామాల ప్రజలు రాష్ట్రానికి వలస వచ్చేందుకు ఆసక్తి చూపుతున్నారని పేర్కొన్నారు.

## విమర్శిస్తే ప్రజలు సహించరు

**నడ్డా వ్యాఖ్యలపై మంత్రి నిరంజన్‌రెడ్డి ధ్వజం**



**హైదరాబాద్, నమస్తేతెలంగాణ:** కేంద్రమంటే చక్రవర్తులేం కాదు... రాష్ట్రాలు వారికి సామంతులు కాదని వ్యవసాయ శాఖ మంత్రి నిరంజన్‌రెడ్డి చెప్పారు. రాష్ట్ర ప్రభుత్వంపై బీజేపీ వర్కింగ్ ప్రెసిడెంట్ జేపీ నడ్డా చేసిన వ్యాఖ్యలపై సోమవారం ఆయన మండిపడ్డారు. తెలంగాణకు రూపాయి ఇవ్వకుండా ఢిల్లీ నుంచి నెలకోసారి వచ్చి రాళ్లు వేస్తున్నారని ధ్వజమెత్తారు. రాష్ట్ర ప్రభుత్వాన్ని బీజేపీ నేతలు విమర్శిస్తే ప్రజలు సహించబోరని హెచ్చరించారు. ప్రధాని, కేంద్ర మంత్రులు గతంలో తెలంగాణ పథకాలను ప్రశంసించారని, ఇప్పుడు విమర్శించడం తగదని హితవుపలికారు. రాష్ట్ర పథకాలను అధ్యయనం చేసిన నీతిఆయోగ్ అద్భుతమని కితాబిచ్చి, రూ.24 వేల కోట్ల గ్రాంట్ ఇవ్వాలని సిఫారసు చేస్తే.. 24 రూపాయలు కూడా ఇవ్వలేదని ఆగ్రహం వ్యక్తంచేశారు. బీజేపీ పాలిత రాష్ట్రాల్లో ఎక్కడైనా ఐదు లక్షల ఎకరాలకు సాగునీరిచ్చే ప్రాజెక్టు నిర్మించారా అని ప్రశ్నించారు. కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలో పూర్తిచేసిన ఘనత కేసీఆర్ సర్కార్‌కే దక్కిందని చెప్పారు. ఈ ప్రాజెక్టును సందర్శించిన కేంద్ర జలసంఘం అద్భుతమని వర్ణించిందని గుర్తుచేశారు.

## నడ్డా ఆరోపణలు అర్థరహితం

**టీఆర్‌ఎస్‌తోనే ప్రజలకు మేలు: మంత్రి కొప్పుల**



**ధర్మారం:** ఏపీలోని పోలవరం ప్రాజెక్ట్‌కు జాతీయహోదా ఇచ్చి, కాళేశ్వరంపై కేంద్రం వివక్ష ప్రదర్శించిందని సంక్షేమ శాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ ధ్వజమెత్తారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రీడిజైనింగ్ చేసి కాళేశ్వరం ప్రాజెక్టును మూడేండ్లలోనే నిర్మించారని.. ప్రాజెక్టు నిర్మాణానికి ఒక్క రూపాయి, జాతీయహోదా ఇవ్వకుండా బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. సోమవారం పెద్దపల్లి జిల్లా ధర్మారం మండలం ఖిలావనపర్తిలో టీఆర్‌ఎస్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ పాలనపై, కాళేశ్వరం ప్రాజెక్టుపై బీజేపీ నేతల అరోపణలు అర్థరహితమని చెప్పారు. గోదావరి నీరు వృథాగా సముద్రం పాలవకుండా, పొలాలకు మళ్లించేందుకు రూ. 80 వేల కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టు నిర్మించారని పేర్కొన్నారు. గోదావరి నీటిని ఎదురెక్కించి ఎగువకు తరలిస్తుండడాన్ని ప్రజలుచూసి సంబురపడిపోతుంటే జీర్ణించుకోలేక బీజేపీ నాయకులు విమర్శలు చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తంచేశారు. టీఆర్‌ఎస్ ప్రభుత్వం పదికాలాలపాటు అధికారంలో ఉంటేనే రాష్ట్రానికి మేలు జరుగుతుందని చెప్పారు.

# గోదావరి తగ్గుముఖం

- నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో నిరంతర ఎత్తిపోతలు
- ఎలంపల్లి నుంచి మధ్యమానేరుదాకా గంగమ్మ పరవళ్లు



గాయత్రి పంప్‌హౌస్ నుంచి ఎస్సారెస్పీ వరదకాల్వకు వెళ్తున్న నీరు

**హైదరాబాద్/ కరీంనగర్ ప్రధాన ప్రతినిధి/ భద్రాద్రి కొత్తగూడెం జిల్లా ప్రతినిధి, నమస్తే తెలంగాణ:**

గోదావరి బేసిన్‌లోనూ వరద ఉధృతి తగ్గిపోతున్నది. పేరూరు దగ్గర 2.96 లక్షల క్యూసెక్కుల ప్రవాహం ఉండగా.. ధవళేశ్వరం దగ్గర 4.81 లక్షల క్యూసెక్కులుగా నమోదైంది. దీంతో బరాజ్ నుంచి 4.75 లక్షల క్యూసెక్కులు విడుదలచేస్తున్నారు. తాజా నీటిసంవత్సరంలో ఇప్పటివరకు 1525 టీఎంసీలు సముద్రంలో కలిశాయి. ఎగువన ప్రాజెక్టులకు కూడా ఇన్‌ఫ్లోలు భారీగా పడిపోయాయి. శ్రీరాంసాగర్‌కు చుక్క ఇన్‌ఫ్లో లేదు. కడెంకు 888 క్యూసెక్కుల స్వల్ప వరద కొనసాగుతున్నది. ఇక.. భద్రాచలం వద్ద గోదావరి వరద పూర్తిస్థాయిలో తగ్గడంతో పరీవాహకప్రాంత పల్లెల ప్రజలు, జిల్లా అధికారులు ఊపిరిపీల్చుకున్నారు. సోమవారం సాయంత్రం 4 గంటలకు 24.2 అడుగుల వద్ద నిలకడగా ప్రవహిస్తున్నది. చర్ల మండల పరిధిలోని తాలిపేరు ప్రాజెక్టులోకి వరదనీరు చేరడంతో ఆరు గేట్లు ఎత్తి నీటిని గోదావరి నదిలోకి వదిలారు.

### నిరంతర ఎత్తిపోతలు


కాళేశ్వరంలో లింక్-2లోని నంది, గాయత్రి పంప్‌హౌస్‌లలో మోటర్లు నిరంతరంగా నడుస్తుండటంతో ఎలంపల్లి నుంచి మధ్యమానేరు దాకా గోదావరి ఉరకలేస్తున్నది. నంది రిజ్వాయర్‌కు చేరుతున్న నీటిని శుక్రవారం నుంచి ఆరు గేట్ల ద్వారా కరీంనగర్ జిల్లా రామడుగు మండలం గాయత్రి పంప్‌హౌస్‌కు తరలిస్తున్నారు. ఈ నెల 11 నుంచి గాయత్రి పంప్‌హౌస్‌లో రెండు బాహుబలి మోటర్లను దఫాలవారీగా వెట్‌ట్రయల్‌రన్ చేస్తున్న అధికారులు.. ఎత్తిపోసిన నీటిని వరదకాల్వ ద్వారా రాజన్న సిరిసిల్ల జిల్లాలోని మధ్యమానేరు జలాశయానికి తరలిస్తున్నారు.

**గోదావరి బేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల్లో సోమవారం నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| సింగూరు | 1717.93 | 1670.42 | 29.91 | 0.29 | 0 | 20 |
| నిజాంసాగర్ | 1405.00 | 1368.37 | 17.18 | 0.14 | 0 | 10 |
| శ్రీరాంసాగర్ | 1091.00 | 1062.90 | 90.31 | 17.18 | 0 | 389 |
| లోయర్‌మానేరు | 920.00 | 882.90 | 24.07 | 3.55 | - | 206 |
| మిడ్‌మానేరు | 1043.31 | 1001.74 | 25.87 | 5.80 | 6,365 | 83 |
| కడెం | 700.00 | 697.15 | 7.60 | 6.88 | 888 | 888 |
| ఎల్లంపల్లి | 485.56 | 483.50 | 20.18 | 18.42 | 1,393 | 6,861 |

# సాగర్ 26 గేట్లు మూసివేత

- శ్రీశైలంలో రెండు గేట్ల ద్వారా నీటి విడుదల
- శాంతించిన కృష్ణా, తుంగభద్ర, భీమా నదులు
- ఎగువ ప్రాజెక్టుల్లో తగ్గిన ఇన్‌ఫ్లో, అవుట్‌ఫ్లో
- ప్రాజెక్టులను పూర్తిగా నింపే పనిలో అధికారులు
- నిండుగా జలకళలాడుతున్న ప్రాజెక్టులు
- కాల్వల ద్వారా సాగునీటి అవసరాలకు



నాగార్జునసాగర్ ప్రాజెక్టు మొత్తం 26 గేట్లు మూసివేసిన దృశ్యం

**హైదరాబాద్/ నల్లగొండ, మహబూబ్‌నగర్ ప్రధాన ప్రతినిధులు, నమస్తే తెలంగాణ :**

ఎగువన వరద తగ్గుముఖం పట్టి, కృష్ణమ్మ నెమ్మదించటంతో వివిధ ప్రాజెక్టుల్లో నీటినిల్వలను అంచనావేస్తూ అవుట్‌ఫ్లోను గణనీయంగా నియంత్రిస్తున్నారు. మహారాష్ట్ర, కర్ణాటకలో వర్షాలు క్రమంగా తగ్గుముఖం పట్టడంతో కృష్ణానదితోపాటు తుంగభద్ర, భీమా నదులు శాంతించాయి. దీంతో అన్ని ప్రాజెక్టులకు ఇన్‌ఫ్లోలు ఒక్కసారిగా తగ్గిపోయాయి. సోమవారం సాయంత్రం ఆల్మట్టి జలాశయం నుంచి 2 లక్షల క్యూసెక్కుల అవుట్‌ఫ్లో నమోదైంది. ఇక్కడ పూర్తిస్థాయి నిల్వకు అధికారులు చర్యలు తీసుకుంటున్నారు. సోమవారం వరకు ఆల్మట్టి 121 టీఎంసీలకు చేరింది. నారాయణపురకు వరద రెండు లక్షల క్యూసెక్కులు వస్తుండటంతో.. అవుట్‌ఫ్లోను 1.87 లక్షలకు తగ్గించారు. ఇక్కడ ప్రస్తుతం 33.38 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టుల్లో గరిష్ఠంగా నీటిని నిల్వచేస్తూ.. వచ్చే వరదను దిగువకు వదులుతున్నారు. జూరాల ప్రాజెక్టును పూర్తిస్థాయిలో నింపారు. ఇక్కడ 12 గేట్ల ద్వారానే నీరు విడుదలవుతున్నది. తుంగభద్ర ప్రాజెక్టులో 12 గేట్లు మాత్రమే తెరిచి ఉంచారు. శ్రీశైలంలో కేవలం రెండు గేట్ల ద్వారా దిగువకు నీరు వదులుతున్నారు. మంగళవారానికి వాటిని కూడా మూసివేసే అవకాశం ఉన్నది. నాగార్జుసాగర్‌లో సోమవారం రాత్రికి మొత్తం 26 గేట్లను మూసివేశారు. రిజర్వాయర్‌కు వరద ఉధృతి అధికం కావడంతో ఈ నెల 12న సాగర్ 26 గేట్లను ఎత్తిన విషయం తెలిసిందే. అప్పటినుంచి సోమవారం ఉదయం వరకు సుమారు 350 టీఎంసీ నీటిని దిగువకు విడుదలచేశారు. మొత్తంగా ఆల్మట్టి మొదలుకుని, పులిచింతల వరకు కృష్ణాబేసిన్‌లోని ప్రాజెక్టులన్నీ నిండుగా కనిపిస్తున్నాయి. దీంతో ఆయా ప్రాజెక్టుల పరిధిలోని కాల్వలకు నీటివిడుదల కొనసాగుతున్నది. అన్ని ప్రాజెక్టుల పరిధిలోనూ విద్యుత్‌ను ఉత్పత్తిచేస్తున్నారు.

### తగ్గిన పర్యాటకుల తాకిడి

సోమవారం ప్రాజెక్టు గేట్లు మూసివేయడంతో నాగార్జునసాగర్‌కు పర్యాటకులు బాగా తగ్గారు. దీంతో డ్యాం పరిసర ప్రాంతాలు బోసిపోయాయి. ఆదివారం ఆరు లక్షలమంది పర్యాటకులు రాగా సోమవారం వేలసంఖ్యలో కూడా రాలేదు.

**కృష్ణాబేసిన్‌లోని వివిధ ప్రాజెక్టుల్లో సోమవారం నీటిమట్టాల వివరాలు**

| రిజర్వాయర్ | ఎఫ్‌ఆర్‌ఎల్ అడుగుల్లో | ప్రస్తుత మట్టం అడుగుల్లో | పూర్తిస్థాయి నిల్వ టీఎంసీల్లో | ప్రస్తుత నిల్వ టీఎంసీల్లో | ఇన్‌ఫ్లో క్యూసెక్కుల్లో | అవుట్‌ఫ్లో క్యూసెక్కుల్లో |
|---|---|---|---|---|---|---|
| ఆల్మట్టి | 1705.00 | 1703.28 | 129.72 | 120.35 | 1,75,000 | 2,00,000 |
| నారాయణపుర | 1615.00 | 1611.88 | 37.64 | 33.38 | 2,00,000 | 1,87,410 |
| ఉజ్జయిని | 1630.00 | 1630.00 | 117.24 | 117.24 | 8,822 | 15,950 |
| జూరాల | 1045.00 | 1044.13 | 9.66 | 9.25 | 2,08,000 | 2,02,651 |
| తుంగభద్ర | 1633.00 | 1632.96 | 100.86 | 100.70 | 26,818 | 9,180 |
| శ్రీశైలం | 885.00 | 883.00 | 215.81 | 207 | 2,52,376 | 1,65,120 |
| నాగార్జునసాగర్ | 590.00 | 586.90 | 312.05 | 304.99 | 55,132 | 55,122 |
| పులిచింతల | 175.00 | 168.79 | 45.77 | 36.68 | లేదు | లేదు |

# మెడికల్ కౌన్సెలింగ్‌కు లైన్‌క్లియర్

మొదటిపేజీ తరువాయి...

నిలిపేయాలని ఈ నెల ఏడో తేదీన ఇచ్చిన మధ్యంతర స్టే ఉత్తర్వుల కాలపరిమితి ఈ నెల 13వ తేదీతోనే ముగిసిందని, ప్రస్తుతం ఎలాంటి స్టే అమలులో లేదని స్పష్టంచేసింది. రిజర్వేషన్లపై సుప్రీంకోర్టు ఆదేశాలతోపాటు ప్రభుత్వ జీవో ప్రకారమే కన్వీనర్ కోటా సీట్లను భర్తీ చేస్తున్నామన్న కాళోజీ నారాయణరావు యూనివర్సిటీ వాదనను సమర్థించింది. 440 మంది మెరిట్ రిజర్వుడ్ అభ్యర్థుల సీట్ల కేటాయింపులో ఎలాంటి తప్పులు జరిగినట్టు కనిపించడం లేదని ధర్మాసనం పేర్కొన్నది. మొదటిదశ కౌన్సెలింగ్‌లో ఓపెన్ క్యాటగిరీలో సీట్లు పొందిన 440 మంది మెరిట్ రిజర్వుడ్ విద్యార్థులు.. ఉత్తమ కోర్సులు, కాలేజీల కోసం రెండోదశ కౌన్సెలింగ్‌లో రిజర్వేషన్ల కోటాలో సీట్లు పొందారని, అవి రిజర్వుడ్ సీట్ల కిందికి వస్తాయని తెలిపింది. 440 మందిలో 20 మంది కాలేజీల్లో చేరలేదని, ఆ 20 సీట్లు ఓపెన్ క్యాటగిరీ సీట్లుగానే పరిగణిస్తారని పేర్కొన్నది. 'ఆశిష్ రంజన్ వర్సెస్ యూనియన్ ఆఫ్ ఇండియా' కేసులో 2018-19 ఏడాదికి ఎంబీబీఎస్, బీడీఎస్ కోర్సుల్లో ప్రవేశాలను ఈ నెల 31లోపు ముగించాలని సుప్రీంకోర్టు ఆదేశాలు జారీచేసిందని, సదరు ఆదేశాలకు యూనివర్సిటీ కట్టుబడి ఉండాలని హైకోర్టు స్పష్టంచేసింది. ఈ మేరకు కౌన్సెలింగ్ ప్రక్రియను కొనసాగించడంతోపాటు 31వతేదీలోగా ముగించాలని ఆదేశించింది.

## ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు
# నేటినుంచి తుదివిడుత కౌన్సెలింగ్

**పోచమ్మమైదాన్ (వరంగల్):** ఎంబీబీఎస్, బీడీఎస్ ప్రవేశాలకు మంగళవారం నుంచి గురువారం వరకు తుదివిడుత వెబ్ కౌన్సెలింగ్ నిర్వహించనున్నట్టు వరంగల్‌లోని కాళోజీ నారాయణరావు ఆరోగ్య విశ్వవిద్యాలయం అధికారులు తెలిపారు. ఈ మేరకు సోమవారం నోటిఫికేషన్ విడుదలచేశారు. క్యాటగిరీ ఏ సీట్లకు మంగళవారం ఉదయం 8 గంటల నుంచి గురువారం (22వ తేదీ) ఉదయం 11 గంటల వరకు ప్రాధాన్యతాక్రమంలో కళాశాలలవారీగా ఆప్షన్లను నమోదుచేసుకోవాలని తెలిపారు. తుదిమెరిట్ జాబితాలోని అర్హులైన అభ్యర్థులందరూ వెబ్ కౌన్సెలింగ్‌లో పాల్గొనాలని అధికారులు సూచించారు. ఎన్‌సీసీ, క్యాప్, ఈడబ్ల్యూఎస్ కోటా కింద అర్హులైన అభ్యర్థులు కూడా వెబ్‌ఆప్షన్లు నమోదు చేసుకోవాలని కోరారు. సీట్ మ్యాట్రిక్స్‌లను యూనివర్సిటీ వెబ్‌సైట్‌లో పొందుపరిచారని, రాష్ట్రానికి అప్పగించిన ఆల్ ఇండియా కోటా సీట్లను కూడా ఈ విడుత కౌన్సెలింగ్‌లో భర్తీచేస్తారని వివరించారు. పూర్తి వివరాలకు www.knruhs.in వెబ్‌సైట్‌ను చూడాలని రిజిస్ట్రార్ డాక్టర్ ప్రవీణ్‌కుమార్ పేర్కొన్నారు.

# వెబ్‌సైట్ ద్వారా మోడల్‌స్కూళ్ల అటెండెన్స్

- రాష్ట్రంలోని 192 స్కూళ్లలో అమలు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రంలోని మోడల్‌స్కూళ్లలో రోజువారీ హాజరును వెబ్‌సైట్ ద్వారా సేకరిస్తున్నారు. మొత్తం 192 మోడల్ స్కూళ్ల ఉపాధ్యాయులు, విద్యార్థుల హాజరు వివరాలు నేరుగా హైదరాబాద్‌లోని మోడల్ స్కూల్ సొసైటీ ప్రధాన కార్యాలయానికి చేరేటట్టు ఈ వెబ్‌సైట్‌ను రూపొందించారు. ఈ వెబ్‌సైట్ ద్వారా విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరుశాతం కచ్చితంగా తెలుసుకొనే అవకాశం ఉంటుందని మోడల్ స్కూల్ సొసైటీ డైరెక్టర్ ఏ సత్యనారాయణరెడ్డి తెలిపారు. ఓ ప్రైవేటుసంస్థ ఈ సేవలను ఉచితంగా అందిస్తున్నదని చెప్పారు. ప్రస్తుతం ఈ విధానాన్ని ప్రయోగాత్మకంగా అమలుచేస్తున్నామని.. విజయవంతమైతే త్వరలో అన్నిరకాల పాఠశాలల్లో అమలుచేసే అవకాశమున్నదని చెప్పారు.



ఆర్టికల్ 370 ద్వారా దేశాన్ని ఎలా మోసం చేసిందో మేము కాంగ్రెస్‌కు అద్దం పట్టినట్టు చూపిస్తాం. నేషనల్ కాన్ఫరెన్స్ ఆర్టికల్ 370, 35ఏలకు కట్టుబడి ఉండకుండా వారి సొంత ప్రజలనే మోసం చేసింది. వాళ్లు 370, 35ఏలకు బద్ధులై ఉంటే కాంగ్రెస్‌తో కలిసి కేంద్రంలో భాగస్వామిగా ఉన్నప్పుడు ఎన్నో సవరణలు చేయకపోయేవారు.


**జితేంద్రసింగ్, కేంద్రమంత్రి**

ఆర్థికవ్యవస్థ మందగమనం అన్నది చాలా ఆందోళన కలిగించేది. విద్యుత్, బ్యాంకేతర ఆర్థిక రంగాలలోని సమస్యలను ప్రభుత్వం తక్షణమే పరిష్కరించాలి. పెట్టుబడులు పెట్టడానికి ప్రైవేట్‌రంగానికి ఊతమిచ్చే కొత్త సంస్కరణలతో ముందుకు రావాలి.

**రఘురామ్ రాజన్, ఆర్బీఐ మాజీ గవర్నర్**



### చరిత్రలో నేడు




**1866**

అమెరికాలో అంతర్యుద్ధం ముగిసిందని అధికారికంగా ప్రకటించిన అధ్యక్షుడు ఆండ్ర్యూ జాన్సన్.

**1977**

బృహస్పతి, శని, యూరేనస్, నెప్ట్యూనల వైపుగా అధ్యయానికి వాయేజర్2ను ప్రయోగించిన నాసా.





**2008**

బీజింగ్ ఒలింపిక్స్‌లో 100, 200 మీటర్ల పరుగు పందెంలో కొత్త రికార్డు నెలకొల్పిన జమైకాకు చెందిన ఉసేన్ బోల్ట్

హాంకాంగ్‌లో కొన్నివారాల పాటు హింసాయుత నిరసనలు సాగిన తరువాత ఆదివారం నాడు శాంతియుత ప్రదర్శన జరిగింది. ఈ ప్రదర్శన ప్రశాంతత నెలకొల్పడానికి దారి తీస్తుందా అనేది చూడాలె. ఈ ప్రదర్శనలు జరిపిన లక్షలాది మంది ఆకాంక్షలను ఉపేక్షించకూడదు. ఈ శాంతియుత ప్రదర్శన ఇచ్చిన అవకాశాన్ని ప్రభుత్వం ఉపయోగించుకోవాలె. ఈ స్తబ్దతను ఛేదించవలసిన బాధ్యత ప్రభుత్వంపై ఉన్నది. ప్రభుత్వం వెంటనే చర్చల ప్రక్రియను చేపట్టాలె. లేకపోతే మళ్లా హింసాయుత ఘటనలు జరుగవచ్చు.

**సౌత్ చైనా మార్నింగ్ పోస్ట్**

అస్ట్రేలియా జనాభా విధానంపై దర్యాప్తు జరుపాలనే డిమాండ్ బాగా వినిపిస్తున్నది. దీంతో ప్రభుత్వం సంయుక్త పార్లమెంటరీ కమిటీని ఏర్పాటు చేసింది. వలస వచ్చిన వారు మెట్రోపాలిటన్ నగరాల్లో కాకుండా ఇతర ప్రాంతాలలో స్థిరపడేలా చేయడం ఎట్లా అనే అంశంపై కమిటీ అధ్యయనం సాగుతున్నది. మౌలిక వసతులు ఏర్పాటు, నైపుణ్య శిక్షణ, ఉపాధికల్పన ద్వారా ఇతర ప్రాంతాలకు వలస వచ్చిన వారి ని ఆకర్షించవచ్చు. వలసల వల్ల దేశ ఆర్థికాభివృద్ధి, మేధో పరిణతి, సామాజిక దృఢత్వం సాధ్యపడుతుంది. లక్షలాదిమంది వ్యక్తిగత ఆకాంక్షలు కూడా నెరవేరుతయి.

**ది సిడ్నీ మార్నింగ్ హెరాల్డ్**



# అణ్వస్త్ర విధానం

అణ్వాయుధాన్ని తాము మొదటగా ప్రయోగించబోమనే భారతదేశ విధానం భవిష్యత్తులో మారవచ్చునని కేంద్ర రక్షణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ సూచనప్రాయంగా వెల్లడించడం చర్చానీయాంశమైంది. మాజీ ప్రధాని వాజపేయి మొదటి వర్ధంతి సందర్భంగా ఆయనకు నివాళి అర్పించడానికి రక్షణమంత్రి శుక్రవారం గతంలో అణుపరీక్షలు జరిపిన పోఖ్రాన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ 'మొదటగా అణ్వస్త్రం ప్రయోగించబోమ'నే విధానం పరిస్థితులను బట్టి మారవచ్చునని అన్నారు. ఆ తరువాత ఒక ట్వీట్‌లో ఇదే అభిప్రాయాన్ని ధ్రువీకరించారు. మొదటగా ప్రయోగించబోమనే అణ్వస్త్ర విధానాన్ని మార్చుకోవాలనే వాదన బీజేపీ పెద్ద లు కొంత కాలంగా వినిపిస్తూనే ఉన్నారు. ప్రధాని మోదీ ఇటీవల లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో 'అణుబాంబులు పెట్టుకున్నది దీపావళి కోసం కాదు' అన్నారు. 2016లో రక్షణమంత్రి మనోహర్ పారికర్ కూడా మొదటగా ప్రయోగించబోమనే విధానాన్ని వ్యతిరేకిస్తూ మాట్లాడారు. అయితే ఇది ప్రభుత్వ విధానం కాదని తన అభిప్రా యం మాత్రమే అని అన్నారు. కానీ ఇప్పుడు రక్ష ణమంత్రి రాజ్‌నాథ్ సింగ్ మాట్లాడిన సందర్భం భిన్నమైనది. కశ్మీర్ స్వయం ప్రతిపత్తిని రద్దు చేయడం, పాకిస్థాన్‌తో ఉద్రిక్త పరిస్థితులు ఏర్పడటంతో పాటు మోదీ ప్రభుత్వం కఠిన విధానాలను అవలంబించబోతున్నదనే సూచనలు వెలువడుతున్నాయి. దీంతో భారత్ అణ్వస్త్ర విధానాన్ని మార్చుకోవచ్చుననే అభిప్రాయం ఏర్పడుతున్నది. కాలాన్ని బట్టి రక్షణ విధానాలను మార్చుకోవడం సాధారణమే. అయితే ఈ మార్పునకు గల హేతుబద్ధత ఏమిటనే చర్చ సాగడం సహజం.

> **రెండవ ప్రపంచయుద్ధం చివరలో జపాన్‌పై అమెరికా అణుబాంబు ప్రయోగించినప్పుడు అణ్వస్త్రం ఎంత వినాశకరంగా ఉంటుందో మానవాళి ప్రత్యక్షంగా చూసింది. ఆనాటి నుంచి అణ్వాయుధాలను ఏ దేశమూ ప్రయోగించలేదు. అంతర్జాతీయ అభిప్రాయం అణ్వాయుధ ప్రయోగానికి తీవ్ర వ్యతిరేకంగా ఉన్నది. బాధ్యతాయుతమైన అణ్వస్త్రశక్తిగా ఇప్పటికే నిరూపించుకున్న భారత్ ఇక ముందు కూడా చైనా, అమెరికా వంటి దేశాలతో చర్చిస్తూ పాకిస్థాన్‌ను కట్టడి చేయడమే కాదు, ప్రపంచశాంతికి కృషి చేయాలె.**

భారత్ మొదటగా అణ్వస్త్రం ప్రయోగించబోమంటూ చెప్పుకోవడానికి రెండు కారణాలు ఉన్నాయి. ఒకటి– తాము బాధ్యతాయు దేశంగా చెప్పుకోవడం. రెండవది–పాకిస్థాన్‌ను ఇరుకున పెట్టడం. కొత్తగా స్వాతంత్ర్యం పొందిన కాలంలో భారత్ ఆధిపత్య దేశాల నుంచి తీవ్ర వ్యతిరేకతను ఎదుర్కొన్నది. అణ్వస్త్రం తయారుచేసుకున్న దేశాలు కూడబలుక్కుని ఇతర దేశాలు తయారుచేయకుండా ఆంక్షలు విధించాయి. అణ్వస్త్ర నిరోధక ఒప్పందం, అణుపరీక్షల నిరోధక ఒప్పందం, క్షిపణి పరిజ్ఞాన కట్టడి ఒప్పందం మొదలైనవి ఈ విధంగా వచ్చినవే. ఈ అంతర్జాతీయ ఒప్పందాలు వివక్షాపూరితమైనవని భారత్ వాటిని ధిక్కరించింది. స్వాతంత్ర్యం రావడానికి ముందే నుంచే నెహ్రూ, ప్రముఖ శాస్త్రవేత్త హోమీభాభా తదితరులు అణుశక్తిప్రయోగాల అవసరంపై చర్చించుకున్నారు. మొదట్లో తమది 'శాంతియుత అణు కార్యక్రమం' అని చెప్పుకున్న భారత్ క్రమంగా అణ్వస్త్రశక్తిగా ఎదిగింది. తాము బాధ్యత గల అణ్వస్త్రశక్తినని చెప్పుకోవడానికి 'మొదటగా ప్రయోగించబోమ'నే ప్రకటన భారత్‌కు ఉపయోగపడ్డది. అణ్వస్త్రంలేని దేశంపై అణ్వస్త్రాన్ని ప్రయోగించబోమని కూడా భారత్ ప్రకటించింది. ప్రపం చదేశాలు దశలవారిగా అణునిరాయుధీకరణకు దిగితే, తాము కూడా సిద్ధమని స్పష్టంగా చెప్పిం ది. క్రమంగా భారత్ అనేక సడలింపులను సాధించుకోగలిగింది. బడా దేశాలకు దీటుగా అణ్వస్త్ర శక్తిగా ప్రకటించుకుని కూడా నైతికంగా తమది శాంతియుత దేశమని ప్రపంచానికి చాటగలిగింది. వర్ధమాన దేశంగా వివిధ రంగాలలో అభివృద్ధి చెందుతూనే అణ్వస్త్రశక్తిగా అవతరించడం భారత్ సాధించిన విజయం.

భారత్ ప్రకటించిన 'మొదటగా దాడి చేయబోమ'నే అణ్వస్త్ర విధానం పాకిస్థాన్‌కు ఇబ్బందికరంగా మారింది. సంప్రదాయ యుద్ధంలో భారత్‌దే పైచేయిగా ఉంటుంది. అణ్వస్త్ర అవసరం భారత్‌కు రాదు. కానీ పాకిస్థాన్ తన దగ్గర అణ్వస్త్రం ఉంటేనే భారత్ దాడి చేయడానికి భయపడుతుందని భావిస్తుంది. ఈ కారణంగా తాము మొదటగా అణ్వస్త్ర దాడి చేయబోమనే ప్రకటన చేయలేదు. ఇతర దేశం అణ్వస్త్ర దాడి జరిపితే, ఆ వెంటనే అణ్వస్త్ర ప్రతిదాడి జరిపే సామర్థ్యం (సెకండ్ స్ట్రయిక్ క్యాపబిలిటీ) ఉండటం కూడా ప్రధానమైన అంశం. భూమి, ఆకాశం (విమానాల ద్వారా) నుంచే కాకుండా సముద్రం (జలాంతర్గాముల) నుంచి అణ్వస్త్ర దాడి జరిపే సామర్థ్యాన్ని కూడా భారత్ సంతరించుకున్నది. దీనివల్ల పాకిస్థాన్ మన దేశంపై అణ్వస్త్ర దాడి జరుప సాహసించదు. ఈ నేపథ్యంలో మొదటగా దాడికి దిగబోమనే విధానాన్ని భారత్ ఎందుకు మార్చుకుంటుందనే సందేహం కలుగుతున్నది. పాకిస్థాన్‌ను బెదిరించడానికి ఇటువంటి ఈ ప్రకటనలు చేస్తుండవచ్చు. మొదటగా ప్రయోగించబోమనే విధానాన్ని వదులుకున్నంత మాత్రాన తప్పకుండా ప్రయోగిస్తామనే అర్థం తీయకూడదు. రెండవ ప్రపంచయుద్ధం చివరలో జపాన్‌పై అమెరికా అణుబాంబు ప్రయోగించినప్పుడు అణ్వస్త్రం ఎంత వినాశకరంగా ఉంటుందో మానవాళి ప్రత్యక్షంగా చూసింది. ఆనాటి నుంచి అణ్వాయుధాలను ఏ దేశమూ ప్రయోగించలేదు. అంతర్జాతీయ అభిప్రాయం అణ్వాయుధ ప్రయోగానికి తీవ్ర వ్యతిరేకంగా ఉన్నది. బాధ్యతాయుతమైన అణ్వస్త్రశక్తిగా ఇప్పటికే నిరూపించుకున్న భారత్ ఇక ముందు కూడా చైనా, అమెరికా వంటి దేశాలతో చర్చిస్తూ పాకిస్థాన్‌ను కట్టడి చేయడమే కాదు, ప్రపంచశాంతికి కృషి చేయాలె.

**జనగళం**

## విద్వేష రాజకీయాలు ఇక్కడ చెల్లవు

బీజేపీ జాతీయ నేతలు ఢిల్లీలో ఒకరకంగా, హైదరాబాద్‌లో ఒకరకంగా మాట్లాడటం పరిపాటిగా మారింది. రాజకీయ లబ్ధి కోసం అసత్యాలు మాట్లాడటం అలవాటైంది. మిషన్ కాకతీయ, మిషన్ భగీరథ పథకాలను నీతిఆయోగ్ ప్రశంసించింది. దానికి నిధులు కూడా ఇవ్వాలని కేంద్రానికి సిఫార్సు చేసింది. ముఖ్యమంత్రి కేసీఆర్, మంత్రులు కూడా అనేకసార్లు ప్రధాని సంబంధిత కేంద్ర మంత్రులను కలిసి కూడా రాష్ట్రంలో చేపట్టిన వివిధ ప్రాజెక్టుల తగిన నిధులు ఇవ్వాలని వినతి పత్రాలు అందించారు. అయినా కేంద్రంలోని పెద్దలు అప్పుడు సానుకూలంగా స్పందించడం తర్వాత బుట్టదాఖలు చేయడం గడిచిన ఐదేండ్ల కాలంలో జరుగుతున్నది. కానీ బీజేపీ జాతీయ నాయకులకు ఇవన్నీ తెలిసినా రాష్ట్ర నాయకులు రాసిచ్చిన స్క్రిప్టులు చదువుతూ ప్రజల్లో విశ్వాసాన్ని కోల్పోతున్నారు.

తెలంగాణ రాష్ట్రంలో సంక్షేమ రంగానికి పెద్దపీట వేసింది. ప్రాధాన్య అంశాల వారీగా ప్రాజెక్టులను యుద్ధ ప్రాతిపదికన పూర్తి చేస్తున్నది. అట్లనే కాళేశ్వరం ప్రాజెక్టు అద్భుతమైనా అందరూ అంటున్నారు. రైతు బంధు, రైతు బీమా పథకాలకు అంతర్జాతీయంగా ప్రశంసలు అందాయి. వివిధ రాష్ట్రాలు అభినందిస్తూ వాటిని ఆయా రాష్ట్రాల్లో అమలు చేయడానికి ప్రయత్నం చేసిన సంగతి తెలిసిందే. కానీ బీజేపీ జాతీయ,రాష్ట్ర నాయకులకు ఇవి కనిపించకపోవడం, వీటిపై ఆధారాలు లేని అవినీతి ఆరోపణలు చేయడంలోని ఆంతర్యం ఏమిటో అర్థం చేసుకోవచ్చు. తెలంగాణ రాష్ట్రంలో అన్నివర్గాలు సంతోషంగా ఉంటున్నారు. కానీ బీజేపీ నేతలు మతం పేరుతో ఇక్కడ సంక్షోభం సృష్టించి అధికారం దక్కించుకోవాలని భావిస్తున్నట్టు ఉన్నది. కానీ తెలంగాణ ప్రజల స్వరాష్ట్రం కోసం దశాబ్దాల పాటు పోరాటం చేశారు. అనేక త్యాగాలు చేశారు. ఇక్కడి ప్రజల చైతన్యం వల్లనే రాష్ట్ర ఏర్పాటు సాధ్యమైంది. ప్రజల మధ్య విద్వేషాలు రెచ్చగొట్టే వారిని ఎక్కడ ఉంచాలో వారికి తెలుసు. తెలంగాణ కొత్త రాష్ట్రమైనా కేంద్రం సహకారం అంతంత మాత్రమే ఉన్నా అభివృద్ధిలో దేశంలోని అగ్రభాగ నిలుస్తున్నది. అనేక కేంద్ర ప్రభుత్వ సంస్థలు ఇక్కడి ప్రాజెక్టులను ఆదర్శంగా తీసుకోవాలని సూచిస్తున్నాయి. కాబట్టి ఇప్పటికైనా బీజేపీ నేతలు ఈ వాస్తవాన్ని గ్రహించి రాష్ట్రాభివృద్ధి కోసం తమ వంతు సహాయం చేసి ప్రజల మన్ననలు పొందాలి. అంతేగానీ అసత్యాలతో అధికారంలోకి రావాలనే ప్రయత్నాలు ఎప్పటికీ ఫలించవు.

**– జి. భానుప్రసాద్, హైదరాబాద్**

**ఉత్తరాలు, రచనలు పంపవలసిన చిరునామా:** 8-2-603/1/7,8,9, కృష్ణాపురం, రోడ్‌నంబర్.10, బంజారాహిల్స్, హైదరాబాద్-500034. editpage@ntnews.com Fax-040-23291118

విశ్లేషణ



**డాక్టర్ దేవరాజు మహారాజు**

# వారికి మతం ఒక రక్షణ కవచం

గుడ్డితనం వ్యక్తిని మాత్రమే బాధిస్తుంది. గుడ్డి నమ్మకాలు వ్యవస్థను అంధత్వంతో పీడిస్తాయి. ప్రార్థనా స్థలాల ముందు ఆకలితో అడుక్కునే వారికే దేవుడు పట్టెడన్నం పెట్టలేకపోతుంటే ఇక కోట్ల మంది కోర్కెలు ఎలా తీర్చగలడూ?

నా దేశంలో బుద్ధిహీనుల సంత ఉంది. వారు అమాయక ప్రజలతో కొబ్బరికాయలోని ఆరోగ్యకరమైన, పౌష్టిక విలువలున్న నీటిని మురికి నీటిలో పోయిస్తారు. నదిలోని మురికి నీటిని పవిత్ర జలంగా నమ్మించి తాగిస్తారు– అన్నారు డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్. ప్రపంచవ్యాప్తంగా నిరంతరం ఎన్నో ఘోరాలు జరుగుతున్నాయి. ఇందులో చిన్నాచితకవి కొన్నయితే, పెద్ద ఎత్తున జరిగేవి మరికొన్ని. ఆకలి తట్టుకోలేకో, పేదరికంలో మగ్గిపోలేకో చేసే చిన్న చిన్న నేరాలకు తప్పక శిక్షలుంటాయి. అదే అధికార బలంతోనో అండదండలతోనో జరిగే వాటికి శిక్షలుండవు. ముఖ్యంగా మన దేశంలో మతపరంగా, కులపరంగా, వర్గపరంగా విభజింపబడి ఉన్నచోట అధిక సంఖ్యాకులు ఎలా మోసపోతుంటారో చూద్దాం. జనంలో అధిక సంఖ్యాకులు వీళ్లే గనుక... జాగ్రత్త పడాల్సిందీ వీళ్లే! మతం– నైతిక విలువల్ని పెంచేదే గనక అయితే మత ప్రబోధకులు చిన్నపిల్లలపై ఎందుకు లైంగిక దాడులకు పాల్పడుతారు? మానవ బాంబులుగా ఎందుకు తయారవుతారు? మతం అంటేనే ఊహాజనితం. అందులో మరి సత్యానికెక్కడ తావుందీ? అట్లని అబద్ధం చెప్పే హక్కు కూడా మతానికి లేదు.

ప్రమాదవశాత్తూ కరంటు షాక్ కొట్టి మరణించిన యువకుడిని స్వస్థత ప్రార్థనతో తిరిగి బతికించాడు ఒక ఎవాంగ్లిస్ట్. షో–రక్తికట్టించాడు. కానీ అనారోగ్యంతో చనిపోయిన తన తండ్రిని బతికించుకోలేకపోయాడు. మహత్తు కింద మార్చి జనాన్ని మోసం చేస్తున్నారు. ఒక పాస్టర్ ముప్పై పెండ్లిండ్లు చేసుకున్నాడు. కొందరిపై లైంగిక దాడికి పాల్పడ్డాడు. చివరికి మేకల దొంగతనం కేసులో పట్టుబడినాడు. ఒక ఎఫ్.బి. డాట్ కామ్–క్రిస్టియన్ ట్రూతర్స్ యునైటెడ్ వారు ఈ విధంగా ప్రకటించారు. 'మీ ఆదాయంలో పెద్ద మొత్తం దేవుడికి ఇమ్మని నేను సూచిస్తాను. దేవుడికి ఇమ్మంటున్నానంటే, అది నాకివ్వమంటున్నానన్న మాట. మల్టీ మిలియన్ డాలర్లతో నేను మరో కొత్త భవనం కొనుక్కుంటానన్న మాట. దైవ విశ్వాసకులు మాత్రం వారి దైనందిన కార్యక్రమాలకు సరిపడినంత డబ్బు లేక ఇబ్బంది పడుతుంటారు. అది వేరే విషయమన్న మాట!' అన్ని మతాల ప్రార్థనా స్థలాలలో ఫ్యాన్లు, కూలర్లు పెట్టడం చూస్తుంటాం. అవి దేవుడికి కాదు. గుడ్డితనం వ్యక్తిని మాత్రమే బాధిస్తుంది. గుడ్డి నమ్మకాలు వ్యవస్థను అంధత్వంతో పీడిస్తాయి. ప్రార్థనా స్థలాల ముందు ఆకలితో అడుక్కునే వారికే దేవుడు పట్టెడన్నం పెట్టలేకపోతుంటే ఇక కోట్ల మంది కోర్కెలు ఎలా తీర్చగలడూ?

మత ఛాందసం, బూజుపట్టిన భావజాలం మెదళ్లలో నింపుకున్నవారు చేస్తున్న అకృత్యాలు రోజూ కండ్ల ముందే చూస్తున్నాం. పదిహేడేళ్ల పెండ్లికుమార్తె తను కన్యనే అని తొలిరాత్రి భర్తకు నిరూపించలేకపోయింది. భర్త ఆమెను శోభనం గదిలోనే చంపేశాడు. మనం 21 శతాబ్దంలోనే ఉన్నామా? ఎవరు ఎవరినైనా ఎక్కడైనా చంపేయగల ఆటవిక సమాజంలో ఉన్నామా? 'వధూవరులు అగ్నిచుట్టూ ఏడు సార్లు ఎందుకు తిరుగుతారు?' –అన్న దానికి వేద సైన్సు పండితులు ఇచ్చే వివరణ ఇలా ఉంటుంది. ఒక వృత్తంలో 360 డిగ్రీలు ఉంటాయి. అది 1 నుంచి 9 సంఖ్యలలో ఒక ఏడుతో తప్ప అన్నింటితో విభజింపబడుతుంది. అందువల్ల అలా ఏడుసార్లు ప్రదక్షణలు చేయడం వల్ల ఆ జంట విడిపోకుండా ఉంటారని అందులోని గూఢార్థమట. మరి అలా సంప్రదాయాల ప్రకారం పెండ్లి చేసుకుని కూడా ఎందరో విడిపోతున్నారు కదా? మరి ఈ సూడో సైన్సు పండితులు దీనికి కారణాలేమైనా చెపుతారా? ఈ మధ్య ఒకాయన 'కొరుకుడు బాబా' అవతారమెత్తాడు. ఆడా మగా అని తేడా లేకుండా 200 ఫీజు తీసుకుని మీదపడి కొరుకుతాడు. తన పంటిగాటు పడితే రోగాలు నయమౌతాయని, సంతానం లేని వారికి సంతానం కలుగుతుందనీ ప్రచారం చేసుకున్నాడు. ఈ కొరుకుడు బాబా బాగోతం వీడియోలు తీసి కొందరు సోషల్ మీడియాలో పెట్టారు. పోలీసులు స్పందించి తహసీల్‌దార్ ఎదుట బైండోవర్ చేశారు. అలాగే మరో మహిళ కూడా దేవుడు పూనాడని శిగాలు ఊగుతూ ఉంటే, జనాన్ని మోసం చేస్తూ ఉంటే అరెస్టు చేశారు. అందుకే జనం విద్యావంతులైతే సరిపోదు. వివేకవంతులు కావాలి. విజ్ఞులు చెప్పే విషయాల గూర్చి ఆలోచించుకుంటూ ఉండాలి. ప్రఖ్యాత తెలుగు అభ్యుదయ కవి ఆరుద్ర అంటారు–'దేవుడి మీద తిరగబడలేని వాడు ప్రజలను మార్చలేడు. ప్రజలను మార్చకపోతే మూఢాచారాలు అంతరించవు. మూఢాచారాలున్నంత కాలం అభ్యుదయం సాధ్యం కాదు!' అని.

దైవ భావన చాటున నేరగాళ్లు ఎలా రెచ్చిపోతున్నారో నిత్యం మనం చూస్తూనే ఉన్నాం. బెంగళూరులో జరిగిన ఒక తాజా ఉదాహరణ. ఇరువై నాలుగేండ్ల బీసీఏ గ్రాడ్యుయేట్. తల్లిదండ్రులు విడిపోయినందువల్ల ఒంటరిదైంది. చుట్టూ ఎన్నో సమస్యలతో ప్రశాంతత కరువై–టెలివిజన్‌లో ఒక జోతిష్యుడి ప్రకటనకు ఆకర్షింపబడి మోసపోయింది. ఆ జ్యోతిష్యుణ్ణి కలిస్తే పూజ కోసం 15 వేలు తెమ్మన్నాడు. అంత డబ్బు లేదంటే సగమైనా ఇమ్మన్నాడు. నానా తంటాలు పడి సగం డబ్బు చెల్లించింది. ఎన్ని నెలలైనా ఫలితం కనిపించలేదు. ఆమె డబ్బులు కావాలని పట్టుబట్టింది. తర్వాత ఇస్తానని వెనక్కి పంపించాడు. కొన్నిరోజులకు జ్యోతిష్యుడే అమ్మాయికి ఫోన్ చేసి పిలిచాడు. తన గురువు గారు వచ్చారని ఆయనైతే అన్ని సమస్యలకు పరిష్కారం చూపుతాడని చెప్పి, అమ్మాయిని మరొకతనికి అప్పగించి వెళ్లిపోయాడు. ఆ గురువు గారు అరగంట పూజ చేసి ఆ అమ్మాయితో అసభ్యంగా ప్రవర్తించాడు. ఈ విషయం గ్రహించి ఆ అమ్మాయి తప్పించుకుని పారిపోయింది. తర్వాత మరో రోజు స్నేహితురాల్ని వెంటబెట్టుకుని జ్యోతిష్యుడి దగ్గరికి వెళ్లింది. డబ్బు తిరిగి ఇవ్వమని గొడవ చేయడానికే వెళ్లింది. అతని గదికి తాళం కనబడింది. తర్వాత మళ్లీ మళ్లీ వెళ్లినా తాళమే కనిపిస్తున్నది. జ్యోతిష్యుడి గురించి ఆరా తీస్తూ చుట్టుపక్కల వారిని అడుగుతుంటే ఎవరో ఒక ప్రొఫెసర్ ఫోన్ నెంబర్ ఇచ్చారు. ఆయన హేతువాద సంఘ ఫెడరేషన్ అధ్యక్షుడు. అమ్మాయి ఆయనకు ఫోన్ చేసి జరిగిందంతా చెప్పింది. ఆయన రంగంలోకి దిగి, ఆధారాలు సేకరించి కేసు పోలీసులకు అప్పగించాడు. గురుశిష్యులిద్దరిని కటకటాల వెనక్కి పంపాడు. ఇలాంటివి ఎన్నో జరుగుతున్నాయి. ఇవి ఏ మీడియాలో కనబడవు. కాబట్టి ఇలాంటి వాటిపట్ల సామాన్యులే వివేకవంతంగా ఆలోచిస్తూ మసలుకుంటూ ఉండాలి.

కొన్ని జిల్లాలలో జోగినుల పరిస్థితి దారుణంగా ఉంటుంది. యుక్తవయసు రాగానే జోగినిని చేసి ఇంట్లోంచి పంపిస్తారు. పేరుకే దేవుడి భార్య. కానీ సమాజంలోని పెద్దమనుషులకు ఆమె ఉమ్మడి ఆస్తి.

> 'నారు పోసినవాడే నీరు పోస్తాడు' అని అనుకుంటారు. 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అని కూడా అనుకుంటారు. నిజమే! మరి ఇంతకూ ఆ దేవుడెక్కడా? అద్దంలో చూసుకుంటే నీ దేవుడు కనిపిస్తాడు. అతని అభిప్రాయాలన్నీ నీ మెదడులోనే ఉన్నాయి. అందువల్ల అతను బయట ఎక్కడా లేడు. 'దైవ భావన' అన్నది మనిషి మెదడులోనే ఉన్నది. దానిని అందులోంచి తీసేస్తే-అసలు సిసలైన మనిషి మిగులుతాడు. దైవ భావన భారాన్ని మోస్తూ మనిషి శతాబ్దాలు దాటి వచ్చాడు. అయినా రాను రాను మనిషి, మనిషిగా మిగలకుండా పోతున్నాడు. మనిషి ఆలోచనలతో.. మనిషి మనిషిగా ఉంటేనే మనిషి బతుకుతాడు.

యవ్వనం ఉన్నన్ని రోజులు బాగానే బతుకుతారు. ముసలితనంలో కష్టాలు మొదలవుతాయి. సమస్యల నుంచి తమను బయటపడేసినందుకు చాలామంది ఆ దేవుడికి కృతజ్ఞతలు తెలియజేసుకుంటారు. కానీ ఆ సమస్యల్ని సృష్టించించి ఎవరన్నది ఆలోచించరు.

'నారు పోసినవాడే నీరు పోస్తాడు' అని అనుకుంటారు. 'దిక్కులేని వారికి దేవుడే దిక్కు' అని కూడా అనుకుంటారు. నిజమే! మరి ఇంతకూ ఆ దేవుడెక్కడా? అద్దంలో చూసుకుంటే నీ దేవుడు కనిపిస్తాడు. అతని అభిప్రాయాలన్నీ నీ మెదడులోనే ఉన్నాయి. అందువల్ల అతను బయట ఎక్కడా లేడు. 'దైవ భావన' అన్నది మనిషి మెదడులోనే ఉన్నది. దానిని అందులోంచి తీసేస్తే–అసలు సిసలైన మనిషి మిగులుతాడు. దైవ భావన భారాన్ని మోస్తూ మనిషి శతాబ్దాలు దాటి వచ్చాడు. అయినా రాను రాను మనిషి, మనిషిగా మిగలకుండా పోతున్నాడు. మనిషి ఆలోచనలతో.. మనిషి మనిషిగా ఉంటేనే మనిషి బతుకుతాడు.

(వ్యాసకర్త: సాహితీవేత్త, బయాలజీ ప్రొఫెసర్)

పండుగ



**ప్రొఫెసర్ ఎ. సీతారాం నాయక్**

# బంజారాల సంస్కృతికి ప్రతీక

దేశంలో బంజారా గొడుగు కింద దాదాపు 10 కోట్ల జనాభా ఉన్నది. వివిధ పేర్లతో పిలవబడుతూ అన్నిరాష్ట్రాలలో ఉన్నారు. లంబాడీలు, సుగాలీలు, చరన్ బంజారా, వనజర, బాజీగర్ బంజర, లబాన్ బంజారా మొదలగునవి. వీరి కులవృత్తులమీద ఆధారపడి 12 ఉప కులాలు ఉన్నాయి. వీరు కొన్ని ప్రత్యేకమైన సంస్కృతి, సంప్రదాయాలు, ఆచార వ్యవహారాలు ప్రత్యేక వస్త్ర ధారణను కలిగి ఉన్నారు. దేశ, విదేశాలు, ఏ రాష్ట్రంలో ఉన్నా లిపిలేని బంజారా భాష (గోర్ బోలి)నే మాట్లాడుతారు. వీరు ప్రకృతిని, వారి సంఘ సంస్కర్తలను, పూర్వీకులను దేవతలుగా కొనియాడుతారు. వీరు సంచార జీవులు. కాబట్టి అతి తక్కువ పండుగలు జరుపుకుంటారు. ఇందులో తీజ్ పండగ ముఖ్యమైనది. బంజారాలు స్థిర నివాసాలు ఏర్పర్చుకున్నాక తండాల్లో తీజ్ పండుగ నిర్వహించుకుంటారు. కానీ బతుకు దెరువు కోసం పట్టణాలకు వలస వచ్చినవారు, ఉద్యోగరీత్యా వచ్చిన వారు, వారి సంస్కృతికి ప్రతీకైన తీజ్ పండుగను మరిచిపోకుండా జరుపుకోవడం అభినందనీయం.

బంజారాలు గతంలో సంచారజీవులుగా కొనసాగారు. కాబట్టి తీజ్ పండగను అందరూ ఒకేరోజు జరుపుకోవడానికి వీలుపడేది కాదు. సమాజంలో మారుతున్న పరిణామాలకు అనుగుణంగా తీజ్ పండుగను బతుకమ్మ పండగ వలె ప్రభుత్వం గుర్తిస్తే ఒకేరోజు జరుపుకునే అవకాశం లభిస్తుంది. అంతరించిపోతున్న ఈ పండగ విశిష్టతను పునరుద్ధరించడమే కాకుండా, ప్రాముఖ్యం పెరుగుతుంది. తెలంగాణ రాష్ట్రం ఇతర రాష్ట్రాలకు ఆదర్శమవుతుంది. లంబాడీలకు లిపి లేని కారణంగా వారికుండే ప్రత్యేక సంస్కృతి, సంప్రదాయాలు, చరిత్రను, దేశ స్వాతంత్ర్యం కోసం బంజారాల త్యాగాలు, మౌఖికంగా అనేకతరాల నుంచి సంక్రమించే క్రమంలో ప్రాంతాలవారీగా కొన్ని వ్యత్యాసాలు ఉండే అవకాశం ఉన్నది. కాబట్టి రాబోయే తరాలకు బంజారాజాతి చరిత్రను అందిచాలంటే 'గోర్ బోలి' భాషను 8వ షెడ్యూల్‌లో చేర్పించాలని, తీజ్ పండగను అధికారికంగా ప్రకటించాలని గిరిజన బతుకుల్లో మార్పుతెస్తున్న ముఖ్యమంత్రి కేసీఆర్ గారిని యావత్ లంబాడీ జాతి కోరుతున్నది.

తీజ్ పండగ నిర్వహించడానికి ఆ తండాలో ఉండే యుక్తవయస్సు కలిగిన పెండ్లి చేసుకోబోయే యువతులు తండా నాయకుని తీజ్ పండగ నిర్వహించాలని వేడుకుంటారు. నాయకుడు తండా ఆర్థిక పరిస్థితులను దృష్టిలో పెట్టుకుని నిర్వహించడానికి ఆజ్ఞాపిస్తారు. తీజ్ పండుగ జరుపుకోవడానికి అనుమతి లభించిన తరువాత శ్రావణమాసంలోని మంగళవారం రోజు సప్త మాతల్లో ఒకరైన సీత్ల భవానిని పూజించడానికి వన భోజనానికి ఊరి బైటికి వెళ్తారు. ఈ సందర్భంలో పశుపక్ష్యాదులకు వ్యాధులు సోకకూడదని సీత్ల భవాని ముందు నుంచి పశువుల మందను దాటిస్తూ దేవతకు సమర్పించిన నైవేద్యాన్ని పశువులపైకి చల్లుతారు. ఈ దృశ్యం చూడ ముచ్చటగా ఉంటుంది. అదేరోజు మంగళవారం సాయంత్రం తండా నాయకుని ఇంటి ముందు తీజ్‌కు సంబంధించిన గోధుమలను ఒక బిందలో పోసి నానబెట్టి ఉట్టితో ఒక కొయ్యకు వేలాడదీస్తారు. మరుసటిరోజు బుధవారం సాయంత్రం వెదురుతో తయారుచేయించిన బుట్టలలో కొంత ఎరువు వేసి గోధుమలను చల్లుతారు. గోధుమలతో కూడిన ప్రతి ఒక్క బుట్టకు ఒక ప్రత్యేకత ఉన్నది. ఆ తండాలో ఉన్న ఆడపిల్లలకు వారి బంధువుల ఆడపిల్లల సంఖ్యను బట్టి ఎంతమంది ఉంటే అన్ని బుట్టలు మాత్రమే కడుతారు. వీటితో పాటు వారి కుల దేవతలైన శ్రీ సంత్ సేవాలాల్ మహరాజ్, దండి మేరమా యాడి పేర్ల మీద టేకాకులతో తయారుచేసిన రెండు డొప్పలలో కూడా గోధుమలను పెంచుతారు. ఈ బుట్టలన్నింటిని తండా నాయకుని ఇంటిముందు పందిరి వేసి వేలాడదీస్తారు. ఆ రోజు నుంచి ప్రతిరోజు మూడుసార్లు వరస కలిగిన పూజారులు అయిన ఇద్దరు ఆడపిల్లలతో పాటు ఇతర అమ్మాయిలు డప్పు వాయిద్యాల సహాయంతో దగ్గరలో ఉన్న చెరువు/బావి నుంచి తెచ్చిన నీళ్ళను గోధుమలు కలిగిన బుట్టలకు పోస్తారు.



> బంజారాలు ఎక్కడున్నా ఏ ప్రాంతంలో ఉన్న ప్రతి బంజారా వంశీయుడు తీజ్ పండుగను విధిగా జరుపుకోవడం ఆ జాతికే గర్వకార ణం. ఈ పండుగ జాతి సంస్కృతి, సంప్రదాయం, విశిష్టతను చాటిచెప్పే ఏకైక ఉత్సవం. మనకు జన్మనిచ్చిన పూర్వీకులను, మన దేవతలను కొనియాడుతూ, స్మరిస్తూ వారి ఆశీస్సులు పొందే అవకాశం ఈ పండగ ఇస్తుంది.

డమోళి కార్యక్రమం నిమజ్జనానికి ముందురోజు సాయంత్రం జరుగుతుంది. ప్రతి ఇంటి నుంచి బియ్యపు పిండితో చేసిన రొట్టెలు, బెల్లం, నెయ్యితో (చూర్మో, మోయి, లప్సి) తయారుచేసిన తీపి పదార్థాలు ఒక వెడెల్పైన పాత్ర (కాకోటిలో) పెట్టుకుని తలపైన ప్రత్యేకంగా అలంకరించబడిన చుట్ట బట్ట(పులెరోగాల) పై పెట్టుకుని ప్రత్యేకంగా అలంకరించిన (అద్దలు, గవ్వలు, పూసలతో తయారుచేసిన ) వస్త్రంకాకొటిపై కప్పుకుని తీజ్ ఉన్న ప్రదేశానికి వస్తారు. తీపి పదార్థాలను అందరికి పంచుతారు. డమోళి రోజు పుట్ట మట్టిని ఆటపాటలతో తీసుకు వచ్చి వరుసలు కలిసే రెండు ఇండ్లలో ఆడ, మగ గన్ గోర్‌లను తయారుచేస్తారు. తీజ్‌పై ఎలాంటి ఇతరశక్తుల ప్రభావం ఉండకూడదని ఆటపాటలతో గన్ గోర్‌లను ఊరేగించి వాటిని రూపుమాపుతారు. ఫలితంగా ఏ శక్తి ప్రభావం తండా వాసులపై ఉండకూడదని అర్థం. వీరిని వారి పూర్వీకులుగా భావిస్తారు.

తొమ్మిదవరోజు గురువారం శ్రీ సేవాలాల్ మహరాజ్‌కు హోమం పెట్టి, దండిమేర యాడికి బలి పూజ చేస్తారు. ఆ రోజంతా వచ్చిన బంధువులతో (పామణ్) కలిసి సాంస్కృతిక కార్యక్రమాలైన (నాచేరో, దండామారేతో) ఘనంగా నిర్వహిస్తారు. పూజారులైన బంజారా యువతులు తొమ్మిది రోజులు ఈ కార్యక్రమంలో నిష్టతో పాల్గొని, సేవలు అందిస్తూ ఎనలేని ఆనందాన్ని పాలుపంచుకుంటారు. వివాహానంతరం ఈ అవకాశం రాదని దు:ఖాన్ని వెల్లిబుచ్చుతారు. అదేరోజు సాయంత్రం గోధుమ నారుతో కూడిన తీజ్ బుట్టలను ఎవరివి వారు తీసుకును నిమజ్జనానికి ఆడుతూ పాడుతూ బయలుదేరుతారు. చెరువులో నిమజ్జనం చేసిన తరువాత వారి ఆడపడచుల కాళ్ళు (పిడియా) పైన ఉంచి కడిగి దండం పెడతారు. వారితో తీసుకువెళ్ళిన సద్ది రొట్టెలను తిని తిరిగి వారి వారి ఇళ్ళకు చేరుకుంటారు. బంజారాలు ఎక్కడున్నా ఏ ప్రాంతంలో ఉన్న ప్రతి బంజారా వంశీయుడు తీజ్ పండుగను విధిగా జరుపుకోవడం ఆ జాతికే గర్వకారణం. ఈ పండుగ జాతి సంస్కృతి, సంప్రదాయం, విశిష్టతను చాటిచెప్పే ఏకైక ఉత్సవం. మనకు జన్మనిచ్చిన పూర్వీకులను, మన దేవతలను కొనియాడుతూ, స్మరిస్తూ వారి ఆశీస్సులు పొందే అవకాశం ఈ పండగ ఇస్తుంది. మనం ఏ జాతి నుంచి ఉద్భవించామో ఆ జాతికి రుణపడి ఉండాలి. ఆ జాతి ప్రయోజనాలతో పాటు సంస్కృతి సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత విజ్ఞానవంతులైన మనపై ఉన్నది. మన సంస్కృతిని సజీవంగా ఉంచి జాతి ఔన్నత్యాన్ని కాపాడాలి.

(వ్యాసకర్త: మాజీ లోక్‌సభ సభ్యులు, మహబూబాబాద్)


Printed and Published by Damodar Rao Divakonda, on behalf of Telangana Publications Pvt Ltd, Printed at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481,
Published at Telangana Publications Pvt. Ltd, S.No.863/A, 863/C, Nustulapur, Opp: Grampanchayat Office, Timmapur Mandal, Dist: Karimnagar - 505 481, Telangana State. Editor: Katta Shekar Reddy. Ph: +91 878 2283899, Toll Free: 1800 425 3666. RNI No. TELTEL/2011/38229.

epaper.ntnews.com

■ ఆరోగ్య పరిస్థితిపై ఆరా తీసిన అద్వానీ, నఖ్వీ తదితరులు

## ప్రాణాధార వ్యవస్థపైనే అరుణ్ జైట్లీ

**న్యూఢిల్లీ:** కేంద్ర మాజీ మంత్రి అరుణ్ జైట్లీకి ఎయిమ్స్‌లో ప్రాణాధార వ్యవస్థ చికిత్స కొనసాగుతున్నది. సోమవారం బీజేపీ సీనియర్ నేత ఎల్‌కే అద్వానీ, కేంద్ర మంత్రి నఖ్వీ, ఉత్తరాఖండ్ సీఎం త్రివేంద్ర సింగ్ రావత్ తదితరులు దవాఖానను సందర్శించారు. జైట్లీ ఆరోగ్య పరిస్థితిపై డాక్టర్లను అడిగి తెలుసుకున్నారు. ఊపిరి పీల్చుకోవడంలో ఇబ్బంది తలెత్తడంతో ఈ నెల 9న జైట్లీని ఎయిమ్స్‌కు తరలించిన సంగతి తెలిసిందే. అయితే జైట్లీ ఆరోగ్య పరిస్థితి విషమంగానే ఉన్నట్లు తెలుస్తున్నది. ఆదివారం నుంచి ఆయనకు ఎక్స్‌ట్రాకార్పొరల్ మెంబ్రేన్ ఆక్సిజినేషన్ (ఈసీఎంవో), ఇంట్రా-ఆరోటిక్ బెలూన్ పంప్ (ఏఐబీపీ) వంటి వ్యవస్థలతో చికిత్సనందిస్తున్నారు. ఎయిమ్స్‌లోని పలు విభాగాల వైద్య బృందం నిత్యం జైట్లీ పరిస్థితిని పర్యవేక్షిస్తున్నది. రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్, ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్, స్మృతి ఇరానీ, యూపీ సీఎం ఆదిత్యనాథ్, ఢిల్లీ సీఎం కేజ్రీవాల్, కాంగ్రెస్ నేతలు అభిషేక్ సింఘ్వీ,



జ్యోతిరాదిత్య సింధియా, బీఎస్పీ అధినేత్రి మాయావతి, ఆరెస్సెస్ అధిపతి మోహన్ భగవత్ తదితరులు గత మూడు రోజులుగా ఎయిమ్స్‌ను సందర్శించి జైట్లీ ఆరోగ్య పరిస్థితి గురించి తెలుసుకున్నారు.

■ అమెరికా అధ్యక్షుడు ట్రంప్‌తో మోదీ ఫోన్ సంభాషణ

■ భారత్‌పై పాక్ ప్రధాని విషం చిమ్మడంపై పరోక్ష ప్రస్తావన

## రెచ్చగొట్టే వ్యాఖ్యలతో శాంతికి విఘాతం



(ఫైల్)

**న్యూఢిల్లీ:** జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి రద్దు అనంతరం ప్రధాని నరేంద్రమోదీ తొలిసారిగా అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో సోమవారం ఫోన్ ద్వారా సంభాషించారు. కశ్మీర్ అంశంపై భారత్‌కు వ్యతిరేకంగా పాకిస్థాన్ ప్రధాని ఇమ్రాన్‌ఖాన్ రెచ్చగొట్టే వ్యాఖ్యలు చేయడాన్ని ఆయన ఈ సందర్భంగా ప్రస్తావించారు. భారత్‌కు వ్యతిరేకంగా హింసను ప్రేరేపించేలా పలువురు నేతలు విపరీత వ్యాఖ్యలు చేయడం శాంతికి మంచిది కాదని ట్రంప్‌తో వ్యాఖ్యానించారు. సుమారు అరగంటపాటు సాగిన ఈ సంభాషణలో ద్వైపాక్షిక, ప్రాంతీయ అంశాలపై ఇరువురు నేతలు చర్చించినట్లు విదేశాంగ శాఖ ఒక ప్రకటనలో తెలిపింది. కశ్మీర్ అంశాన్ని ద్వైపాక్షిక చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని ఇమ్రాన్‌ఖాన్‌కు ట్రంప్ ఫోన్ ద్వారా స్పష్టం చేసిన రెండు రోజుల తర్వాత ఈ సంభాషణ జరుగడం గమనార్హం. భారత్‌పై ఆదివారం కూడా ఇమ్రాన్ తీవ్ర ఆక్రోశం వెళ్లగక్కారు. భారత ప్రభుత్వానివి ఫాసిస్టు విధానాలని, దీని వల్ల పాక్‌తో పాటు భారత్‌లోని మైనార్టీలకు ముప్పు పొంచి ఉందని ఆరోపించారు. ఈ నేపథ్యంలో ట్రంప్‌తో మోదీ ఫోన్‌లో మాట్లాడుతూ.. ఉగ్రవాద, హింసారహిత వాతావరణం నెలకొల్పాల్సిన అవసరాన్ని ప్రధానంగా ప్రస్తావించారు. సీమాంతర ఉగ్రవాదానికి చరమగీతం పాడాలన్నారు. ఈ మార్గాన్ని అనుసరించే ఎవరితోనైనా, పేదరికం, నిరక్షరాస్యతపై పోరాటంపై కలిసి పనిచేసేందుకు భారత్ కట్టుబడి ఉందన్నారు. ఆఫ్ఘనిస్థాన్‌కు స్వాతంత్ర్యం సిద్ధించి సోమవారంతో 100 ఏండ్లు పూర్తయిన నేపథ్యంలో.. 'ఐక్య, సురక్షిత, ప్రజాస్వామిక, అసలైన స్వతంత్ర ఆఫ్ఘనిస్థాన్' కోసం భారత్ సుదీర్ఘకాలంగా నిబద్ధతతో పనిచేస్తున్నదని పేర్కొన్నారు.





ఎంపీల కోసం నిర్మించిన డూప్లెక్స్ ఫ్లాట్లను ప్రారంభిస్తున్న ప్రధాని నరేంద్రమోదీ

### ప్రభుత్వ పరిశీలనలో
## కొత్త పార్లమెంట్ భవనం

■ ప్రధాని నరేంద్రమోదీ వెల్లడి

■ ఎంపీల కోసం నిర్మించిన 36 డూప్లెక్స్ ఫ్లాట్లు ప్రారంభం


**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** కొత్తగా పార్లమెంట్ భవనాన్ని నిర్మించడమా.. ప్రస్తుత భవనాన్నే ఆధునీకరించటమా.. అనే ప్రతిపాదనలపై ప్రభుత్వం పరిశీలిస్తున్నదని ప్రధాని నరేంద్ర మోదీ తెలిపారు. ఎంపీల కోసం ఢిల్లీలోని నార్త్ అవెన్యూలో నిర్మించిన 36 డూప్లెక్స్ ఫ్లాట్లను ప్రధాని సోమవారం ప్రారంభిస్తూ.. 2022 నాటికి దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి 75 ఏండ్లు పూర్తవుతున్న నేపథ్యంలో పార్లమెంట్ భవనంలో వసతులను మెరుగుపరచాలని లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ చైర్మన్ వెంకయ్యనాయుడు ఇటీవల ముగిసిన పార్లమెంట్ సమావేశాల సందర్భంగా తనను కోరిన సంగతిని ప్రస్తావించారు. 'పార్లమెంట్ నుంచే డిమాండ్లు వస్తున్నందున ఈ విషయాన్ని ప్రభుత్వం తీవ్రంగా పరిశీలిస్తున్నది. ప్రస్తుత భవనాన్ని ఏ విధంగా ఆధునికీకరించాలి, కొత్త భవన నిర్మాణం చేపట్టాలా అనే దానిపై అధికారులు మేధోమథనం చేస్తున్నారు. 75వ స్వాతంత్ర్య వేడుకల నాటికి అది సాకారమయ్యేలా ఈ ప్రక్రియను వేగవంతం చేయాలని నేను సూచించాను' అని ప్రధాని చెప్పారు. పార్లమెంట్ సమావేశాల సమయంలో వసతి కోసం ఇబ్బంది పడుతున్న ఎంపీలు చాలాకాలం హోటళ్లను బుక్ చేసుకోవాల్సి వస్తున్నదన్నారు. కాబట్టి ఎంపీలకు గృహ వసతులను మెరుగుపరచాల్సి ఉందన్నారు.

## బంగ్లాలను వారంలో ఖాళీ చేయండి

**న్యూఢిల్లీ:** ఏడు రోజుల్లోగా ప్రభుత్వ గృహాలను ఖాళీ చేయాలంటూ మాజీ ఎంపీలకు లోక్‌సభ హౌసింగ్ కమిటీ డెడ్‌లైన్ విధించింది. విద్యుత్, తాగునీరు, గ్యాస్ సరఫరాను మూడు రోజుల్లో నిలిపివేయనున్నట్లు హెచ్చరించింది. కమిటీ చైర్మన్ సీఆర్ పాటిల్ నేతృత్వంలో సోమవారం జరిగిన భేటీలో ఈ మేరకు నిర్ణయం తీసుకుంది. ప్రధాని మోదీ నేతృత్వంలో రెండోసారి ప్రభుత్వం ఏర్పడిన తర్వాత మే 25న రాష్ట్రపతి కోవింద్ 16వ లోక్‌సభను రద్దు చేశారు. అనంతరం నెల రోజుల్లో మాజీ ఎంపీలు అధికార బంగ్లాలను ఖాళీ చేయాల్సి ఉంది. అయితే సుమారు 200 మంది మాజీ ఎంపీలు ఇంకా ప్రభుత్వ గృహాలను ఖాళీ చేయలేదు.

# కోటాపై ఆరెస్సెస్ కుట్ర!

### రిజర్వేషన్ల మీద మోహన్ భగవత్ వ్యాఖ్యలపై కాంగ్రెస్, బీఎస్పీ మండిపాటు



మోహన్ భగవత్

■ రిజర్వేషన్ విధానాన్ని బీజేపీ, ఆరెస్సెస్ కాలరాయాలని చూస్తున్నాయని విమర్శ

■ సమాజంలోని వివక్ష భగవత్‌కి కనిపించట్లేదన్న భీమ్ ఆర్మీ

■ భగవత్ వ్యాఖ్యలను తోసిపుచ్చిన కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలె

■ తమ అధినేత వ్యాఖ్యలను రాజకీయం చేశారన్న ఆరెస్సెస్

■ రిజర్వేషన్లను తాము సమర్థిస్తామని పునరుద్ఘాటన



మాయావతి



చంద్రశేఖర్ ఆజాద్

**లక్నో/న్యూఢిల్లీ, ఆగస్టు 19:** రిజర్వేషన్ల అంశంపై చర్చలు జరుగాలని పిలుపునిచ్చిన రాష్ట్రీయ స్వయం సేవక్ సంఘ్ (ఆరెస్సెస్) అధిపతి మోహన్ భగవత్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. కాంగ్రెస్, బీఎస్పీ, భీమ్ ఆర్మీ తదితర పార్టీలు, సంఘాల నేతలు భగవత్ వ్యాఖ్యలను ఖండించగా.. కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలె సైతం ఆరెస్సెస్ అధిపతి వ్యాఖ్యలను తోసిపుచ్చారు.

**హక్కులను కాలరాస్తున్నారు**

దేశంలో అమలవుతున్న రిజర్వేషన్లపై భగవత్ చేసిన వ్యాఖ్యల మీద కాంగ్రెస్ పార్టీ సోమవారం విరుచుకుపడింది. దేశంలో రిజర్వేషన్ కోటాను లేకుండా చేయాలని బీజేపీ, ఆరెస్సెస్ ప్రయత్నిస్తున్నాయని ఆరోపించింది. వాళ్ల మనస్సులో దళిత, బీసీ వ్యతిరేక భావజాలం పేరుకుపోయిందని మండిపడింది. రాజ్యాంగంలో మార్పులు చేయడానికి బీజేపీ, ఆర్ఎస్ఎస్ తరుచూ ప్రయత్నిస్తున్నాయని, ప్రభుత్వ వైఫల్యాలను కప్పిపుచ్చుకొని.. ప్రజల దృష్టిని మరల్చడానికే ఇలాంటి వ్యాఖ్యలు చేస్తున్నారని కాంగ్రెస్ నేతలు పవన్ ఖేర్, పీఎల్ పునియా, ఉదిత్ రాజ్ విమర్శించారు. భగవత్ వ్యాఖ్యలపై బహుజన్ సమాజ్ పార్టీ(బీఎస్పీ) అధినేత్రి మాయావతి భగ్గుమన్నారు. రిజర్వేషన్లపై ఉన్న వ్యతిరేక భావజాలాన్ని మార్చుకోవాలని సూచించారు. ఈ వ్యాఖ్యల వెనుక ఉన్న అర్థమేమిటని నిలదీశారు. భగవత్ వ్యాఖ్యలపై మాయావతి ట్విట్టర్ వేదికగా స్పందిస్తూ.. 'దళిత, గిరిజన, బడుగు, బలహీన వర్గాల పురోభివృద్ధి కోసం రాజ్యాంగం మానవతా దృక్పథంతో రిజర్వేషన్ల వ్యవస్థను తీసుకొచ్చింది. వీటిని మార్చాలని ప్రయత్నించడం అన్యాయం. రిజర్వేషన్ల వ్యతిరేక అభిప్రాయాన్ని ఆరెస్సెస్ తక్షణమే మార్చుకోవడం మంచిది' అన్నారు. ఎస్సీ, ఎస్టీ, ఓబీసీల ఆర్థిక స్థితిగతులను మెరుగుపర్చడానికి రాజ్యాంగం కల్పించిన హక్కులను కాలరాసే ప్రయత్నానికి తెర తీశారని మాయావతి ఆరోపించారు. బీఎస్పీ మరో నేత సుదేంద్ర భదురియా మాట్లాడుతూ.. బీఆర్ అంబేద్కర్ ప్రసాదించిన రిజర్వేషన్ పాలసీని బీజేపీ, ఆరెస్సెస్ కాలరాయాలని ప్రయత్నిస్తున్నాయని మండిపడ్డారు. దీన్ని వ్యతిరేకించడానికి పోరాడుతామన్నారు. మరోవైపు, రిజర్వేషన్లపై భగవత్ చేసిన వ్యాఖ్యలను భీమ్ ఆర్మీ అధినేత చంద్రశేఖర్ ఆజాద్ తప్పుబట్టారు. ఉన్నత వర్గాల వారు, వెనుకబడిన వర్గాల వారి మధ్య గల తేడాను ఆరెస్సెస్ అధినేత తప్ప, అందరూ చూడగలుగుతున్నారని ఎద్దేవా చేశారు. 'ప్రైవేటు రంగంలో వెనుకబడిన వర్గాలకు రిజర్వేషన్ కల్పించకుండా కుట్ర జరుగుతున్నది. వెనుకబడిన బలహీన వర్గాల ప్రజలకు ప్రైవేటు రంగంలో కూడా రిజర్వేషన్లు కల్పించాలని డిమాండ్ చేస్తున్నాను. అది జరిగితేనే, ఎస్సీ, ఎస్టీ, బీసీ వర్గాలకు న్యాయం జరుగుతుంది. సమాజంలో ప్రస్తుతం ఉన్న వివక్షను కండ్లు లేని వాళ్లు కూడా చూడగలుగుతున్నారు. ఆయన(భగవత్) ఎలా చూడలేకపోతున్నారు?' అని ప్రశ్నించారు.

**భగవత్ సలహాలో తప్పులేదు: ఎన్సీపీ**

రిజర్వేషన్లపై మోహన్ భగవత్ ఇచ్చిన సలహాలో తప్పేంలేదని నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) ఎంపీ మాజిద్ మెనన్ అన్నారు. 'ఆయన ఇచ్చిన సలహాలో నాకు తప్పేం కనబడటంలేదు. రిజర్వేషన్లపై సామరస్య వాతావరణంలో చర్చ జరుగాల్సిన అవసరం ఉందని ఆయన అన్నారంటే, అది క్లిష్టమైన సమస్యగానే పరిగణించాలి. దేశంలో వివిధ వర్గాలకు చెందిన ప్రజలు నివసిస్తున్నారు. అయితే, అవకాశాల్లో సమానత్వం లేదు. కొన్ని వర్గాలు వెనుకబడ్డాయి. రిజర్వేషన్లు 50 శాతం మించరాదు. అదే జరిగితే, జనరల్ కోటా వాళ్లకు ఏమీ మిగలదు. రిజర్వేషన్లపై ఏకరీతి విధానాన్ని తీసుకురావడానికి అన్ని పార్టీల సమావేశం తప్పనిసరి' అని అన్నారు.

**ఆయన వ్యాఖ్యలను రాజకీయం చేశారు: ఆరెస్సెస్**

రిజర్వేషన్లపై సామరస్యపూర్వక వాతావరణంలో చర్చలు జరగాలన్న మోహన్ భగవత్ వ్యాఖ్యలపై విమర్శలు వెల్లువెత్తడంతో ఆరెస్సెస్ నష్టనివారణ చర్యలకు ఉపక్రమించింది. భగవత్ వ్యాఖ్యలపై అనవసరమైన వివాదాలు సృష్టిస్తూ.. రాజకీయం చేస్తున్నారని పేర్కొన్నది. 'ఆదివారం ఓ కాలేజీలో జరిగిన కార్యక్రమంలో రిజర్వేషన్లపై భగవత్ చేసిన వ్యాఖ్యలను కొందరు రాజకీయం చేశారు. దళితులు, వెనుకబడిన వర్గాలు, ఆర్థికంగా బలహీన వర్గాల వారికి రిజర్వేషన్లు కల్పించడాన్ని ఆరెస్సెస్ ఎప్పటికీ సమర్థిస్తుంది' అని ఆరెస్సెస్ జాతీయ ప్రచార నాయకుడు అరుణ్ కుమార్ అన్నారు. కాగా, ఆరెస్సెస్ అనుబంధ సంస్థ శిక్షా సంస్కృతి ఉత్థాన్ నిర్వహించిన జ్ఞాన్ ఉత్సవ్ కార్యక్రమంలో మోహన్ భగవత్ ఆదివారం ప్రసంగించారు. రిజర్వేషన్లపై చర్చలు జరిగిన ప్రతిసారీ ఘాటు వ్యాఖ్యలు వినిపిస్తున్నాయని, అలాకాకుండా అన్నివర్గాలవారూ సుహృద్భావ రీతిలో రిజర్వేషన్లపై అభిప్రాయాలు పంచుకోవాలని ఆయన పేర్కొనడం తెలిసిందే.

### చర్చ అవసరం లేదు



రిజర్వేషన్లపై మోహన్ భగవత్ చేసిన వ్యాఖ్యలను కేంద్ర మంత్రి రామ్‌దాస్ అథావలె తోసిపుచ్చారు. 'రిజర్వేషన్లపై చర్చ అవసరం లేదు. ఒకవేళ దానిపై చర్చ జరిగినా.. ఎస్సీ, ఎస్టీలకు రిజర్వేషన్లు కల్పించాలని ప్రజలు చెబుతారు. ఏ వర్గాలకు రిజర్వేషన్లు కల్పించడం జరిగిందో ఆ రిజర్వేషన్ల జోలికి పోవడం సరి కాదు' అని అన్నారు. రిజర్వేషన్లు ఎవరికి చేరుతున్నాయనే దానిపై చర్చ జరుగొచ్చుని, అయితే రిజర్వేషన్లు ఉండాలా? లేదా? అనే దానిపై చర్చ అనవసరమని చెప్పారు.



రోయా రహ్మానీ

### కశ్మీర్‌తో మాకెలా ముడిపెడతారు?

■ అమెరికాలో ఆఫ్ఘనిస్థాన్ రాయబారి రోయా రహ్మానీ

**వాషింగ్టన్/ కాబూల్, ఆగస్టు 19:** కశ్మీర్ అంశాన్ని తమ దేశంలో శాంతి ప్రక్రియకు పాకిస్థాన్ ముడి పెట్టడంపై ఆఫ్ఘనిస్థాన్ మండిపడింది. పాకిస్థాన్ చర్య 'నిర్లక్ష్యపూరితం, బాధ్యతారాహిత్యం, అసంబద్ధం' అని అమెరికాలో ఆఫ్ఘన్ రాయబారి రోయా రహ్మానీ అన్నారు. తమదేశంలో హింస ఇంకా కొనసాగాలని పాక్ వక్రబుద్ధితో కోరుకుంటున్నదని రోయా ఒక లేఖను విడుదల చేశారు. పాక్‌కు ఆఫ్ఘన్ నుంచి ఎటువంటి ముప్పు లేదన్నారు. కశ్మీర్ ప్రత్యేకప్రతిపత్తి రద్దు నేపథ్యంలో అమెరికా, ఆఫ్ఘన్‌లోని తాలిబన్ల మధ్య జరుగుతున్న శాంతి చర్చలు సంక్లిష్టంగా మారతాయని అమెరికాలో పాక్ రాయబారి అసద్ మాజీద్‌ఖాన్ ఇటీవల అన్నారు. దీనిపై రోయా రహ్మానీ తాజాగా స్పందిస్తూ.. అసద్ వ్యాఖ్యలు అందరినీ తప్పుదోవ పట్టించడమేనన్నారు. కశ్మీర్ సమస్య భారత్-పాక్ మధ్య ద్వైపాక్షిక అంశం అని రహ్మానీ గుర్తుచేశారు. దీనికి తోడు పాకిస్థాన్ పెంచి పోషిస్తున్న ఉగ్రవాదుల వల్ల ఆఫ్ఘన్ సుస్థిరతకు తరుచుగా ముప్పు ఎదురవుతున్నదని ఆమె ఆందోళన వ్యక్తంచేశారు.

# నిష్పాక్షిక విచారణ జరిపించండి

### సైన్యంపై తాను చేసిన ఆరోపణలపై షెహ్లా రషీద్ స్పందన




షెహ్లా రషీద్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** జమ్ముకశ్మీర్‌లో సైన్యం మానవ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నదని తాను చేసిన వ్యాఖ్యలపై వివాదం రేగడంతో కశ్మీరీ రాజకీయ కార్యకర్త షెహ్లా రషీద్ స్పందించారు. క్షేత్రస్థాయిలో ప్రజలతో మాట్లాడే తాను ఈ వ్యాఖ్యలు చేశానని చెప్పారు. తాను తప్పుడు వార్తలు ప్రచారం చేస్తున్నానని వస్తున్న విమర్శలను తోసిపుచ్చారు. తన వ్యాఖ్యలను ఆర్మీ ఖండించిన నేపథ్యంలో తాను చేసిన ఆరోపణలపై నిష్పాక్షిక దర్యాప్తు జరిపించాలని డిమాండ్ చేశారు. భద్రతాబలగాలు యువతను విచారణ పేరుతో వేధింపులకు గురిచేస్తున్నారని, రాత్రిపూట నివాసాల్లోకి ప్రవేశించి ఇంటిని చిందరవందర చేస్తున్నారని, సరకులను ఉద్దేశపూర్వకంగా నేలపై పడేస్తున్నారని షెహ్లా రషీద్ ఆదివారం వరుస ట్వీట్లలో ఆరోపించారు. షోపియాన్‌లో నలుగురిని ఆర్మీ శిబిరానికి తరలించి చిత్రహింసలకు గురిచేశారన్నారు. వారి అరుపులు ఆ ప్రాంతం మొత్తం వినబడేలా వారికి దగ్గరగా మైక్ అమర్చారని, దీంతో ఆ ప్రాంతంలో భయానక వాతావరణాన్ని సృష్టించారని పేర్కొన్నారు. తనను అరెస్ట్ చేయాలని వస్తున్న డిమాండ్లపై రషీద్ స్పందిస్తూ.. కశ్మీర్‌లో మానవ హక్కుల ఉల్లంఘనల నుంచి దృష్టి మరల్చేందుకు ఈ డిమాండ్లు చేస్తున్నారన్నారు. బీజేపీ అజెండా అమలు కోసం ఈ హక్కుల ఉల్లంఘనలకు పాల్పడుతున్నారని ధ్వజమెత్తారు. కాగా, రషీద్ ఆరోపణలను ఆర్మీ తీవ్రంగా ఖండించింది. ఆమె ఆరోపణలు పూర్తిగా నిరాధారమని పేర్కొంది. దీంతో ఆమె తప్పుడు వార్తలను ప్రచారం చేస్తున్నారని, ఆమెను అరెస్ట్ చేయాలని చాలా మంది డిమాండ్ చేస్తున్నారు. సుప్రీంకోర్టు న్యాయవాది అలోక్ శ్రీవాస్తవ ఆమెపై క్రిమినల్ ఫిర్యాదు కూడా దాఖలు చేశారు.

### 70 మంది ఉద్యోగాలను కాపాడిన ప్రభుత్వం

కశ్మీర్‌లోయలో ఆంక్షల నేపథ్యంలో వ్యాపారం భారీగా దెబ్బతినడంతో ఒక బహుళజాతి కంపెనీ 70 మంది కశ్మీర్ ఉద్యోగులను తొలిగించేందుకు నోటీసు జారీ చేయగా, జమ్ముకశ్మీర్ ప్రభుత్వ యంత్రాంగం స్పందించి వారి ఉద్యోగాలను కాపాడింది. ప్రముఖ బిజినెస్ సర్వీస్ ప్రొవైడర్ కంపెనీ ఏజిస్ శుక్రవారం శ్రీనగర్‌లోని తన బీపీవో ఆఫీసు మూసివేసి 70 మంది ఉద్యోగులను తొలిగిస్తూ నోటీసు ఇచ్చింది. ఏజిస్ ఏకైక క్లయింట్ వొడాఫోన్ కాల్స్ రోజుకు లక్ష నుంచి 10 వేలకు పడిపోయాయి. ఈ నేపథ్యంలో ఉద్యోగులను తొలిగించగా, ఈ వార్త కశ్మీర్ ప్రభుత్వానికి చేరింది. దీంతో శ్రీనగర్ డిప్యూటీ కమిషనర్ షాహిద్ ఇక్బాల్ చౌదరి వెంటనే స్పందించారు. ఏజిస్ కంపెనీని సంప్రదించి ఉద్యోగులను తొలగించవద్దని స్పష్టం చేశారు. ఈ మేరకు మూడు నెలల వేతనాలు అందించేందుకు ప్రభుత్వం అంగీకరించింది.

### కనిపించని పెండ్లి సందడి!



కశ్మీర్‌లో ఓ ఇంట పెండ్లికి సిద్ధమవుతున్న వధువు (ఫైల్)

**ఆర్టికల్ 370** రద్దు తర్వాత విధించిన ఆంక్షలతో కశ్మీర్ లోయలో పెండ్లి సందడి కనిపించడం లేదు. ఆర్భాటానికి బదులు సాదాసీదాగా పెండ్లి జరిపించేందుకు ప్రజలు మొగ్గుతున్నారు. దీంతో ఈ వివాహ సీజన్‌లో వ్యాపారాలు పూర్తిగా దెబ్బతిన్నాయి. వివాహ దుస్తులు, బంగారం దుకాణాలు బోసిపోయాయి. వాజవాన్ (సంప్రదాయ కశ్మీరీ వంటకం) వంటవాళ్లకు పని లేకుండాపోయింది. మరోవైపు వివాహ ఆహ్వానం రద్దు ప్రకటనలకు దినపత్రికలు ప్రత్యేకంగా ఓ పేజీని కేటాయిస్తుండడం గమనార్హం. 'కశ్మీర్‌లో ప్రస్తుత పరిస్థితుల దృష్ట్యా నా కుమారుడి పెండ్లి వేడుకను మామూలుగా నిర్వహిస్తున్నాం. దీంతో వివాహ విందు ఆహ్వానాన్ని రద్దు చేస్తున్నాం. అసౌకర్యానికి చింతిస్తున్నాం' అని స్థానిక ఉర్దూ డైలీలో ఓ ప్రకటన కనిపించింది. ఆ పత్రిక సోమవారం నాటి ఎడిషన్‌లో 25కు పైగా అలాంటి ప్రకటనలు ఉన్నాయి. ప్రజల సౌకర్యార్థం ఒక ప్రైవేట్ టీవీ చానల్ వివాహ రద్దు ప్రకటనను ఉచితంగా ప్రసారం చేస్తున్నది. వాజవాన్ వంటగాడైన ముస్తాక్ అహ్మద్ మాట్లాడుతూ.. 'సాధారణంగా 600-800 మంది అతిథుల కోసం వివాహ విందుకు ఆర్డర్లు వస్తాయి. ప్రస్తుతం 150-200 మందికే ఆర్డర్లు వస్తున్నాయి' అని తెలిపారు. దీంతో తమ ఆదాయం 70% తగ్గిపోయిందని ఆవేదన వ్యక్తం చేశాడు. అల్లర్లు, వరదల తదితర కారణాలతో 2008 నుంచి ఇప్పటివరకు ఐదుసార్లు వివాహ సీజన్‌పై ప్రభావం పడిందని చెప్పారు. మొహమ్మద్ ఇక్బాల్ అనే నగల వ్యాపారి మాట్లాడుతూ.. ప్రస్తుత పరిస్థితులతో తమ వ్యాపారం 50% పడిపోయిందని తెలిపారు.



శ్రీనగర్‌లోని ఓ స్కూల్‌కు వెళుతున్న పాధ్యాయినిలు

## తెరుచుకున్న విద్యాసంస్థలు

■ ఐదు సున్నిత సరిహద్దు జిల్లాల్లో బడులు తిరిగి ప్రారంభం

■ కశ్మీర్‌లో నామమాత్రమే

■ జమ్ముకశ్మీర్‌లో పరిస్థితిపై అమిత్‌షాకు వివరించిన దోవల్

**జమ్ము/శ్రీనగర్:** జమ్ములో ఆంక్షలను అధికారులు పూర్తిస్థాయిలో ఎత్తివేయడంతో సున్నితమైన ఐదు సరిహద్దు జిల్లాల్లో పక్షం రోజుల తర్వాత విద్యాసంస్థలు సోమవారం తిరిగి తెరుచుకున్నాయి. జమ్ముకశ్మీర్‌కు ప్రత్యేక ప్రతిపత్తి కల్పించే ఆర్టికల్ 370 రద్దు, రాష్ట్ర విభజన నేపథ్యంలో ఈ నెల 4 నుంచి రాష్ట్రంలో ఆంక్షలను విధించిన విషయం తెలిసిందే. పరిస్థితులు సద్దుమణగడంతో జమ్ములో ఆంక్షలు ఎత్తివేయగా, కశ్మీర్‌లో మాత్రం కొనసాగిస్తున్నారు. కశ్మీర్‌లో ఆంక్షలను సడలించడంతో చాలా వరకు పాఠశాలల్లో ఉపాధ్యాయులు హాజరైనా విద్యార్థులు మాత్రం పెద్దగా హాజరుకాలేదు రెండు రోజులుగా చోటుచేసుకుంటున్న హింసాత్మక నిరసనల నేపథ్యంలో వరుసగా 15వ రోజూ నగరంలో ప్రైవేట్ పాఠశాలలు మూతపడ్డాయి. కాగా, జమ్ముకశ్మీర్‌లో శాంతి భద్రతలపై జాతీయ భద్రతా సలహాదారు అజిత్ దోవల్ సోమవారం హోం మంత్రి అమిత్‌షాను కలిసి వివరించారు.

### విపరీతార్థాలు తీస్తే మీకే నష్టం: సోనమ్



జమ్ముకశ్మీర్‌పై ఇటీవలి తన వ్యాఖ్యలకు సోషల్ మీడియాలో ట్రోలింగ్ ఎదుర్కొంటున్న బాలీవుడ్ నటి సోనమ్‌కపూర్ విమర్శకులకు గట్టిగా జవాబిచ్చారు. 'దయచేసి శాంతించండి. తప్పుగా అర్థం చేసుకుని వక్రభాష్యంతో విపరీతార్థాలు తీయడం వల్ల మీపైనే ప్రభావం పడుతుంది. కనుక మిమ్మల్ని మీరు పరిశీలించుకుని మీరేంటో తెలుసుకోండి' అని ట్వీట్ చేశారు. కశ్మీర్‌కు ప్రత్యేకప్రతిపత్తి రద్దుపై ఇటీవల బీబీసీ ఇంటర్వ్యూలో సోనమ్ స్పందిస్తూ.. 'ప్రస్తుతం అక్కడ్ని పరిస్థితులను చూసి నా గుండె ముక్కలవుతున్నది. నాకు చాలా దేశభక్తి ఉన్నది. ప్రస్తుతం ప్రశాంతంగా ఉండి, దీన్ని అలా ముందుకు సాగనివ్వడమే మంచిదనిపిస్తున్నది' అని పేర్కొన్నారు. దీనిపై నెటిజన్లు ఆమె మీద విమర్శలు గుప్పించారు.

## పాక్‌లోకీ దూసుకెళ్లగలం!

■ పూర్తిస్థాయి యుద్ధానికి సిద్ధం

■ 'బాలాకోట్' దాడుల సమయంలో ప్రభుత్వానికి తెలిపిన ఆర్మీ చీఫ్ రావత్


**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** పుల్వామా ఉగ్రదాడికి ప్రతీకారంగా బాలాకోట్ ఆపరేషన్‌కు సిద్ధమయ్యే క్రమంలో భారత సైన్యం పాకిస్థాన్‌తో పూర్తిస్థాయి యుద్ధానికి కూడా సిద్ధమైనట్లు తాజాగా వెల్లడైంది. పాక్ ఎలాంటి దుస్సాహసానికి పాల్పడినా తిప్పికొట్టడానికి సిద్ధంగానే ఉన్నామని, అవసరమైతే ఆ దేశ భూభాగంలోకి ప్రవేశించి యుద్ధం సాగించేందుకు కూడా సిద్ధమేనని భారత సైన్యాధిపతి బిపిన్ రావత్ నాడు ప్రభుత్వానికి చెప్పినట్లు మిలిటరీ వర్గాలు తెలిపాయి. పుల్వామా ఉగ్రదాడికి బదులుగా పాక్‌కు తగిన జవాబు చెప్పేందుకు వైమానిక దాడులు సహా వివిధ మార్గాలు అన్వేషిస్తున్న క్రమంలో సైనిక సన్నద్ధతపై ఆర్మీ చీఫ్ అప్పట్లో ప్రభుత్వానికి వివరించినట్లు పేర్కొన్నాయి. పదవీ విరమణ చేస్తున్న పలువురు ఆర్మీ అధికారులతో సోమవారం రావత్ అంతర్గత సమావేశం నిర్వహించారు. బాలాకోట్ దాడుల తర్వాత పాకిస్థాన్ సైన్యం ఎలాంటి చర్యకు దిగినా తిప్పికొట్టేందుకు భారత బలగాలు నాడు సిద్ధంగా ఉన్నట్లు రావత్ ఈ సందర్భంగా చెప్పారని విశ్వసనీయ వర్గాలు తెలిపాయి. పాక్ భూభాగంలోకి ప్రవేశించి యుద్ధం చేసేందుకు సైతం సర్వసన్నద్ధంగా ఉన్నట్లు పేర్కొన్నారని అన్నారు.

## ట్రిపుల్ తలాక్‌పై ఫిర్యాదు చేసిందని కాల్చేశారు


■ వివాహితను పాశవికంగా హత్యచేసిన అత్త, మామ, భర్త, కుటుంబసభ్యులు

■ కండ్లకు కట్టినట్టు చెప్పిన ఐదేండ్ల కుమార్తె

■ ఉత్తరప్రదేశ్‌లో ఘటన



**లక్నో:** ట్రిపుల్ తలాక్ చెప్పినా.. ఇల్లు వదిలి వెళ్లనందుకు భార్యను కిరాతకంగా హతమార్చాడు ఓ భర్త. ఉత్తర్‌ప్రదేశ్‌లోని శ్రావస్తి జిల్లాలో శుక్రవారం ఈ పాశవిక ఘటన జరిగింది. శ్రావస్తి జిల్లా గద్రా గ్రామంలో సయిదా ఉంటున్నది. ఉపాధి నిమిత్తం ఆమె భర్త నఫీజ్ ముంబైలో ఉంటున్నాడు. ఈనెల 6న అతడు సయిదాకు ఫోన్ చేసి మూడు సార్లు తలాక్ చెప్పాడు. దీనిపై ఆమె చేసిన ఫిర్యాదును పోలీసులు నమోదు చేసుకోలేదు. గ్రామానికి నఫీజ్ వచ్చాక, ఈనెల 15న అతడిని, సయిదాను పోలీసు స్టేషన్‌కు పిలిపించి కలిసి ఉండాలని చెప్పి పంపారు. పోలీసులను ఆశ్రయించిందన్న కారణంతో భార్యపై నఫీజ్ కోపం పెంచుకున్నాడు. ఇంటి నుంచి వెళ్లిపొమ్మని బెదిరించాడు. ఎంతకూ ఆమె వినకపోవడంతో శుక్రవారం ఆమెను దారుణంగా చంపాడు. ఈ ఘటనను సయిదా ఐదేండ్ల కూతురు ఫాతిమా పోలీసులకు వివరంగా చెప్పింది. 'శుక్రవారం మధ్యాహ్నం నాన్న నమాజ్ చేసి రాగానే అమ్మతో వాగ్వాదానికి దిగాడు. నీకు తలాక్ ఇచ్చాను ఇక్కడి నుంచి వెళ్లిపొమ్మని బెదిరించాడు. అమ్మ జుట్టు పట్టుకొని కొట్టాడు. అత్తమ్మలు.. అమ్మ ఒంటిపై కిరోసిన్ పోశారు. తాతయ్య, నానమ్మ అగ్గిపుల్ల వెలిగించి అమ్మపై వేశారు' అని ఫాతిమా చెప్పింది. నిందితుడు, అతని కుటుంబంపై హత్య, వరకట్న వేధింపుల కింద కేసు నమోదు చేసినట్టు శ్రావస్తి ఎస్పీ ఆశిష్ శ్రీవాస్తవ చెప్పారు. పోలీసులు కేసు నమోదు చేయకపోవడంపై విచారణ జరుపుతున్నట్టు తెలిపారు.



### బీహార్ చివరి కాంగ్రెస్ సీఎం జగన్నాథ్ మిశ్రా
## కన్నుమూత

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** బీహార్ మాజీ ముఖ్యమంత్రి జగన్నాథ్ మిశ్రా(82) కన్నుమూశారు. గత కొన్నేండ్లుగా బ్లడ్ క్యాన్సర్‌తో బాధపడుతున్న ఆయన సోమవారం ఢిల్లీలోని తన నివాసంలో గుండెపోటుతో మరణించినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. జగన్నాథ్ మిశ్రా భార్య గత ఏడాది చనిపోయారు. వారికి ముగ్గురు కుమారులు, ముగ్గురు కుమార్తెలు. చివరి కుమారుడు నితీశ్ మిశ్రా బీహార్ సీఎం నితీశ్ కుమార్ ప్రభుత్వంలో మంత్రిగా ఉన్నారు. బీహార్ రాజకీయాల్లో డాక్టర్ సాహెబ్‌గా పేరుగాంచిన జగన్నాథ్ మిశ్రా కాంగ్రెస్ పార్టీ తరుపున మూడుసార్లు సీఎం పదవి (1975-90 మధ్య కాలంలో) చేపట్టారు. ఆ రాష్ట్రానికి చివరి కాంగ్రెస్ సీఎం కూడా ఆయనే. కాంగ్రెస్ అధ్యక్షురాలు సోనియా, బీహార్ సీఎం నితీశ్‌తోపాటు పలువురు సంతాపం తెలిపారు. బీహార్ ప్రభుత్వం మూడు రోజులు సంతాప దినాలు ప్రకటించింది.



సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన టీజీఎన్‌ఎఫ్ కార్యవర్గ సమావేశంలో పాల్గొన్న టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ సమన్వయకర్త మహేశ్ బిగాల తదితరులు

# ఎన్నారైలకు కేటీఆర్, కవిత అండ

### టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ కోఆర్డినేటర్ మహేశ్ బిగాల

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ప్రవాస భారతీయుల సమస్యలను పరిష్కరించేందుకు టీఆర్ ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ ఎంపీ కవిత ఎంతో కృషిచేస్తున్నారని, సమాచారం అందిన వెంటనే స్పందిస్తూ అండగా నిలుస్తున్నారని టీఆర్‌ఎస్ ఎన్నారై సెల్ సమన్వయకర్త మహేశ్ బిగాల ప్రశంసించారు. సోమవారం హైదరాబాద్‌లోని ఓ హోటల్‌లో జరిగిన తెలంగాణ గల్ఫ్ నాన్ రెసిడెంట్ ఇండియన్స్ ఫెడరేషన్ (టీజీఎన్‌ఎఫ్) ఎగ్జిక్యూటివ్ బాడీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. ఎన్నారైల విషయంలో రాష్ట్రం పరిధి చాలా తక్కువైనప్పటికీ వారికి సీఎం కేసీఆర్ ప్రభుత్వం ఎంతో మేలుచేస్తున్నదని, త్వరలో ఎన్నారై పాలసీని తీసుకొచ్చేందుకు చర్యలు చేపడుతున్నదని తెలిపారు. సౌదీలోని తెలంగాణవాసులకు టీజీఎన్‌ఎఫ్ వారధిలా పనిచేస్తున్నదని మహేశ్ బిగాల పేర్కొన్నారు.



## ఎములాడకు పోటెత్తిన భక్తజనం

శ్రావణ సోమవారం సందర్భంగా వేములవాడ శ్రీపార్వతీ రాజరాజేశ్వర స్వామి ఆలయం భక్తులతో కిక్కిరిసిపోయింది. భక్తులు కోడెమొక్కు చెల్లించుకున్నారు. భక్తుల రద్దీని దృష్ట్యా గర్భ గుడిలో ఆర్జితసేవలను రద్దు చేశారు. రాజన్నను దాదాపు 40 వేల మందికి పైగా భక్తులు దర్శించుకున్నారని, సుమారు రూ.23 లక్షల ఆదాయం సమకూరిందని ఆలయ అధికారులు వెల్లడించారు.

- వేములవాడ కల్చరల్



# మృత్యుఒడికీ తోడైవస్తా!

### 12 గంటల వ్యవధిలో ప్రాణం విడిచిన దంపతులు

### భార్య మృతిని తట్టుకోలేక తనువు చాలించిన వృద్ధుడు

### మహబూబాబాద్ జిల్లా కోమటిపల్లిలో విషాదం

**కేసముద్రం రూరల్:** మూడుముళ్లు.. ఏడడుగులతో ఒక్కటైన ఆ దంపతులు మృత్యువులోనూ తోడయ్యారు. జీవిత చరమాంకం వరకు తనకు తోడూనీడగా ఉన్న భార్య మరణాన్ని తట్టుకోలేక ఆ వృద్ధుడు 12 గంటల వ్యవధిలోనే తనువు చాలించాడు. మహబూబాబాద్ జిల్లా కేసముద్రం మండలం కోమటిపల్లికి చెందిన జనగాం లచ్చమ్మ, సాయిలు దంపతులు. ఇటీవల అనారోగ్యానికి గురైన లచ్చమ్మ(75) నాలుగు రోజులుగా చికిత్స పొందుతూ ఆదివారం రాత్రి 8.30 గంటల ప్రాంతంలో కన్నుమూసింది. లచ్చమ్మ ఇక లేదన్న విషయాన్ని తట్టుకోలేక ఏడుస్తూ సోమవారం ఉదయం సాయిలు(80) కూడా తుదిశ్వాస విడిచాడు. అన్యోన్యంగా



జనగాం లచ్చమ్మ, సాయిలు(ఫైల్)

ఉండే ఆ వృద్ధ దంపతులు గంటల వ్యవధిలోనే మరణించడంతో కోమటిపల్లిలో విషాదం నెలకొన్నది. తల్లిదండ్రుల మృతిని తట్టుకోలేక వారి ఇద్దరు కూతుళ్లు, ఇద్దరు కుమారుల రోదనలు అక్కడున్నవారిని సైతం కంటతడి పెట్టించాయి.

# ఫిష్‌హబ్‌గా తెలంగాణ

### సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్

### ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో వదిలిన చేప పిల్లలు

### రాష్ట్రంలో కొనసాగుతున్న చేప పిల్లల విడుదల

**నమస్తే తెలంగాణ నెట్‌వర్క్:** రానున్న రోజుల్లో తెలంగాణ రాష్ట్రం ఫిష్‌హబ్‌గా మారనున్నదని సంక్షేమశాఖ మంత్రి కొప్పుల ఈశ్వర్ అన్నారు. సోమవారం జగిత్యాల జిల్లా ధర్మపురి వద్ద గోదావరి ఎల్లంపల్లి బ్యాక్‌వాటర్‌లో ఉచిత చేప పిల్లలను విడుదల చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొప్పుల మాట్లాడుతూ.. గ్రామీణ ఆర్థిక వ్యవస్థ బలోపేతం చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం కుల వృత్తులను పోత్సహిస్తున్నదనీ, అందులో భాగంగానే మత్స్యకారుల జీవనోపాధి కోసం రాష్ట్రవ్యాప్తంగా ఉన్న 46 వేల చెరువులు, రిజర్వాయర్లల్లో ఉచిత చేప పిల్లలను వదులుతున్నట్టు చెప్పారు. పెరిగిన చేపలను అమ్ముకునేందుకు సబ్సిడీపై లగేజీ అటోలు, మోపెడ్ బైక్‌లు, పరికరాలు కూడా అందజేస్తున్నామని తెలిపారు. దేశంలో ఏ రాష్ట్రంలో లేని విధంగా వందశాతం ఉచితంగా చేప పిల్లలను పంపిణీ చేస్తున్న ఏకైక రాష్ట్రం తెలంగాణేనని ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో కలెక్టర్ శరత్, మత్స్యశాఖ డిప్యూటీ డైరెక్టర్ హనుమంతరావ్ తదితరులు పాల్గొన్నారు.

**రామప్పలో చెరువులో..**

ములుగు జిల్లా వెంకటాపూర్ మండలం పాలంపేటలో గల రామప్ప రిజర్వాయర్‌లో ఎంపీలు బండా ప్రకాశ్, మాలోత్ కవిత, ములుగు జెడ్పీ చైర్మన్ కుసుమ జగదీశ్వర్, ఎమ్మెల్యే సీతక్క, జలవనరుల అభివృద్ధి సంస్థ చైర్మన్ వీ ప్రకాశ్‌రావు, కలెక్టర్ నారాయణరెడ్డి చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యుడు బండా ప్రకాశ్ మాట్లాడుతూ చేపల పెంపకం కోసం రామప్పలో సీడ్ ఉత్పత్తి కేంద్రం ఏర్పాటు చేసే దిశగా కృషి చేస్తామన్నారు.

**మెదక్ జిల్లా నాగాపూర్ చెరువులో..**

మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండలం నాగాపూర్ ఊర చెరువులో సోమవారం లక్షా 27 వేల చేప పిల్లలను ఎమ్మెల్సీ శేరి సుభాశ్‌రెడ్డి, మెదక్ ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి వదిలారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. జిల్లాలో 4.50 కోట్ల చేప పిల్లలను వందశాతం సబ్సిడీతో 1,500 చెరువులు, కుంటల్లో వదిలేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్టు తెలిపారు. కాగా ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులో సోమవారం ఎమ్మెల్యే జోగు రామన్న చేప పిల్లలను వదిలారు.



జగిత్యాల జిల్లా ఎల్లంపల్లి బ్యాక్ వాటర్‌లో చేప పిల్లలను వదులుతున్న మంత్రి కొప్పుల ఈశ్వర్



ములుగు జిల్లా రామప్ప చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎంపీలు బండా ప్రకాశ్, మాలోత్ కవిత, జెడ్పీ చైర్మన్ జగదీశ్వర్ తదితరులు



మెదక్ జిల్లా హవేళిఘనపూర్ మండలం నాగాపూర్ చెరువులో చేప పిల్లలను వదులుతున్న ఎమ్మెల్సీ శేరిసుభాశ్‌రెడ్డి, ఎమ్మెల్యే పద్మాదేవేందర్‌రెడ్డి



ఆదిలాబాద్ జిల్లా జైనథ్ మండలం సాత్నాల ప్రాజెక్టులో చేప పిల్లలను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే జోగురామన్న



లక్కి మిరానిని అభినందిస్తున్న హరీశ్‌రావు

## అంధ విద్యార్థికి హరీశ్‌రావు అభినందన

### రూ.1,01,116లు అందజేత

**ముకరంపుర:** పదో తరగతిలో 10 జీపీఏ సాధించిన కరీంనగర్ పారమిత పాఠశాలకు చెందిన అంధ విద్యార్థి లక్కి మిరానిని సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు హైదరాబాద్‌లోని తన నివాసంలో సోమవారం అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థికి లక్షా వెయ్యి నూట పదహార్ల నగదును బహుమతిగా అందించారు. పాఠశాల చైర్మన్ ప్రసాదరావు, విద్యార్థి తల్లిదండ్రులు దీపక్ మిరాని, ముస్కాన్ మిరానిని హరీశ్‌రావు అభినందించారు. లక్కి ఆదర్శ విద్యార్థి అని.. భవిష్యత్‌లో అతని విద్యకు కావాల్సిన సహాయం అందిస్తామని హరీశ్‌రావు భరోసానిచ్చారు.



గురుకులాల అభ్యున్నతికి ముఖ్యమంత్రి కేసీఆర్ ఎంతో కృషి చేశారనీ, కార్పొరేట్‌కు దీటుగా వసతులు, పౌష్టికాహారం అందిస్తున్నారని రాష్ట్ర ఎస్సీ, ఎస్టీ కమిషన్ చైర్మన్ ఎర్రోళ్ల శ్రీనివాస్ అన్నారు. సోమవారం పెద్దపల్లి జిల్లా సుల్తానాబాద్ మండలం గర్రెపల్లి గురుకుల బాలికల గురుకుల విద్యాలయాన్ని సందర్శించిన ఆయన విద్యార్థులతో కలిసి భోజనం చేశారు.

-సుల్తానాబాద్‌రూరల్

## ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం

### మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి

**నమస్తే తెలంగాణ ప్రధాన ప్రతినిధి, సంగారెడ్డి:** ఎన్డీఏ హయాంలో ప్రభుత్వ సంస్థలు నిర్వీర్యం అవుతున్నాయని మెదక్ ఎంపీ కొత్త ప్రభాకర్‌రెడ్డి అన్నారు. ఇప్పటికే ఆకాశవాణిని ప్రైవేటీకరణ చేసిన కేంద్రం ఎయిర్‌ఇండియా, బీహెచ్‌ఈఎల్, బీడీఎల్, ఓడీఎఫ్‌లను కార్పొరేటీకరణ పేరుతో ప్రైవేట్‌పరం చేసేందుకు కుట్రలు చేస్తున్నదని విమర్శించారు. ఓడీఎఫ్ కార్పొరేటీకరణ ఆపాలని డిమాండ్ చేస్తూ సంగారెడ్డి జిల్లా కంది మండలం ఎద్దుమైలారంలోని ఆర్డినెన్స్ ఫ్యాక్టరీ ఎదుట చేపట్టిన కార్మికుల ధర్నాకు ఎంపీ మద్దతు ప్రకటించారు. దేశంలో 42 ఆర్డినెన్స్ ఫ్యాక్టరీలుండగా వీటిలో 82 వేలకు టుంబాలు ఉపాధి పొందుతున్నాయనీ ఇప్పటికిప్పుడు వాటిని కార్పొరేటీకరణ చేయాల్సిన అవరమేముందన్నారు. ఈ అంశంపై సీఎం కేసీఆర్‌తో మాట్లాడి, పార్లమెంట్‌లో పోరాడుతామన్నారు. కార్మికులు అధైర్యపడవద్దని టీఆర్‌ఎస్ అండగా ఉంటుందన్నారు. ఈసందర్భంగా కార్మికులు ఎంపీకి వినతి పత్రం అందించారు. మాజీ ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, ఓడీఎఫ్ కార్మిక జేఏసీ అధ్యక్షుడు ఈశ్వర్‌ప్రసాద్, నాయకులు నరేష్‌కుమార్, జనార్ధన్‌రెడ్డి, మోహన్, రాజయ్య, జెడ్పీటీసీ కొండల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# ఓ మోస్తరు వానలు

### నల్లగొండ, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో..

### గ్రేటర్ హైదరాబాద్‌లో జల్లులు

**హైదరాబాద్/సిటీబ్యూరో/నెట్‌వర్క్, నమస్తే తెలంగాణ:** బంగాళాఖాతంలో ఏర్పడిన ఉపరితల ఆవర్తన ప్రభావంతో సోమవారం నల్లగొండ, సూర్యాపేట, జనగామ జిల్లాల్లో ఓ మోస్తరు వర్షం కురవగా, గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో జల్లులు పడ్డాయి. కాగా కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఎర్రవాగులో సోమవారం ఓ రైతుతోపాటు ఎడ్లబండి వరద ఉధృతిలో కొట్టుకుపోతుండగా తోటి రైతులు కాపాడారు. కాగా వచ్చే 48 గంటల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. నల్లగొండ జిల్లాలోని పలు మండలాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురిసింది. మిర్యాలగూడ, చిట్యాల, మర్రిగూడ, శాలిగౌరారం, తిరుమలగిరి(సాగర్), చందంపేట మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురవడంతో వీధుల్లో వరద ప్రవహించింది. వ్యవసాయ భూముల్లో నీళ్లు నిలిచాయి. నల్లగొండ పట్టణంలో జల్లులు కురవడంతో ప్రజలు ఉపశమనం పొందారు. ఆదివారం ఉదయం నుంచి సోమవారం ఉదయం వరకు అత్యధికంగా దేవరకొండలో 5.3 మి.మీ. వర్షపాతం నమోదైంది. సూర్యాపేట జిల్లా కోదాడ, హుజూర్‌నగర్ నియోజక వర్గాలోని పలు మండలాల్లో సోమవారం ఓ మోస్తరు వర్షం కురవగా, సూర్యాపేట, తుంగతుర్తిలో జల్లులు పడ్డాయి. హుజూర్‌నగర్, మేళ్లచెర్వు, చింతలపాలెం, నేరేడుచర్ల, కోదాడ మండలాల్లో కురిసిన వర్షానికి రోడ్లు జలమయమయ్యాయి. జనగామ జిల్లా కేం ద్రంతోపాటు స్టేషన్‌ఘన్‌పూర్, దేవరుప్పుల తదితర మండలాల్లో సోమవారం సాయం త్రం వర్షం కురిసింది. దీంతో జనగామ పట్టణంలోని పలు వీధుల్లోని డ్రైనేజీలు పొంగిపొర్లాయి. కాగా గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలుచోట్ల తేలికపాటి వాన జల్లులు కురిశాయి.

**ఎర్రవాగులో మునిగిన ఎడ్లబండి..**

రెండు రోజుల క్రితం కురిసిన వర్షాలకు కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా దహెగాం మండలం ఎర్రవాగు ఉప్పొంగుతున్నది. గిరివెల్లికి చెందిన రైతు పుల్గం రాజన్న సోమవారం తన పత్తి చేనుకు మందు వేయడానికి ఎడ్లబండిలో బస్తాలు వేసుకొని బయలుదేరాడు. ఎర్రవాగు దాటుతుండగా ఒక్కసారిగా వరద పెరగడంతో ఎండ్లబండి సహా రాజన్న కొట్టుకుపోతుండగా అక్కడే ఉన్న రైతులు గమనించి రాజన్నను కాపాడారు. అనంతరం ఎడ్ల మెడకు ఉన్న దొత్తెలను తొలగించడంతో అవి గట్టుకు చేరుకున్నాయి. ఆ తరువాత తాళ్ల సాయంతో ఎడ్లబండిని బయటకు లాగారు.



జనగామ జిల్లా కేంద్రంలో కురుస్తున్న వర్షం

### వచ్చే 48 గంటల్లో రాష్ట్రంలో వర్ష సూచన

వచ్చే 48గంటల్లో తెలంగాణలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశాలున్నాయి. ఉత్తర జార్ఖండ్ దానిని ఆనుకొని ఉన్న బీహార్ ప్రాంతాల్లో అల్పపీడనం ఏర్పడింది. దీనికి అనుబంధంగా సముద్రమట్టానికి 7.6 కిలోమీటర్ల ఎత్తు వరకు ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీంతోపాటు ఉత్తర, కోస్తా తమిళనాడు దాని పరిసరాల్లో సముద్రమట్టానికి 3.1 కిలోమీటర్ల నుంచి 4.5 కిలోమీటర్ల మధ్య ఉపరితల ఆవర్తనం కొనసాగుతున్నది. దీని ప్రభావం తెలంగాణపైనా ఉం టుందని హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారి రాజారావు తెలిపారు. ఉపరితల ఆవర్తనం, అల్పపీడనం వల్ల రుతుపవనాలు కొంత చురుగ్గా కదులుతున్నాయని చెప్పారు. రాగల 48 గంటల్లో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురుస్తాయన్నారు.

**గ్రేటర్ హైదరాబాద్‌లో 24గంటల్లో..**

వచ్చే 24 గంటల్లో గ్రేటర్ హైదరాబాద్ పరిధిలోని పలుచోట్ల తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలు కురిసే అవకాశమున్నట్టు హైదరాబాద్ వాతావరణ కేంద్రం అధికారులు తెలిపారు.

### వేధింపులు తాళలేక..

## భర్త హత్య

**కలెక్టరేట్:** వేధింపులు భరించలేక భర్తను హతమార్చిన ఘటన పెద్దపల్లి మండలం చందపల్లిలో సోమవారం చోటుచేసుకుంది. గ్రామానికి చెందిన అస్రాబేగంకు, రామగుండం ఎల్కలపల్లికి చెందిన సయ్యద్ సలీమ్(38)తో కొన్నేళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఆరేళ్ల కొడుకు, ఐదేళ్ల కూతురు ఉంది. కొద్దిరోజులక్రితం బతుకుదెరువు కోసం వీరు చందపల్లికి వచ్చారు. ఈక్రమంలో కాపురంలో గొడవలు మొదలవ్వగా, సలీమ్ భార్యాపిల్లలను వదిలి ఎల్కలపల్లికి వెళ్లాడు. అస్రాబేగం పిల్లలతో కలిసి చందపల్లిలో ఉంటున్నది. ఆటో నడుపుతూ జీవిస్తున్న సలీమ్ తరుచూ చందపల్లికి వచ్చి భార్యను వేధిస్తుండేవాడు. సోమవారం ఉదయం కూడా అదే మాదిరిగా భార్యభర్తల మధ్య ఘర్షణ జరుగగా, తీవ్ర అసహనానికి లోనైన అస్రాబేగం చందపల్లిలోనే ఉండే తన తల్లిదండ్రులు గౌస్‌ఖాన్, షమీమున్నీసాలతోపాటు సోదరులు గౌస్, జాఫర్‌లతో కలిసి సలీమ్‌పై దాడి చేసింది. దాడిలో సలీమ్ అక్కడికక్కడే మృతి చెందాడు. అనంతరం సలీమ్ బట్టలను మార్చి మంచంలో పడుకోబెట్టి.. ఏమీ తెలియనట్టు బంధువులకు సమాచారం ఇచ్చారు. సలీమ్ మృతిపై అనుమానం వచ్చిన బంధువులు పోలీసులకు సమాచారం అందించారు. పెద్దపల్లి డీసీపీ సుదర్శన్‌గౌడ్, ఏసీపీ వెంకటరమణారెడ్డి, సీఐ నరేందర్, ఎస్‌ఐ ఉపేందర్‌రావు ఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు.

## ముగ్గురికి జీవితఖైదు

**జైనూర్:** వివాహితపై లైంగిక దాడికి పాల్పడి, సెల్‌ఫోన్‌లో చిత్రీకరించి బెదిరింపులకు పాల్పడ్డ ఘటనలో నిందితులకు జీవితఖైదు విధిస్తూ న్యాయస్థానం తీర్పునిచ్చింది. కుమ్రంభీం ఆసిఫాబాద్ జిల్లా జైనూర్‌కు చెందిన ఓ వివాహిత చేనులో పని చేస్తుండగా, అదే గ్రామానికి చెందిన జాహెద్ (కుంటల్), సల్మాన్‌ఖాన్, వాహేద్ ఆమె తాగే నీటిలో మత్తు మందు కలిపి, అనంతరం ఆమెపై లైంగిక దాడిని సెల్‌ఫోన్‌లో చిత్రీకరించారు. ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామనీ, వీడియో అందరికీ చూపిస్తామని బెదిరించారు. నాలుగు రోజుల తర్వాత తన భర్తతో సదరు వివాహిత స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. విచారణలో నేరం రుజువు కావడంతో.. సోమవారం జిల్లా జడ్జి జీవీఎన్ భారతలక్ష్మి ముగ్గురికి జీవిత ఖైదుతోపాటు ఒక్కొక్కరికీ రూ.60 వేల జరిమానా విధించినట్టు ఎస్సై శ్రీనివాస్ తెలిపారు.



సిరిసిల్ల ప్రధాన దవాఖానలో వైద్యురాలితో మాట్లాడుతున్న రాజశేఖర్‌బాబు

## సర్కారు దవాఖానల్లో సుఖ ప్రసవాలకే ప్రాధాన్యం

- క్షేత్ర స్థాయిలో గర్భిణుల జాబితా తయారు
- వైద్య విధాన పరిషత్ జేడీ రాజశేఖర్‌బాబు

**సిరిసిల్ల టౌన్:** రాష్ట్రంలోని సర్కారు దవాఖానల్లో సాధారణ ప్రసవాల సంఖ్య పెంచుందుకు చర్యలు తీసుకుంటున్నట్టు వైద్య విధాన పరిషత్ జాయింట్ డైరెక్టర్ రాజశేఖర్‌బాబు తెలిపారు. రాజన్న సిరిసిల్ల జిల్లా ప్రధాన దవాఖానను సోమవారం ఆయన తనిఖీ చేశారు. దవాఖానలోని గర్భిణుల సహాయ కేంద్రం, పరీక్ష కేంద్రం, ఆన్‌లైన్‌లో గర్భిణుల వివరాల నమోదు, కేసీఆర్ కిట్స్ పంపిణీ, ఆశా కార్యకర్తల వివరాలు, తదితర రికార్డులను పరిశీలించారు. గర్భిణుల సహాయ కేంద్రంలో ప్రతి ఆశా కార్యకర్త పేరు, ఫోన్ నెంబర్ల రికార్డు ఉండాలని సూచించారు. గర్భిణుల పూర్తి వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేయాలన్నారు. జిల్లా వైద్యాధికారి డాక్టర్ చంద్రశేఖర్, సూపరింటెండెంట్ డాక్టర్ తిరుపతి, డాక్టర్ రాధాకృష్ణ, డాక్టర్ మురళీధర్‌రావు పాల్గొన్నారు.

### కేఏ పాల్‌పై

## ఎన్‌బీడబ్ల్యూ

**మూసాపేట:** ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్‌పై నాన్ బెయిలబుల్ వారెంట్ జారీ అయింది. తన సోదరుడు డేవిడ్‌రాజు హత్య కేసులో కేఏ పాల్ నిందితుడిగా ఉన్నాడు. కేసు విచారణ నిమిత్తం సోమవారం మహబూబ్‌నగర్ కోర్టుకు పాల్ హాజరుకాకపోవడంతో న్యాయమూర్తి నాన్‌బెయిలబుల్ వా రెంట్ జారీ చేసినట్టు మూసాపేట ఎస్సై మ ధుసూదన్‌గౌడ్ తెలిపారు. 2010 జనవరి 30న తెల్లవారుజామున మూసాపేట మండలం సంకలమద్ది సమీపంలో జాతీయ రహదారి పక్కన ఆగి ఉన్న కారులో డ్రైవర్ సీటులో డేవిడ్‌రాజ్ విగతజీవిగా ఉండటం.. కారులోనే వేర్వేరు నంబర్ ప్లేట్లు లభించడంతో పథకం ప్రకారం హత్య చేశారని పోలీసులు నిర్ధారణకు వచ్చారు. హత్యలో మొత్తం 9 మంది ప్రమేయం ఉన్నట్టుగా గుర్తించారు. 2012 మే 21న ఒంగోలులో కేఏపాల్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. సోమవారం కేసు విచారణకు కేఏ పాల్ కోర్టుకు హాజరు కాకపోవడంతో నాన్‌బెయిలబుల్ వారెంట్ జారీ అయ్యింది.

# గర్భిణీకి ప్రాణం పోసిన ప్రభుత్వ వైద్యులు

**హుజూరాబాద్‌టౌన్:** ప్రాణపాయ స్థితిలో ఉన్న గర్భిణీకి సకాలంలో శస్త్రచికిత్స చేసి ప్రాణాలు కాపాడారు కరీంనగర్ జిల్లా హుజూరాబాద్ సర్కారు దవాఖాన వైద్యులు. శంకరపట్నం మండలం మొలంగూర్‌కు చెందిన దొడ్డిపల్లి శిరీషకు గోదావరిఖనికి చెందిన అజయ్‌తో వివాహం జరిగింది. ప్రస్తుతం ఆమె ఆరు నెలల గర్భిణి. రాఖీ పండుగ కోసం పుట్టింటికి వచ్చింది. ఆదివారం అర్ధరాత్రి దాటి న తర్వాత 1.30 గంటలకు శిరీషకు ఫిట్స్ వచ్చి నాలుక కరుచుకొని కోమాలోకి వెళ్లింది. సమాచారం అందుకున్న 108 సిబ్బంది ఆమె ను హుజూరాబాద్ సర్కారు దవాఖానకు తీసుకువచ్చారు. విధుల్లో ఉన్న స్త్రీ వైద్యనిపుణురాలు వాణీలత విషయాన్ని దవాఖాన సూపరింటెండెంట్ రవిప్రవీణ్‌రెడ్డి దృష్టికి తీసుకువెళ్లారు. దీంతో ఆయన 2.30 గంటలకు దవాఖానకు వచ్చి, వైద్యులందరినీ సమన్వయం చేశారు. దూరప్రాంతాల్లో ఉన్నప్పటికీ వైద్యులందరూ రాత్రే దవాఖానకు చేరుకున్నారన్నారు. లాప్రోస్కోపిక్ జనరల్ సర్జన్ డాక్టర్ పీ శ్రీకాంత్ రెడ్డి, గైనకాలజిస్టులు బీ విజేత, వై వాణీలత, పిల్లల వైద్యుడు రమేశ్ రెండు గంటల పాటు శ్రమించి శిరీషకు శస్త్ర చికిత్స చేశారు. అప్పటికే గర్భంలోనే మృతి చెందిన శిశువును తొలగించి తల్లి ప్రాణాలు కాపాడారు.



చికిత్స పొందుతున్న శిరీష

# చిల్లర రాజకీయాలొద్దు

- గుప్త నిధుల తవ్వకాల కేసులో మీ వదినమ్మ లేదా..?
- రేవంత్‌రెడ్డిని ప్రశ్నించిన ఎమ్మెల్యే గువ్వల బాలరాజు

**అచ్చంపేట, నమస్తే తెలంగాణ:** చిల్లర రాజకీయాలు చేస్తూ.. బ్రోకర్‌గా మారి జైలుకు వెళ్లిన ప్రస్తుత కాంగ్రెస్ నేత రేవంత్‌రెడ్డి ఒళ్లు దగ్గరపెట్టుకొని మాట్లాడాలని అచ్చంపేట ఎమ్మెల్యే గువ్వల బాలరాజు హెచ్చరించారు. సోమవారం అచ్చంపేటలో ఎమ్మెల్యే మీడియాతో మాట్లాడారు. యురేనియం తవ్వకాల విషయంలో ఇష్టమొచ్చినట్టు మాట్లాడితే తగిన రీతిలో బుద్ధి చెప్పాల్సి ఉంటుందన్నారు. రాబర్ట్‌వాద్రాకు చెందిన డీబీర్స్ సంస్థకు గత కాంగ్రెస్ సర్కారే యురేనియం వెలికితీసే అనుమతులిచ్చిందనిగుర్తుచేశారు. 'స్వయాన మీ వదిన వనజమ్మ ఇటీవల పదర మండలం రాయలగండి వద్ద గుప్తనిధుల తవ్వకానికి వచ్చి పట్టుబడిన విషయం నిజం కాదా' అని రేవంత్‌రెడ్డి అని ఎమ్మెల్యే ప్రశ్నించారు.

నమస్తే తెలంగాణ
# ఆట
8
[ కరీంనగర్ ]
మంగళవారం 20 ఆగస్టు 2019
WWW.NTNEWS.COM



## ఇసో అల్బెన్ డబుల్ ధమాకా

ప్రపంచ జూనియర్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్

**న్యూఢిల్లీ:** ప్రపంచ జూనియర్ ట్రాక్ సైక్లింగ్ చాంపియన్‌షిప్‌లో భారత అథ్లెట్లు తమ అత్యుత్తమ ప్రదర్శనను నమోదు చేశారు. ఇసో అల్బెన్ డబుల్ ధమాకా కొట్టడంతో ఈ టోర్నీలో భారత్ మొత్తం మూడు పతకాలు ఖాతాలో వేసుకుంది. ఇసో అల్బెన్, రొనాల్డో సింగ్, రోజిత్ సింగ్‌తో కూడిన భారత బృందం పురుషుల టీమ్ స్ప్రింట్ ఈవెంట్‌లో ఇప్పటికే స్వర్ణం సాధించగా.. తాజాగా అల్బెన్ మరో రజతం, కాంస్యం చేజిక్కించుకున్నాడు. పోటీల చివరి రోజు సోమవారం వ్యక్తిగత స్ప్రింట్ ఈవెంట్‌లో రజతం నెగ్గిన 18 ఏండ్ల అల్బెన్.. వ్యక్తిగత కైరిన్ ఈవెంట్‌లో కాంస్య పతకం గెలుచుకున్నాడు. మొత్తం మూడు మెడల్స్‌తో భారత్ పతకాల పట్టికలో ఆరో స్థానంలో నిలిచింది. అంతర్జాతీయ సైక్లింగ్ పోటీల్లో భారత్‌కు ఇదే ఉత్తమం. జర్మనీ, న్యూజిలాండ్, గ్రీస్ వరుసగా తొలి మూడు స్థానాలు దక్కించుకున్నాయి.

# ఆరంభం అదిరింది

శ్రీకాంత్, సాయి ప్రణీత్, ప్రణయ్ ముందంజ
రెండో రౌండ్‌కు మేఘన-పూర్విషా జోడీ
బ్యాడ్మింటన్ ప్రపంచ చాంపియన్‌షిప్



ప్రణయ్



సాయి ప్రణీత్

**పతకమే లక్ష్యంగా ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో అడుగిడిన భారత షట్లర్లు తొలి రోజు అంచనాలకు తగ్గట్టే రాణించారు. పురుషుల విభాగంలో మూడున్నర దశాబ్దాలుగా అందని ద్రాక్షలా ఊరిస్తున్న పతకం ఆశలను మోస్తూ తొలిరౌండ్‌లో అదరగొట్టారు. కిడాంబి శ్రీకాంత్, సాయి ప్రణీత్, హెచ్‌ఎస్ ప్రణయ్ తొలిరౌండ్‌లో గెలిచి రెండో రౌండ్లోకి దూసుకెళ్లారు. మహిళల డబుల్స్‌లో జక్కంపూడి మేఘన-పూర్విషా జోడీ సత్తాచాటింది.**

**బాసెల్ (స్విట్జర్లాండ్):** బీడబ్ల్యూఎఫ్ ప్రపంచ బ్యాడ్మింటన్ చాంపియన్‌షిప్‌లో భారత షట్లర్లు శుభారంభం చేశారు. సోమవారం ఇక్కడ జరిగిన పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో సాయి ప్రణీత్, కిడాంబి శ్రీకాంత్, హెచ్‌ఎస్ ప్రణయ్ విజయం సాధించి ముందడుగేశారు. ప్రపంచ 19వ ర్యాంకర్ సాయి ప్రణీత్ 21-17, 21-16తో ఆంటోనీ హోసూ (కెనడా)ను వరుస గేమ్‌ల్లో చిత్తు చేశాడు. 40 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలిగేమ్ ప్రారంభంలో పోరు హోరాహోరీగా జరిగింది. 8-7కు చేరుకున్న ప్రణీత్ ఆ తర్వాత మరింత రెచ్చిపోయాడు. కండ్లు చెదిరే షాట్లతో ప్రత్యర్థిని బెంబేలెత్తిస్తూ వరుసగా తొమ్మిది పాయింట్లు సాధించాడు. పదునైన స్మాష్‌లు, చురుకైన డ్రాప్‌లతో ఆకట్టుకున్నాడు. అయితే అంత త్వరగా ఓటమిని అంగీకరించని ఆంటోనీ కడదాక పోరాడాడు. చక్కటి ప్రతిఘటన కనబరుస్తూ ఆధిక్యాన్ని తగ్గించాడు. ఫలితంగా చివరికి ప్రణీత్ 21-17 తేడాతో తొలిగేమ్‌ను సొంతం చేసుకున్నాడు. రెండో గేమ్‌లోనూ సేమ్ సీన్ రిపీట్ అయింది. ఆరంభంలో ఇరువురు ఆటగాళ్లు ఆధిక్యం కోసం తీవ్రంగా శ్రమించారు. దీంతో గేమ్ హోరాహోరీగా సాగింది. ఒక దశలో 11-9తో ఆధిక్యం దక్కించుకున్న ప్రణీత్ ఇక అక్కడి నుంచి వెనుదిరిగి చూడకుండా చకచకా పాయింట్లు సాధించుకుంటూ ఆఖరికి 21-16తో గేమ్‌తో పాటు మ్యాచ్‌ను తన ఖాతాలో వేసుకున్నాడు.

### సత్తచాటిన ప్రణయ్..

మరో మ్యాచ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్ హెచ్ఎస్ ప్రణయ్ 17-21, 21-10, 21-11 తేడాతో 93వ ర్యాంకర్ ఇటూ హీనో(ఫిన్లాండ్)పై నెగ్గాడు. 59 నిమిషాల పాటు జరిగిన పోరులో తొలి గేమ్ ఆసాంతం తడబడిన ప్రణయ్.. 17-21తో కోల్పోయి ఉత్కంఠ రేపాడు. అయితే రెండో గేమ్‌లో పుంజుకొని 5-5 నుంచి 17పాయింట్లు సాధించి.. ప్రత్యర్థికి ఐదు పాయింట్లు మాత్రమే ఇచ్చి 21-10తో సునాయాసంగా గెలిచాడు. మూడో గేమ్‌లో తొలి నుంచి ఆధిపత్యం ప్రదర్శించి ముందడుగేశాడు. రెండో రౌండ్‌లో లిన్‌డాన్ (చైనా)తో ప్రణయ్ తలపడనున్నాడు.

### జక్కంపూడి జోరు..

మహిళల డబుల్స్ తొలి రౌండ్‌లో భారత జోడీ జక్కంపూడి మేఘన-ఎస్.పూర్విషా రామ్ 21-10, 21-18 తేడాతో డయానా కోర్లెటో-నిక్టే అలెజాండ్రా సొటోమయోర్(గుటెమల)పై విజయం సాధించి, రెండో రౌండ్‌లో అడుగుపెట్టింది. షిహో తనక-కొహరు యోనెమోటా (జపాన్) ద్వయంతో రెండో రౌండ్‌లో మేఘన-పూర్విషా జోడీ ఢీకొననుంది. తెలంగాణ షట్లర్ ఎన్. సిక్కిరెడ్డి-అశ్విని పొన్నప్ప జోడీ మహిళల డబుల్స్‌లో నేడు తమ అదృష్టాన్ని పరీక్షించుకోనుంది. వీరితో పాటు పూజ దండు-సంజనా సంతోష్ ద్వయం కూడా మంగళవారం బరిలో దిగనుంది. మిక్స్‌డ్ డబుల్స్‌లో ప్రణవ్ చోప్రా-సిక్కిరెడ్డి జంట తొలిరౌండ్ ఆడనుండగా.. పురుషుల డబుల్స్‌లో మను అత్రి-సుమీత్ రెడ్డి, ఎమ్ఆర్ అర్జున్-శ్లోక్ రామచంద్రన్, అరుణ్-సన్యమ్ శుక్లా జోడీలు బరిలో దిగనున్నాయి.

## పడిలేచిన శ్రీకాంత్..



మరో మ్యాచ్‌లో ఏడో సీడ్ కిడాంబి శ్రీకాంత్ 17-21, 21-16, 21-6 తేడాతో అన్‌సీడెడ్ నాట్ గుయెన్(ఐర్లాండ్)పై చెమటోడ్చి నెగ్గాడు. 66 నిమిషాల పాటు సాగిన మ్యాచ్‌లో తొలి గేమ్ ప్రారంభం నుంచి ఆధిపత్యం ప్రదర్శించిన తెలుగు షట్లర్ మధ్యలో గతి తప్పాడు. ఓ దశలో 14-7తో ముందంజలో ఉన్నా.. పదేపదే తప్పిదాలు చేసి గేమ్‌ను 17-21తో కోల్పోయాడు. రెండో గేమ్ ప్రారంభంలోనూ 3-6తో వెనుకబడి ఆందోళన రేకెత్తించిన శ్రీకాంత్.. ఆ తర్వాతి నుంచి అదరగొట్టాడు. ప్రత్యర్థి ఆధిపత్యాన్ని క్రమంగా తగ్గించుకుంటూ పోతూ చివరికి 21-16తో గేమ్‌ను సొంతం చేసుకున్నాడు. ఇక నిర్ణయాత్మక మూడో గేమ్‌లో విశ్వరూపం ప్రదర్శిస్తూ.. ప్రత్యర్థికి ఏ మాత్రం అవకాశం ఇవ్వకుండా ఏకంగా 11వరుస పాయింట్లతో 21-6 తేడాతో కైవసం చేసుకొని రెండో రౌండ్‌లో ప్రవేశించాడు. రెండో రౌండ్‌లో మిషా జిల్‌బెర్మాన్ (ఇజ్రాయిల్)తో శ్రీకాంత్ తలపడనున్నాడు.

# అది కాకుంటే ఇదైనా..!

బ్యాటింగ్ కోచ్ బరిలో లాల్‌చంద్ రాజ్‌పుత్
సహాయక సిబ్బంది కోసం ఇంటర్వ్యూలు ప్రారంభించిన ఎమ్మెస్కే కమిటీ
భరత్ అరుణ్, శ్రీధర్ కొనసాగింపు!



**ముంబై:** టీమ్ఇండియా ప్రధాన కోచ్ పదవి ఆశించి భంగపడ్డ మాజీ ఆటగాడు లాల్ చంద్ రాజ్‌పుత్ బ్యాటింగ్ కోచ్‌గానైనా ఎంపికవ్వాలని ప్రయత్నిస్తున్నాడు. జింబాబ్వే, అఫ్ఘనిస్థాన్ జాతీయ జట్లకు కోచ్‌గా పనిచేసిన రాజ్‌పుత్ సొంత జట్టు తరపున ఏదో ఓ స్థాయిలో సేవలదించేందుకు సిద్ధమయ్యాడు. క్రికెట్ దిగ్గజం కపిల్ దేవ్ నేతృత్వంలోని క్రికెట్ సలహాదారుల కమిటీ ఇటీవల టీమ్ఇండియా ప్రధాన కోచ్‌గా రవిశాస్త్రినే కొనసాగించగా.. అతడి సహాయక సిబ్బంది నియామక ప్రక్రియను ఎమ్మెస్కే ప్రసాద్ సారథ్యంలోని ఐదుగురు సభ్యుల సెలక్షన్ కమిటీ ప్రారంభించింది. బ్యాటింగ్, బౌలింగ్, ఫీల్డింగ్, జట్టు మేనేజర్ పదవుల కోసం దరఖాస్తు చేసుకున్న వారికి సోమవారం నుంచి ఇంటర్వ్యూలు మొదలుపెట్టింది. దరఖాస్తు చేసుకున్న వారందరి ఇంటర్వ్యూలు గురువారంలోగా పూర్తికానుండగా, ఆ రోజే సహాయక సిబ్బంది పేర్లను ప్రకటించే అవకాశముంది. బ్యాటింగ్ కోచ్ రేసులో రాజ్‌పుత్, మాజీ ఓపెనర్ విక్రమ్ రాథోడ్ ముందున్నారు. వారితో పాటు ఈ స్థానానికి ప్రవీణ్ ఆమ్రే, ముంబై మాజీ స్టార్ అమోల్ మజుందార్, సితాన్షు కొటాక్, హృతికేశ్ కనిత్కర్, మిథున్ మన్‌హాస్ కూడా దరఖాస్తు చేసుకున్నారు. కాగా, బౌలింగ్ కోచ్ స్థానం కోసం దిగ్గజ బౌలర్ వెంకటేశ్ ప్రసాద్ దరఖాస్తు చేసుకోగా, పరాస్ మాంబ్రే, అమిత్ భండారీ కూడా పోటీలో ఉన్నారు. ఫీల్డింగ్ కోచ్ పదవికి దక్షిణాఫ్రికా ఆల్‌టైం బెస్ట్ ఫీల్డర్ జాంటీ రోడ్స్ దరఖాస్తు చేసుకున్న వారిలో ఉన్నాడు.

### భరత్, శ్రీధర్ కొనసాగింపు!

ప్రస్తుతం టీమ్ఇండియా బ్యాటింగ్ కోచ్‌గా సంజయ్ బంగర్, బౌలింగ్‌కు భరత్ అరుణ్, ఫీల్డింగ్‌కు ఆర్.శ్రీధర్ ఉన్నారు. ప్రపంచకప్‌తోనే వీరి పదవీ కాలం ముగిసినా వెస్టిండీస్ టూర్ కోసం బీసీసీఐ మరో 45 రోజుల గడువు పొడిగించింది. ప్రస్తుతం సహాయక సిబ్బంది నియామకం కోసం ఇంటర్వ్యూల ప్రక్రియ జరుగుతున్నా.. భరత్, శ్రీధర్ వారి స్థానాల్లోనే కొనసాగే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ప్రధాన కోచ్ రవిశాస్త్రి సైతం ఇప్పుడున్న వారినే కొనసాగించాలని చెప్పినట్టు సమాచారం. భరత్ అరుణ్ నేతృత్వంలో టీమ్ఇండియా బౌలింగ్ చాలా మెరుగైంది. ముఖ్యంగా పేస్ విభాగంలో బలోపేతమైంది. బుమ్రా సహా మిగిలిన బౌలర్లందరూ చక్కగా రాణిస్తున్నారు. దీంతో అతడి పదవి పదిలంగానే ఉంటుందనేది విశ్లేషకుల మాట. అలాగే భారత జట్టు ఫీల్డింగ్ కూడా గత కొంత కాలంగా ఉన్నత ప్రమాణాలతో ఉంది. ఆటగాళ్లు మెరుపు ఫీల్డింగ్‌తో మెప్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో జాంటీ రోడ్స్ పోటీలో ఉన్నా.. ఎమ్మెస్కే కమిటీ ఆర్.శ్రీధర్ వైపే మొగ్గు చూపే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయి. ఎటొచ్చి బ్యాటింగ్ కోచ్ సంజయ్ బంగర్ స్థానమే ప్రమాదంలో పడింది. ప్రపంచ కప్ సహా కొంతకాలంగా మిడిల్‌ఆర్డర్ వైఫల్యం అతడి పదవిపై ప్రభావాన్ని చూపనుండగా.. ఆ స్థానం కోసం పోటీదారులు సైతం బలంగా ఉన్నారు. ఏ స్థానానికి ఎవరు ఎంపికవుతారన్న అంశంపై గురువారం స్పష్టత రానుంది.

## టెస్టు జట్టుతోనే సైనీ

**న్యూఢిల్లీ:** వెస్టిండీస్ పర్యటనలో టీ20, వన్డేలకు మాత్రమే ఎంపికైన యువ పేసర్ నవ్‌దీప్ సైనీ.. టెస్టులు జట్టుతోనూ కొనసాగనున్నాడు. కొన్నేళ్లుగా దేశవాళీ క్రికెట్‌లో దుమ్మురేపుతూ వస్తున్న ఈ పేసర్.. విండీస్‌తో తొలి టీ20తో అరంగేట్రం చేసి.. మొదటి మ్యాచ్‌లోనే మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అందుకున్న విషయం తెలిసిందే. మెరుపు వేగం, బంతిని ఇరువైపులా స్వింగ్ చేసే సామర్థ్యమున్న సైనీని టెస్టు సిరీస్ సన్నాహకాల్లో భాగంగా నెట్ బౌలర్‌గా వినియోగించుకోవాలని జట్టు యాజమాన్యం నిర్ణయించింది. అలాగే టెస్టు సిరీస్‌లో భువనేశ్వర్ కుమార్‌కు నవ్‌దీప్ కవర్‌గానూ ఉండనున్నాడు. 'టెస్టు సిరీస్ కోసం టీమ్ఇండియాతోనే ఉండాలని సైనీకి జట్టు యాజమాన్యం సూచించింది. అతడు నెట్‌బౌలర్‌గా ఉంటా డు'అని బీసీసీఐ అధికారి ఒకరు సోమవారం చెప్పారు.

## ప్రాక్టీస్ మ్యాచ్ 'డ్రా'



**అంటిగ్వా:** వెస్టిండీస్ టూర్‌లో భాగంగా టీ20, వన్డే సిరీస్‌లు చేజిక్కించుకున్న టీమ్ఇండియా.. టెస్టు సిరీస్‌నూ సొంతం చేసుకునేందుకు గ్రౌండ్ సిద్ధం చేసుకుంటున్నది. అసలు పోరుకు ముందు వెస్టిండీస్-ఏతో జరిగిన మూడు రోజుల ప్రాక్టీస్ మ్యాచ్‌ను భారత్ ఎలెవెన్ పూర్తి ఆధిపత్యం ప్రదర్శించి చివరకు 'డ్రా'గా ముగించింది. అజింక్యా రహనే (54), హనుమ విహారి (64) అర్ధశతకాలతో చెలరేగడంతో భారత్ ఎలెవెన్ రెండో ఇన్నింగ్స్‌లో 5 వికెట్ల నష్టానికి 188 పరుగుల వద్ద డిక్లేర్‌చేసింది. 305 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన విండీస్ చివరకు 21 ఓవర్లలో 47/3తో నిలిచింది. ఫలితం తేలే అవకాశం లేకపోవడంతో ఇరుజట్ల కెప్టెన్లు 'డ్రా'కు మొగ్గుచూపారు. తొలి ఇన్నింగ్స్‌లో పుజారా సెంచరీ, రోహిత్ శర్మ అర్ధ సెంచరీ బాదడంతో భారత్ ఎలెవన్ 297/5 వద్ద డిక్లేర్ చేయగా.. అనంతరం ఇషాంత్, ఉమేశ్, కుల్దీప్ తలా 3 వికెట్లు పడగొట్టడంతో వెస్టిండీస్-ఏ తొలి ఇన్నింగ్స్‌లో 181 పరుగులకు ఆలౌటైంది.

## విరుద్ధ ప్రయోజనాలపై శ్వేతపత్రం



ఎడుల్జీ

**ముంబై:** పరస్పర విరుద్ధ ప్రయోజనాల మార్గదర్శకాలను అమలు చేయడంలో ఎదురవుతున్న ఇబ్బందులకు పరిష్కారం కనుగొనే దిశగా క్రికెట్ పరిపాలకుల కమిటీ (సీవోఏ) అడుగులేస్తున్నది. ఈ నేపథ్యంలో ఈ అంశంపై పూర్తి వివరాలతో శ్వేతపత్రాన్ని రూపొందిస్తామని సీవోఏ సభ్యురాలు డయానా ఎడుల్జీ సోమవారం వెల్లడించారు. కమిటీ మరో సభ్యుడు, రిటైర్డ్ లెఫ్టినెంట్ జనరల్ రవి తోడ్గేతో పాటు ప్రస్తుత, మాజీ క్రికెటర్లలతో ఆమె సంప్రదింపులు జరిపారు. మాజీ కెప్టెన్లు దిలీప్ వెంగ్‌సర్కార్, సౌరభ్ గంగూలీలతో సహా మరికొంత మందిని కలిసి పరస్పర విరుద్ధ ప్రయోజనాల అంశంలో సమస్యలపై చర్చించి అభిప్రాయాలు, సలహాలు స్వీకరించారు. సుప్రీంకోర్టు నియమించిన జస్టిస్ ఆర్‌ఎం లోధా ప్యానెల్ విధించిన నిబంధనలపై సీఓఏ ముఖ్యంగా సమాలోచనలు చేసింది. 'విరుద్ధ ప్రయోజనాల విషయంలో ఎదురవుతున్న సమస్యలన్నీ చర్చించాం. గంగూలీ సహా మరికొంత మంది నుంచి సలహాలు తీసుకున్నాం. త్వరలో శ్వేతపత్రాన్ని రూపొందిస్తాం. సుప్రీంకోర్టుకు అందే లా దాన్ని అమికస్‌క్యూరీ ముందుంచుతాం'అని ఎడుల్జీ అన్నారు. సచిన్ టెండూల్కర్, రాహుల్ ద్రవిడ్, వీవీఎస్ లక్ష్మణ్‌కు కూడా పరస్పర విరుద్ధ ప్రయోజనాల విషయంలో గతంలో నోటీసులు జారీ అయిన విషయం తెలిసిందే.

## సన్‌రైజర్స్ అసిస్టెంట్ కోచ్‌గా బ్రాడ్ హడిన్



**న్యూఢిల్లీ:** ఆస్ట్రేలియా మాజీ వికెట్ కీపర్ బ్యాట్స్‌మన్ బ్రాడ్ హడిన్ ఇండియన్ ప్రీమియర్ లీగ్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఫ్రాంచైజీకి సహాయక కోచ్‌గా ఎంపికయ్యాడు. ఇటీవలి వరకు సన్‌రైజర్స్ హెడ్‌కోచ్‌గా పనిచేసిన టామ్ మూడి ఈ సీజన్ అనంతరం తన పదవి నుంచి తప్పుకొని టీమ్ఇండియా హెడ్ కోచ్ పోస్టు కోసం ప్రయత్నించి భంగపడిన విషయం తెలిసిందే. అయితే మూడి స్థానంలో ఇంగ్లండ్ మాజీ కోచ్ ట్రెవర్ బేలిస్‌ను సన్‌రైజర్స్ ప్రధాన కోచ్‌గా ఎంపిక చేసింది. హడిన్ అతడితో కలిసి పనిచేయనున్నాడు.

### ఎంసీసీలో జాన్సన్



**లండన్:** ఆస్ట్రేలియా మాజీ స్టార్ పేసర్ మిచెల్ జాన్సన్‌కు అరుదైన గౌరవం దక్కింది. మెరిల్‌బోన్ క్రికెట్ క్లబ్ (ఎంసీసీ) జీవితకాల గౌరవ సభ్యుడిగా ఎంపికయ్యాడు. లార్డ్స్‌లో ఆసీస్-ఇంగ్లండ్ మధ్య ఆదివారం యాషెస్ సిరీస్ రెండో టెస్టు జరుగుతున్న సమయంలో ఈ విషయాన్ని ఎంసీసీ ప్రకటించింది. 'ఎంసీసీ జీవితకాల గౌరవ సభ్యుడిగా లార్డ్స్‌లో కూర్చుంటానని నేను ఎప్పుడూ అనుకోలేదు. చాలా గొప్పగా ఫీలవుతున్నా'అని జాన్సన్ ట్వీట్ చేశాడు.

## భారత్‌కు డజను పతకాలు





**న్యూఢిల్లీ:** అంతర్జాతీయ బాక్సింగ్ టోర్నీలో భారత జూనియర్ మహిళా బాక్సర్లు దుమ్మురేపారు. సెర్బియా వేదికగా జరిగిన టోర్నమెంట్‌లో భారత అమ్మాయిలు 12 పతకాలు చేజిక్కించుకున్నారు. అందులో 4 స్వర్ణాలు, 4 రజతాలు, 4 కాంస్యాలు ఉన్నాయి. తమన్నా (48 కేజీలు), అంబెశోరి దేవి (57 కేజీలు), ప్రీతి దహియ (60 కేజీలు), ప్రియాంక (66 కేజీలు) ఫైనల్ బౌట్లలో సత్తాచాటి పసిడి పతకాలు సొంతం చేసుకున్నారు. 48 కేజీల ఫైనల్లో తమన్నా 5-0తో అలెనా ట్రెమసోవ (రష్యా)పై నెగ్గి 'ఉత్తమ విదేశీ బాక్సర్'గా ఎంపికైంది. అంబెశోరి దేవి 3-2తో డునా సిపెల్ (స్వీడన్), ప్రీతి 3-2తో క్రిస్టినా కర్టసేవా (ఉక్రయిన్)పై విజయాలు సాధించగా.. ప్రియాంక 5-0తో ఓల్గా పెట్రాష్కో (రష్యా)ను చిత్తు చేసింది. అంజూ దేవి (50 కేజీలు), సిమ్రన్ వర్మ (52 కేజీలు), మాన్షి దలాల్ (75 కేజీలు), తన్షిబిర్ కౌర్ సంధు (80 కేజీలు) ఫైనల్ బౌట్లలో ఓడి రజత పతకాలు దక్కించుకున్నారు. అంతకు ముందు సెమీఫైనల్స్‌లో ఆత్రేయ (63 కేజీలు), నేహ (54 కేజీలు), ఖుషి (70 కేజీలు), అల్ఫియా (ప్లస్ 80 కేజీలు) ఓటమి పాలై కాంస్య పతకాలు సొంతం చేసుకున్నారు. భారత్ నుంచి 13 మంది బాక్సర్ల బృందం ఈ పోటీల్లో పాల్గొంటే.. అందులో 12 మంది పతకాలు సాధించడం విశేషం.

## రెండో రౌండ్‌లో ప్రజ్నేశ్



**నార్త్ కరోలినా:** భారత అగ్రశ్రేణి టెన్నిస్ ప్లేయర్ ప్రజ్నేశ్ గుణేశ్వరన్ ఏటీపీ-250 టోర్నమెంట్‌లో రెండో రౌండ్‌కు చేరాడు. అమెరికా వేదికగా జరుగుతున్న విన్‌స్టన్ సాలెమ్ ఓపెన్ టోర్నీ పురుషుల సింగిల్స్ తొలి రౌండ్‌లో ప్రపంచ 89వ ర్యాంకర్ ప్రజ్నేశ్ 6-3, 6-4తో సెడ్రిక్ మార్సెల్ స్టెబ్ (జర్మనీ)పై గెలిచి రెండో రౌండ్‌కు అర్హత సాధించాడు. గంటా 13 నిమిషాల పాటు సాగిన ఈ పోరులో ప్రజ్నేశ్ వరుస సెట్లలో గెలుపొందాడు. ఐదింట రెండు బ్రేక్ పాయింట్లు కాపాడుకున్న గుణేశ్వరన్ ఒక డబుల్ ఫాల్ట్ చేస్తే.. ప్రత్యర్థి 7 డబుల్ ఫాల్ట్స్‌తో మూల్యం చెల్లించుకున్నాడు. రెండో రౌండ్‌లో ప్రపంచ 30వ ర్యాంకర్, టాప్ సీడ్ బెనాయిట్ పెయిర్ (ఫ్రాన్స్)తో ప్రజ్నేశ్ మంగళవారం అమీతుమీ తేల్చుకోనున్నాడు. మరోవైపు పురుషుల డబుల్స్ విభాగంలో దివిజ్ శరణ్-రోహన్ బోపన్న జోడీ తొలి రౌండ్‌లోనే ఓడి టోర్నీ నుంచి నిష్క్రమించింది. దివిజ్-బోపన్న జంట తొలిరౌండ్‌లో 3-6, 3-6తో వరుస సెట్లలో నికోలస్ మొన్రో-సాండ్‌గ్రెన్ (అమెరికా) చేతిలో పరాజయం పాలైంది.


## కోహ్లీ ర్యాంకుకు స్మిత్ ఎసరు!



**దుబాయ్:** యాషెస్ సిరీస్‌లో దుమ్మురేపుతున్న ఆస్ట్రేలియా కెప్టెన్ స్టీవ్ స్మిత్ ఐసీసీ టెస్టు ర్యాంకింగ్స్‌లో జోరు కనబరిచాడు. బ్యాట్స్‌మెన్ జాబితాలో రెండో ర్యాంకులోనే ఉన్నా.. రేటింగ్ పాయింట్లు మెరుగుపర్చుకొని అగ్రస్థానంలో ఉన్న భారత కెప్టెన్ విరాట్ కోహ్లీకి చేరువయ్యాడు. కోహ్లీ 922 పాయింట్లతో టాప్‌లో ఉంటే.. స్మిత్ 913 పాయింట్లతో రెండో స్థానంలో కొనసాగుతున్నాడు. ప్రస్తుతం వీరిద్దరి మధ్య 9 పాయింట్ల అంతరమే ఉంది. ఇంగ్లండ్‌తో ముగిసిన రెండో టెస్టు తొలి ఇన్నింగ్స్‌లో 92 పరుగులతో ఆకట్టుకున్న స్మిత్.. ఆర్చర్ వేసిన బంతి తలకు బలంగా తాకడంతో రెండో ఇన్నింగ్స్‌లో బరిలో దిగలేదు. విలియమ్సన్ (887), చతేశ్వర్ పుజారా (881) వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో ఉన్నారు. టాప్-10లో భారత్ నుంచి కోహ్లీ, పుజారా మాత్రమే ఉన్నారు.

## జైపూర్‌కు యూపీ షాక్

ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్




**చెన్నై:** ప్రొ కబడ్డీ లీగ్ 7వ సీజన్‌లో వరుస విజయాలతో దూసుకెళ్తున్న జైపూర్ పింక్ పాంథర్స్‌కు యూపీ యోధా షాకిచ్చింది. సోమవారం ఇక్కడ జరిగిన మ్యాచ్‌లో యూపీ 31-24తో జైపూర్‌ను ఓడించింది. లీగ్‌లో ఇప్పటి వరకు 8 మ్యాచ్‌లాడిన జైపూర్‌కు ఇది రెండో పరాజయం కాగా.. 9 మ్యాచ్‌లాడిన యూపీకి మూడో విజయం. యోధా తరపున సురేందర్ గిల్ (8 పాయింట్లు), శ్రీకాంత్ జాదవ్ (7 పాయింట్లు) రాణించారు. పాంథర్స్ తరపున దీపక్ హుడా (9 పాయింట్లు) ఒంటరి పోరాటం చేశాడు. మ్యాచ్ ఆరంభంలో ఇరుజట్లు హోరాహోరీగా తలపడటంతో పలుమార్లు స్కోర్లు సమమయ్యాయి. అయితే తొలి అర్ధభాగం ముగియడానికి కాస్త ముందు జైపూర్ ఆలౌటవడంతో యూపీ 16-10తో ఫస్ట్ హాఫ్ ముగించింది. రెండో సగంలోనూ అదే ఆధిక్యం కొనసాగించిన యోధా అలవోకగా గెలుపొందింది. మరో మ్యాచ్‌లో హర్యానా స్టీలర్స్ 30-27తో యు ముంబాపై విజయం సాధించింది. లీగ్‌లో నేడు విశ్రాంతి దినం. బుధవారం జరిగే పోటీల్లో పుణెరీతో బెంగళూరు, జైపూర్‌తో తమిళ్ తలైవాస్ తలపడనున్నాయి.

## వొడాఫోన్ ఐడియాకు బాలేష్ గుడ్‌బై

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ప్రముఖ మొబైల్ ఆపరేటర్ వొడాఫోన్ ఐడియా సీఈవో బాలేష్ శర్మ తన పదవికి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతో ఆయన రాజీనామా చేసినట్లు కంపెనీ ఒక ప్రకటనలో వెల్లడించింది. దీంతో ఈ స్థానంలో వొడాఫోన్ గ్రూపు ఎగ్జిక్యూటివ్‌గా విధులు నిర్వహిస్తున్న రవీందర్ టక్కర్..కంపెనీ నూతన మేనేజింగ్ డైరెక్టర్, సీఈవోగా నియమితులయ్యారు. ఈ నియామకం వెంటనే అమల్లోకి రానున్నదని సంస్థ ఒక ప్రకటనలో వెల్లడించింది.



# పెద్దన్నకు పెను సవాళ్లే!

## మాంద్యం కోరల్లో అమెరికా

### వచ్చే రెండేండ్లలో ఆర్థిక ఇబ్బందులు.. హెచ్చరిస్తున్న నిపుణులు

**వాషింగ్టన్, ఆగస్టు 19:**

'ముందున్నది ముసళ్ల పండగ' అంటున్నారు ఆర్థిక నిపుణులు. అగ్రరాజ్యం ఆర్థిక వ్యవస్థ వచ్చే రెండేండ్లలో మాంద్యం కోరల్లో చిక్కుకోవడం ఖాయమని వారు జోస్యం చెబుతున్నారు. మెజారిటీ ఆర్థిక విశ్లేషకులు 2020, 21ల్లో అమెరికా ఆర్థిక వ్యవస్థ ఇబ్బందుల్లో పడుతుందని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. సోమవారం విడుదలైన ఓ సర్వేలో పెద్దన్న ఆర్థిక పరిస్థితి ఏమంత బాగా లేదన్న అభిప్రాయాలు వినిపించాయి. గత వారం అమెరికా ఆర్థిక గణాంకాలు మిశ్రమంగా విడుదలైన నేపథ్యంలో ఆ దేశాధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్.. మాంద్యం భయాలను కొట్టిపారేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నేషనల్ అసోసియేషన్ ఫర్ బిజినెస్ ఎకనామిస్ట్స్ (ఎన్‌ఏబీఈ) సర్వేలో మెజారిటీ ఆర్థిక నిపుణులు అమెరికా ఆర్థిక వ్యవస్థకు మాంద్యం ముప్పు పొంచి ఉన్నదని చెబుతుండటం ప్రాధాన్యతను సంతరించుకున్నది. 'ఫిబ్రవరి సర్వేతో పోల్చితే ఈ ఏడాది తదుపరి మాంద్యం మొదలవుతుందనిపిస్తున్నది' అని ఎన్‌ఏబీఈ అధ్యక్షుడు హంటర్ అన్నారు. అయితే ఈ ఏడాది సంగతి ఎలా ఉన్నా.. వచ్చే ఏడాది మాంద్యం తప్పదన్న అంచనాలు చాలావరకు వినిపిస్తున్నాయి. కాగా, సర్వేలో పాల్గొన్నవారిలో 34 శాతం ఆర్థికవేత్తలు 2021 ఆఖరుకల్లా అమెరికా మాంద్యం బారిన పడుతుందని చెబుతున్నారు. ఫిబ్రవరి సర్వేలో ఇది 25 శాతంగానే ఉండటం గమనార్హం. ఇక తాజా సర్వేలో 38 శాతం మంది 2020లోనే ఆ ఛాయలు కనిపిస్తాయని అంటుండగా, 2 శాతం మంది ఈ ఏడాదే ఆ ముప్పు ఉందని అంచనా వేస్తున్నారు.




### ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై ప్రభావం


**అమెరికా** ఆర్థిక ఇబ్బందులు ప్రపంచ ఆర్థిక వ్యవస్థపై సహజంగానే పడనున్నాయి. వరల్డ్ ఎకానమీకి అమెరికా పెద్ద దిక్కుగా ఉండటం, ఆ దేశ కరెన్సీ డాలరే ప్రపంచ కరెన్సీగా ఉండటంతో గ్లోబల్ ఎఫెక్ట్ తప్పదని నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇప్పటికే చైనాతో అమెరికా వాణిజ్య యుద్ధం వల్ల ప్రపంచ ఆర్థిక వ్యవస్థ ప్రభావితం అవుతున్న విషయం తెలిసిందే. నిజానికి ఫెడరల్ రిజర్వ్ బ్యాంక్.. చాలా ఏండ్ల తర్వాత కీలక వడ్డీరేట్లను తగ్గించింది. దేశ ఆర్థిక వ్యవస్థలో కొత్త ఉత్సాహం నింపేందుకే ఈ నిర్ణయం తీసుకున్నది. ట్రంప్ సైతం వడ్డీరేట్లను తగ్గించాలని ఫెడరల్ రిజర్వ్‌పై ఒత్తిడి తెచ్చారు. అయినప్పటికీ మాంద్యం దెబ్బ అమెరికాకు ఇప్పటికే తగిలిందని, ఇది వచ్చే రెండేండ్లలో తారాస్థాయికి చేరితే.. ప్రపంచ ఆర్థిక వ్యవస్థ కుదేలేనని పలువురు ఆందోళన వెలిబుచ్చుతున్నారు.

### ట్రంప్ ధీమా



**తమ** దేశ ఆర్థిక వ్యవస్థకు ఏమీ కాదని ట్రంప్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. 'అన్నింటికీ నేను సిద్ధంగానే ఉన్నాను. మాంద్యం గురించి నేను అస్సలు దిగులు చెందడం లేదు. మా పాలనలో అమెరికా ఆర్థిక పరిస్థితులు బలపడ్డాయి. అమెరికన్ వినియోగదారులు చాలా సంపన్నులు' అని ఆదివారం విలేఖరులతో మాట్లాడుతూ అన్నారు. 'అద్భుతమైన రీతిలో నేను పన్ను ప్రోత్సాహకాలను అందించాను. అమెరికన్ల వద్ద ఇప్పుడు బోలెడు డబ్బున్నది. వారి కొనుగోలు శక్తి బాగున్నది' అన్నారు. వాస్తవానికి చాలామంది ఆర్థికవేత్తలు అమెరికాకు ఏమీ కాదని అంటున్నారని, ప్రపంచంలోని మిగతా దేశాలకు మాత్రం సమస్యలేనని హెచ్చరిస్తున్నట్లు చెప్పారు. ట్రంప్ ముఖ్య ఆర్థిక సలహాదారు లర్రీ కుడ్లో సైతం మాంద్యం ప్రభావాన్ని తక్కువ చేసి మాట్లాడుతున్నారు. 'వినియోగదారులకు పెద్ద ఎత్తున జీతాలు వస్తున్నాయి. కాబట్టి వారు ఖర్చుకు వెనుకాడబోరు. పొదుపునకూ వారు పెద్దపీట వేస్తున్నారు. కనుక ఈ ఏడాది ద్వితీయార్థం (జూలై-డిసెంబర్) ఇంకా బాగుంటుంది' అన్న నమ్మకాన్ని కుడ్లో వెలిబుచ్చారు.

## భయపడవద్దు: దాస్



**ముంబై:** ప్రతీ దాన్నీ భయంతో చూడాల్సిన అవసరం లేదని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) గవర్నర్ శక్తికాంత దాస్ అన్నారు. సోమవారం ఇక్కడ జరిగిన జాతీయ బ్యాంకింగ్ సదస్సులో మాట్లాడుతూ.. భారతీయ ఆర్థిక పరిస్థితులపై విచారం, దిగులు అక్కర్లేదన్న ఆయన అందరు తమ ముందున్న అవకాశాలపై దృష్టి పెట్టాలని కోరారు. ఆర్థిక మందగమనం, జాతీయ-అంతర్జాతీయంగా సవాళ్లు ఉన్న మాట నిజమేనని అంగీకరించినా.. ఆందోళన చెందాల్సిన పని లేదన్నారు. ఈ ఆర్థిక సంవత్సరానికి (2019-20)గాను గత నెల 5న లోక్‌సభలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో సంపన్నులు, విదేశీ పోర్ట్‌ఫోలియో మదుపరుల (ఎఫ్‌పీఐ)పై పన్ను తదితర నిర్ణయాలు దేశీయ కార్పొరేట్ రంగానికి మింగుడు పడటం లేదన్న విషయం తెలిసిందే. నాటి నుంచి దేశీయ స్టాక్ మార్కెట్లు 13 శాతానికిపైగా నష్టపోగా, స్టాక్, రుణ మార్కెట్ల నుంచి విదేశీ పెట్టుబడులు వేల కోట్ల రూపాయల్లో వెనక్కిపోతున్న సంగతీ విదితమే. ఈ నెల ఆరంభం నుంచే స్టాక్ మార్కెట్ల నుంచి రూ.10,416.25 కోట్లు, రుణ మార్కెట్ల నుంచి రూ.2,096.4 కోట్లు తరలిపోయాయి. 'నేను వార్తా పత్రికలు చదివినప్పుడు.. బిజినెస్ ఛానల్ వార్తలు చూసినప్పుడు దేశ ఆర్థిక పరిస్థితులు బాగా లేవని చెబుతున్నారు. నిజమే కానీ ఆ పరిస్థితులు ఆయా రంగాలకు మాత్రమే చెందిన వి. అయినప్పటికీ దేశ ఆర్థిక వ్యవస్థకు ఆపాదిస్తున్నారు. ఒక్కసారి మీ ముందున్న అవకాశాల ను పరిశీలించాలని మిమ్మల్ని నేను కోరుతున్నాను' అని దాస్ అన్నారు. కాగా, జీడీపీ పురోగతి కోసం వరుస ద్రవ్యసమీక్షల్లో కీలక వడ్డీరేట్లను ఆర్బీఐ తగ్గిస్తున్న విషయం తెలిసిందే. రెపో, రివర్స్ రెపో వడ్డీరేట్లను గత నాలుగు ద్వైమాసిక ద్రవ్యపరపతి విధాన సమీక్షల్లో 110 బేసిస్ పాయింట్ల మేర దాస్ కోత పెట్టారు.

## భయపడాల్సిందే: రాజన్



**న్యూఢిల్లీ:** దేశ ఆర్థిక వ్యవస్థ ఆందోళనకరంగానే ఉందని రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఆర్బీఐ) మాజీ గవర్నర్ రఘురామ్ రాజన్ అన్నారు. ప్రస్తుత ఆర్థిక మందగమనం భయపడే స్థాయిలోనే ఉందన్న ఆయన కొత్త సంస్కరణల అవసరం చాలా ఉందని అభిప్రాయపడ్డారు. ముఖ్యంగా విద్యుత్, బ్యాంకింగేతర ఆర్థిక రంగాల్లో నెలకొన్న సమస్యలను కేంద్ర ప్రభుత్వం వెంటనే పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రైవేట్ రంగ పెట్టుబడులను ఆకర్షించేలా ప్రభుత్వ నిర్ణయాలు ఉండాలని సీఎన్‌బీసీ టీవీ18కు ఇచ్చిన ఇంటర్వ్యూలో సూచించారు. 'ప్రస్తుతం అన్ని రంగాల్లో మందగమనం కనిపిస్తున్నది. ఈ పరిస్థితులు మారాలంటే ఉద్దీపనలు అవసరం' అని అన్నారు. అలాగే పడకేసిన జీడీపీని పరుగులు పెట్టించాలంటే మళ్లీ కొత్తగా సంస్కరణల బాట పట్టాల్సిందేనన్న ఆయన అంతర్జాతీయ మార్కెట్లలో రుణ సమీకరణ సంస్కరణ కాదని, అదొక వ్యూహాత్మక చర్య మాత్రమేనని పేర్కొన్నారు. ఇదిలావుంటే దేశ జీడీపీని 2011-12 ఆర్థిక సంవత్సరం నుంచి 2016-17 ఆర్థిక సంవత్సరం మధ్య 2.5 శాతం ఎక్కువగా అంచనా వేశారని మాజీ ముఖ్య ఆర్థిక సలహాదారు అర్వింద్ సుబ్రమణ్యన్ చేసిన ఆరోపణలపైనా రాజన్ ఈ సందర్భంగా స్పందించారు. 'జీడీపీ గణాంకాలపై నెలకొన్న అనుమానాలను నివృత్తి చేసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. కొంతకాలం ఓ స్వతంత్ర నిపుణుల బృందం చేత వృద్ధిరేటును లెక్కిస్తే బాగుంటుందన్నది నా అభిప్రాయం. తప్పుడు జీడీపీ గణాంకాలతో ఎప్పటికైనా ఇబ్బందే. దానివల్ల విధానపరమైన నిర్ణయాల్లో సమస్యలు తలెత్తుతాయి' అన్నారు. ఇక 2008 నాటి ఆర్థిక మాంద్యం మళ్లీ రాబోతున్నదా? అన్న ప్రశ్నకు రాజన్ బదులిస్తూ 'ఎలాంటి ఉపద్రవం ముంచుకొస్తుంది అన్నది నాకు తెలియదు. అయితే అప్పటి పరిస్థితులకు, ఇప్పటి పరిస్థితులకు చాలా తేడా ఉంది' అన్నారు. ముఖ్యంగా పరపతిలో వ్యత్యాసం ఉందని, బ్యాంకులు ఇప్పుడు చాలా బలంగా ఉన్నాయని చెప్పారు. 2013 నుంచి 2016 వరకు ఆర్బీఐ గవర్నర్‌గా పనిచేసిన రాజన్.. రెండో విడుత ఆ పదవిలో ఉండేందుకు నిరాకరించిన విషయం తెలిసిందే.

# 6 నెలల కనిష్ఠానికి..




### 29 పైసలు నష్టపోయి 71.43కి పడిపోయిన రూపాయి

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** ఆర్థిక మాంద్యం ఒకవైపు, విదేశీ పెట్టుబడిదారుల నిధుల ఉపసంహరణ మరోవైపు రూపాయిని అతలాకుతలం చేశాయి. డాలర్‌తో పోలిస్తే రూపాయి మారకం విలువ సోమవారం ఒకేరోజు 29 పైసలు పడిపోయి రూ.71.43కి జారుకున్నది. గడిచిన ఆరు నెలల్లో ఇదే కనిష్ఠ స్థాయి రూపాయికి. అంతర్జాతీయ మార్కెట్లో క్రూడాయిల్ ధరలు భగ్గుమనడం, అమెరికా కరెన్సీకి అనూహ్యంగా మద్దతు లభించడంతో దేశీయ మారకానికి మరిన్ని చిల్లులు పడటానికి పరోక్షంగా కారణమయ్యాయి. పతనం దిశగా పరిగెడుతున్న దేశ ఆర్థిక వ్యవస్థను తిరిగి పుంజుకోవడానికి కేంద్ర ప్రభుత్వం తీసుకునే చర్యలకోసం వేచిచూస్తున్నారని ఫారెక్స్ ట్రేడర్ వెల్లడించారు. 71.48 వద్ద నష్టాలతో ప్రారంభమైన రూపాయి విలువ..చివరకు 29 పైసల నష్టంతో 71.43 వద్ద స్థిరపడింది. ఫిబ్రవరి 7న ముగిసిన 71.45 తర్వాత కరెన్సీకి ఇదే కనిష్ఠ స్థాయి. గత శుక్రవారం రూ.71.14 వద్ద ముగిసిన విషయం తెలిసిందే. ఆసియా కరెన్సీలలో రూపాయి అత్యధికంగా పతనం చెందిందని, గత రెండు సెషన్లలో బ్రెంట్ క్రూడాయిల్ స్వల్పంగా పెరుగడం కూడా ఆందోళనను మరింత పెంచిందని హెచ్‌డీఎఫ్‌సీ సెక్యూరిటీస్ హెడ్ వీకే శర్మ తెలిపారు. ఇతర కరెన్సీలతో పోలిస్తే అమెరికా డాలర్ విలువ రెండు వారాల గరిష్ఠ స్థాయికి చేరుకున్నది. త్వరలో రూపాయి విలువ 72.40 స్థాయికి పడిపోయే అవకాశాలున్నాయని ఆయన పేర్కొన్నారు. మరోవైపు ఫ్యూచర్ మార్కెట్లో బ్రెంట్ క్రూడాయిల్ బ్యారెల్ ధర 0.85 శాతం పెరిగి 59.14 డాలర్ల వద్ద ముగిసింది. ఈక్విటీ మార్కెట్ల నుంచి విదేశీ సంస్థాగత పెట్టుబడిదారులు తమ ఇన్వెస్ట్‌మెంట్ల ఉపసంహరణ కొనసాగుతుండటంతో మార్కెట్లో సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. సోమవారం కూడా రూ.305.74 కోట్ల నిధులను వెనక్కితీసుకున్నారు.

# కార్పొరేట్లకు భారీ ఊరట!

- రూ.400 కోట్లకు పైగా టర్నోవర్ కలిగిన సంస్థలపై పన్ను 25 శాతానికి దశలవారీగా తగ్గిస్తాం..
- కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్

**న్యూఢిల్లీ, ఆగస్టు 19:**

ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికిగాను ప్రవేశపెట్టిన సార్వత్రిక బడ్జెట్‌లో సంపన్న వర్గాలపై పన్ను వాత పెట్టిన కేంద్ర ప్రభుత్వం..తాజాగా కార్పొరేట్లను మచ్చిక చేసుకోవడానికి దశలవారీగా కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించనున్నట్లు ప్రకటించింది. సంపద సృష్టికర్తలకు మద్దతుగా రూ.400 కోట్లకు పైగా వార్షిక టర్నోవర్ కలిగిన కార్పొరేట్ సంస్థలపై విధిస్తున్న పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గించాలనుకుంటున్నట్లు కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ సోమవారం ప్రకటించారు. గత బడ్జెట్‌లో రూ.400 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన సంస్థలపై పన్నును 30 శాతం నుంచి 25 శాతానికి తగ్గిస్తు నిర్ణయం తీసుకున్న విషయం తెలిసిందే. అంతక్రితం ఏడాది ఆర్థిక మంత్రి హోదాలో అరుణ్ జైట్లీ ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో రూ.250 కోట్ల లోపు టర్నోవర్ కలిగిన సంస్థలపై విధిస్తున్న కార్పొరేట్ ట్యాక్స్‌ను 25 శాతానికి తగ్గించారు. తాజాగా ఢిల్లీలో పారిశ్రామిక వర్గాలు ఏర్పాటు చేసిన సమావేశంలో నిర్మలా సీతారామన్ మాట్లాడుతూ.. సంపద సృష్టికర్తలకు కేంద్ర ప్రభుత్వం ఎల్లప్పుడు చేదోడువాదోడుగా ఉంటుందని, దీంట్లోభాగంగా దశలవారీగా కార్పొరేట్ ట్యాక్స్‌ను తగ్గిస్తామని హామీ ఇచ్చారు. ఎప్పటిలోగా తగ్గించేదానిపై ఆమె స్పష్టమైన సమాధానం ఇవ్వలేదు. సంపద సృష్టికర్తలకు అన్ని రకాలుగా సహాయ సహకారాలు అందిస్తామని స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా ప్రధాని నరేంద్ర మోదీ ప్రకటించిన నాలుగు రోజుల్లోనే నిర్మలా ఈ నిర్ణయం తీసుకోవడం విశేషం.



ఆర్థిక మంత్రికి ప్రత్యక్ష ట్యాక్స్ కోడ్ నివేదిక

**ఆదాయ** పన్ను చట్టానికి ప్రత్యామ్నాయంగా రూపొందించిన నూతన ప్రత్యక్ష పన్నుల కోడ్ రూపొందించడానికి సీబీడీటీ సభ్యుడు అఖిలేష్ రంజన్ నేతృత్వంలో కేంద్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన ప్రత్యేక కమిటీ సోమవారం తన పూర్తి స్థాయి నివేదికను కేంద్ర ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్‌కు సమర్పించారు. ఈ విషయాన్ని నిర్మలా సీతారామన్ ట్విట్టర్ వేదికగా వెల్లడించారు. ఈ నివేదికలోని పూర్తి వివరాలు అంతత్వరగా వెల్లడయ్యే అవకాశాలు లేవు. మే 31నే తన నివేదికను సమర్పించాల్సి ఉండగా, మరో రెండు నెలలపాటు పొడిగించారు. సీబీడీటీ సభ్యుడు అఖిలేష్ రంజన్ నేతృత్వంలోని ఏర్పాటైన ఈ టాస్క్‌ఫోర్స్ కమిటీలో గిరిష్ అహుజా(ప్రముఖ సీఏ), రాజీవ్ మీమాని(ఈవై చైర్మన్, రీజినల్ మేనేజింగ్ పార్ట్‌నర్), ముకేశ్ పాటిల్(ట్యాక్స్ అడ్వకేట్), మన్సి కేడియా(ఐసీఆర్ ఐఈఆర్ కన్సల్టెన్స్), జీసీ శ్రీవాత్సవ(రిటైర్డ్ ఐఆర్‌ఎస్ అధికారి) ఉన్నారు.

## చైనాలో 20 లక్షల ఉద్యోగాలు ఔట్!

### అమెరికా అధ్యక్షుడు ట్రంప్

**వాషింగ్టన్, ఆగస్టు 19:** అతి త్వరలోనే చైనాలో 20 లక్షలకుపైగా ఉద్యోగాలు పోనున్నాయని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ జోస్యం చెప్పారు. అదనపు సుంకాలతోపాటు తన కఠిన విధానాలే ఇందుకు కారణమన్నారు. 'చైనా ఆర్థిక వ్యవస్థ చాలాచాలా పేలవంగా నడుస్తున్నది. తప్పుడు ద్రవ్యవిధానాలతో ఆ దేశం ఇన్నాళ్లూ ప్రయోజనాలను పొందింది. ఇప్పుడు ఉద్యోగాలను కాపాడుకోవడానికి ఆ సొమ్మునే గుమ్మరిస్తున్నది' అని ఆదివారం విలేఖరులతో అన్నారు. కాగా, చైనా అధ్యక్షుడు జిన్‌పింగ్‌తో ఇటీవల మాట్లాడారన్న దానిపై స్పందించేందుకు ట్రంప్ నిరాకరించారు. మరోవైపు హువావీపై నిషేధాన్ని సోమవారం అమెరికా 90 రోజులు వాయిదా వేసింది. తమ దేశ భద్రతకు ముప్పు వాటిల్లేలా హువావీ తీరున్నదంటూ అగ్రరాజ్యం అభ్యంతరం వ్యక్తం చేస్తున్న విషయం తెలిసిందే.

# స్వల్పంగా లాభపడ్డ స్టాక్ మార్కెట్లు



**ముంబై, ఆగస్టు 19:** ప్రారంభంలో భారీగా లాభపడిన స్టాక్ మార్కెట్లు చివరి గంటలో మదుపరులు అమ్మకాలకు మొగ్గుచూపడంతో స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నది. మార్కెట్ ముగిసే సమయానికి సెన్సెక్స్ 52.16 పాయింట్లు లాభపడి 37,402.49 వద్ద ముగియగా, నిఫ్టీ 6.10 పాయింట్ల లాభంతో 11,053.90 వద్ద స్థిరపడింది. దేశ ఆర్థిక వ్యవస్థపై ఆందోళన వ్యక్తంకావడంతో ఫైనాన్షియల్, ఆటో రంగ షేర్లు అమ్మకాలకు గురవడంతో భారీ లాభాలకు బ్రేక్‌పడినట్లు అయింది. ఇంట్రాడేలో 369 పాయింట్లు లాభపడిన సూచీ చివరకు స్వల్ప లాభాలతో సరిపెట్టుకున్నది. గడిచిన మూడు సెషన్లలో సెన్సెక్స్ 444.33 పాయింట్లు లాభపడగా, నిఫ్టీ 128.05 పాయింట్లు చొప్పన పెరిగాయి. సన్‌ఫార్మా, టెక్ మహీంద్రా, యాక్సిస్ బ్యాంక్, ఎల్ అండ్ టీ, రిలయన్స్ ఇండస్ట్రీస్, ఐసీఐసీఐ బ్యాంక్‌లు మూడు శాతం వరకు లాభపడగా, మరోవైపు యెస్ బ్యాంక్, పవర్ గ్రిడ్, ఓఎన్‌జీసీ, ఎస్బీఐ, మహీంద్రా అండ్ మహీంద్రా, హీరో మోటోకార్ప్, టాటా స్టీల్, ఏషియన్ పెయింట్స్, హెచ్‌డీఎఫ్‌సీ బ్యాంకులు 3.46 శాతం వరకు నష్టపోయాయి. రంగాలవారీగా చూస్తే కన్జ్యూమర్ డ్యూరబుల్, క్యాపిటల్ గూడ్స్, ఇండస్ట్రియల్, హెల్త్‌కేర్, ఇంధనం, ఐటీ రంగ షేర్లకు మదుపరుల నుంచి మద్దతు లభించింది. కానీ, ఆయిల్ అండ్ గ్యాస్, ఆటో, మెటల్, ఎఫ్‌ఎంసీజీ షేర్లు మాత్రం నష్టపోయాయి. ముకేశ్ అంబానీకి చెందిన రిలయన్స్ ఇండస్ట్రీస్ అత్యంత విలువైన కంపెనీగా మళ్లీ అవతరించింది. కంపెనీ షేరు ధర భారీగా లాభపడటంతో మార్కెట్ క్యాపిటలైజేషన్ రూ.8,19,073.62 కోట్లకు చేరుకున్నది. తన సమీప ప్రత్యర్థి టీసీఎస్ విలువ రూ.8,11,847.19 కోట్ల కంటే రూ.7,226.43 కోట్లు అధిక విలువ కలిగివున్నది.

## రెపో రేటుకు రుణాలను లింక్ చేయండి

### బ్యాంకులకు సూచించిన ఆర్బీఐ గవర్నర్ శక్తికాంత దాస్

**ముంబై, ఆగస్టు 19:** ప్రధాన బ్యాంకులన్ని తమ రుణాలను రెపో రేటుకు అనుసంధానం చేసుకోవాలని రిజర్వు బ్యాంక్ గవర్నర్ శక్తికాంత దాస్ సూచించారు. ఇప్పటికే డజన్‌కు పైగా బ్యాంకులు తమ రుణాలు, డిపాజిట్లను రెపో రేటుకు అనుసంధానం చేసుకున్నప్పటికీ..మొత్తం బ్యాంకింగ్ వ్యవస్థ ఈ నూతన వ్యవస్థలోకి మారాలని ఆయన సూచించారు. మే నెలలో బ్యాంకింగ్ దిగ్గజం స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా తన రుణాలను, డిపాజిట్లను రెపోతో లింక్ చేయగా, జూలై నుంచి గృహ రుణాలను అనుసంధానం చేసింది. వీటితోపాటు బ్యాంక్ ఆఫ్ బరోడా, యూనియన్ బ్యాంక్, కెనరా బ్యాంక్‌లు లింక్ చేసుకున్నాయని బ్యాంకింగ్ రంగంపై ఇండస్ట్రీ బాడీ ఫిక్కీ ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన ఈ విషయం వెల్లడించారు. బ్యాంకులు తమ రుణాలను రెపో రేటుకు అనుసంధానం చేయడం వల్ల ఆర్థికంగా ఉపయోగం చేకూర్చునున్నదని, ఇది వేగవంతంగా జరుగాల్సిన అవసరం ఉన్నదని ఆయన సూచించారు. మరోవైపు ప్రస్తుతానికి బ్యాంకింగేతర సంస్థల ఆస్తుల నాణ్యతను సమీక్షించాలనుకోవడం లేదని ఆయన స్పష్టంచేశారు. దేశవ్యాప్తంగా ఉన్న 12 వేల నాన్-బ్యాంకింగ్ ఇన్సిట్యూట్‌లలో పలు సంస్థలు తీవ్ర ఆర్థిక ఇబ్బందులను ఎదుర్కొంటున్నాయి.

## అలహాబాద్ బ్యాంక్ సమాలోచనలు



**హైదరాబాద్, ఆగస్టు 19:** ప్రభుత్వ రంగ బ్యాంకింగ్ సంస్థ అలహాబాద్ బ్యాంక్.. రెండు రోజులపాటు శాఖాధిపతుల సమావేశాన్ని నిర్వహించింది. దేశవ్యాప్తంగా జరిగిన ఈ సమావేశాల్లో భాగంగా హైదరాబాద్ జోనల్ ఆఫీసులోనూ సమావేశాలైయ్యాయి. కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ సూచనల మేరకు జాతీయ ప్రాధాన్యతలు, వృద్ధిరేటు పురోగతికి తీసుకోవాల్సిన చర్యలు వంటి అంశాలపై ప్రధానంగా చర్చ జరిగినట్లు బ్యాంక్ తెలియజేసింది.

## ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్..

హైదరాబాద్‌లోని అన్ని ఇండియన్ ఓవర్‌సీస్ బ్యాంక్ (ఐవోబీ) శాఖల్లో సమీక్షా సమావేశాలు జరిగాయి. కేంద్రం నుంచి వచ్చిన మార్గదర్శకాల ప్రకారం రెండు రోజులపాటు జరిగిన ఈ సమాలోచనల్లో వృద్ధికారక చర్యలు, ప్రభుత్వ పథకాల అమలు, వ్యాపార, పారిశ్రామిక రంగాలకు రుణాలు, వ్యవసాయ, విద్య రుణాలకు అవకాశం వంటి వాటిపై ప్రధానంగా చర్చ జరిగినట్లు తెలియజేసింది.

## సీటెట్-2019 దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం

- షెడ్యూల్ జారీచేసిన సీబీఎస్ఈ అధికారులు

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సెంట్రల్ టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్ (సీటెట్)-2019కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ సోమవారం నుంచి ప్రారంభమైంది. ఈ దరఖాస్తులకు సెప్టెంబర్ 18 చివరి తేదీ. ఫీజు చెల్లించేందుకు సెప్టెంబర్ 23 వరకు గడువు విధించారు. దరఖాస్తుల్లో తప్పుల సవరణకు అక్టోబర్ 3 వరకు అవకాశం కల్పించారు. సీటెట్ డిసెంబర్ 8న నిర్వహించనున్నారు. ఉదయం 9.30 నుంచి పేపర్-1, మధ్యాహ్నం 2 నుంచి పేపర్-2 పరీక్షలు జరుగుతాయని, ఆరువారాల్లో ఫలితాలు విడుదలచేయనున్నారు. సోమవారం షెడ్యూల్ విడుదలయింది. జనరల్ క్యాటగిరీ అభ్యర్థులు రూ.700, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ.350, రెండు పేపర్లకూ హాజరయ్యే జనరల్ అభ్యర్థులు రూ.1,200, ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు రూ.600 చెల్లించాలని, పూర్తి వివరాల కోసం www.ctet.nic.in వెబ్‌సైట్‌ను సంప్రదించాలని సూచించారు.

## సైబర్ సెక్యూరిటీపై కలిసి పనిచేద్దాం

- తెలంగాణతో జట్టుకట్టిన ఇజ్రాయెల్ సంస్థ



**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** సైబర్ సెక్యూరిటీ రంగంలో సవాళ్లను పరిష్కరించి, అవకాశాలను అందిపుచ్చుకొనేందుకు తెలంగాణతో ఇజ్రాయెల్ సంస్థ జట్టుకట్టింది. సైబర్ సెక్యూరిటీ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్ పేరుతో రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటుచేసిన సంస్థ ఇజ్రాయెల్‌కు చెందిన సైబర్‌టెక్ సంస్థతో కలిసి సంయుక్తంగా హైదరాబాద్‌లో సోమవారం కీలక సమావేశం నిర్వహించాయి. రాష్ట్ర ఐటీశాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్‌రంజన్, సైబర్‌టెక్ సంస్థ ఎడిటర్ ఇన్ చీఫ్ అమిర్‌రాపపోర్ట్, టీహబ్ సీఈవో రవినారాయణ్, ఇజ్రాయెల్‌కు చెందిన కాబ్‌వెబ్స్ టెక్నాలజీస్ మేనేజింగ్ డైరెక్టర్ ఎరియల్ టలిబీ, మెక్‌బర్ ఉపాధ్యక్షుడు గిల్‌హజాజ్, డిజిటల్ ట్రస్ట్ సొల్యూషన్స్ సీఈవో రామ్మోహన్‌రెడ్డి బొమ్మిరెడ్డి తదితరులు చర్చల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జయేశ్‌రంజన్ మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం సైబర్ సెక్యూరిటీకి అధిక ప్రాధాన్యం ఇస్తూ సెంటర్ ఆఫ్ ఎక్స్‌లెన్స్‌ను ప్రారంభించిందని తెలిపారు. రాబోయే కాలంలో కీలక సమస్యలను పరిష్కరించే దిశగా ఈ ఒప్పందం సాగాలని ఆకాంక్షించారు.

## మైనార్టీలకు ఉచితంగా సివిల్స్ కోచింగ్

ప్రముఖ కోచింగ్ సంస్థల్లో శిక్షణకు 100 మంది ఎంపిక

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్రవ్యాప్తంగా మైనార్టీ అభ్యర్థులకు ఆల్ ఇండియా సివిల్ సర్వీసెస్ పరీక్షలకు ఉచింగా కోచింగ్ ఇవ్వడానికి తెలంగాణ మైనార్టీ సంక్షేమశాఖ ముందుకువచ్చింది. అందుకు సంబంధించి సోమవారం బంజారాహిల్స్‌లో ఏర్పాటుచేసిన ఒక కార్యక్రమంలో సలహాదారు ఏకే ఖాన్ ఆధ్వర్యంలో నిర్వహించిన కౌన్సెలింగ్‌లో 100 మంది మైనార్టీ అభ్యర్థులను ఉచిత కోచింగ్‌కు ఎంపికచేశారు. రాష్ట్రంలోని ప్రముఖ కోచింగ్ సంస్థలు అనలాగ్, బ్రెయిన్‌ట్రీ, ఆర్సీరెడ్డి, విజన్ ఐఏఎస్ సంస్థల్లో కోచింగ్ తీసుకోవడానికి అభ్యర్థులకు అవకాశమిచ్చారు. అందుకయ్యే ఖర్చు మొత్తం ప్రభుత్వం భరిస్తుందని, పైగా స్కాలర్‌షిప్ కూడా అందిస్తామని మైనార్టీ శాఖ అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా ఆ శాఖ డైరెక్టర్ షానవాజ్‌ఖాసీం మాట్లాడుతూ ఐఏఎస్, ఐపీఎస్ కావాలన్న తమ కలలను సాకారం చేసుకోవాలని సూచించారు. తెలంగాణ మైనార్టీ గురుకుల విద్యాసంస్థల సొసైటీ సెక్రటరీ బీ షఫీవుల్లాఖాన్ మాట్లాడుతూ.. మైనార్టీ అభ్యర్థులు ఐఏఎస్, ఐపీఎస్‌లుగా ఎంపికైతే తిరిగి ఆ వర్గం సంక్షేమానికి బాగా పనిచేసే అవకాశం ఉంటుందని అన్నారు.

# బ్రాహ్మణ సంక్షేమానికి భరోసా

### ప్రభుత్వ పథకాలు అందేందుకు బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ఏర్పాటు

**బ్రాహ్మణ సంక్షేమం, ప్రగతి కార్యక్రమాల నిర్వహణకు వెచ్చించిన మొత్తం**

| పథకం పేరు | ఖర్చుచేసిన బడ్జెట్ రూపాయల్లో |
|---|---|
| వివేకానంద ఓవర్సీస్ విద్యా పథకం | 29,83,31,636 |
| వేదపరిషత్‌లకు గ్రాంట్ | 45,50,000 |
| వేద, శాస్త్ర పండితుల పారితోషికం | 8,90,000 |
| వేద విద్యాబోధనకు | 5,71,250 |
| కంచి కామకోటి సంప్రదాయ విద్యాలయం | 6,00,000 |
| రామానుజ విద్యా పథకం | 38,53,243 |
| బెస్ట్ పథకం | 21,56,34,127 |
| బ్రాహణ సదనాల నిర్మాణానికి | 3,27,70,522 |
| టీబీఎస్పీ నిర్వహణకు | 2,24,19,415 |
| ఇతర పథకాల అమలుకు | 95,41,320 |
| వెచ్చించిన మొత్తం | 58,91,61.263 |

- మూడేండ్లలో రూ.58.91 కోట్లు వెచ్చించిన ప్రభుత్వం
- విదేశీ విద్య కోసం ఒకేరోజు రూ.10.80 కోట్లు మంజూరు
- బెస్ట్ పథకంతో పారిశ్రామిక, వ్యాపార వేత్తలకు ప్రోత్సాహం

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** పేదరికంలో మగ్గుతున్న బ్రాహ్మణుల సంక్షేమంపై తెలంగాణ ప్రభుత్వం ప్రత్యేక దృష్టి నిలిపింది. ఆర్థికంగా వెనుకబడిన వీరిని ఉన్నతస్థితికి తెచ్చేందుకు సీఎం కే చంద్రశేఖర్‌రావు దూరదృష్టితో ఏర్పాటుచేసిన తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ (టీబీఎస్పీ) ద్వారా ప్రభుత్వ పథకాలు అందేలా చర్యలు తీసుకొంటున్నారు. 2017 ఏప్రిల్‌లో ఏర్పాటుచేసిన నాటినుంచి ఇప్పటివరకు బ్రాహ్మణుల ప్రగతి కోసం ప్రభుత్వం రూ.58.91 కోట్లు వెచ్చించింది. బ్రాహ్మణుల్లోని పేద కుటుంబాల బాగు కోసం ప్రభుత్వ నిర్దేశించిన లక్ష్యాలకు అనుగుణంగా కేటాయించిన బడ్జెట్‌తో పలు పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను తెలంగాణ బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలుచేస్తున్నారు. టీబీఎస్పీ ద్వారా వివేకానంద విదేశీ విద్యాపథకం, రామానుజ ఫీజు రీయింబర్స్‌మెంట్ పథకం, వేదపాఠశాలలకు ఆర్థిక సాయం, వేద, శాస్త్రపండితులకు గౌరవభృతి, వేద విద్యార్థులకు ఆర్థికసాయం వంటి సంక్షేమ కార్యక్రమాలను అమలుచేస్తున్నది. మరోవైపు రాష్ట్రవ్యాప్తంగా బ్రాహ్మణసదనాల నిర్మాణల పనులు కొనసాగుతున్నాయి. పేద బ్రాహ్మణులకు స్వయం ఉపాధి కల్పించడంతోపాటు వ్యాపార, పారిశ్రామికరంగాల్లో రాణించేలా ఆర్థిక చేయూత పథకాన్ని అమలుచేస్తున్నారు. బెస్ట్ పేరిట ఔత్సాహిక పారిశ్రామిక, వ్యాపారవేత్తలకు ప్రోత్సాహం అందిస్తున్నారు. ఇప్పటివరకు 1500 మందికి పైగా లబ్ధి పొందారు. మూడేండ్లలో రూ.58,91, 61.263 మొత్తాన్ని ఖర్చుచేశారు.

### విద్య, ఉపాధి కల్పనే లక్ష్యం



పేద బ్రాహ్మణులకు ఉద్యోగ, ఉపాధి అవకాశాలు కల్పించడం లక్ష్యంగా బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ కృషి చేస్తున్నది. విద్యార్థులతోపాటు వాణిజ్య, వ్యాపారవేత్తలను ప్రోత్సహించేందుకు వివిధ పథకాలను ప్రవేశపెట్టి విజయవంతంగా అమలుచేస్తున్నాం. చిన్నతరహా కుటీర పరిశ్రమలు నెలకొల్పేందుకు సబ్సిడీ రుణాలు అందిస్తున్నాం. అన్ని జిల్లాలవారికి సమప్రాధాన్యం కల్పిస్తూ సంక్షేమ, ప్రగతి కార్యక్రమాలను అమలుచేస్తున్నాం. ఎంతో ఉన్నతాశయంతో సీఎం కేసీఆర్ ఏర్పాటు చేసిన సంక్షేమ పరిషత్ ద్వారా అర్హులైనవారికి ఆయా పథకాలు అందేలా చర్యలు తీసుకొంటున్నాం

– కేవీ రమణాచారి, చైర్మన్, తెలంగాణ రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్

### ఒకే రోజు 54 మందికి సాయం

బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ ద్వారా అమలుచేస్తున్న వివేకానంద విదేశీవిద్యా పథకం కింద ఒకేరోజు 54 మంది విద్యార్థులకు రూ.10.80 కోట్లు మంజూరుచేశారు. దేశంలో ఎక్కడా లేని విధంగా బ్రాహ్మణ విద్యార్థులు విదేశాల్లో ఉన్నతవిద్యను అభ్యసించేందుకు నిధులు కేటాయించడంపై హర్షం వ్యక్తమవుతున్నది. ఒక్కొక్కరికి రూ.20 లక్షలు మంజూరుచేయడం సాహసోపేత నిర్ణయమని విద్యార్థులు అభిప్రాయపడుతున్నారు.

### ప్రభుత్వం వల్లే ఈ భాగ్యం కలిగింది



వివేకానంద విదేశీవిద్యా పథకం కారణంగానే విదేశాల్లో ఉన్నతవిద్య చదివే భాగ్యం కలిగింది. కాలిఫోర్నియా వర్సిటీలో మెటీరియల్ సైన్స్‌లో ఎమ్మెస్ చదివేందుకు వెళ్తున్నాను. ప్రభుత్వం సహకారం ఎప్పటికీ మరువలేనిది.

– రుచిర, విద్యార్థిని

### పరిషత్ ఏర్పాటుతో సంక్షేమం



బ్రాహ్మణపరిషత్ ఏర్పాటుతోనే నాలాంటి ఎందరికో విదేశాల్లో ఉన్నతవిద్యకు ఆర్థిక సహాయం అందుతున్నది. కెనడాలో ఎంటెక్ ఎలక్ట్రికల్ ఇంజినీరింగ్ కోర్సు చదివేందుకు అవకాశం దక్కింది.

– శ్రీధరాచార్యులు, విద్యార్థి

### సీఎం కేసీఆర్‌కు రుణపడి ఉంటాం



మధ్యతరగతికి చెందిన నాకు క్యాంప్‌బెల్స్ విల్లె యూనివర్సిటీలో ఫార్మాస్యుటికల్ సైన్సెస్‌లో ఎమ్మెస్ చదివే అవకాశం లభించింది. ప్రభుత్వం రూ.20 లక్షలు ఆర్థికసాయం అందించడం చాలా గొప్ప విషయం. సీఎం కేసీఆర్‌కు ఎంతో రుణపడి ఉంటాం.

– కిరీటి, విద్యార్థి

### ఎంతో ఆనందంగా ఉంది



వివేకానంద విదేశీవిద్యా పథకం ద్వారా రూ.20 లక్షల సాయం అందించడం ఆనందంగా ఉన్నది. ఐటీలో ఎమ్మెస్ చదివేందుకు ఆస్ట్రేలియా వెళ్తున్నా. ప్రభుత్వ సహాయం వల్లనే కల సాకారమవుతున్నది. నాలాంటి అమ్మాయిలకు ఈ పథకం ఎంతో ఉపకరిస్తుంది.

– వైష్ణవి, విద్యార్థిని

# దస్తావేజుల డిజిటలైజేషన్

- రూ.20 కోట్లు విడుదల చేసిన ప్రభుత్వం
- వంద సంవత్సరాల పత్రాలకు మోక్షం
- ట్యాంపరింగ్ మోసాలకు చెక్
- టెండర్లను ఆహ్వానించిన టీఎస్‌టీఎస్

**ప్రత్యేకప్రతినిధి, నమస్తే తెలంగాణ:** వంద సంవత్సరాలకుపైగా దుమ్ముపట్టి చిరిగిపోతున్న స్థిరాస్తులకు సంబంధించిన దస్తావేజులకు ఎట్టకేలకు మోక్షం లభించనున్నది. రిజిస్ట్రేషన శాఖలో 1860 నుంచి 1999 వరకు మాన్యువల్‌గా (చేతిరాత) ఉన్న స్థిరాస్తుల దస్తావేజులను డిజిటలైజ్ చేయడానికి రాష్ట్ర ప్రభుత్వం రూ.20 కోట్లు విడుదల చేసింది. స్టాంపులు, రిజిస్ట్రేషన్లశాఖ రికార్డుల డిజిటలైజేషన్ బాధ్యతను తెలంగాణ స్టేట్ టెక్నాలజీ సర్వీసెస్‌కు అప్పగించగా, టెండర్లను ఆహ్వానించింది. వాస్తవానికి బ్రిటీష్ కాలం1860 నుంచి స్థిరాస్తులకు సంబంధించి దస్తావేజుల రిజిస్ట్రేషన్ ప్రక్రియ అధికారికంగా జరుగుతున్నది. చేతిరాత ద్వారా దస్తావేజులను తయారుచేసి రిజిస్ట్రేషన్‌చేసేవారు. రెండు కాపీలను అమ్మకందారులకు, కొనుగోలుదారులకు ఇచ్చి మరోకాపీని రికార్డులలో భద్రపరిచేవారు. ఈ ప్రక్రియ 1999 వరకు కొనసాగింది. అదే సంవత్సరం ప్రభుత్వ శాఖల్లో మొదట రిజిస్ట్రేషన్‌శాఖలోనే కంప్యూటరీకరణ మొదలైంది. అప్పటి నుంచి రిజిస్ట్రేషన్‌శాఖను కంప్యూటర్ ఎయిడెడ్ రిజిస్ట్రేషన్ డిపార్ట్‌మెంట్ (కార్డ్)గా కూడా వ్యవహరిస్తున్నారు. అంతకుపూర్వం 139 సంవత్సరాల నుంచి ఉన్న మాన్యువల్ దస్తావేజులను గత ప్రభుత్వాలు నిర్లక్ష్యంచేశాయి. లక్షల్లో ఉన్న పాత దస్తావేజులు బూజుపట్టి , శిథిలమై దీనావస్థకు చేరాయి. చేతిరాతతో ఉన్న కొన్ని ట్యాంపరింగ్ అవుతున్నాయని తరుచూ ఆరోపణలు వచ్చాయి. కొన్ని రికార్డులు గల్లంతైన సందర్భాలూ ఉన్నాయి. ఈ క్రమంలో 2005లో ప్రయోగాత్మకంగా హైదరాబాద్ జిల్లా రిజిస్ట్రేషన్ కార్యాలయంలో అప్పటి జిల్లా రిజిస్ట్రార్, ప్రస్తుత జాయింట్ కమిషనర్ వేముల శ్రీనివాసులు ఆధ్వర్యంలో రికార్డుల డిజిటలైజేషన్ జరిగింది. సుమారు ఆరువేల రికార్డులను డిజిటలైజ్ చేశారు. ఈ తర్వాత రాష్ట్రంలోని అన్ని కార్యాలయాల్లో రికార్డులను డిజిటలైజ్ చేయాలనే ప్రతిపాదన వచ్చినప్పటికీ ప్రభుత్వాలు పట్టించుకోలేదు. తెలంగాణ ప్రభుత్వం ఇటీవల డిజిటలైజేషన్ కోసం 20 కోట్లు మంజూరు చేసింది. దీనిపై ప్రస్తుత కమిషనర్ తోగర్ల చిరంజీవులు కసరత్తు జరిపి డిజిటలైజేషన్ బాధ్యతను టీఎస్‌టీఎస్‌కు అప్పగించారు. మరో రెండురోజుల్లో టెండర్ ప్రక్రియ పూర్తవుతుందని సమాచారం.

### చేరికలతో సిద్ధాంతాలకు ఇబ్బంది లేదు: లక్ష్మణ్

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** తెలంగాణలో పెద్దసంఖ్యలో నాయకులు తమ పార్టీలో చేరానని, కొత్తవారి చేరికలతో పార్టీ సిద్ధాంతాలకు వచ్చిన ఇబ్బందేమీ లేదని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణ్ పేర్కొన్నారు. పార్టీ రాష్ట్ర కార్యాలయంలో శనివారం ఆయన మీడియాతో ఇష్టాగోష్టిలో మాట్లాడుతూ.. తెలంగాణలో తాము చరిత్ర సృష్టించబోతున్నామని ప్రకటించారు.

### టీడీపీకి మాజీ మంత్రి ఆదినారాయణరెడ్డి గుడ్‌బై!

**అమరావతి:** ఆంధ్రప్రదేశ్‌లో తెలుగుదేశం పార్టీకి మరో పెద్దదెబ్బ తగిలింది. మాజీ మంత్రి, ఆ పార్టీ సీనియర్ నేత ఆదినారాయణరెడ్డి త్వరలో బీజేపీలో చేరే అవకాశాలు కనిపిస్తున్నాయి.

## కేంద్ర ప్రణాళికాసంఘం మాజీ సభ్యుడితో వినోద్‌కుమార్ భేటీ

- అర్థికపరమైన అంశాలపై చర్చ

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన బీ వినోద్‌కుమార్ సోమవారం బేగంపేట్‌లోని సెస్ కార్యాలయంలో కేంద్ర ప్రణాళికాసంఘం మాజీసభ్యుడు చెన్నమనేని హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిశారు. అత్యుత్తమైన ఆర్థికవిధానాలు, ప్రణాళికలు, వాటి రూపకల్పనలో తీసుకోవాల్సిన మెళకువలు గురించి చర్చించారు.



కేంద్రప్రణాళికాసంఘం మాజీ సభ్యుడు చెన్నమనేని హన్మంతరావును మర్యాదపూర్వకంగా కలిసిన వినోద్‌కుమార్

**వినోద్‌కుమార్‌కు అభినందనల వెల్లువ**

ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడిగా నియమితులైన వినోద్‌కుమార్‌ను కూకట్‌పల్లిలోని ఆయన నివాసంలో ఎంపీ రంజిత్‌రెడ్డి, ఎమ్మెల్యేలు సంజయ్, గణేశ్‌గుప్తా, మర్రి జనార్దన్‌రెడ్డి, ఎమ్మెల్సీలు శ్రీనివాస్‌రెడ్డి, పురాణం సతీ శ్, కర్నె ప్రభాకర్, మాజీ ఎంపీ మంద జగన్నాథం, సివిల్ సప్లయ్ కార్పొరేషన్ చైర్మన్ మారెడ్డిశ్రీనివాస్‌రెడ్డి, టెస్కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావు, జగిత్యాల జెడ్పీ చైర్మన్ వసంత, వరంగల్ మేయర్ గుండాప్రకాశ్, గట్టు రాంచందర్ రావు తదితరులు అభినందించారు.

# వెయ్యి వ్యాఖ్యలపెట్టు ఒక్కఫొటో

- అంతర్జాతీయ ఫొటోగ్రఫీ డే వేడుకలో మంత్రి శ్రీనివాస్‌గౌడ్
- తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఫొటోగ్రాఫర్లకు అవార్డుల ప్రదానం

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ఒక్కఫొటో వెయ్యి వ్యాఖ్యల పెట్టు అని, ఒక్కచిత్రం అక్కడి స్థితిగతులను, ఇతివృత్తాన్ని ఆవిష్కరిస్తుందని ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్ చెప్పారు. ఒక్క ఫొటోకు ఎంతోశక్తి ఉందని, గంటసేపు చదివే సమాచారాన్ని ఒక్కఫొటో సెకనులో చెప్తుందని అన్నారు. రాష్ట్ర భాషా సాంస్కృతికశాఖ, తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ సంయుక్త ఆధ్వర్యంలో సోమవారం హైదరాబాద్‌లోని రవీంద్రభారతిలో అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఫొటో ప్రదర్శన వీక్షకులను ఎంతగానో ఆకట్టుకున్నది. ఈ సందర్భంగా మంత్రి శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ.. ఉద్యమకాలంలోనే ఫొటో జర్నలిస్టుల సంఘం ఏర్పడిందని గుర్తుచేశారు. ఫొటో జర్నలిస్టులూ.. జర్నలిస్టులేనని, జర్నలిస్టుల మాదిరిగానే వీరిని మరింత ముందుకు తీసుకురావాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉన్నదని అన్నారు. ఫొటో జర్నలిస్టులకు సైతం మంచి రోజులు వస్తాయని, అన్ని రకాలుగా ప్రభుత్వం వారికి సహాయ సహకారాలు అందిస్తున్నదని చెప్పారు.

**కేసీఆర్ చేసిన దీక్ష, స్థితిగతులను ఒక్కఫొటో ఆవిష్కరించింది: అల్లం నారాయణ**

ఫొటోలంటే చిహ్నాలు, గత స్మృతుల గుర్తులని, వార్తా స్రవంతిలో ఫొటోల ప్రభావం చాలా ఎక్కువగా ఉంటుందని మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ చెప్పారు. ఎన్ని రాతలు రాసినా కన్పించని ప్రభావం ఒక్కఫొటో చెప్తుందని అన్నారు. తెలంగాణ ఉద్యమంలో భాగంగా నిమ్స్‌కు వచ్చిన తర్వాత కేసీఆర్ చేసిన దీక్ష, స్థితిగతులను నాడు ఒక్క ఫొటో ఆవిష్కరించిందన్నారు. మంటల్లో కాలిపోతూ శ్రీకాంతాచారి చేసిన జై తెలంగాణ నినాదాలను, అతని ఉద్వేగాన్ని ఒక్కఫొటో చాటి చెప్పిందని గుర్తుచేశారు. హిరోషిమా- నాగసాకి, భోపాల్ గ్యాస్ దుర్ఘటన, సునామీ తదతర విధ్వంసాలను ఆవిష్కరించింది ఒక్కఫొటో అని అన్నారు. జర్నలిస్టులకు వర్తించే అన్ని గుర్తింపులు, సంక్షేమ ఫలాలు, సదుపాయాలు, సౌకర్యాలు ఫొటో జర్నలిస్టులకు సైతం వర్తిస్తాయన్నారు. ఫొటో జర్నలిస్టులను ఆదరించి, తమ ఉన్నతిని కాంక్షిస్తున్న రాష్ట్ర ప్రభుత్వం, సీఎం కేసీఆర్, మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, భాషా సాంస్కృతిక శాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణకు తెలంగాణ ఫొటో జర్నలిస్టుల అసోసియేషన్ అధ్యక్షుడు భాస్కర్ కృతజ్ఞతలు తెలిపారు. భాషా సాంస్కృతికశాఖ సంచాలకుడు మామిడి హరికృష్ణ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో రాష్ట్ర కార్యవర్గసభ్యులు జీ చిన్న యాదగిరిగౌడ్ తదితరులు పాల్గొన్నారు. తొలుత నిర్వహించిన సాంస్కృతిక కార్యక్రమాలు వీక్షకులను ఆకట్టుకున్నాయి. కుమారి అక్షర రాథోడ్ చేసిన కూచిపూడి నృత్యరూపకం మంత్రముగ్ధులను చేసింది.



ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ, టీపీజేఏ అధ్యక్షుడు భాస్కర్ తదితరులు

### విజేతలకు బహుమతుల ప్రదానం

తెలంగాణ ఫొటో జర్నలిస్ట్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో తెలంగాణ ప్రభుత్వం - పర్యాటక, భాషా సాంస్కృతికశాఖ సౌజన్యంతో నిర్వహించిన రాష్ట్రస్థాయి ఫొటోగ్రఫీ పోటీల్లో గెలుపొందినవారికి మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మీడియా అకాడమీ చైర్మన్ అల్లం నారాయణ అవార్డులను ప్రదానంచేశారు.

**క్యాటగిరీ - 1 (బెస్ట్ పిక్చర్):**
**మొదటి బహుమతి:** కుంట్ల శ్రీనివాస్ (ఈనాడు), హైదరాబాద్ - పండుగలు
**ద్వితీయ బహుమతి:** దేవేంద్రనాథ్ (సాక్షి) హైదరాబాద్ - న్యూస్ పిక్చర్
**తృతీయ బహుమతి:** జీ వినోద్ (నమస్తే తెలంగాణ) వనపర్తి - పల్లె అందాలు
**న్యూస్ పిక్చర్స్ - కన్సోలేషన్:**
బందిగె గోపి (నమస్తే తెలంగాణ) మహబూబ్‌నగర్
**క్యాటగిరీ - 2 (బెస్ట్ పిక్చర్):**
**మొదటి బహుమతి:** ఆర్‌ఆకాశ్ (నమస్తే తెలంగాణ), నల్లగొండ - సంక్షేమ పథకాలు
**క్యాటగిరీ - 3 (బెస్ట్ పిక్చర్):**
**మొదటి బహుమతి:** గొట్టె వెంకన్న (నమస్తే తెలంగాణ), వరంగల్ అర్బన్ - చారిత్రక కట్టడాలు
జీ శ్రీనివాస్ (నమస్తే తెలంగాణ) హైదరాబాద్ - కళలు




బషీర్‌బాగ్ ప్రెస్‌క్లబ్‌లో ఫొటో ప్రదర్శనను తిలకిస్తున్న విద్యాశాఖ కార్యదర్శి జనార్దన్‌రెడ్డి. చిత్రంలో ఐజేయూ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, కే శ్రీనివాస్‌రెడ్డి, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విరాహత్‌అలీ, కే సత్యనారాయణ, టీపీజేఎస్ అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్ తదితరులు ఉన్నారు

## దేశోద్ధారకభవన్‌లో ఫొటో ప్రదర్శన

- ప్రారంభించిన విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి

**హైదరాబాద్ సిటీబ్యూరో, నమస్తే తెలంగాణ:** ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా సోమవారం తెలంగాణ ఫొటో జర్నలిస్టుల సంఘం ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని దేశోద్ధారకభవన్‌లో ఫొటో ప్రదర్శనను ఏర్పాటుచేశారు. రాష్ట్రవ్యాప్తంగా గుర్తింపుపొందిన వందలాది ఫొటోలను ఈ ప్రదర్శనలో ఉంచారు. విద్యాశాఖ కార్యదర్శి బీ జనార్దన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా విచ్చేసి ప్రదర్శనను ప్రారంభించారు. అనంతరం ఫొటో జర్నలిస్టులను ఉద్దేశించి ఆయన మాట్లాడారు. అంతర్జాతీయ ఫొటోగ్రఫీ దినోత్సవం సందర్భంగా ప్రతి ఫొటో జర్నలిస్టుకు శుభాకాంక్షలు అని తెలిపారు. కార్యక్రమంలో ఐజేయూ అధ్యక్షుడు దేవులపల్లి అమర్, సభ్యులు కల్లూరి సత్యనారాయణ, టీయూడబ్ల్యూజే రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కే విరాహత్ అలీ, ఐజేయూ సీనియర్ సభ్యుడు కే శ్రీనివాస్‌రెడ్డి, సీనియర్ జర్నలిస్టు వర్కాల యాదగిరి, టీపీజేఎస్ అధ్యక్షుడు అనుమల్ల గంగాధర్, ప్రధాన కార్యదర్శి కేఎన్ హరి, విద్యాసాగర్ తదితరులు పాల్గొన్నారు.

నమస్తే తెలంగాణ
# జిందగీ
మంగళవారం 20 ఆగస్టు 2019 WWW. NTNEWS.COM /nt.zindagi



'చలపతి గారు.. మీ అబ్బాయి చదువు ఎలా సాగుతున్నది?'
'రాఘవయ్య గారు మీకు పాస్ పుస్తకం వచ్చింది కదా?'
'అమ్మా.. సైదమ్మా పింఛన్ అందుతున్నదా?'
'సర్పంచ్ గారు.. మన ఊళ్లో అందరికీ వంద శాతం మరుగుదొడ్లు పూర్తయ్యాయి కదా?!'
..అంటూ పేరు పేరున ఆత్మీయ పలకరింపు. వాత్సల్య కరచాలన స్పర్శ. బాధితులకు నేనున్నానంటూ భుజం తట్టే భరోసా. మరోవైపు విధుల్లో నిర్లక్ష్యం చూపే జిల్లా ఉద్యోగులకు ఆయనో ఛండశాసనుడు. 'ఏంటీ ఈ చెత్త' అంటూ పార, పారక తెప్పించి తానే స్వయంగా శుభ్రం చేసే.. స్వచ్ఛమైన మనసున్న వ్యక్తి. తాను పనిచేసే జిల్లాల్లో నిత్యం సృజనాత్మక కార్యక్రమాలు చేపట్టి.. సమస్య ఏదైనా అక్కడికక్కడే పరిష్కారం చూపి, సంగారెడ్డి జిల్లాను సర్వతోముఖాభివృద్ధి దిశగా తీసుకెళ్తున్నారు కలెక్టర్ హనుమంతరావు. కేంద్రప్రభుత్వం అందించే 'పోషణ్ అభియాన్' అవార్డును తెలంగాణ తరపున ఆయన అందుకోబోతున్నారు. ఈ సందర్భంగా 'జిందగీ' ఆయనను పలుకరించింది.

# సంస్కరణల కలెక్టర్!

ఓ సామాన్యుడు జిల్లా కలెక్టర్‌తో మాట్లాడాలంటే గతంలో వారం రోజులు పట్టేది. కోరి తెచ్చుకున్న తెలంగాణలో ఇప్పుడా పరిస్థితి లేదు. కారణం.. మంత్రిప్రగడ హనుమంతరావు లాంటి కలెక్టర్లు ప్రతి జిల్లాలోనూ ఉన్నారు. బాధితుల పక్షాన నిలబడుతూ జనరంజక పాలన అందిస్తున్నారు. సంగారెడ్డి జిల్లా పరిపాలనా ఉన్నతాధికారిగా కొత్త పథకాలు, కార్యక్రమాలు చేపడుతూ ప్రజారంజక పాలన అందిస్తున్నారు మంత్రిప్రగడ హనుమంతరావు. ఆయన చేస్తున్న సంస్కరణలు, వినూత్న కార్యక్రమాలను ఇతర జిల్లాలలో కూడా వేర్వేరు పేర్లతో అమలు చేస్తుండడం విశేషం.



**ఉద్యమంలా 'హరిత దత్తత':** సంగారెడ్డి పరిశ్రమలకు కేంద్రంగా ఉన్నది. దీంతో మన ముఖ్యమంత్రి చేపట్టిన 'హరిత హారం'ను అత్యంత సమర్థవంతంగా ఇక్కడ నిర్వహిస్తున్నారు. 'గ్రీన్ క్లబ్'ను ఏర్పాటు చేసి అందులో పరిశ్రమల యాజమానులను సభ్యులుగా చేర్చారు. వారి సౌజన్యంతో 'హరిత దత్తత' చేపట్టారు. ఇందులో భాగంగా 40 పరిశ్రమల యజమానులు రూ.3 కోట్ల విలువైన రెండు లక్షల ట్రీ గార్డులు, వాటికి అవసరమైన సరంజామాను అందించారు. రోడ్డు కిరువైపులా ఎవెన్యూ ప్లాంటేషన్ కోసం ఈ కార్యక్రమం ఉద్యమంలా సాగుతున్నది. ప్రతి మండలంలో జిల్లా స్థాయి అధికారిని దీనికి పర్యవేక్షణ, నిర్వహణ బాధ్యతలను అప్పజెప్పారు. రెండు కిలోమీటర్ల వరకు 400 మొక్కలను నాటుతున్నారు.







జిల్లా పాలన పగ్గాలు చేపట్టిన వెంటనే గ్రామాల్లో రెవెన్యూ సమస్యలు అనేకం ఉన్నాయనే విషయాన్ని గమనించారు హనుమంతరావు. ఇందుకు పరిష్కారంగా **'భూ వాణి'**ని ప్రవేశపెట్టారు. జిల్లాలోని రెవెన్యూ, ఫారెస్ట్, ఇరిగేషన్ భూ సంబంధిత అధికారులందరినీ ఇందులో భాగస్వామ్యం చేశారు. ప్రతి నెల ఒక మండల కేంద్రంలో 'భూ వాణి' నిర్వహిస్తున్నారు. తద్వారా అప్పటికప్పుడు రైతుల సమస్యలను పరిష్కరించారు. సమస్య చెప్పుకోవడానికి వచ్చే వారికి నీడ, భోజన, నీటి వసతులు కల్పిస్తారు. అన్నం పెట్టి తమ సమస్యలను పరిష్కరించిన ఈ కలెక్టర్ సారు సేవలు మర్చిపోలేమని బాధిత రైతులంటున్నారు. 26 మండలాల్లో దీనిని విజయవంతంగా పూర్తి చేశారు. ఈ కార్యక్రమంలో వీఆర్‌ఓల అక్రమాలు వెలుగులోకి రావడంతో వారిని సస్పెండ్ చేశారు.

### ప్రజల చెంతకే 'ప్రజావాణి'

సంగారెడ్డి జిల్లాలో ప్రతీ సోమవారం 'ప్రజావాణి' నిర్వహిస్తున్నారు. జిల్లా కేంద్రంతో పాటు ప్రతీ మండల కేంద్రంలోనూ ప్రతి సోమవారం కలెక్టర్ అధ్యక్షతన ప్రజావాణి జరుగుతున్నది. దీనికి అన్ని విభాగాల ఉన్నతాధికారులు రావాల్సి ఉంటుంది. దీంతో జిల్లా నలుమూలల నుంచి వ్యయ ప్రయాసలకోర్చే బాధితులకు ఉపశమనం దొరికింది. జిల్లాలోని అన్ని మండలాల్లో విజయవంతంగా నిర్వహిస్తున్నారు.

### అభివృద్ధి కోసం 'తండా బాట'

సంగారెడ్డి జిల్లాలో విసిరేసినట్లుగా ఉండే 75 మారుమూల తండాల అభివృద్ధిపై కలెక్టర్ హనుమంతరావు దృష్టి సారించారు. ఒక్కో తండాలో రెండు రోజులు కలెక్టర్‌తో సహా అన్ని విభాగాల అధికారులు పర్యటిస్తారు. తాగునీటి సమస్య మొదలుకొని అన్నింటినీ దగ్గరుండి పరిష్కరించనున్నారు. తండా బాటను ఈ నెల 27న కంది మండలం, ఎర్ద్నమూర్ తండా నుంచి ప్రారంభించనున్నారు.

### ఫోకస్.. రూట్స్.. మేము సైతం

చదువుతోనే సమాజ అభివృద్ధి సాధ్యమని నమ్మిన వ్యక్తి కలెక్టర్ హనుమంతరావు. అందుకే విద్యాశాఖలోనూ సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. పదో తరగతి విద్యార్థులు 10 జీపీఏ సాధించడానికి ఫోకస్, రూట్స్, నేను సైతం కార్యక్రమాలు ప్రవేశపెట్టారు. ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రతిభా ప్రవేశ పరీక్ష నిర్వహించి, ఎంపికైన 100 మందికి జిల్లా సైన్స్ కేంద్రంలో రెసిడెన్సియల్ పద్ధతిలో శిక్షణ ఇప్పిస్తున్నారు. పదో తరగతిలో నూరు శాతం ఫలితాల సాధనకు 'రూట్స్' కార్యక్రమం ద్వారా శిక్షణ కొనసాగుతున్నది. ఉపాధ్యాయుల కొరత ఉన్న పాఠశాలల్లో 'మేము సైతం' కార్యక్రమం ద్వారా రిటైర్డ్ ఉపాధ్యాయులు, అధ్యాపకులను వలంటీర్లుగా కొనసాగిస్తున్నారు. గతంలో పదవ తరగతి ఫలితాల్లో రాష్ట్రంలో 11వ స్థానంలో ఉన్న జిల్లాను.. గతేడాది 4వ స్థానానికి తీసుకొచ్చారు.

### గ్రామాల్లో 'ఆరోగ్య వేదిక'లు

గ్రామాల్లోకి వైద్యాన్ని తీసుకెళ్లేందుకు 'గ్రామ ఆరోగ్య వేదిక'లను హనుమంతరావు ప్రారంభించారు. దీని ద్వారా గ్రామాల్లో ప్రజల ఆరోగ్యం, పరిశుభ్రతలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారులు, సిబ్బందితో అవగాహన కల్పించడం, ఆరోగ్య శిబిరాలు నిర్వహిస్తున్నారు. ఈ వేదికల ద్వారా చికిత్సలు చేసి, మందుల పంపిణీ చేస్తున్నారు. ఝరాసంగం మండలంలో నర్సాపూర్, బెదులువాడి గ్రామాలను పైలెట్ ప్రాజెక్ట్‌గా ఎంపిక చేసి, విజయవంతంగా నిర్వహించారు. వారానికి 3 గ్రామాల్లో ఈ శిబిరాలు నిర్వహిస్తున్నారు.

### శుక్రవారం 'శ్రమదానం'

నివసించే ఇల్లువలే.. ప్రభుత్వ కార్యాలయాలు కూడా శుభ్రంగా ఉండాలనే ఉద్దేశంతో ప్రతి శుక్రవారం 'శ్రమదానం' కార్యక్రమాన్ని చేపట్టారు హనుమంతరావు. ఉదయం 8.30 నుంచి 10.30 వరకు జిల్లాలోని అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో వలంటీర్లుగా అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది పరిశుభ్రతకు నడుం బిగించాలి. దీనికి మున్సిపల్ పరిధిలోని ప్రతి వార్డుకు ఒక జిల్లా అధికారిని నియమించారు.

### పేదల కోసం 'సహాయం'

సంగారెడ్డిలో ప్రభుత్వ అధికారుల వేతనాల్లోంచి కొంత నిధిని 'సహాయం' పేరిట పేదల కోసం ఖర్చు చేస్తున్నారు కలెక్టర్ హనుమంతరావు. ఈయన సిద్దిపేట ఆర్‌డీఓగా ఉన్నప్పుడు 'సహాయం' అనే కార్యక్రమాన్ని రూపొందించారు. అలా వచ్చిన డబ్బుతో ఓ నిరుపేదకు ఇల్లు కట్టించి ఇచ్చారు. 'సహాయం' ద్వారా చాలామందికి ఆర్థికంగా తోడ్పాటు అందిస్తున్నారు. గ్రామాల్లో యువత కోసం త్వరలోనే మంచి కార్యక్రమాలు రూపొందిస్తున్నారు.

### కలెక్టర్ హనుమంతరావు ప్రొఫైల్

సూర్యాపేట జిల్లా బేతవోలు గ్రామానికి చెందిన హనుమంతరావు తల్లిదండ్రులు శంకర్‌రావు, ప్రమీల. ఆయనకు రమేష్, జగదీష్, శ్రీనివాసరావు సోదరులు. పద్మ, విజయలక్ష్మి సోదరీమణులు. తాత రాజగోపాలరావు నిజాం వ్యతిరేక ఉద్యమంలో రైతుల పక్షాన పాల్గొని మరణించారు. నాన్న శంకర్‌రావు ఉపాధ్యాయుడిగా చేస్తూనే పశువులకు ఉచితంగా వైద్య సేవలందించేవారు. హనుమంతరావును కలెక్టర్‌గా చూడకుండానే 2007లో అనారోగ్యంతో మరణించారు. హనుమంతరావుకు 2001లో నల్లగొండకు చెందిన స్రవంతితో వివాహం జరిగింది. వీరికి సాయి హర్షిణి, సాయి ప్రణవ్ బాలాజీ సంతానం. ఓయూలో పీజీ గణితం ఎంట్రెన్స్‌లో 7వ ర్యాంక్‌తో.. అక్కడే ఎంఫిల్ పూర్తి చేశారు. కోదాడ, హుజూర్‌నగర్‌లలోని ప్రైవేటు కళాశాలల్లో గణిత అధ్యాపకుడిగా రోజూ మూడు కళాశాల్లో పని చేస్తూ.. పోటీ పరీక్షలకు సిద్ధపడేవారు. ఆయన ప్రతిభకు వరుసగా ఎంసీఆర్‌డీఓ, లెక్చరర్, రైల్వే ఎఎస్‌ఎం, స్టాటిస్టికల్ ఆఫీసర్, పీఎన్‌బీ పీఓ, జిల్లా ఏటీఓ, ఎక్సైజ్ ఇన్స్పెక్టర్, డీఎస్పీ ఉద్యోగాలు వచ్చాయి. 2007 గ్రూప్-1లో రాష్ట్ర స్థాయిలో 7వ ర్యాంక్ సాధించారు. 2008లో ఆయన ఉద్యోగ ప్రస్థానం మొదలైంది. సంగారెడ్డి, మహబూబ్‌నగర్, జగిత్యాలలో డిప్యూటీ కలెక్టర్‌గా పని చేశారు. గజ్వేల్‌లో 'గజ్వేల్ ఏరియా డెవలెప్‌మెంట్ అథారిడీ' (గడా) అధికారిగా పని చేశారు. 2013 బ్యాచ్‌లో కన్ఫర్డ్ ఐఏఎస్. జిల్లాల పునర్విభజన అనంతరం సిద్దిపేట జిల్లా జాయింట్ కలెక్టర్‌గా చేశారు. గతేడాది ఆగస్టు 31 నుంచి సంగారెడ్డి కలెక్టర్‌గా పని చేస్తున్నారు. సంగారెడ్డి జిల్లాలో మహిళా శిశు సంక్షేమ పరిధిలో విశేషమైన సేవలందించినందుకు గాను కేంద్ర ప్రభుత్వం నుంచి 'పోషణ్ అభియాన్' అవార్డును ఈనెల 23న ఢిల్లీలో కలెక్టర్ హనుమంతరావు అందుకోనున్నారు. రాష్ట్రం నుంచి ఈ అవార్డుకు హనుమంతరావు ఒక్కరే ఎంపిక కావడం విశేషం.

### గ్రామ స్వరాజ్యమే ప్రభుత్వ లక్ష్యం



సమస్యలు లేని గ్రామాలుగా మన పల్లెలను తీర్చిదిద్దడమే లక్ష్యంగా మేము పనిచేస్తున్నాం. మా ప్రతి అడుగులోనూ ప్రభుత్వ సహకారం ఉన్నది. గతంలో గజ్వేల్‌లో 'గడప గడపకు గడా' కార్యక్రమాన్ని విజయవంతం చేశాం. ముఖ్యమంత్రి కేసీఆర్ గారితో కలిసి పనిచేసిన అనుభూతి మర్చిపోలేనిది. ప్రజల్లో చైతన్యం తీసుకొచ్చి, దళారులు, మధ్యవర్తులు లేకుండా.. ప్రజల వద్దకే పాలన అందించడం మా ఉద్దేశం. అందుకే పారదర్శక పాలన కోసం నిరంతరం కృషి చేస్తున్నాం. నేను చేసే ప్రతి పనిలో నా తోటి ఉద్యోగులు, జిల్లా ఉన్నతాధికారుల సహకారం మరువలేనిది. సంగారెడ్డిని అన్ని రంగాల్లో నంబర్‌వన్ స్థానంలో నిలబెట్టేందుకు శాయశక్తులా కృషి చేస్తాను.

**- మంత్రిప్రగడ హనుమంతరావు,** కలెక్టర్

...✍ డప్పు రవి

# హోమ్ డెకరేషన్ చేయండిలా!

**మనస్సు ఎక్కడుంటే అదే మన ఇల్లు అవుతుందన్నది నిజమే. రోజంతా ఎక్కడ తిరిగినా చివరికి ఇంటికి చేరాల్సిందే. మరి ఆ ఇంటిని నచ్చినట్టుగా అలంకరించుకోవాలనుకుంటున్నారా? అయితే ఈ కింది చిట్కాలు ఫాలో అవ్వండి.**



**రంగులేసిన నాప్‌కిన్లు :**
ఆరు నాప్‌కిన్లను తీసుకొని నచ్చిన రంగులు వేయండి. తర్వాత నాప్‌కిన్లను మడిచి అతిథులను ఇంటిని పిలిచినప్పుడల్లా తెల్లని ప్లేటులో పెట్టి అందిస్తే కొత్త నాప్‌కిన్లు లాగే కనిపిస్తాయి. ఈ నాప్‌కిన్లను మ్యాట్లపై కూడా పెట్టొచ్చు.

**పాత కుర్చీలకు కొత్త అందం :**
ఇంటికి వేసిన రంగులు మిగులుంటే. పాత బల్లలు, కుర్చీలను ఎంచుకోండి. వీటికి మిగిలిన రంగులు వేసి ఇంట్లో పెట్టడం వల్ల ఇంటి గోడలు, కుర్చీలు మ్యాచింగ్‌లా ఉంటాయి. చూడడానికి కూడా ఆకర్షణీయంగానూ ఉంటుంది.

**కర్టెన్లకు కొత్త దశ :**
పాత కర్టెన్లను రోజూ చూసి బోర్ కొడుతుంటే, వాటి చివర్లన వేలాడే గుండ్రటి పోంపోంలను అతికించవచ్చు. ఈ చిన్న మార్పు కర్టెన్‌కు అదనపు అందాన్ని ఇస్తుంది. ఈ పద్ధతినే దిండ్లు, కుషన్లకి కూడా చేయొచ్చు.

**సూట్‌కేసు టేబుల్ :**
ఆధునిక ఇళ్లలో స్టోరేజీ సమస్య ఎక్కువగా ఉంటుంది. అలాంటప్పుడు పాత సూట్‌కేసులను కొత్తగా వాడొచ్చు. పాత సూట్‌కేసును బెడ్ చివర బల్లలోపల పెట్టవచ్చు. దీన్ని పుస్తకాలు పెట్టుకోవడానికి, దుప్పట్లు పెట్టుకోవడానికి వాడుకోవచ్చు.

**షట్టర్ ఉన్న సైడ్‌టేబుల్ :**
ఇల్లు మారేటప్పుడు పాత షట్టర్ కిటికీ తలుపులను స్టోర్ రూంలో పడేస్తుంటారు. అందులో నాలుగింటిని క్యూబ్ ఆకారంలో అతికించాలి. దీనిపై గ్లాస్ స్లాబ్ పెడితే సైడ్ టేబుల్ రెడీ. దీనిపై కుండీ మొక్క, ఫ్లవర్ వాజ్ పెడితే అందంగా ఉంటుంది.



**చిల్లర బ్యాంకు :**
గుండ్రటి డబ్బా తీసుకొని దాన్ని శుభ్రంగా కడిగి తుడువాలి. చిల్లర బ్యాంక్ అనే కొత్త టేబుల్ ప్రింట్ తీసి అతికించండి. దీనికి రంగులు కూడా వేస్తే బాగుంటుంది. డబ్బాకు చిన్న రంధ్రం వేసి దాన్ని చిల్లరకు ఉపయోగించుకోండి.

# బ్రదర్ కాదు.. సిస్టర్!



**ఎక్కువగా రద్దీ ఉండే నగరాల్లో కోల్‌కతా ఒకటి. అక్కడ కారు నడపాలంటే ఆషామాషీ కాదు. ఈ రద్దీలోనే ఆమె జీవిత ప్రయాణం మొదలైంది. ప్రయాణికురాలిగా కాదు.. ఓ క్యాబ్ డ్రైవర్‌గా. కోల్‌కతాలో మొదటి కారు డ్రైవర్‌గా ఆమె సుపరిచితురాలైంది.**

సైకిల్, బైక్, కారు.. ఏదైనా సరే వాటిని నడపడం సుష్మాకు ఇష్టం. ప్రత్యేకంగా కారు నడపడం అయితే ఒక కల. ఈ కల చాలా సరదాగా అనిపించినా ఆమెకు కొన్నాళ్ల తర్వాత ప్రొఫెషన్‌గా మారింది. బతుక్కు దారి చూపి ఉపాధి మార్గాన్ని చూపించింది. 30 యేండ్ల సుష్మాకు ఓ అబ్బాయి. సుష్మకు తన అభిరుచి పట్ల భర్త నుంచి ప్రోత్సాహం ఉంది. అందుకే ఎప్పటికైనా కారు డ్రైవింగ్ చేయాలనుకునేది. ఓ రోజు కోల్‌కతా ట్యాక్సీ ఎక్కింది. డ్రైవింగ్ అంటే ఇష్టం ఉన్న సుష్మా ఆ ట్యాకీవాలాతో డ్రైవింగ్ గురించి ముచ్చటించింది. దీంతో అతను స్పందిస్తూ 'ఇంత ఆసక్తి ఉంటే క్యాబ్ డ్రైవర్‌గా చేయొచ్చు కదా' అని చాలా సాధారణంగా అన్నాడు. కానీ సుష్మా మెదడులో ఆ మాటలు నిలిచిపోయాయి. వెంటనే స్థానికంగా ఓ డ్రైవింగ్ స్కూల్‌లో శిక్షణ తీసుకుంది. తర్వాత కమర్షియల్ లైసెన్స్ అడిగే శిక్షకులు ఆశ్చర్యపోయారు. తను డ్రైవర్ కావాలనుకుంటున్నాని చెప్తే నివ్వెరపోయారు. కొద్ది రోజుల్లోనే లైసెన్స్ పొందింది. తర్వాత ఓ క్యాబ్ సర్వీస్ కంపెనీలోని డ్రైవర్ల జాబితాలో చేరింది. ఆర్థికంగా వెనుకబడి ఉన్న సుష్మ కుటుంబానికి ఇలా ఒక ఆసరా దొరికింది. రోజుకూ 15 ట్రిప్పులు తీసుకుంటుంది. డ్రాపింగ్, పికప్‌లో ఎలాంటి ఆసల్యమైనా కస్టమర్లు తీవ్రంగా స్పందిస్తారు. అవమానిస్తారు. ఇవన్నీ తట్టుకొని, తప్పులను దిద్దుకొని ముందుకు సాగుతున్నది. క్యాబ్‌బుక్ చేసుకున్న వారు కాల్ చేసి 'బ్రదర్ ఎక్కడ ఉన్నారు' అని అడిగితే.. 'బ్రదర్ కాదు సిస్టర్' అంటూ సున్నితంగా వినిపించే సుష్మ మాటలు విని ఆశ్చర్యపోతుంటారు ప్రయాణికులు.

# కండ్లచుట్టూ నల్లటి వలయాలా?

**చాలామంది ముఖం చూడకుండా కండ్లతోనే మాట్లాడుకుంటారు. మరి అలాంటి కళ్లు ఉబ్బినట్లుగా, నలుపుగా ఉంటే చూడడానికి బాగుంటుందా? వీటిని నివారించడానికి కొన్ని పద్ధతులున్నాయి.**



- కొన్ని బాదంపప్పులను బాగా నానబెట్టి మెత్తని పేస్టులా చేయాలి. అందులో కొంచెం పాలు కలిపి రాత్రిపడుకనే ముందు కంటి చుట్టూ రాసుకోవాలి. నిద్ర లేవగానే చల్లటి నీటితో శుభ్రపరుచుకోవాలి.
- అధిక ఒత్తిడి, అలసట వల్ల కండ్ల కింద వాచినట్లు అవుతుంది. అది పోవాలంటే.. వాడిన గ్రీన్ టీ బ్యాగులను చల్లటి నీటిలో ముంచి కంటి కింద వాపు ప్రాంతంలో పెట్టుకుంటే తగ్గుతుంది.
- వీటన్నింటికంటే మనిషికి సరిపడినంత అంటే రోజుకు ఎనిమిది గంటలు నిద్రపోవాలి. దీంతోపాటు పోషకాహారం తీసుకుంటే కండ్లు మిలమిలా మెరుస్తాయి.
- కీరదోస రసం కండ్లకి చాలా మంచిది. అది చర్మానికి మంచి టోనర్‌గా కూడా పనిచేస్తుంది. కీరదోస రసంలో దూది ముంచి కనురెప్పలపై పెట్టుకోవాలి. కొంచెం రసాన్ని కండ్ల కింద భాగంలో రాసుకోవాలి. ఇలా తరచూ చేయడం వల్ల కండ్లు అందంగా మారుతాయి.
- టమాటా గుజ్జు, నిమ్మరసం, శనగపిండి, పసుపు బాగా కలుపాలి. ఈ మిశ్రమాన్ని కండ్ల చుట్టూ బాగా రాసుకొని 10 నిమిషాల తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రపరుచుకోవాలి. రోజుకి ఒకసారైనా ఇలా చేస్తే కళ్ల చుట్టూ ఉండే నల్లని వలయాలు త్వరగా తగ్గుతాయి.

# సహచరుల సాయం



**స్నేహితులతో జన్మదిన వేడుకలు జరుపడం మామూలే. కానీ ఆ వేడుకకు ఒక అర్థం ఉండాలనుకున్నారు కొందరు స్నేహితులు. బెంగళూరుకు చెందిన ఓ స్నేహితుల బృందం చావుబతుకుల్లో ఉన్న ఓ స్నేహితురాలి తల్లి చికిత్సకు అవసరమైన ఆర్థిక సాయం అందించారు.**



బెంగళూరుకు చెందిన 40 మంది స్నేహితులు ఓ బృందంగా ఏర్పడ్డారు. ఆ బృందానికి 'సైన్స్ ఉత్సవ్ క్లబ్'అని పేరు పెట్టారు. బృందంలోని సభ్యురాలు సత్వీర్‌కౌర్ తల్లి క్యాన్సర్‌తో బాధపడుతున్నది. ఆమె చికిత్సకు అవసరమైన డబ్బును సమకూర్చేందుకు 'సైన్స్ ఉత్సవ్ క్లబ్' సభ్యులంతా ముందుకొచ్చారు. అందుకోసం సైన్స్ ఉత్సవ్ క్లబ్ తరపున అందరూ కలిసి నిధులు సేకరించేందుకు ఆన్‌లైన్‌లో 'సైన్స్ ఫర్ ఏ కాజ్' అనే ప్రచార కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ ప్రచార కార్యక్రమంలో భాగంగా పాఠశాల విద్యార్థులకు సైన్స్‌పై అవగాహనా తరగతులు నిర్వహించి తద్వారా వచ్చిన మొత్తాన్ని సత్వీర్ కౌర్ తల్లికి అవసరమైన చికిత్సను అందించారు. ఆర్థికంగా సాయమందించడమేకాకుండా సత్వీర్‌కు ఆమె తల్లికి మనోధైర్యాన్నిచ్చారు. సత్వీర్ తల్లి చికిత్సకు రూ.15లక్షలు అవసరం. 'సహచరులు ఇచ్చే ప్రతి రూపాయి ఎంతో విలువైంది, వారు ఇచ్చిన మద్దతుతో ధైర్యంగా ఉన్నామని' సత్వీర్ చెబుతున్నది. 'ఇటువంటి స్నేహితులుండడం నా అదృష్టం' అని అంటున్నది. సైన్స్ ఉత్సవ్ బృందం వారు దేశవ్యాప్తంగా పలు నగరాల్లోని పాఠశాలల విద్యార్థులకు సైన్స్‌పై వర్క్‌షాప్‌లు నిర్వహించారు. వీటి ద్వారా సేకరించిన రూ. 80వేలు ఆమె వైద్యం కోసం అందించారు. ఇప్పుడు సైన్స్ ఉత్సవ్ బృందం సభ్యులు మరి కొన్ని నిధులను సమీకరించే పనిలో నిమగ్నమయ్యారు.

### పెరుగు ఇలా తిందాం..



- పెరుగు తినేటప్పుడు ఉప్పు, చక్కెర వేసుకోవడం చాలా మందికి అలవాటు. వీటితో పాటు కొన్ని పండ్లను కూడా కలిపి పెరుగును తినొచ్చు.
- పెరుగులో స్ట్రాబెర్రీలు, అరటిపండ్లు కలిపి తినొచ్చు. బ్లూబెర్రీ, ఎండుద్రాక్ష, చెర్రీపండ్లను పెరుగుకు జోడిస్తే మంచి కలరింగ్‌తో పాటు టేస్టీగానూ ఉంటుంది.
- పెరుగులో కానీ, పెరుగన్నంలో కానీ దానిమ్మ గింజలను మిక్స్ చేసి తింటే బాగుంటుంది.
- మామిడి, అరటి, యాపిల్ పండ్లను ముక్కలుగా కట్ చేసి వాటిని పెరుగులో ముంచి తింటే అదో రకమైన టేస్టీ.

## కాపర్–టి అవసరమేంటి?



**సంతానోత్పత్తిని నియంత్రించేందుకు కృత్రిమంగా అమర్చే లోహ పరికరం ఇది.**

అండం.. వీర్య కణాలతో కలువకుండా కాపర్–టి పనిచేస్తుంది. అండం.. గర్భాశయభాగంలో కూడా అంటుకోకుండా ఇది నియంత్రిస్తుంది. దీనిని సహజ ప్రసవం అయినవాళ్లు మాత్రమే కాకుండా సిజేరియన్ ఆపరేషన్ చేసుకున్నవాళ్లు కూడా వాడొచ్చు. బహిష్టు తర్వాత దీనిని అమర్చుకోవాలి. అయితే దీనిని అమర్చిన వెంటనే కొద్దిగా రక్త స్రావం అవుతుంది. గర్భంతో ఉన్నప్పుడు ఎట్టి పరిస్థితుల్లోనూ కాపర్–టిని వాడొద్దు. ఏదైనా దీర్ఘకాలిక వ్యాధి ఉన్నవారు సైతం దీనిని అమర్చుకోకూడదు.

## సర్వైకల్ స్పాండిలోసిస్‌కి కారణమేంటి?



**ఆధునిక జీవనశైలి కారణంగా సర్వైకల్ స్పాండిలోసిస్ వ్యాధి బారిన పడుతున్నవారు ఎక్కువవుతున్నారు. మెడనొప్పే కదా అని నిర్లక్ష్యం చేస్తే సమస్య మరింత తీవ్రమవుతుంది. తొలిదశలోనే గుర్తించి సమస్య నుంచి విముక్తి పొందండి.**

మెడ వెనుక భాగంలో తల నుంచి మొదలయ్యే మొదటి ఏడు వెన్నుపూసల మధ్య కార్టిలేజ్ మెత్తటి ఎముక ఉంటుంది. వెన్నుపూసలు సులువుగా కదిలేందుకు ఈ కార్టిలేజ్ తోడ్పడుతుంది. అయితే అసంబద్ధ భంగిమల్లో కూర్చోవడం, కంప్యూటర్ల ముందు ఎక్కువసేపు కదలకుండా కూర్చుని విధులు నిర్వర్తించడం, ఒకేచోట గంటల తరబడి కదలకుండా పనిచేయడం, నిత్యం తీసుకునే ఆహారంలో క్యాల్షియం, విటమిన్స్ తగినంత లేకపోవడం మొదలైన కారణాలతో ఈ కార్టిలేజ్ క్షీణిస్తాయి. ఈ సమస్య ఉన్నవాళ్లు సమస్య తీవ్రంగా ఉంటే విశ్రాంతి తప్పనిసరిగా తీసుకోవాలి. కుర్చీలో కూర్చున్నప్పుడు, వాహనం నడిపేటప్పుడు నిటారుగా ఉండేవిధంగా సరైన భంగిమలో కూర్చోవాలి. మెడనొప్పి ఉన్నప్పుడు స్వల్ప వ్యాయామాలు డాక్టర్ సలహా మేరకు చేయాలి. సరైన పౌష్టికాహారం తీసుకోవాలి.

## కండ్లకలకతో జాగ్రత్త



**వైరస్.. బ్యాక్టీరియా ద్వారా కండ్లకు కలిగే ఇన్ఫెక్షనే కండ్లకలక. దీనితో కండ్లు బాగా ఎర్రబడి నీళ్లు వస్తాయి.**


కండ్లలో మంటలు వస్తాయి. ఏదో పొడిచినట్లు అనిపిస్తుంది. సరిగ్గా చూడలేం. ఇది సోకితే వారి సమీపంలోని వాళ్లు చాలా జాగ్రత్తగా ఉండాలి. ఎందుకంటే ఇది అంటువ్యాధి.

**ఏం చేయాలి?:** వ్యాధి సోకిన వాళ్ళు గోరువెచ్చని నీళ్ళతో తరచూ కళ్ళు కడగాలి. వీలైతే నల్లటి కళ్ళజోడు ధరించాలి. వీరి చేతి రుమాలు తుండుగుడ్డ ఇతరులని వాడనీయకూడదు. డాక్టరు సలహాపై కండ్లలో మందు చుక్కలు వాడాలి.

**ఎంత తొండమున్నా దోమ ఏనుగు కాదు అంటారు.**
**కానీ దోమ.. ఏనుగుకంటే ప్రమాదం.**
**ఇప్పుడు వస్తున్న వ్యాధుల్లో చాలామటుకు దోమకాటుకు సంబంధించినవే.**
**దోమ అంత ప్రమాదకరమైంది.**
**అందుకే తనకంటూ ఒక రోజును సృష్టించుకోగలిగింది.**
**నేడు ప్రపంచ దోమల నివారణ దినం సందర్భంగా ఆరోగ్యానికి.. అందమైన జీవితానికి ఆటంకం కలిగిస్తున్న దోమలతో సోకే వ్యాధుల గురించి తెలుసుకోండి.**

### ప్రాణం తీస్తుంది

దోమల వల్ల వచ్చే వ్యాధుల్లో ప్రతీ సంవత్సరం 7.25 లక్షల మందికి పైగా చనిపోతున్నారని అధ్యయనాలు చెప్తున్నాయి. హత్యలు, దాడుల వల్ల 4.75 లక్షల మంది, పాము కాటు వల్ల 50 వేల మంది చనిపోతున్నారు. అంటే వీటన్నింటి కంటే దోమద్వారా పోతున్న ప్రాణాలే ఎక్కువ.దోమకాటు వల్ల ప్రతీ సంవత్సరం 20 లక్షల మంది అనారోగ్యానికి గురవుతున్నారు. నీరు నిల్వ ఉండే చోట.. అపరిశుభ్ర వాతావరణంలో దోమలు నివాసాలను ఏర్పరచుకొని సంతతిని వృద్ధి చేసుకుంటాయి. దోమల్లో వేలాది రకాలున్నప్పటికీ ఐదారు రకాల దోమలే మనిషి పాలిట ప్రాణాంతకంగా మారుతున్నాయి. దోమకాటు వల్ల డెంగ్యూ, మలేరియా, చికున్ గున్యా, మెదడు వాపు, ఫైలేరియా వంటి వ్యాధులు సోకి మనిషి ప్రాణాలు పోతున్నాయి.



**నేడు ప్రపంచ దోమల నివారణ దినం**

# దోమచాటు వ్యాధులు



దోమకాటు చాలా ప్రమాదం. లేనిపోని రోగాలన్నీ దోమల ద్వారానే వస్తున్నాయని అనేక అధ్యయనాలు తెలిపాయి. పరిశుభ్రత లోపం వల్లే దోమలు రోజురోజుకూ వృద్ధి చెందుతూ తమ ఉనికిని చాటుతున్నాయి. హత్యలు, దాడుల వల్ల మరణిస్తున్నవారి కంటే దోమల వల్ల వచ్చే వ్యాధులతో మరణిస్తున్నవారి సంఖ్యే ఎక్కువగా ఉంటున్నది. అంటే దోమల ప్రభావం ఎంత తీవ్రంగా ఉందో అర్థం చేసుకోవచ్చు.



**మలేరియా:** ఆడ అనాఫిలీస్ దోమ కుట్టడం వల్ల మలేరియా వ్యాధి సోకుతుంది. మలేరియాతో బాధపడుతున్న రోగిని దోమ కుట్టడం వల్ల దాని కడుపులోకి వ్యాధికారక పరాన్నజీవి ప్రవేశించి అక్కడ పెరుగుతుంది. ఇదే దోమ మరో వ్యక్తిని కుట్టినప్పుడు ఆ వ్యక్తి రక్తంలోకి చేరి మలేరియాకు కారణమవుతుంది.
**లక్షణాలు:** చలి, వణుకుతో జ్వరం రావడం.. శరీర ఉష్ణోగ్రత పెరగడం.. జ్వరం వస్తూ పోతూ ఉంటుంది.

**డెంగ్యూ:** పగటి సమయంలో కుట్టే యెడీస్ ఆడ దోమల ద్వారా డెంగ్యూ వ్యాధి సంక్రమిస్తుంది. ఇది సాధారణ వైరస్ జ్వరం. ఎముకలు, కండరాలు, కీళ్లనొప్పులతో జ్వరం మొదలవుతుంది. ప్లేట్లెట్స్ అమాంతం తగ్గిపోతాయి.
**లక్షణాలు:** హఠాత్తుగా తీవ్ర జ్వరం రావడం, కదలలేని స్థితి, ఎముకలు, కండరాలలో భరించలేని నొప్పి, శరీరంపై ఎర్రని దద్దుర్లు, వాంతులు, వికారం, నోరు ఎండిపోవడంతో పాటు చిగుళ్లు, ముక్కు ద్వారా రక్తం వస్తుంది.

**మెదడువాపు:** క్యూలెక్స్ ఆడదోమ కుట్టడం వల్ల ఈ వ్యాధి సంక్రమిస్తుంది. జపనీస్ ఎన్సెఫలైటీస్ వైరస్ ద్వారా వ్యాపిస్తుంది. ఎక్కువగా 2 నుంచి 14 ఏళ్ల లోపు పిల్లల్లో ఈ వ్యాధి వస్తుంది.

**లక్షణాలు:** ఆకస్మిక జ్వరం వచ్చి తీవ్రత ఎక్కువ కావడం, విపరీతమైన తలనొప్పి, వాంతులు రావడం, అపస్మారక స్థితికి లోనుకావడం, శరీరంలో ఏదో ఒకపక్క పక్షవాతానికి గురికావడం, ఫిట్స్ రావడం. ఈ వ్యాధి ఎక్కువగా 2 నుంచి 14 సంవత్సరాలలోపు పిల్లల్లో వస్తుంది.

**చికున్ గున్యా:** ఏడిస్ దోమల వల్ల ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. చేతులు.. కాళ్లలో.. కీళ్లలో వాపు వచ్చి కనీసం అడుగు తీసి అడుగు వేయలేని పరిస్థితి ఏర్పడుతుంది. జ్వరంతో మనిషి బలహీనంగా తయారవుతాడు.
**లక్షణాలు:** తలనొప్పి, వాంతులు, వికారంతో పాటు హఠాత్తుగా జ్వరం, కీళ్ల నొప్పులు, సరిగా నిలబడలేకపోవడం.

### నివారణ చర్యలు

- ఇంటి పరిసరాలలో నీరు నిల్వ ఉండకుండా చూడాలి.
- నీరు నిల్వ ఉన్న గుంతలలో క్రిమిసంహారక మందులు, కిరోసిన్ లేదా వాడిన ఇంజనాయిల్లో ముంచిన గుడ్డ ఉండలలో వేయాలి. దీంతో దోమల లార్వాలు చనిపోతాయి.
- నీటి గుంతలను గుర్తించి మట్టితో ఎప్పటికప్పుడు పూడ్చివేయాలి.
- మురికినీరు ఎప్పకటికప్పుడు వెళ్లిపోయే విధంగా చర్యలు తీసుకోవాలి
- నీటిట్యాంకులు, డ్రమ్ములపై మూతలు సరిగా ఉంచాలి.
- ఇంట్లో, ఇంటిచుట్టూ పనికిరాని కూలర్లు, పాత టైర్లు, డ్రమ్ములు, వాడని రోళ్లు, కొబ్బరి చిప్పలు, పగిలిన కుండలు, సీసాలు లేకుండా చూసుకోవాలి.
- కిటికీలకు, డోర్లకు జాలీలు బిగించాలి. వ్యక్తిగత రక్షణకు దోమతెరలు, కాయిల్స్ వాడాలి.
- శరీరాన్ని కప్పి ఉంచే దుస్తులు ధరించాలి

**ఫైలేరియా:** దీనిని బోదకాలు అని కూడా అంటారు. క్యూలెక్స్ దోమ ద్వారా ఈ వ్యాధి వ్యాప్తి చెందుతుంది. శరీరంలోని ఏ భాగానికైనా బోదకాలు సోకుతుంది.
**లక్షణాలు:** తరచూ జ్వరం, చంకల్లో, గజ్జల్లో బిల్లలు కట్టడం, వెన్నుపాము దగ్గరి నుంచి అన్ని అవయవాలకు వాపు, కాళ్లు, చేతులు, స్థనాలు, వరిబీజం, బుడ్డ, జ్ఞానేంద్రియాలు పాడవుతాయి.

### ఇలా చేస్తే దోమలు పరార్

డెంగీ, చికున్ గున్యా, మలేరియా వంటి దోమల ద్వారా వ్యాపించే ప్రాణాంతక వ్యాధులను నివారించాలంటే వైద్యం



ఇంటి నుంచే ప్రారంభం కావాలి. పరిసరాలు పరిశుభ్రంగా ఉంటే తప్ప దోమల నియంత్రణ పూర్తిగా సాధ్యంకాదు. కాబట్టి ఎవరికి వారు ఇంటి లోపల దోమలు లేకుండా చూసుకోవడమే వీలైన మార్గం. వాటి కోసం ఇలా చేద్దాం.
**ఐస్ ముక్కలు:** దోమలు కార్బన్ డై ఆక్సైడ్‌కు ఆకర్షితమవుతాయి. ఐస్ గడ్డలు కార్బన్ డై ఆక్సైడ్‌ను విడుదల చేస్తాయి. కాబట్టి ఐస్ గడ్డలను ఓ కంటెయినర్‌లో పెట్టి ఇంట్లో అక్కడక్కడ ఉంచాలి. దోమలు వీటి దగ్గరకు చేరతాయి. అప్పుడు దోమల ఎలక్ట్రిక్ బ్యాట్ తీసుకొని వాటి పని పట్టవచ్చు.

**వేపనూనె:** వేపనూనె, కొబ్బరినూనెను 1:1 నిష్పత్తిలో తీసుకొని చర్మంపై రాసుకోవాలి. వేప వాసన చూసి దోమలు పారిపోతాయి. వేపలో యాంటీ బ్యాక్టీరియా, యాంటీ ఫంగల్, యాంటీ వైరల్, యాంటీ ప్రోటోజోల్ గుణాలు ఉన్నాయి.

**కాఫీ గ్రౌండ్స్:** ఇంటి సమీపంలో నీరు నిలిచిన చోట దోమలు గుడ్లు పెట్టి ఉంటాయి. కాఫీ డికాషన్ చల్లడం ద్వారా అందులోని దోమల గుడ్లు నీటిపైకి చేరతాయి. అవి ఆక్సిజన్‌కు లోనయి దోమలుగా మారకుండానే నిర్వీర్యమవుతాయి. నీటిలో దోమలు గుడ్లు కూడా పెట్టవు.

**నిమ్మనూనె:** దోమల నివారణకు యూకలిప్టస్, లెమన్ ఆయిల్‌ను చర్మంపై రాసుకోవాలి. దీనివల్ల మన చర్మానికి ఎలాంటి హానీ ఉండదు. వీటిలో ఉండే సినోల్ రసాయనం యాంటీసెప్టిక్ కీటక నివారిణిగా పనిచేస్తుంది.

**కర్పూరం:** చీకటి పడుతున్న వేళలో ఇంటి తలుపులు మూసేసి కర్పూరం వెలిగించండి. 20 నిమిషాల తర్వాత తలుపు తెరిస్తే దోమలు కనిపించవు. కర్పూరం మంచి కీటక నివారిణిగా పనిచేస్తుంది.

**తులసి:** పారాసైటాలజీ అనే పత్రిక దోమల నివారణలో తులసి ప్రాధాన్యం గురించి రాసింది. దోమల లార్వాను చంపేందుకు తులసి చక్కగా పనిచేస్తుందట. మన ఆయుర్వేదం కూడా ఇదే చెప్పింది. ప్రతీ ఇంట్లోనూ తులసి మొక్కలను ఉంచుకోవడం వల్ల చాలావరకు దోమల సమస్య ఉండదట.

**డాక్టర్ అర్షద్ పుంజానీ**
సీనియర్ జనరల్ ఫిజీషియన్
యశోద హాస్పిటల్స్
సోమాజిగూడ





# ఐవీఎఫ్ విఫలమైతే?

**'ఇక మీరు తల్లి కాలేరు' అనే మాట వింటే ఎంత బాధ కలుగుతుంది? మీరు కన్న కలలు.. ఆశలు.. నిరాశగా మారి జీవితంపై నమ్మకం కోల్పోతారు. అలాంటి ఆశా.. నిరాశల్ని పటాపంచలు చేస్తూ సంతాన సాఫల్య భాగ్యం కలిగిస్తుంది ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్). ఇదీ ఫెయిలైతే ఏం చేయాలి?**

సంతాన సాఫల్య ప్రక్రియలో అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానం అద్భుతాలను సృష్టిస్తున్నది. అసలు పిల్లలే పుట్టరు అనుకొని.. చివరి ప్రయత్నంగా దీనిని ఆశ్రయించినవాళ్లకు మంచి ఫలితాలను చూపిస్తున్నది. ఫెర్టిలిటీ సెంటర్‌లోకి అడుగుపెట్టి.. సంతోషంతో ఇంటికి వెళ్తున్నారు.

### ఐవీఎఫ్ అంటే?

జీవనశైలి.. ప్రాధాన్యాలు మారడం వల్ల నేటి ప్రపంచంలో సంతానం లేకపోవడం తీవ్రమైన ఆందోళన కలిగిస్తున్నది. లక్షలకు లక్షలు ఖర్చుపెట్టినా పిల్లలు పుట్టడం లేదు. ఇక లాభం లేదనుకొని కొందరు ఇంజెక్షన్‌లు, మందులు, కృత్రిమ వీర్యం, ఇంట్రాయూటిరిన్ బదిలీలు వంటి ఆధునిక పద్ధతులను ఆశ్రయిస్తున్నారు. అలాంటి వాటిలో ఇన్ విట్రో ఫెర్టిలైజేషన్ (ఐవీఎఫ్) కూడా ఒకటి. సంతాన సాఫల్యం కోసం అందుబాటులో ఉంటున్న మంచి ఉపకరణం ఐవీఎఫ్.

### విచారం వద్దు.. అవగాహన ముద్దు


ఐవీఎఫ్ ఫెయిల్ అవుతుందనే అనుమానాలు కొందరిలో ఉన్నాయి. పైసలు వృథా అవుతున్నాయి కానీ ఫలితం ఎలా ఉంటుందో అన్న అనుమానాలూ ఉన్నాయి. వాటన్నింటినీ పాజిటివ్‌గా తీసుకోవాలి. ఒకవేళ ఏదైనా పొరపాటు జరిగి ఐవీఎఫ్ ప్రక్రియ విఫలం చెందినా కూడా విచారించవద్దు. సంతాన సాఫల్యంలో మానసిక ఆరోగ్యం కూడా చాలా ముఖ్యం. ఇప్పుడున్న పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని ట్రీట్‌మెంట్ తీసుకోవాలి. సేకరించిన అండాన్ని ప్రయోగశాలలో వీర్యంతో కలిపి ఐవీఎఫ్ నిపుణుల పర్యవేక్షణలో విభజించబడుతుంది. అక్కడి నుంచి గర్భాశయంలోకి బదిలీ చేస్తే.. ప్రక్రియ విజయవంతంగా కొనసాగి ప్రెగ్నెన్సీ వస్తుంది. అయితే కొందరిలో ఈ ప్రక్రియ సక్రమంగా జరకగపోవడంతో ఐవీఎఫ్ సైకిల్ విఫలం అవుతుంది. అప్పుడు ఎందుకు విఫలమైందో డాక్టర్ విశ్లేషిస్తారు. హార్మోనల్ సప్లిమెంట్ల సహాయంతో మరోసారి ప్రక్రియను ప్రారంభించడం మంచిది.

### వైఫల్యానికి కారణమేంటి?

ఐవీఎఫ్ సైకిల్‌ను మొదలుపెట్టడానికి ప్రాథమిక ఆవశ్యకతలు లభించకపోతే ఐవీఎఫ్ విఫలమవుతుంది. కొన్నిసార్లు మాత్రలు, హార్మోనల్ సప్లిమెంట్స్ విఫలమైతే స్త్రీ పునరుత్పత్తి అవయవం కావాల్సిన రూపానికి చేరుకోదు. ప్రేరేపిత హార్మోన్‌ను ఉపయోగించినా కూడా అండాశయం బహుళ గ్రీవాల్ని ఉత్పత్తి చేయదు. బహుళ గ్రీవాలు ఉత్పత్తయిన తర్వాత కూడా వాటిలో అండాలు ఉండవు. బహుళ గ్రీవాల్ని ఉత్పత్తి చేయడానికి కారణం ఆరోగ్యవంతమైన ఫలదీకరణ చెందిన అండం. దీనిని బదిలీ చేసే అవకాశాన్ని పెంచడం కోసం బహుళ అండాలు ఉత్పత్తి చేయాల్సి వస్తుంది. ఐతే తిరిగి పొందిన ప్రతీ అండం సజీవంగా ఉండదు. ఒకవేళ ఉన్నా కావాల్సినంత పరిణతి చెందదు. పిండంగా మారడానికి ఫలదీకరణ చెందవు. కొన్నిసార్లు ఫలదీకరణ చెందిన అండాల్ని ఉత్పత్తి చేయడానికి గర్భాశయంలోకి చేరుకున్నా ఇంప్లాంటేషన్ ప్రక్రియ ప్రమాదకరంగానే ఉంది. ఐవీఎఫ్ ప్రయత్నం విఫలమవడానికి మరొక ప్రధాన అంశం రోగుల జీవిత శైలికి సంబంధించింది. 35 ఏండ్ల లోపు వారికి ఐవీఎఫ్ ఎక్కువగా ఫెయిల్ అవుతుంది. పొగ తాగే అలవాటు ఉన్న కూడా ఐవీఎఫ్ విజయవంతం కాదు.

ఐవీఎఫ్ పూర్తి ప్రక్రియలో నిర్లక్ష్యం పనికిరాదు. ఇది కేవలం శారీరకంగా, ఆర్థికంగానే కాకుండా ఉద్వేగభరితంగా, మానసికంగా కూడా ప్రభావానికి గురిచేస్తుంది. అందువల్ల సక్రమమైన సంరక్షణ, సహాయం పొందాలి. మిమ్మల్ని మీరు నమ్మితే ఎలాంటి ఆరోగ్య సమస్య అయినా పరిష్కారం అవుతుంది.

### ఏం చేయాలి?



నిజంగానే ఏదో ఒక పొరపాటు వల్ల ఐవీఎఫ్ విఫలం అయిందే అనుకోండి. అప్పుడేం చేస్తారు? మొదటి మహిళకు కొంత సమయం విశ్రాంతి ఇవ్వాలి. వెంటనే మరొక ప్రక్రియను ఆశ్రయించొద్దు. డాక్టర్‌తో మాట్లాడి ప్రక్రియ ఎక్కడ విఫలమైందో తెలుసుకోవడం రెండవ అత్యంత ప్రధానమైన చర్య. ఐవీఎఫ్ సైకిల్‌ను, వైఫల్యాన్ని విశ్లేషించుకోవాలి. మొదటి ఐవీఎఫ్ సైకిల్ విఫలమవడం మీ కలలు అంతమైనట్లు కనిపించినా వాస్తవం మాత్రం వేరుగా ఉంటుందనే విషయం తెలుసుకోవాలి. ఐవీఎఫ్ ప్రక్రియలో నిమగ్నమైన తర్వాత ఎంతో జాగ్రత్త తీసుకోవాలి. ఆర్థికంగా, మానసికంగా కుంగుబాటుకు దారితీసేలా వ్యవహరించొద్దు. ఇంప్లాంటేషన్ విఫలమైతే, పీజీఎస్ వంటి టెక్నిక్‌లు ఉంటాయి.

**డాక్టర్ శిల్పారెడ్డి**
ఐవీఎఫ్ ఎక్స్‌పర్ట్
ఇందిరా ఐవీఎఫ్ సెంటర్
హైదరాబాద్



### మధుమేహ డైట్



**మూడు పూటలా ఆహారం తీసుకోవాలి. తక్కువ మోతాదులో తీసుకుంటే పరిస్థితి అదుపులో ఉంటుంది. ఏ ఆహారం తీసుకోవాలి ఎంత మోతాదులో తీసుకోవాలో చూద్దాం.**

భోజనంలో తప్పకుండా పచ్చి కూరగాయ ముక్కలు ఒక కప్పు ఉండాలి. మీగడ తీసిన పాలతో చేసిన పెరుగు ఒక కప్పు లేదా ఒక కప్పు మజ్జిగ తీసుకోవాలి. తోలు తీసిన కోడిమాంసం కూర 2 లేదా మూడు ముక్కలు తీసుకోవాలి. మాంసం కూర.. ఐదు లేదా ఆరు ముక్కలు తీసుకోవాలి. చేపకూర.. రెండు ముక్కలు తినాలి. పచ్చసొన తీసిన గుడ్డు రోజుకొకటి తినాలి.

### రక్తస్రావం ప్రథమ చికిత్స



**తలకు గానీ.. ఇతర శరీర భాగాలకు గానీ దెబ్బ తగిలితే దాని ప్రభావం మొదటగా చెవిపై ఉంటుంది. వెంటనే చెవిలో నుంచి రక్తస్రావం అవుతుంది.**

రక్తస్రావం అవుతుంటే దానిని నియంత్రించేందుకు ప్రథమ చికిత్సద్వారా పరిస్థితిని అదుపు చేయాలి. ఏ వైపు చెవినుంచి రక్తస్రావం అయితే ఆ వైపే పడుకోబెట్టాలి. చెవినుంచి రక్తస్రావం అదుపులోకి రాకపోవడంతో కొన్నిసార్లు దాని ప్రభావం ముక్కుకు చేరే ప్రమాదం ఉంది. ఒకవేళ నిజంగానే ముక్కునుంచి రక్తస్రావం అయితే.. వ్యక్తిని బల్లవద్ద కూర్చోబెట్టి అతని ముందు ఒక చిన్నపాత్రను పెట్టాలి. ముక్కును గట్టిగా మూసి తల ముందుకు వంచాలి. అతనికి స్పృహ లేకపోతే బోర్లా పడుకోపెట్టాలి. ముక్కుపై తడిగుడ్డ లేదా ఐస్ పెట్టి.. ముక్కుద్వారా నోటిలోకి కారిన రక్తాన్ని పాత్రలోకి ఉమ్మేయమని చెప్పాలి.

## నిపుణ — విద్య ఉద్యోగ సమాచారం


### ప్రొఫెసర్ పోస్టులు

**కేంద్రవిశ్వవిద్యాలయం అయిన అసోం యూనివర్సిటీ వివిధ విభాగాల్లో ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం ఖాళీలు:** 26 (సిల్చార్ ప్రాంగణం–21, దిపు ప్రాంగణం–5)
- **విభాగాలు:** అగ్రికల్చర్ ఇంజినీరింగ్, బెంగాలీ, కెమిస్ట్రీ, కంప్యూటర్ సైన్స్ & ఇంజినీరింగ్, ఎకనామిక్స్, ఇంగ్లిష్, ఎడ్యుకేషన్, జియోగ్రఫీ, హిస్టరీ, హిందీ, పొలిటికల్ సైన్స్ తదితరాలు
- **అర్హత:** యూజీసీ నింబంధనల ప్రకారం
- **ఎంపిక:** ఇంటర్వ్యూ ద్వారా
- **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో, **చివరితేదీ:** సెప్టెంబర్ 6
- **వెబ్‌సైట్:** www.aus.ac.in

### ప్రాజెక్టు ఇంజినీర్లు

**ముంబైలోని హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పీసీఎల్) ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం ఖాళీలు:** 164 (ప్రాజెక్టు ఇంజినీర్ (మెకానికల్–63, సివిల్–18, ఎలక్ట్రికల్–25, ఇన్‌స్ట్రుమెంటేషన్–10), రిఫైనరీ ఇంజినీర్ (కెమికల్)–10, లా ఆఫీసర్–4, క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్–20, హ్యూమన్ రిసోర్స్ ఆఫీసర్–8, ఫైర్ & సేఫ్టీ ఆఫీసర్–6)
- **అర్హత:** గుర్తింపు పొందిన యూనివర్సిటీ/సంస్థ నుంచి మెకానికల్, ఎలక్ట్రికల్, ఇన్‌స్ట్రుమెంటేషన్, సివిల్ ఇంజనీరింగ్‌లో బీఈ/బీటెక్, లా, మాస్టర్స్ డిగ్రీ లేదా తత్సమాన పరీక్ష ఉత్తీర్ణత. సంబంధిత విభాగంలో అనుభవం ఉండాలి.
- **వయస్సు:** ప్రాజెక్టు ఇంజినీర్‌కు 28 ఏండ్లు, మిగతా పోస్టులకు 30 ఏండ్లకు మించరాదు.
- **పేస్కేల్:** క్వాలిటీ కంట్రోల్ ఆఫీసర్ (ఈ–1)కు ఏడాదికి రూ.11.76 లక్షలు, మిగతా (ఈ–3) పోస్టులకు రూ.17.64 లక్షలు జీతం చెల్లిస్తారు.
- **ఎంపిక:** రాతపరీక్ష(సీబీటీ), ఇంటర్వ్యూ, గ్రూప్ డిస్కషన్ ద్వారా
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **చివరితేదీ:** సెప్టెంబర్ 16
- **వెబ్ సైట్:**www.hindustanpetroleum.com

### స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియాలో

**న్యూఢిల్లీలోని స్పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా (ఎస్ఏఐ) కింది పోస్టుల భర్తీకి ప్రకటన విడుదల చేసింది.**

- **మొత్తం పోస్టులు:** 60 (న్యూట్రిషనిస్ట్–15, అసిస్టెంట్ న్యూట్రిషనిస్ట్–15, చెఫ్–15, అసిస్టెంట్ చెఫ్–15)
- **అర్హత:** సంబంధిత విభాగంలో మాస్టర్స్ డిగ్రీ, బ్యాచిలర్ డిగ్రీ, హోటల్ మేనేజ్‌మెంట్‌లో డిప్లొమా ఉండాలి.
- **పే స్కేల్:** న్యూట్రిషనిస్ట్/చెఫ్ పోస్టులకు రూ.75,000–1,00,000/–, అసిస్టెంట్ న్యూట్రిషనిస్ట్/అసిస్టెంట్ చెఫ్ పోస్టులకు రూ.40,000–60,000/–
- **ఎంపిక:** ఇంటర్వ్యూ , **దరఖాస్తు:** ఆఫ్‌లైన్‌లో
- **ఇంటర్వ్యూతేదీ:** ఆగస్టు 28, 29
- **వెబ్‌సైట్:**www.sportsauthorityofindia.nic.in

### జూనియర్ అసిస్టెంట్లు

**వరంగల్‌లోని కాళోజీ నారాయణ రావు యూనివర్సిటీ ఆఫ్ హెల్త్ సైన్సెస్ ఖాళీగా ఉన్న కింది పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ విడుదల చేసింది.**



- **మొత్తం ఖాళీలు:** 19
- జూనియర్ అసిస్టెంట్–15 ఖాళీలు
జూనియర్ స్టెనోగ్రాఫర్–4 ఖాళీలు
- **అర్హత:** బ్యాచిలర్ డిగ్రీ (కంప్యూటర్ సైన్స్) లేదా డిగ్రీ స్థాయిలో కనీసం ఏడాది పాటు కంప్యూటర్ సైన్స్ సబ్జెక్టు చదివి ఉండాలి. జూనియర్ స్టెనోగ్రాఫర్ పోస్టులకు అదనంగా ఇంగ్లిష్ టైప్ రైటింగ్‌లో హయ్యర్ గ్రేడ్ సర్టిఫికెట్ ఉండాలి.
- **వయస్సు:** 219 జూలై 1 నాటికి 18 నుంచి 34 ఏండ్ల మధ్య ఉండాలి.
- **పేస్కేల్:** రూ.16,400–49,870/–
- **ఎంపిక:** రాతపరీక్ష ద్వారా. స్టెనోగ్రఫీ పోస్టులకు అదనంగా స్టెనోగ్రఫీ టెస్ట్ ఉంటుంది.
- **దరఖాస్తు:** ఆన్‌లైన్‌లో
- **దరఖాస్తులకు చివరితేదీ:** సెప్టెంబర్ 7
- **రాతపరీక్ష:** అక్టోబర్ 20
- **వెబ్‌సైట్:** www.knruhsrt.in

# మహారాష్ట్రలో ఘోర రోడ్డుప్రమాదం



మహారాష్ట్రలోని షాహదా - దొండైచ రోడ్డు సమీపంలో ప్రమాదానికి గురైన బస్సు

## కంటెయినర్ లారీ, బస్సు ఢీకొని 13 మంది దుర్మరణం

**దులే, ఆగస్టు 19:** మహారాష్ట్రలోని దులే జిల్లాలో ఘోరరోడ్డు ప్రమాదం చోటుచేసుకున్నది. మహారాష్ట్ర రోడ్డు రవాణాసంస్థకు చెందిన బస్సును ఓ కంటెయినర్ ఢీకొట్టడంతో 13 మంది మృతిచెందగా.. 15 మందికిగా యాలయ్యాయి. ఔరంగాబాద్ నుంచి షాహదాకు వెళ్తున్న బస్సును షాహదా – దొండైచ రోడ్డు సమీపంలో ఎదురుగావస్తున్న కంటెయినర్ అదుపుతప్పి ఢీకొట్టడంతో ఈ ఘటన జరిగింది. మృతుల్లో ఇద్దరు మహిళలు, ఇద్దరు పిల్లలు, రెండు వాహనాల డ్రైవర్లు ఉన్నారు. 11 మంది అక్కడికక్కడే మృతిచెందగా.. మరో ఇద్దరు దవాఖానలో చికిత్సపొందుతూ చనిపోయారు. క్షతగాత్రులను స్థానిక దవాఖానకు తరలించి చికిత్సనందిస్తున్నారు. అందులో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉన్నది.

# నేడు చంద్రుడి కక్ష్యలోకి చంద్రయాన్-2!

- ఉదయం 8.30 నుంచి గంటపాటు కీలక ప్రక్రియలు
- సవాల్‌తో కూడుకున్న చర్యలన్న ఇస్రో చైర్మన్ శివన్

**బెంగళూరు, ఆగస్టు 19:** చంద్రుడి పరిశోధనల కోసం ఇస్రో ప్రయోగించిన రెండో మిషన్ చంద్రయాన్-2 నేడు చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశించనున్నది. దీని కోసం మంగళవారం ఉదయం 8.30 నుంచి 9.30 వరకు కీలక ప్రక్రియలు చేపట్టనున్నట్టు ఇస్రో చైర్మన్ కే శివన్ సోమవారం తెలిపారు. చంద్రయాన్-2లోని ద్రవ ఇంజిన్‌ను మండించి, దాని దిశలు మార్చి చంద్రుడి కక్ష్యలోకి ప్రవేశపెట్టే ఈ చర్య సవాల్‌తో కూడుకున్నదన్నారు. దీని తర్వాత మరో 4 సార్లు కక్ష్య తగ్గింపు ప్రక్రియలు చేపట్టాల్సి ఉన్నదని, తద్వారా చంద్రుడి ధ్రువానికి వంద కి.మీ సమీపానికి చంద్రయాన్-2 చేరుతుందని చెప్పారు. సెప్టెంబర్ 2న ఆర్బిటార్ చంద్రయాన్-2 నుంచి ల్యాండర్ విక్రమ్ విడివడుతుందని వివరించారు. చివరగా మరో రెండు ప్రక్రియలతో సెప్టెంబర్ 7న చంద్రుడిపైకి ల్యాండర్ దిగుతుందని, అందులోని రోవర్ చంద్రుడి ఉపరితలంపైకి చేరుతుందని శివన్ వివరించారు. జూలై 22న జీఎస్ఎల్వీ మార్క్ 3 ద్వారా చంద్రయాన్-2ను ఇస్రో విజయవంతంగా ప్రయోగించిన సంగతి తెలిసిందే. అనంతరం కొన్ని రోజుల పాటు భూమి చుట్టూ పరిభ్రమించిన చంద్రయాన్-2 కక్ష్యలను పెంచే పలు చర్యలు చేపట్టారు. ఆగస్టు 14న జరిపిన ప్రక్రియతో చంద్రయాన్-2 భూ కక్ష్యను వీడి చంద్రుడి సమీపానికి చేరింది. దీంతో మంగళవారం చంద్రుడి కక్ష్యలోకి దీన్ని ప్రవేశపెట్టనున్నారు. ఇప్పటి వరకు అన్ని దశలు విజయవంతమయ్యాయని, చంద్రయాన్-2లోని అన్ని వ్యవస్థలు చక్కగా పనిచేస్తున్నాయని బెంగళూరులోని మిషన్ ఆపరేషన్స్ కాంప్లెక్స్(మాక్స్) నుంచి దీన్ని నియంత్రిస్తున్న ఇస్రో శాస్త్రవేత్తలు తెలిపారు.





# రాజ్యసభకు మన్మోహన్ ఏకగ్రీవ ఎన్నిక

- రాజస్థాన్ నుంచి ఎన్నికైన మాజీ ప్రధాని మంత్రి
- 1991-2019 మధ్య అసోం నుంచి మన్మోహన్ ప్రాతినిధ్యం



**జైపూర్, ఆగస్టు 19:** మాజీ ప్రధానమంత్రి మన్మోహన్ సింగ్.. రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. ఇంతకు ముందు ఆయన 1991– 2019 మధ్య దాదాపు మూడు దశాబ్దాల పాటు అసోం నుంచి ఎగువసభకు ప్రాతినిధ్యం వహించారు. అయితే ఈ దఫా ఆ రాష్ట్రం నుంచి అవకాశం లేకపోవడంతో రాజస్థాన్ నుంచి పోటీచేశారు. సోమవారం మధ్యాహ్నం మూడు గంటలకు నామినేషన్ల ఉపసంహరణకు గడువు ముగిసిన తర్వాత రాజ్యసభ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, రాష్ట్ర అసెంబ్లీ కార్యదర్శి ప్రమీల్ కుమార్ మాథూర్ ఒక ప్రకటనలో మన్మోహన్‌సింగ్ ఏకగ్రీవంగా ఎన్నికైనట్లు ప్రకటించారు. రాజ్యసభకు ఎన్నికైనందుకు మన్మోహన్ సింగ్‌కు రాజస్థాన్ సీఎం అశోక్ గెహ్లాట్ అభినందనలు తెలిపారు. 'రాజ్యసభకు ఏకగ్రీవంగా ఎన్నికైన మాజీ ప్రధాని డాక్టర్ మన్మోహన్ సింగ్‌కు అభినందనలు. ఆయన ఎన్నిక రాష్ట్రానికి గర్వకారణం. ఆయనకు గల విస్తారమైన పరిజ్ఞానం, అనుభవం నుంచి రాజస్థాన్ ప్రజలకు లబ్ధి చేకూరనుంది' అని గెహ్లాట్ ట్వీట్ చేశారు. మన్మోహన్ సింగ్ తరపున రిటర్నింగ్ అధికారి ప్రమీల్‌కుమార్ మాథూర్ నుంచి ఎన్నికల ధ్రువీకరణ పత్రాన్ని రాష్ట్ర ప్రభుత్వ చీఫ్‌విప్ మహేష్ జోషి స్వీకరించారు. రాజ్యసభ ఎంపీ మదన్ లాల్ సైనీ మృతితో రాజస్థాన్ నుంచి రాజ్యసభకు ఉప ఎన్నిక అనివార్యమైంది. దీంతో మన్మోహన్ సింగ్ అభ్యర్థిత్వాన్ని కాంగ్రెస్ పార్టీ ఖరారుచేసింది. మరోవైపు ఈ ఎన్నికలో పోటీ చేయరాదని బీజేపీ నిర్ణయించింది. ఈ నెల 13న మాజీ ప్రధాని తన నామినేషన్ పత్రాలను దాఖలుచేశారు. దాదాపు మూడు దశాబ్దాల పాటు అసోం నుంచి ఆయన రాజ్యసభకు ప్రాతినిధ్యం వహించారు. 1991 నుంచి 2019 వరకు వరుసగా ఐదు దఫాలు అసోం నుంచి రాజ్యసభకు ఎన్నికైన మన్మోహన్ సింగ్ 2004– 14 మధ్య రెండు దఫాలు దేశ ప్రధానమంత్రిగా సేవలందించారు. ఈ ఏడాది జూన్ 14తో రాజ్యసభ ఎంపీగా ఆయన పదవీకాలం ముగిసింది. అసోం అసెంబ్లీ నుంచి రాజ్యసభకు పంపేందుకు కాంగ్రెస్ పార్టీకి సరిపడా బలం లేకపోగా, ఇతర రాష్ట్రాల్లో ఎక్కడా ఖాళీలు లేవు. రాజస్థాన్‌కు 10 రాజ్యసభ స్థానాలు ఉన్నాయి. మిగతా తొమ్మిది స్థానాలకు బీజేపీ సభ్యులు ప్రాతినిధ్యం వహిస్తున్నారు.

# చిగురుటాకులా ఉత్తరాది

- వర్షాలు, వరదలతో అస్తవ్యస్తమవుతున్న రాష్ట్రాలు
- హిమాచల్‌ప్రదేశ్‌లో 25 మంది మృతి, రూ. 574 కోట్ల ఆస్తి నష్టం
- జలదిగ్బంధంలో ఉత్తరాఖండ్.. పది మంది మృతి, ఆరుగురు గల్లంతు
- పంజాబ్, హర్యానాలో పొంగిపొర్లుతున్న వాగులు, వంకలు
- ఉధృతంగా ప్రవహిస్తున్న యమున.. ఢిల్లీ, ఆగ్రాలో ప్రమాద హెచ్చరికలు

**సిమ్లా/చండీగఢ్/ఢిల్లీ/ఆగ్రా, ఆగస్టు 19:** భారీ వర్షాలు, వరదలతో ఉత్తరాది రాష్ట్రాలు జలదిగ్బంధంలో చిక్కుకున్నాయి. ఎడతెరిపి లేకుండా కురుస్తున్న వర్షాలకు హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్‌లో 35 మంది మరణించారు. పంజాబ్, హర్యానా, జమ్ములను వరదలు ముంచెత్తుతున్నాయి. ఢిల్లీ, ఆగ్రా, హర్యానా, పంజాబ్‌లకు వరద హెచ్చరికలు జారీచేశారు.

**70 ఏండ్లలో తొలిసారి..**

హిమాచల్‌ప్రదేశ్‌ను వర్షాలు వీడటంలేదు. రాష్ట్రంలో కురుస్తున్న భారీ వర్షాలతో మరో ముగ్గురు చనిపోయారు. దీంతో సోమవారం నాటికి మృతుల సంఖ్య 25కు చేరింది. గత 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా 102 మి. మీ. వర్షపాతం నమోదైందని, గత డెబ్బై ఏండ్లలో ఇదే రికార్డు స్థాయి వర్షపాతం అని భారత వాతావరణ విభాగం(ఐఎండీ) సోమవారం పేర్కొన్నది. రానున్న 24 గంటల్లో రాష్ట్రవ్యాప్తంగా భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని కూడా హెచ్చరించింది. శనివారం నుంచి కురుస్తున్న వర్షాల కారణంగా రాష్ట్రంలో రూ. 574 కోట్ల ఆస్తి నష్టం సంభవించినట్టు ప్రభుత్వ ప్రతినిధి ఒకరు పేర్కొన్నారు. భారీ వర్షాలతో సిమ్లా, బిలాస్‌పూర్, హమీర్‌పూర్ ప్రాంతాలు తీవ్రంగా దెబ్బతిన్నాయి. రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో కొండచరియలు విరిగిపడటం, వరదల కారణంగా రహదారులు కొట్టుకుపోయాయి. దీంతో దాదాపు 500 మందికి ప్రపంచంతో సంబంధాలు తెగిపోయి బిక్కుబిక్కుమంటూ ఒంటరిగా గడుపుతున్నట్టు అధికారులు తెలిపారు. కొండ చరియలు, చెట్లు విరిగిపడటంతో కాంగ్రా, కులు, చంబా తదితర జిల్లాల్లో రాకపోకలు నిలిచిపోయాయి. జాతీయ విపత్తు ప్రతిస్పందన దళం(ఎన్‌డీఆర్ఎఫ్) సాయంతో అధికారులు సహాయక చర్యలు చేపట్టారు.



హిమాచల్‌ప్రదేశ్‌లోని మండిలో ఇసుకలో చిక్కుకున్న కారు

### యమునమ్మ ఉగ్రరూపం

యమునా నదిలో వరద ఉధృతి పెరుగుతుండటంతో ఢిల్లీ రాష్ట్ర ప్రభుత్వం అప్రమత్తమైంది. యమునా నది ప్రవాహం ప్రమాదకర సూచీని దాటిన నేపథ్యంలో రాష్ట్ర ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ సోమవారం అత్యవసర సమావేశాన్ని నిర్వహించారు. వరద పరిస్థితులు, ముందస్తు జాగ్రత్తలపై చర్చించారు. హర్యానాలోని హతినికుండ్ బరాజ్ నుంచి 21 లక్షల క్యూసెక్కుల వరద నీటిని విడుదల చేయడంతో దిగువ ప్రాంతాలకు యమునా నది ఉధృతంగా ప్రవహిస్తున్నది. ఆగ్రాలోని దాదాపు 27 గ్రామాల్లో హైఅలర్ట్ విధించారు. నదీ పరివాహక ప్రాంతాల్లో నివసిస్తున్న వాళ్లు వెంటనే ఆయా ప్రాంతాల్ని విడిచి వెళ్లాలని హెచ్చరించారు. మరోవైపు, ఉత్తరాఖండ్, ఒడిశా, తమిళనాడు, తూర్పు మధ్యప్రదేశ్, ఛత్తీస్‌గఢ్, జార్ఖండ్, పుదుచ్చేరిలో భారీ వర్షాలు కురిసే అవకాశం ఉన్నదని ఐఎండీ సోమవారం హెచ్చరించింది.

**ఉత్తరాఖండ్‌లో భారీ వర్షాలు**

ఉత్తరాఖండ్‌లో కురుస్తున్న భారీ వర్షాలకు పలు జిల్లాల్లో జనజీవనం స్తంభించింది. భారీ వర్షాల కారణంగా రాష్ట్రంలో ఇప్పటివరకూ పది మంది చనిపోగా, మరో ఆరుగురు గల్లంతయ్యారు. వాతావరణం అనుకూలించకపోవడం వల్ల ఆదివారం నిలిపివేసిన సహాయక చర్యలను అధికారులు సోమవారం ప్రారంభించారు. వరద ప్రభావిత ప్రాంతాల్లో చిక్కుకున్న ప్రజలకు మూడు హెలికాప్టర్ల సాయంతో ఆహారం, అవసరమైన మందులను అధికారులు అందించారు. భారీ వర్షాల కారణంగా గాయపడిన నలుగురు క్షతగాత్రులను హెలికాప్టర్ల సాయంతో డెహ్రాడూన్‌లోని దవాఖానకు చేర్చి చికిత్స అందిస్తున్నట్టు తెలిపారు. ఉత్తరకాశిలోని మోరి ప్రాంతంలో డజనుకు పైగా గ్రామాలు వరదల్లో చిక్కుకున్నాయని, పలు ఇండ్లు నేలమట్టమై, వందల హెక్టార్ల పంట నీటిలో మునిగిపోయినట్టు అధికారులు తెలిపారు. భారీ వర్షాలు కురుస్తాయన్న ఐఎండీ హెచ్చరికల నేపథ్యంలో.. రాష్ట్రంలోని తొమ్మిది జిల్లాల్లో సోమవారం అన్ని పాఠశాలలు, అంగన్వాడీ కేంద్రాలను ప్రభుత్వం మూసివేసింది.

**వరదబారిన పంజాబ్, హర్యానా**

పంజాబ్, హర్యానా రాష్ట్రాలను వరదలు ముంచెత్తుతున్నాయి. గత మూడు రోజులుగా కురిసిన భారీ వర్షాలకు ఈ రెండు రాష్ట్రాల్లోని వాగులు, వంకలు, నదులు ఉప్పొంగి ప్రవహిస్తున్నాయి. యమునా నది ప్రవాహం ఒక్కసారిగా పెరుగడంతో కర్నాల్ జిల్లాలోని పలు గ్రామాలు జల దిగ్బంధంలో చిక్కుకున్నాయి. వరదల్లో చిక్కుకున్న తొమ్మిది మందిని భారత వాయు సేన (ఐఏఎఫ్) సిబ్బంది సోమవారం రక్షించింది. షాహ్‌కోట్‌లోని ఫిల్లౌర్ బ్రిడ్జి వద్ద వరద నీరు ఉధృతంగా ప్రవహిస్తుండటంతో ఎన్‌డీఆర్ఎఫ్, రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం 92 మంది గజ ఈతగాళ్లను సిద్ధం చేశారు. రెవెన్యూ, పారిశుద్ధ్యం, వైద్య విభాగాలు అప్రమత్తంగా ఉండాలని ఆయా రాష్ట్ర ప్రభుత్వాలు అధికారులను ఆదేశించాయి. జమ్ములోని పలు ప్రాంతాలను కూడా వరదలు ముంచెత్తుతున్నాయి.



జమ్ములో ని తావినది ప్రవాహంలో చిక్కుకున్న మత్స్యకారులను రక్షిస్తున్న వాయుసేన

### మత్స్యకారులను రక్షించిన వాయుసేన

**జమ్ము, ఆగస్టు 19:** జమ్ముకశ్మీర్‌లోని తావినది ప్రవాహంలో చిక్కుకున్న నలుగురు మత్స్యకారులను సోమవారం భారత వాయు సేన (ఐఏఎఫ్) రెస్క్యూ ఆపరేషన్ ద్వారా రక్షించింది. జమ్ముకశ్మీర్‌లో కురుస్తున్న భారీ వానల నేపథ్యంలో భగవతినగర్ సమీపంలో నిర్మాణంలో ఉన్న బ్రిడ్జి వద్దకు నదీ ప్రవాహం పోటెత్తింది. దీంతో అక్కడ చేపలు పట్టేందుకు వెళ్లిన నలుగురు మత్స్యకారులు వరద ప్రవాహంలో చిక్కుకున్నారు. వారిని రక్షించేందుకు రాష్ట్ర విపత్తు ప్రతిస్పందన దళం, పోలీసులు చేసిన ప్రయత్నాలు విఫలం కావడంతో అధికారులు వాయుసేన సాయం కోరారు. వాయుసేన హెలికాప్టర్ ఘటనస్థలానికి చేరడంతో జాలర్లకు ప్రాణాలపై ఆశలు చిగురించాయి. ఓ సైనికుడు తాడుసాయంలో హెలికాప్టర్ పైనుంచి జాలర్ల దగ్గరకు దిగాడు. వారికి ధైర్యం చెప్పాడు. హెలికాప్టర్‌లో ఉన్న సిబ్బంది జాలర్లిద్దరిని సురక్షితంగా పైకి లాగారు. అనంతరం వారిని సురక్షిత ప్రాంతానికి చేరవేశారు. ఇదంతా కేవలం 35 నిమిషాల్లోనే పూర్తిచేశారు.

## టెలికం, ఐటీరంగాల్లో రాజీవ్ ముద్ర

- మాజీ ప్రధాని 75వ జయంతి సందర్భంగా వారంపాటు స్మారక కార్యక్రమాలు: రాహుల్‌గాంధీ



**న్యూఢిల్లీ, ఆగస్టు 19:** తన తండ్రి, మాజీ ప్రధానమంత్రి దివంగత రాజీవ్‌గాంధీ హయాంలో దేశంలో టెలికం, సమాచార సాంకేతికరంగాల్లో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి విజయాలు సాధించారని కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీ సోమవారం పేర్కొన్నారు. ఆగస్టు 20న రాజీవ్‌గాంధీ 75వ జయంతిని పురస్కరించుకొని కాంగ్రెస్ పార్టీ దేశవ్యాప్తంగా స్మారక కార్యక్రమాలు ఘనంగా నిర్వహించనున్నట్టు తెలిపారు. 'ఈ వారం మేము నా తండ్రి రాజీవ్‌గాంధీజీ 75వ జయంతిని దేశవ్యాప్తంగా స్మారక కార్యక్రమాలతో జరుపుకుంటాం. ఈవారంలో ప్రతిరోజూ ఆయనను గౌరవించుకుంటాం. ఆయన సాధించిన అద్భుతమైన విజయాల్లో ఒక్కోదానిని మీ దృష్టికి తీసుకొస్తాను. ఈ రోజు అంశం.. సమాచార సాంకేతికరంగంలో సంస్కరణలు' అని ట్విట్టర్‌లో రాహుల్ పేర్కొన్నారు. రాజీవ్‌గాంధీ ప్రధానమంత్రిగా ఉన్న సమయంలో ఐటీరంగంలో సాధించిన విజయాలను వెల్లడించేలా రూపొందించిన 55 సెకండ్ల వీడియో క్లిప్‌ను ఆయన షేర్‌చేశారు.


## ఏపీలో ముగ్గురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవం

### మూడు వైసీపీ ఖాతాలోనే

**హైదరాబాద్, నమస్తే తెలంగాణ:** ఆంధ్రప్రదేశ్‌లో ముగ్గురు ఎమ్మెల్సీల ఎన్నిక ఏకగ్రీవంగా పూర్తయింది. మూడు ఎమ్మెల్సీలను అధికార వైసీపీ సొంతం చేసుకుంది. రాష్ట్ర మంత్రి మోపిదేవి వెంకటరమణ, పార్టీ నేతలు మహ్మద్ ఇక్బాల్, చల్లా రామకృష్ణారెడ్డి ఎమ్మెల్సీలుగా ఎన్నికయ్యారు. వైఎస్సార్సీపీకి పూర్తి మెజార్టీ ఉండటంతో ప్రతిపక్ష టీడీపీ పోటీ చేయలేదు.

## ఉన్నావ్ విచారణకు మరో 2 నెలల గడువు

- సీబీఐకి అనుమతించిన సుప్రీంకోర్టు ధర్మాసనం
- న్యాయవాదికి రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వానికి ఆదేశం



కుల్దీప్‌సింగ్

**న్యూఢిల్లీ:** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఉన్నావ్ బాధితురాలి రోడ్డు ప్రమాదం కేసు విచారణ పూర్తిచేసేందుకు సీబీఐకి సుప్రీంకోర్టు గడువు పొడిగించింది. రెండు వారాల్లోగా దర్యాప్తు పూర్తిచేయాలని తెలిపింది. ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ బాధితురాలి తరపు న్యాయవాదికి వైద్యఖర్చుల కోసం రూ.5 లక్షల పరిహారం ఇవ్వాలని యూపీ ప్రభుత్వాన్ని సుప్రీంకోర్టు ఆదేశించింది. ఈ ఘటనపై ఇప్పటికే రెండువారాల గడువు ఇచ్చిన సుప్రీంకోర్టు.. సీబీఐ విజ్ఞప్తిమేరకు తాజాగా గడువును మరో రెండువారాలపాటు పొడిగించింది. లైంగికదాడి ఘటనతోపాటు రోడ్డు ప్రమాదం కేసుపై జస్టిస్ దీపక్‌గుప్తా, జస్టిస్ అనిరుద్ధబోస్ నేతృత్వంలోని ధర్మాసనం విచారించింది. ఈ కేసులో బాధితురాలితోపాటు ఆమె న్యాయవాది వాంగ్మూలాన్ని ఇంకా నమోదు చేయలేదని, అలాగే పలు ఎలక్ట్రానిక్ ఆధారాలను విశ్లేషించాల్సి ఉన్నదని సీబీఐ.. సుప్రీంకోర్టుకు విన్నవించింది. తీవ్రంగా గాయపడిన న్యాయవాది పరిస్థితి విషమంగానే ఉన్నదని ఈ కేసులో అమికస్ క్యూరీగా ఉన్న సీనియర్ న్యాయవాది వీ గిరి.. ధర్మాసనం దృష్టికి తీసుకొచ్చారు. లైంగిక దాడికి గురైన యువతి కుటుంబసభ్యులు మీడియాలో చేసిన బహిరంగ ప్రకటనలకు ధర్మాసనం మినహాయింపునిచ్చింది. 'బహిరంగ ప్రకటనలు చేయడం నిందితులకు ఉపయోగపడతాయి. మీకు ఏమైనా ఫిర్యాదులు ఉంటే ధర్మాసనానికి విన్నవించండి. మీకు సహకరించేందుకే మేం ఇక్కడ ఉన్నాం' అని సుప్రీంకోర్టు వ్యాఖ్యానించింది. తదుపరి కేసు విచారణను ధర్మాసనం వచ్చే నెల ఆరో తేదీకి వాయిదా వేసింది. 2017 లో బీజేపీ ఎమ్మెల్యే కుల్దీప్‌సింగ్ సెంగార్ తనపై లైంగికంగా దాడిచేశాడని ఆరోపించిన సదరు యువతి.. ఇద్దరు కుటుంబసభ్యులు, న్యాయవాదితో కలిసి గత నెల 28న కారులో వెళ్తుండగా లారీ ఢీకొట్టింది. ఈ ఘటనలో ఇద్దరు కుటుంబసభ్యులు మరణించగా.. తీవ్రంగా గాయపడ్డ బాధితురాలును చికిత్స నిమిత్తం లక్నో నుంచి ఢిల్లీలోని ఎయిమ్స్‌కు తరలించారు.

# సింగరేణి.. 'హరిత'వేణి

బొగ్గుగని ప్రాంతంలో పచ్చని హారం

- హరితహారంలో ముందున్న సింగరేణి
- ఇప్పటివరకు 3.32 కోట్ల మొక్కలు నాటిన సిబ్బంది
- సహజ అడవులను తలపిస్తున్న ఓబీ ప్లాంటేషన్లు
- కనుమరుగవుతున్న వృక్షజాతులకు పునరుజ్జీవనం

**భద్రాద్రి కొత్తగూడెం, మంచిర్యాల ప్రతినిధులు, నమస్తే తెలంగాణ:** సింగరేణి హరితవేణిగా మారుతున్నది. ముఖ్యమంత్రి కేసీఆర్ స్ఫూర్తితో బొగ్గుగని ప్రాంతం హరితవనంలా మారుతున్నది. సింగరేణి ప్రాంతం ఎటుచూసినా పచ్చని దుప్పటి పరుచుకున్న ప్రాంతంగా కనువిందు చేస్తున్నది. సింగరేణి కాలరీస్ సంస్థ మొక్కలు నాటే కార్యక్రమాన్ని మొక్కుబడిలా కాకుండా.. త్రికరణశుద్ధితో ఆచరిస్తూ మంచి ఫలితాలను సాధిస్తున్నది. నాలుగు విడుతల హరితహారం కార్యక్రమాల్లో భాగంగా ఇప్పటికే 3.32 కోట్ల మొక్కలు నాటడంతోపాటు, వాటిని సంరక్షిస్తున్న సంస్థ.. ఐదో విడుత హరితహారం కార్యక్రమానికి సిద్ధమవుతున్నది. సింగరేణి సీఎండీ శ్రీధర్ ప్రత్యేక చొరవతో ఓబీలు, కాలనీలు పచ్చదనాన్ని సంతరించుకున్నాయి. సంస్థలో ఉన్న ఫారెస్ట్రీ విభాగాన్ని హరితహారం కార్యక్రమంలో భాగస్వామ్యం చేశారు. సింగరేణి వ్యాప్తంగా 11 ఏరియాల్లో 12 నర్సరీలను ఏర్పాటు చేసి పెద్దఎత్తున మొక్కల పెంపకాన్ని చేపడుతున్నది. హరితహారంలో భాగంగా మొక్కలను నాటడమే కాకుండా సింగరేణి సంస్థలో పనిచేస్తున్న ప్రతీ ఒక్కరినీ భాగస్వామ్యం చేసి వాటి రక్షణ బాధ్యతలను కూడా అప్పగించింది.

**సింగరేణిలోని 11 ఏరియాల్లో నాటిన మొక్కల వివరాలు (లక్షల్లో)**

| ఏరియా | 2015 | 2016 | 2017 | 2018 |
|---|---|---|---|---|
| కొత్తగూడెం (రుద్రంపూర్, కార్పొరేట్) | 2.66 | 10.80 | 11.24 | 10.31 |
| ఇల్లెందు | 3.32 | 3.69 | 4.2 | 3.07 |
| మణుగూరు | 4.37 | 5.63 | 4.6 | 4.1 |
| రామగుండం1 | 7.14 | 6.13 | 3.86 | 3.14 |
| రామగుండం2 | 1.03 | 3.09 | 4.63 | 6.53 |
| రామగుండం3 | 1.4 | 3.9 | 4.09 | 2.91 |
| భూపాలపల్లి | 8.06 | 10 | 12.03 | 8.5 |
| శ్రీరాంపూర్ | 3.67 | 5.7 | 6.33 | 6.64 |
| బెల్లంపల్లి | 6.21 | 7.78 | 5.92 | 8.38 |
| మందమర్రి | 2.25 | 3.44 | 3.65 | 3.7 |



మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఏరియాలో ఓపెన్‌కాస్టు డంపుపై పెరుగుతున్న వనం

**30 ఏండ్లలో కోటి 31 లక్షలే..**


నిబంధనల ప్రకారం పర్యావరణహిత చర్యల్లో భాగంగా సింగరేణి 1984 నుంచి మొక్కలు నాటుతూ వస్తున్నది. ఇందుకోసం సంస్థ ఆరు జిల్లాల్లో 12 చోట్ల సొంతంగా నర్సరీలను ఏర్పాటుచేసింది. 1984 నుంచి 2008 వరకు ఏడాదికి సగటున 2.44 లక్షలు, 2009 నుంచి 2014 వరకు సగటున 14.48 లక్షల చొప్పున మొత్తం 30 ఏండ్లలో సింగరేణి సంస్థ కోటి 31 లక్షల మొక్కలు నాటింది. కానీ, హరితహారం ప్రారంభమైన నాలుగేండ్లలో 3.32 కోట్ల మొక్కలు నాటడం విశేషం. ఈ ఏడాది కూడా మరో కోటి మొక్కలు నాటేందుకు సిద్ధమయింది. ఓపెన్‌కాస్ట్ గనుల డంపు యార్డుల మీద ఓబీ డంపు ప్లాంటేషన్, విశాలమైన ఖాళీ ప్రదేశాల్లో చేపట్టే బ్లాక్ ప్లాంటేషన్, రోడ్ల వెంట, కాలనీలు, కార్యాలయాలు, పార్కులు తదితర ప్రాంతాల్లో చేపట్టే అవెన్యూ ప్లాంటేషన్ అనే మూడు రకాలుగా విభజించి సింగరేణి ప్రాంతాలలో మొక్కలు నాటుతున్నారు. ఓబీ ప్లాంటేషన్ కింద ఇప్పటికే 4,231 హెక్టార్లలో ఒక కోటి 56 లక్షల మొక్కలు నాటగా అవి నేడు అడవులను తలపిస్తున్నాయి. ఓసీ, జీకే ఓసీ. (కొత్తగూడెం), మణుగూరు, ఓసీ డంపుల మీద పెంచిన ప్లాంటేషన్లలో అంతరించిపోతున్న వృక్షజాతులు తిరిగి ప్రాణం పోసుకుంటున్నాయి.

**కనుమరుగవుతున్న వృక్షజాతులకు ప్రాధాన్యం**

రోజురోజుకూ అంతరించిపోయే వృక్షజాతులను గుర్తించిన సింగరేణి యాజమాన్యం ఆ జాతుల మొక్కలనే ప్రధానంగా ఎంపిక చేసి సింగరేణి నర్సరీల్లో పెంచుతున్నది. ఇలాంటి సుమారు 50 రకాల అటవీజాతి మొక్కలకు తిరిగి ప్రాణం పోస్తున్నది. వీటిని ప్రత్యేకించి ఓబీ, డంప్ యార్డులు, సింగరేణి ఏరియాల్లోని ఖాళీ స్థలాల్లో విరివిగా పెంచుతున్నది. విశాలమైన ప్రదేశాల్లో పెరిగిన నారేప, వెదురు, మారేడు, నేరేడు, చిందుగా, నెమలినార, తానీ, మర్రి, ఎర్రచందనం, ఎగిస, జువ్వి, బూరుగ, జిట్రేగి, రావి, ఉసిరి, మేడి, బుట్టగనం, సిస్సో తదితర జాతుల చెట్లతో సత్తుపల్లి, కొత్తగూడెం ఏరియా, ఇల్లెందు, మణుగూరు, రామగుండం 1,2,3, బెల్లంపల్లి, భూపాలపల్లి, శ్రీరాంపూర్, మందమర్రి ప్రాంతాలు సహజసిద్ధమైన అడవులుగా దర్శనమిస్తున్నాయి. సింగరేణి ఆధ్వర్యంలోని నర్సరీల నుంచి లక్షలాది మొక్కలను సమీప గ్రామాల రైతులకు, ప్రజలకు ఉచితంగా పంపిణీ చేస్తున్నది. వాటిలో ముఖ్యంగా పండ్ల మొక్కలు, పూలమొక్కలు, ఇతర వృక్షజాతులు అధిక సంఖ్యలో ఉన్నాయి. సింగరేణిలో ఉన్న దాదాపు 50 కాలనీల్లోని అన్ని క్వార్టర్లలోనూ పండ్ల మొక్కలు అధికంగా కనిపిస్తున్నాయి. సంస్థ సీఎండీ ఎన్.శ్రీధర్ ప్రత్యేకంగా హరితహారం కార్యక్రమంలో స్వయంగా పాల్గొంటూ మొక్కలు నాటి వాటిని సంరక్షించే బాధ్యతను ప్రోత్సహిస్తున్నారు. ఈఏడాది కూడా సింగరేణి సంస్థ ఆధ్వర్యంలో మరో కోటి మొక్కలు నాటేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు. సింగరేణి సంస్థ వ్యాప్తంగా ఉన్న 11 ఏరియాల్లో హరితహారంలో భాగంగా మొక్కలు నాటేందుకు 12 నర్సరీలలో సుమారు 70 లక్షల మొక్కలను సిద్ధం చేశారు. మరో 30 లక్షల మొక్కలను ఇతర నర్సరీల నుంచి సమకూర్చుకునేందుకు ఏర్పాట్లు చేసుకుంటున్నారు.

## తేజ్‌పాల్‌కు చుక్కెదురు

- లైంగికదాడి కేసులో అభియోగాల రద్దు పిటిషన్‌ను డిస్మిస్ చేసిన సుప్రీంకోర్టు
- గోవా కోర్టులో వచ్చే నెల 23 నుంచి విచారణ పునఃప్రారంభం



**న్యూఢిల్లీ/పనాజీ, ఆగస్టు 19:** లైంగికదాడి కేసులో తనపై మోపిన అభియోగాలను రద్దు చేయాలని కోరుతూ 'తెహల్కా' పత్రిక వ్యవస్థాపకుడు తరుణ్ తేజ్‌పాల్ దాఖలుచేసిన పిటిషన్‌ను సుప్రీంకోర్టు సోమవారం డిస్మిస్ చేసింది. తేజ్‌పాల్‌పై సహచర మాజీ ఉద్యోగిని దాఖలుచేసిన కేసు విచారణను ఆరునెలల్లో పూర్తిచేయాలని జస్టిస్ అరుణ్‌మిశ్రా నేతృత్వంలోని సుప్రీంకోర్టు ధర్మాసనం గోవాలోని దిగువకోర్టును ఆదేశించింది. 2013లో గోవాలోని ఓ ఫైవ్‌స్టార్ హోటల్ లిఫ్ట్‌లో సహచర మాజీ ఉద్యోగినిపై లైంగికవేధింపులకు పాల్పడినట్టు అభియోగాలను ఎదుర్కొంటున్నారు. ముందస్తు బెయిల్ రాకపోవడంతో క్రైమ్ బ్రాంచ్ పోలీసులు 2013 నవంబర్ 30న అతన్ని అరెస్టుచేశారు. ఆ తర్వాత 2014 మేలో బెయిల్‌పై బయటికివచ్చారు. దీనిపై కోర్టు ఆగస్టు 6న తీర్పును రిజర్వులో పెట్టింది. తేజ్‌పాల్ పిటిషన్‌ను గోవా పోలీసులు వ్యతిరేకించారు. నేరాన్ని రుజువుచేసేందుకు ఆధారాలున్నాయని, విచారణ ఎదుర్కోవాల్సిందేనని కోర్టుకు విన్నవించారు. తేజ్‌పాల్ పిటిషన్‌ను సుప్రీం డిస్మిస్ చేయడంతో గోవా కోర్టు వచ్చే నెల 23 నుంచి ఈ కేసు విచారణను పునఃప్రారంభించనున్నట్టు నార్త్ గోవా జిల్లా జడ్జి విజయ్‌పోల్ ప్రకటించారు.

## బాలింతపై అధికారి భర్త దాష్టీకం

**ఛత్తీస్‌గఢ్:** ఓ వసతిగృహంలో మూడునెలల పసిబిడ్డతో ఆశ్రయం పొందుతున్న ఓ మహిళను వసతిగృహ సూపరింటెండెంట్ భర్త బయటికి ఈడ్చుకెళ్లాడు. ఇందుకు సంబంధించిన వీడియో సామాజికమాధ్యమాల్లో వైరల్‌కావడంతో సూపరింటెండెంట్, ఆమె భర్తపై పోలీసులు కేసు నమోదుచేశారు. ఛత్తీస్‌గఢ్ రాష్ట్రంలోని కొరియాజిల్లా జనక్‌పూర్ బ్లాక్‌లోని బర్వాని కన్యా ఆశ్రమ్ వసతిగృహానికి సుమీలాసింగ్ సూపరింటెండెంట్‌గా వ్యవహరిస్తున్నారు. అక్కడే ఆయాగా పనిచేస్తున్న మహిళ తన మూడునెలల పసిబిడ్డతో కలిసి తలదాచుకుంటున్నది. సూపరింటెండెంట్ భర్త రంగల్‌సింగ్ ఇక్కడ ఎందుకుంటున్నావంటూ ఆమెను నిలదీసి, మహిళ అని చూడకుండా బయటికి ఈడ్చిపడేశాడు. ఇంత జరుగుతున్నా పక్కనే ఉన్న అతని భార్య వారించలేదు. దీంతో పోలీసులు ఇద్దరిపై కేసు నమోదుచేశారు.

నమస్తే తెలంగాణ
చిత్రం
[ కరీంనగర్ ]
మంగళవారం 20 ఆగస్టు 2019


'సరిలేరు నీకెవ్వరు' చిత్రంలో మహేష్‌బాబు

# జనగణమన సైనికుడు

మహేష్‌బాబు కథానాయకుడిగా నటిస్తున్న చిత్రం 'సరిలేరు నీకెవ్వరు'. దిల్‌రాజు సమర్పణలో జి.ఎం.బి ఎంటర్‌టైన్‌మెంట్, ఎ.కె ఎంటర్‌టైన్‌మెంట్ పతాకాలపై రామబ్రహ్మం సుంకర ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. అనిల్ రావిపూడి దర్శకుడు. రష్మిక మందన్న కథానాయిక. ప్రస్తుతం హైదరాబాద్‌లో చిత్రీకరణ జరుగుతున్నది. మహేష్‌బాబు, విజయశాంతి, రష్మిక మందన్నతో పాటు ప్రధాన తారాగణంపై కీలక సన్నివేశాల్ని చిత్రీకరిస్తున్నారు. సైనికుల త్యాగాల్ని కీర్తిస్తూ ఇటీవలే చిత్రబృందం 'భగభగభగ మండే నిప్పుల వర్షమొచ్చినా జనగణమన అంటూనే దూకేవాడే సైనికుడు..' అనే వీడియో గీతాన్ని విడుదలచేసింది. 1971 ఇండో-పాక్ యుద్ధం, 1984 సియాచిన్‌ఘటన, 1999కార్గిల్ యుద్ధం, 2016లో సర్జికల్స్ స్ట్రైక్స్‌లలో పాల్గొన్న సైనికుల ధైర్యసాహసాల్ని కొనియాడుతూ ఈ పాటను విడుదలచేశారు. నిర్మాతలు మాట్లాడుతూ 'ఈ సినిమాలో మహేష్‌బాబు సైనికుడి పాత్రలో కనిపించబోతున్నారు. ఆయన నటన, పాత్ర చిత్రణ శక్తివంతంగా ఉంటాయి. హీరోగా ఆయన్ని కొత్త పంథాలో ఆవిష్కరించే సినిమా ఇది. 2020 సంక్రాంతికి ప్రపంచవ్యాప్తంగా సినిమాను విడుదల చేస్తాం' అని తెలిపారు. ప్రకాష్‌రాజ్, రాజేంద్రప్రసాద్, సంగీత ప్రధాన పాత్రల్లో నటిస్తున్న ఈ చిత్రానికి సంగీతం: దేవిశ్రీప్రసాద్, ఛాయాగ్రహణం: రత్నవేలు.


విజయ్ దేవరకొండ

# బాక్సర్‌గా విజయ్‌దేవరకొండ?

విజయ్‌దేవరకొండ కథానాయకుడిగా పూరి జగన్నాథ్ దర్శకత్వంలో ఓ చిత్రం తెరకెక్కనున్న విషయం తెలిసిందే. ఈ చిత్రాన్ని పూరి జగన్నాథ్ టూరింగ్ టాకీస్, పూరి కనెక్ట్స్ పతాకాలపై పూరి జగన్నాథ్, ఛార్మి నిర్మించబోతున్నారు. నిజజీవితంలో ధిక్కార స్వభావంతో, నిర్మొహమాటంగా తమ మనసులోని భావాల్ని వ్యక్తం చేయడం పూరి జగన్నాథ్, విజయ్‌దేవరకొండ నైజం. ఆటిట్యూడ్ విషయంలో ఎన్నో సారూప్యతలున్న వీరిద్దరు కలిసి సినిమా చేయబోతుండటం సినీ ప్రియుల్లో ఉత్సుకతను రేకెత్తిస్తున్నది. విశ్వసనీయ సమాచారం ప్రకారం ఈ చిత్రంలో విజయ్‌దేవరకొండ బాక్సర్ పాత్రలో కనిపించబోతున్నారని తెలుస్తున్నది. తన కుటుంబ లక్ష్యం కోసం ఓ శక్తివంతుడు, యుక్తిపరుడైన బాక్సర్ చేసిన ప్రయాణమేమిటన్నదే చిత్ర ఇతివృత్తమని సమాచారం. పవర్‌ఫుల్ యాక్షన్ అంశాలతో పాటు ఫ్యామిలీ ఎమోషన్స్, సెంటిమెంట్ మేళవింపుతో ఈ కథాంశం ఉంటుందని చెబుతున్నారు. విజయ్‌దేవరకొండను మునుపెన్నడూలేని విధంగా నవ్యమైన పంథాలో ఆవిష్కరించేందుకు పూరి జగన్నాథ్ కసరత్తు చేస్తున్నారని అంటున్నారు. ఇప్పటికే స్క్రిప్ట్‌వర్క్ మొత్తం పూర్తయినట్లు సమాచారం. ఈ సినిమాకు సంబంధించిన ఇతర నటీనటులు, సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడించనున్నారు. ప్రస్తుతం క్రాంతి మాధవ్ దర్శకత్వంలో నటిస్తున్నారు విజయ్‌దేవరకొండ. చిత్రీకరణ జరుగుతున్నది.

# 'సాహో' హిట్ కావాలని అందరూ కోరుకుంటున్నారు


ప్రభాస్, రాజమౌళి


శ్రద్ధాకపూర్

'బాహుబలి' తరువాత ప్రభాస్ నటిస్తున్న చిత్రం 'సాహో'. సుజిత్ దర్శకుడు. యువీ క్రియేషన్స్ పతాకంపై వంశీ కృష్ణారెడ్డి, ప్రమోద్ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. ఈ సినిమా ఈ నెల 30న ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది. ఈ చిత్ర ప్రీరిలీజ్ వేడుక ఆదివారం రాత్రి హైదరాబాద్‌లో జరిగింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథిగా దర్శకుడు ఎస్.ఎస్. రాజమౌళి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 'ఏ హీరో ఫ్యాన్స్ అయినా వాళ్ల హీరో సినిమా హిట్ కావాలని కోరుకుంటారు. కానీ ప్రభాస్ సినిమాని అందరి హీరోల ఫ్యాన్స్ హిట్ కావాలని కోరుకుంటారు. ఎందుకంటే ప్రభాస్ ఏ రోజు ఏ హీరో గురించి చెడుగా మాట్లాడడు. తన చుట్టూ ఎప్పుడూ పాజిటివ్ వాతావరణం ఉంటుంది. ఆ వాతావరణమే అతనికి ఇంత మంది అభిమానుల్ని సంపాదించి పెట్టింది. ప్రభాస్‌కు దూరదృష్టి చాలా ఎక్కువ. 'బాహుబలి' కథ చెప్పినప్పుడే నా తరువాత చిత్రం ఏంటని ఆలోచించడం మొదలుపెట్టాడు. దీని తరువాత ఎలాంటి సినిమా చేయాలని చాలా తపన పడ్డాడు. ఒక రోజు 'సుజిత్ కథ చెప్పాడు డార్లింగ్.. అద్భుతంగా వుంది' అన్నాడు. పెద్ద సినిమా తరువాత పెద్ద దర్శకుడితో వెళ్లకుండా కథని నమ్మి ప్రభాస్ 'సాహో' చేయడం ఆనందాన్ని కలిగించింది. 'బాహుబలి' తరువాత ఇలాంటి సినిమా అయితే ప్రేక్షకులకు, అభిమానులకు నచ్చుతుందని నమ్మి ఈ సినిమా చేశాడు. సుజీత్‌ది చాలా చిన్న వయసు. చేయగలడా? అని చాలా మంది అనుమానించారు. ఫస్ట్ లుక్, టీజర్‌తోనే సుజిత్ సత్తా ఏంటో అందరికి అర్థమైంది. ఇంత పెద్ద చిత్రాన్ని, ఇంత మంది టెక్నీషియన్స్‌ని, భారీ బడ్జెట్‌ని, ప్రభాస్ లాంటి ఆల్ ఇండియా స్టార్‌ని హ్యాండిల్ చేయడం మామూలు విషయం కాదు' అన్నారు.

**డైహార్డ్ ఫ్యాన్స్ డైలాగ్ రాసింది సుజితే..**

ప్రభాస్ మాట్లాడుతూ 'ఫ్యాన్స్ డైహార్డ్ ఫ్యాన్స్ డైలాగ్ రాసింది సుజితే. మాస్ పల్స్ ఏంటో అతనికి బాగా తెలుసు. షూటింగ్ మొదలైన తరువాత సుజిత్ తన కంటే పెద్ద వాళ్లని ఎలా హ్యాండిల్ చేస్తాడా అని ప్రమోద్, వంశీ, నేను కంగారుపడ్డాం. కానీ అతనిలో ఏ రోజూ ఆ కంగారు కనిపించకపోవడంతో సుజిత్ ఇంటర్నేషనల్ డైరెక్టర్ అవుతాడనిపించింది. ఇలాంటి చిత్రాన్ని చేయడం మామూలు విషయం కాదు. ఏడాదికి రెండు చిత్రాలు ఇవ్వాలని గతంలో మాటిచ్చాను. కానీ ఆ మాటని నిలబెట్టుకోలేకపోయాను. జాగ్రత్తగా తీస్తే నిర్మాతలకు వంద కోట్ల లాభం వచ్చేది కానీ అలా ఆలోచించకుండా ఖర్చు చేశారు. వంశీ, ప్రమోద్ లాంటి స్నేహితులు అందరికి వుండాలి' అన్నారు.

**ప్రభాస్ అభిమానులకు హ్యాట్సాఫ్..**

దర్శకుడు సుజిత్ మాట్లాడుతూ 'ప్రభాస్ అభిమానులకు ఓపిక ఎక్కువ. అందుకే టీజర్‌లో డైహార్డ్ ఫ్యాన్స్ అని రాశాను. బాహుబలి, బాహుబలి-2 వంటి అద్భుతమైన చిత్రాల తరువాత వెంటనే తమ అభిమాన హీరో సినిమా రావాలని కోరుకుంటారు. కానీ తరువాత సినిమా కోసం అభిమానులు రెండేళ్లు ఎదురుచూడాల్సి వచ్చింది. అలా ఎదురుచూసినందుకు ప్రభాస్ అభిమానులకు హ్యాట్సాఫ్. ఇటీవల ఓ ఇంటర్వ్యూలో 'మా అందరికి ఒత్తిడి ఎక్కువగా వుండేది కానీ సుజిత్ ముఖంలో మాత్రం ఎప్పుడు ఎలాంటి టెన్షన్ చూడలేదు' అని ప్రభాస్ అన్నారు. నా ఒత్తిడిని తల్లిదండ్రులతో, స్నేహితులతో పంచుకునేవాడిని. అలా చేయడం వల్లే ఈ చిత్రాన్ని అనుకున్న స్థాయిలో పూర్తి చేయగలిగాను. నా ప్రయాణం ఓ షార్ట్ ఫిల్మ్‌తో మొదలైంది. నేను చేసిన షార్ట్ ఫిల్మ్స్‌కు సంబంధించిన ఓ డీవీడీ యూవీ వారి దగ్గరికి వెళ్లింది. దాన్ని ప్రభాస్ చూశారట 'స్క్రీన్‌ప్లే బాగా రాస్తున్నాడు. ఒకసారి వాడిని పిలవండి' అన్నారట. మా నాన్నతో కలిసి 'మిర్చి' సినిమా చూస్తుంటే ప్రభాస్‌గారు రమ్మంటున్నారని యూవీ నుంచి ఫోనొచ్చింది. నేనెక్కడ, ప్రభాస్ ఎక్కడ? నన్ను పిలవడం ఏంటి? అనుకుని వెళ్లలేదు. రాజమౌళి సినిమా తరువాత ప్రభాస్‌తో సినిమా అంటే సముద్రానికి ఎదురువెళ్లినట్టే. అయితే ప్రభాస్ ప్రతి విషయంలోనూ నాలో ఆత్మవిశ్వాసాన్ని కలిగించారు' అన్నారు. ఈ కార్యక్రమంలో కృష్ణంరాజు, ప్రమోద్, విక్కీ, శ్రద్ధాకపూర్, దిల్‌రాజు, వి.వి.వినాయక్, శ్యామ్‌ప్రసాదరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మంచివాడి కథ


కల్యాణ్‌రామ్

కల్యాణ్‌రామ్ కథానాయకుడిగా నటిస్తున్న తాజా చిత్రం 'ఎంత మంచివాడవురా'. సతీష్ వేగేశ్న దర్శకుడు. మెహరీన్ కథానాయిక. ఉమేష్‌గుప్తా, సుభాష్ గుప్తా నిర్మాతలు. రెండో షెడ్యూల్ చిత్రీకరణ ప్రారంభించబోతున్నారు. ఈ సందర్భంగా నిర్మాత ఉమేష్‌గుప్తా చిత్ర విశేషాలు తెలియజేస్తూ 'టైటిల్‌కు మంచి స్పందన లభిస్తున్నది. పాజిటివ్‌గా ఉందని అందరూ ప్రశంసిస్తున్నారు. ఈ నెల 26 నుంచి సెప్టెంబర్ 22 వరకు రెండో షెడ్యూల్‌ను తణుకు, రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో చిత్రీకరించబోతున్నాం. ఇందులో ప్రధాన తారాగణమంతా పాల్గొంటారు. రెండు యాక్షన్ ఎపిసోడ్స్‌తో పాటు కీలక సన్నివేశాలు, ఓ పాటను తెరకెక్కిస్తాం. అక్టోబర్‌లో హైదరాబాద్, చిక్‌మంగళూర్ ప్రాంతాల్లో షూటింగ్‌కు ప్లాన్ చేస్తున్నాం' అన్నారు. 'చక్కటి కుటుంబ కథా చిత్రమిది. హృదయాన్ని స్పృశించే భావోద్వేగాలతో ఆకట్టుకుంటుంది. కల్యాణ్‌రామ్ పాత్ర విభిన్నంగా సాగుతుంది. వచ్చే ఏడాది సంక్రాంతికి విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నాం' అని దర్శకుడు తెలిపారు. వి.కె.నరేష్, సుహాసిని, తనికెళ్ల భరణి, పవిత్రాలోకేష్, రాజీవ్ కనకాల, వెన్నెల కిషోర్, ప్రవీణ్, ప్రభాస్‌శ్రీను తదితరులు నటిస్తున్న ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: రాజ్‌తోట, సంగీతం: గోపీసుందర్, సమర్పణ: శివలెంక కృష్ణప్రసాద్, రచన-దర్శకత్వం: సతీష్ వేగేశ్న.

# ఎమోషనల్ థ్రిల్లర్


ధనుంజయన్, శివప్రసాద్, రాజశేఖర్

డా॥రాజశేఖర్ కథానాయకుడిగా క్రియేటివ్ ఎంటర్‌టైన్‌మెంట్స్ అండ్ డిస్ట్రిబ్యూటర్స్ పతాకంపై ఓ చిత్రం తెరకెక్కనున్నది. జి.ధనుంజయన్ ఈ చిత్రాన్ని నిర్మించనున్నారు. ప్రదీప్ కృష్ణమూర్తి దర్శకుడు. నిర్మాత మాట్లాడుతూ 'నవ్యమైన ఇతివృత్తంతో రూపొందుతున్న ఎమోషనల్ థ్రిల్లర్ ఇది. సింగిల్‌సిట్టింగ్‌లోనే రాజశేఖర్ కథ విని ఈ సినిమాలో నటించడానికి అంగీకరించారు. టైటిల్‌ను నిర్ణయించి త్వరలో రెగ్యులర్ షూటింగ్ మొదలుపెడతాం. సింగిల్ షెడ్యూల్‌లోనే చిత్రీకరణ పూర్తిచేసి 2020లో చిత్రాన్ని విడుదల చేస్తాం. ఇందులో సత్యరాజ్, నాజర్, బ్రహ్మానందం కీలక పాత్రలను పోషించనున్నారు. కథానాయికతో పాటు మిగతా సాంకేతిక నిపుణుల వివరాల్ని త్వరలో వెల్లడిస్తాం. తమిళంలో యూటర్న్, కొలైకారన్, మిస్టర్ చంద్రమౌళి సినిమాల్ని నిర్మించిన నేను ఈ సినిమాతో తెలుగు చిత్రసీమలోకి అడుగుపెట్టడం ఆనందంగా ఉంది' అని తెలిపారు. ఈ చిత్రానికి ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్: యస్.పి.శివప్రసాద్, సంగీతం: సైమన్ కె కింగ్.

# ఫొటోగ్రాఫర్ ప్రేమ్‌కహానీ


శివ కందుకూరి

తనయుడు శివ కందుకూరిని హీరోగా పరిచయం చేస్తూ ధర్మపథ క్రియేషన్స్‌పై రాజ్‌కందుకూరి నిర్మిస్తున్న చిత్రం 'చూసీ చూడంగానే'. శేష సింధు రావు దర్శకురాలు. వర్ష బొల్లమ్మ కథానాయికగా నటిస్తున్నది. సోమవారం ఈ చిత్ర ఫస్ట్‌లుక్‌ను నిర్మాత డి.సురేష్‌బాబు విడుదలచేశారు. ఈ పోస్టర్‌లో శివ కందుకూరి కెమెరాతో ఫొటోతీస్తూ కనిపిస్తున్నారు. నిర్మాత రాజ్‌కందుకూరి మాట్లాడుతూ 'రొమాంటిక్ ఎంటర్‌టైనర్ ఇది. ఓ జంట ప్రేమ ప్రయాణంలోని మధురభావాలకు అందమైన దృశ్యరూపంగా ఈ సినిమా ఉంటుంది. పెళ్లిళ్ల ఫొటోగ్రాఫర్‌గా శివ కందుకూరి పాత్ర నవ్య పంథాలో సాగుతుంది. కథానాయకుడి పాత్రను దృష్టిలో పెట్టుకొని ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవం రోజున ఫస్ట్‌లుక్ విడుదల చేశాం. ప్రస్తుతం నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. సెప్టెంబర్ నెలలో సినిమాను విడుదల చేసేందుకు సన్నాహాలు చేస్తున్నాం. గోపీసుందర్ సంగీతం ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలుస్తుంది' అని తెలిపారు. ఈ చిత్రానికి సినిమాటోగ్రఫీ: వేదరామన్, సంభాషణలు: పద్మావతి విశ్వేశ్వర్, ఎడిటర్: రవితేజ గిరిజాల.


రామ్‌ప్రసాద్, అలీ, ఎన్.శంకర్, కాశీవిశ్వనాథ్, నరేష్, జీవిత

# తెలుగు నటులకు అవకాశాలివ్వాలి

'మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్(మా)లో సభ్యులుగా ఉన్న చాలా మంది సరైన అవకాశాలు లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు' అని అన్నారు 'మా' అధ్యక్షుడు వి.కె.నరేష్. తెలుగు నటీనటులకు తెలుగు చిత్రాల్లో అవకాశలివ్వాలని కోరుతూ 'మా' కార్యవర్గం సోమవారం హైదరాబాద్‌లో తెలుగు ఫిలిం ప్రొడ్యూసర్స్ సెక్రటరీ సుప్రియ, తెలుగు చలన చిత్ర దర్శకుల సంఘం అధ్యక్షుడు ఎన్.శంకర్, తెలుగు చలన చిత్ర నిర్మాతల మండలి అధ్యక్షుడు సి.కల్యాణ్, రచయితల సంఘం అధ్యక్షుడు పరుచూరి గోపాలకృష్ణలను కలిసి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా 'మా' అధ్యక్షుడు నరేష్ మాట్లాడుతూ 'అసోసియేషన్‌లో సభ్యులుగా ఉన్న నటీనటుల్ని ప్రోత్సహించాలి' అని తెలిపారు. నటీనటుల పూర్తి వివరాలతో కూడిన ప్రత్యేక వెబ్‌సైట్‌ను రూపొందించేలా 'మా' కృషిచేస్తున్నదని జనరల్ సెక్రటరీ జీవిత రాజశేఖర్ పేర్కొన్నారు. రాజశేఖర్ మాట్లాడుతూ 'మూవీ ఆర్టిస్ట్ అసోసియేషన్‌కు సహాయసహకారాలను అందించడానికి నాలుగు ఆర్గనైజేషన్స్ సహృదయంతో స్పందించడం ఆనందంగా ఉంది. త్వరలో ఈ ఆర్గనైజేషన్స్‌తో సమావేశం ఏర్పాటుచేయనున్నాం' అని తెలిపారు. ఈ కార్యక్రమంలో హేమ, అలీ, రాజారవీంద్ర, అనితా చౌదరి తదితరులు పాల్గొన్నారు.

# దైవ రహస్యాల్ని చెప్పేదెవరు?

వినీత్‌చంద్ర, దేవయానీశర్మ జంటగా నటించిన చిత్రం 'తూనీగ' (ఒక దైవరహస్యం). ప్రేమ్ పెయింటింగ్స్ పతాకంపై రూపొందుతున్న ఈ చిత్రానికి ప్రేమ్ సుప్రీమ్ దర్శకుడు. ట్రైలర్‌ను చిత్రబృందం సామాజిక మాధ్యమాల ద్వారా విడుదల చేసింది. చరిత్ర చెరిపిన కథను వినదగు వారెవ్వరు... కనుమరుగైన దైవరహస్యాలని చెప్పేదెవరు.. అనే డైలాగ్‌లు, గ్రాఫిక్స్ హంగులతో వినూత్నంగా ఈ ట్రైలర్‌ను తీర్చిదిద్దారు. దర్శకుడు మాట్లాడుతూ 'భారతీయ సంస్కృతిలోని అనేక అంశాలను తీసుకొని తాత్విక భూమికతో పురాణేతిహాస ప్రధానంగా ఈ చిత్రాన్ని రూపొందించాం. నిర్మాణానంతర కార్యక్రమాలు జరుగుతున్నాయి. త్వరలో సినిమాను ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తాం. ఇటీవల విడుదలైన పాటలు, పోస్టర్స్‌కు మంచి స్పందన లభిస్తున్నది. క్రౌడ్‌ఫండింగ్ విధానంలో రూపుదిద్దుకున్న ఈ చిత్రం ప్రతి ఒక్కరిని అలరిస్తుంది' అని తెలిపారు.

